
'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 323

సోమవారం 13-2-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మెరిసిన జ్యోతి

ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్‌లో రజత పతకం గెల్చుకున్న ఏపీ అథ్లెట్ - 12లో



ఇల్లు.. కొనాలా? అద్దెకా?


రెండింటికీ పన్ను ప్రయోజనాలు.. అద్దెతో పోలిస్తే రుణ ఈఎంఐ అధికం - 13లో



4 హైకోర్టులకు కొత్త సీజేలు

4 హైకోర్టులకు సీజేలు నియమితులయ్యారు. గుజరాత్ సీజే జస్టిస్ సోనియా గోకాని.. దేశంలోనే ఏకైక మహిళా సీజే కానున్నారు.

వివరాలు 6లో ▸



ఎక్స్‌ప్రెస్ వే తొలి దశ ప్రారంభం

దేశంలో అతి పెద్దదైన ఢిల్లీ–ముంబై ఎక్స్‌ప్రెస్ హైవేలో 246 కి.మీ. భాగాన్ని ప్రధాని మోదీ ఆదివారం ప్రారంభించారు.

వివరాలు 6లో ▸



కాపాడేది డబుల్ ఇంజిన్ సర్కారే

కాంగ్రెస్, సీపీఎం, తిప్రా మోతా అనే ట్రిపుల్ ట్రబుల్ నుంచి బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కారే త్రిపురను కాపాడుతుందని అమిత్‌షా చెప్పారు.

వివరాలు 6లో ▸



మరో వస్తువును కూల్చేసిన అమెరికా

కెనడా గగనతలంలో అనుమానాస్పదమైన వస్తువును అమెరికా యుద్ధ విమానం కూల్చేసిందని జస్టిన్ ట్రూడో చెప్పారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

బీసీల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి



బీసీల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని మంత్రులు వేణుగోపాలకృష్ణ, రజిని చెప్పారు. గుంటూరు శివారు అమరావతి రోడ్డులో ఆదివారం బీపీ మండల్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం బీసీల ఆత్మగౌరవ సభలో మాట్లాడారు.

వివరాలు 5 ▸

ఏపీ భవన్‌లో విద్యుత్ పొదుపు ప్రాజెక్ట్



2030 నాటికి బిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించాలన్న లక్ష్యంగా కేంద్ర విద్యుత్‌శాఖ నేతృత్వంలోని బీఈఈ న్యూఢిల్లీలోని వివిధ రాష్ట్రాల ప్రభుత్వ భవనాల్లో ఇంధన సామర్థ్య చర్యలపై దృష్టి సారించింది. మొదటిదశలో ఏపీ భవన్ నుంచి ఇంధన సామర్థ్య పైలట్ ప్రాజెక్టును ప్రారంభించాలని నిర్ణయించింది.

వివరాలు 14 ▸

ఏడాదిలోగా రూ.25 వేల కోట్ల రక్షణ ఎగుమతులు



వచ్చే ఏడాదిలోగా రూ. 25 వేల కోట్ల విలువైన రక్షణ ఉత్పత్తులను ఎగుమతి చేస్తామని, ప్రపంచస్థాయి దేశీ రక్షణ రంగ ఉత్పత్తులను తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టం చేశారు. ఆదివారం బెంగళూరులోని తాజ్ వెస్ట్ ఎండ్ హోటల్‌లో ఏరో ఇండియా–2023 పరిచయ సభ కార్యక్రమం నిర్వహించారు.

వివరాలు 3 ▸



పోలవరం స్పిల్ వే

వడివడిగా జీవనాడి

పోలవరం పనుల్లో పురోగతికి సీఎం వైఎస్ జగన్ చర్యలు

రూ.2,948.04 కోట్ల రీయింబర్స్‌లో కేంద్రం తీవ్ర జాప్యం

- అయినా రాష్ట్ర ఖజానా నుంచే నిధుల సర్దుబాటు
- చంద్రబాబు కమీషన్ల కక్కుర్తి పాపాల వల్లే పనుల్లో జాప్యం
- సవాళ్లను అధిగమిస్తూ పనులు పూర్తి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- డీడీఆర్పీ, సీడబ్ల్యూసీ సూచనల మేరకు దిగువ కాఫర్ డ్యామ్ పూర్తి
- ఈసీఆర్‌ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో అగాధాల పూడ్చివేత ముమ్మరం
- వందలాది టిప్పర్లతో ఇసుకను తెచ్చిపోసి.. రోలింగ్
- వైబ్రో కాంపాక్షన్ చేస్తూ యథాస్థితికి తెచ్చే యత్నం
- దయా ఫ్రమ్ వాల్‌పై ఎన్‌హెచ్‌పీసీ నివేదికే కీలకం
- ఇప్పటికే ఎగువ కాఫర్ డ్యామ్, 48 గేట్లతో స్పిల్ వే పూర్తి
- 2021 జూన్ 11నే గోదావరి ప్రవాహం స్పిల్ వే మీదుగా మళ్లింపు
- రెండేళ్లలో 9,840.2 టీఎంసీల నీరు దిగువకు విడుదల
- స్పిల్ పనితీరు అద్భుతమని సీడబ్ల్యూసీ ప్రశంసలు



దాదాపు పూర్తయిన దిగువ కాఫర్ డ్యామ్

పోలవరం ప్రాజెక్టు నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి రామగోపాల రెడ్డి


ఆలమూరు: రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దిక్సూచిలా నిలిచే పోలవరం ప్రాజెక్టు పనుల్లో కమీషన్ల కోసం నాటి సీఎం చంద్రబాబు చేసిన తప్పిదాలతో ఎదురవుతున్న సవాళ్లను ఒక్కొక్కటిగా అధిగమిస్తూ.. ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భగీరథ యత్నం చేస్తున్నారు. పోలవరం పనులకు

మిగతా 2వ పేజీలో ▶

ఏపీ కొత్త గవర్నర్‌గా జస్టిస్ అబ్దుల్ నజీర్

12 రాష్ట్రాలకు కొత్త గవర్నర్‌లను నియమించిన కేంద్రం

- విభజన తర్వాత రాష్ట్రానికి తొలిసారి సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి
- కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లా బెళువాయికానా స్వస్థలం
- ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా విశ్వభూషణ్ హరిచందన్
- వివాదాస్పద మహారాష్ట్ర గవర్నర్ కొశ్యారీకి ఉద్వాసన



జస్టిస్ అబ్దుల్ నజీర్



హరిచందన్

సాక్షి, న్యూఢిల్లీ / బెంగళూరు శివాజీనగర్: ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అబ్దుల్ నజీర్ నియమితులయ్యారు. ప్రస్తుత గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా నియమించారు. వివాదాస్పద మహారాష్ట్ర గవర్నర్ బీఎస్ కొశ్యారీకి ఉద్వాసన పలికారు. 12 రాష్ట్రాలకు కొత్త గవర్నర్‌లను నియమిస్తూ రాష్ట్రపతి జారీ చేసిన ఉత్తర్వులను కేంద్రం ఆదివారం విడుదల చేసింది. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు ఓ న్యాయమూర్తి గవర్నర్‌గా నియామకం కావడం ఇదే తొలిసారి. ఉమ్మడి రాష్ట్రానికి జస్టిస్ ఓబుల్‌రెడ్డి, జస్టిస్ బీకే దివాన్

మిగతా 2వ పేజీలో ▶

కొత్త గవర్నర్‌కు సీఎం జగన్ శుభాకాంక్షలు

- న్యాయ నిపుణుడి అనుభవం ఎంతో ఉపయోగకరం
- రాష్ట్రం మరింత పురోగమిస్తుందని ఆశాభావం
- ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా నియమితులైన హరిచందన్‌కూ అభినందనలు.. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ఆయన సహకారం మరవలేము
- నిండైన హుందాతనంతో వ్యవహరించారని ప్రశంసలు

2 లో

బెజవాడలో టీడీపీ గూండాల బరితెగింపు

- నెల రోజులుగా ఓ మహిళకు టీడీపీ నేత తమ్ముడి వేధింపులు
- తాజాగా చేతులు వేసి.. అనుచిత వ్యాఖ్యలు
- ఇంట్లో వారికి విషయం చెప్పిన బాధితురాలు.. ఇది పద్ధతి కాదన్న అత్త, మామ, మరిది
- మమ్మల్నే ప్రశ్నిస్తారా.. అంటూ 20 మందితో దాడి
- అనుచరులతో కలిసి కత్తులతో స్వైర విహారం
- నలుగురికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- ఆరుగురిపై కేసు నమోదు



వడ్డాది రమణ

విందిపేట (విజయవాడ పశ్చిమ): టీడీపీ నేతల అరాచకాలకు అంతులేకుండా పోయింది. మహిళలన్న గౌరవం, విచక్షణ లేకుండా బరితెగించి లైంగిక వేధింపులకు పాల్పడటం పరిపాటిగా మారింది. ప్రజల్లో ఉనికి కోల్పోతున్నామనే అక్కసుతో ప్రశ్నించిన వారిపై మూకుమ్మడి దాడులకు దిగుతుండటం నిత్యకృత్యమైంది. ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురి చేయడమే టీడీపీ విధానంగా.. ఆ పార్టీ నేతలు బజారు రౌడీలను మించి కొట్లాటలకు దిగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. తమ కుటుంబంలోని మహిళను ఎందుకు వేధించారని ప్రశ్నించిన పాపానికి విజయవాడలో టీడీపీ నేత ఒకరు ఏకంగా 20 మందికి పైగా అనుచరులతో కలిసి.. కత్తులతో ఆ మహిళ కుటుంబంపై విచక్షణ రహితంగా దాడి చేయడం ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనంగా నిలిచింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. విజయవాడ నగరంలోని 55వ డివిజన్ (విందిపేట) టీడీపీ అధ్యక్షుడు వడ్డాది రమణ తమ్ముడు వడ్డాది నరేష్ నెల రోజులుగా స్థానికంగా నివసించే ఓ వివాహితను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలోనే ఆదివారం సాయంత్రం బయటకు వెళ్తున్న ఆమెపై చేతులు వేసి, అనుచిత వ్యాఖ్యలు చేశాడు. బాధితురాలు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పగా.. ఆమె అత్త, మామ, మరిది కలిసి

మిగతా 3వ పేజీలో ▶



2 నెలల పసిగుడ్డు.. 128 గంటల తరువాత...

ఇప్పుడిప్పుడే లోకం చూస్తున్న పసిగుడ్డు.. ఒకటీ రెండూ కాదు.. ఏకంగా 128 గంటల పాటు శిథిలాల్లోనే చిక్కుకుపోయింది. భూకంప ప్రభావిత తుర్కియేలోని హతాయ్ పట్టణంలో ఈ రెండు నెలల పసికందును రెస్క్యూ సిబ్బంది సజీవంగా రక్షించారు. అలాగే, మరి కొన్ని ఘటనల్లో 151 గంటల తరువాత ఆరేళ్ల బాలుడిని, ఓ బాలికను కూడా కాపాడారు. మరోపక్క భూకంపం ధాటికి తుర్కియే, సిరియా ఇంకా కోలుకోలేదు. మృతుల సంఖ్య 30 వేలు దాటింది. ఇంకా శిథిలాల్లో చిక్కుకున్న వారిని వెలికితీసే పనులు కొనసాగుతున్నాయి.

- వివరాలు 6లో ▶

ఒక్కమాట అబద్ధమున్నా రాజీనామా

- అసెంబ్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సవాల్
- మోదీ పాలనలో ఏ ఒక్క రంగంలోనూ వృద్ధి లేదు
- అన్నిట్లోనూ అత్యంత చెత్త పనితీరు.. వార్షిక వృద్ధి రేటు 6.8 శాతం నుంచి 5.5 శాతానికి పడిపోయింది
- తలసరి ఆదాయం, ఎగుమతులు, పారిశ్రామిక వృద్ధి రేట్లు పడిపోయాయి.. పెట్టుబడి వ్యయం తగ్గిపోయింది..
- జీడీపీలో అప్పులశాతం, ద్రవ్యలోటు పెరిగిపోయాయన్న సీఎం
- ఎన్డీయే అంటే 'నో డేటా అవైలబుల్' అని ఎద్దేవా

2 లో





అమ్మాయిలు అదరగొట్టారు

గత మెగా టోర్నీ రన్నరప్ భారత్.. ఈ టి20 ప్రపంచకప్‌లో పాకిస్తాన్ పనిపట్టి టైటిల్ దిశగా తొలి అడుగు వేసింది. చిరకాల ప్రత్యర్థి నిర్దేశించిన 150 పరుగుల లక్ష్యాన్ని భారత్ అమ్మాయిలు ఛేదించి విజయాన్ని అందుకున్నారు. జెమీమా–రిచా జోడీ అద్భుతమైన ఆటతో 19వ ఓవర్లో 7 వికెట్ల తేడాతో గెలిచి శుభారంభం చేశారు.

- వివరాలు 12లో



తిరుపతిలో సీఎం కప్ ఫైనల్స్

ఈ నెల 23 నుంచి 26 వరకు పోటీలు

14 క్రీడాంశాల్లో పోటీ పడనున్న 4,200 మందికిపైగా క్రీడాకారులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 'సీఎం కప్' టోర్నీ ఫైనల్స్‌ను తిరుపతి వేదికగా నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాప్) సన్నాహాలు చేస్తోంది. ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు 14 క్రీడాంశాల్లోనూ స్టేట్ మినీ ఒలింపిక్స్ మాదిరిగా ఒకే ప్రాంతంలో పోటీలను ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే జిల్లాస్థాయిలో పోటీల్లో గెలుపొందిన జట్ల వివరాలను పంపించాలని డీఎస్‌ఏలు, చీఫ్ కోచ్‌లను శాప్ ఆదేశించింది. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 4,200 మందికిపైగా క్రీడాకారులు సీఎం కప్ టోర్నీలో

మిగతా 14వ పేజీలో ▶

ఇదం జగత్



గ్రామాల్లో రీసైక్లింగ్ రోడ్లు



సేకరించే ప్లాస్టిక్ చెత్తతో రహదారులు

- గ్రామీణ సడక్ యోజన రోడ్ల నిర్మాణంలోనూ వినియోగం
- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక్కో రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు
- 160 నియోజకవర్గాల్లో 160 గ్రామాల ఎంపిక ఇప్పటికే పూర్తి
- ఇప్పటికే గ్రామాల్లో 232 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ



గ్రామాల్లో సిమెంట్, తారు రోడ్లను మాత్రమే ఇప్పటివరకు చూశాం. ఇకపై ప్లాస్టిక్ రోడ్లనూ చూడబోతున్నాం. పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం విధించిన ఏపీ సర్కారు.. ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్‌పైనా ప్రత్యేక దృష్టి సారించింది. వాడి పారేసిన ప్లాస్టిక్ వ్యర్థాలకు అర్థాన్ని.. ప్రయోజనాన్ని చేకూర్చేలా ప్లాస్టిక్ రోడ్ల నిర్మాణానికి అనువుగా మార్చే దిశగా అడుగులు వేస్తోంది. సిమెంట్ పరిశ్రమల్లో వినియోగించే విధంగానూ రీసైక్లింగ్ యూనిట్లను సిద్ధం చేస్తోంది.

సాక్షి, అమరావతి: పర్యావరణంతో పాటు భూగర్భ జలాలకు ప్రమాదకరంగా తయారైన ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు సేకరించి.. వాటిని రోడ్ల నిర్మాణంలో ఉపయోగించేలా రీసైక్లింగ్ చేసేందుకు పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. నియోజకవర్గానికి ఒకచోట ఈ తరహా రీసైక్లింగ్ యూనిట్లను ఏర్పాటు చేయబోతోంది. రాష్ట్రవ్యాప్తంగా 160 గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్ల ఏర్పాటుకు గ్రామాల ఎంపిక సైతం పూర్తయింది. పట్టణాల తరహాలో గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రతి ఇంటినుంచీ నేరుగా చెత్త సేకరణ ప్రక్రియను ప్రభుత్వం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇలా సేకరించిన చెత్తను ఆయా గ్రామాల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న చెత్త సేకరణ కేంద్రాల (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ల)లో ప్లాసిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు వేరు చేసి ఉంచుతారు. గ్రామాల వారీగా ఇలా వేరు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను వారానికి ఒకటి లేదా రెండు విడతలుగా

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

పద్మావతి అమ్మవారి సేవలో జస్టిస్ ఎన్వీ రమణ

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ ఆదివారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం స్వాగతం పలికారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకున్న ఆయన అమ్మవారి మూల విరాట్‌ను దర్శించుకున్నారు. ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో సీఎం జగన్ భేటీ

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం పార్టీ ఎమ్మెల్యేలు, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలు, జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు (జేసీఎస్) రాష్ట్ర కో–ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, రీజనల్ కో–ఆర్డినేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మధ్యాహ్నం మూడు గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుంది. ఈ సమావేశానికి ఆహ్వానితులు అందరూ విధిగా హాజరుకావాలని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ముఖ్యంగా పార్టీ నిర్దేశిత ఫార్మాట్‌లో 'గృహ సారథులు'గా నియమితులైన వారి తుది జాబితాను హార్డ్ కాపీ (పెన్ డ్రైవ్‌లో) లేదా సాఫ్ట్ కాపీని ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు ఈ సమావేశంలో తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని పేర్కొంది.

త్వరలో మరిన్ని 'గిరి' బంకులు



ఇటీవల రంపచోడవరంలో ప్రారంభించిన గిరిజన పెట్రోల్ బంకు

సాక్షి, అమరావతి: గిరిజనులు పండించే పంటలు.. సేకరించే అటవీ ఫలసాయాన్ని కొనుగోలు చేసి వారికి కొండంత అండగా నిలుస్తున్న గిరిజన సహకార సంస్థ (జీసీసీ) తన సేవలను మరింత విస్తృతం చేసింది. పెట్రో ఉత్పత్తుల్ని గిరిజనుల చెంతకు చేర్చేందుకు ఏజెన్సీ ప్రాంతంలో జీసీసీ త్వరలో మరిన్ని పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీలు లాభాల బాటపట్టాయి. ప్రస్తుతం 16 పెట్రోల్ బంకులు, 12 గ్యాస్ ఏజెన్సీలను జీసీసీ నిర్వహిస్తోంది. ఇవి పురోగమిస్తుండటంతో త్వరలో మరిన్ని ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. వీటిలో స్థానిక గిరిజన యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం విశేషం. ఇప్పటికే గిరిజనులు సేకరించే చింతపండు, కరక్కాయ, నల్ల జీడిపిక్కలు తదితరాలను జీసీసీ సేకరించి మార్కెటింగ్ కల్పించడంలో బ్రాండ్ ఇమేజ్‌ను సొంతం చేసుకుంది.

మూడేళ్లలో రూ.720.13 కోట్ల విక్రయాలు

జీసీసీ నడుపుతున్న 16 పెట్రోల్ బంకుల ద్వారా గతేడాది మార్చి నుంచి డిసెంబర్ వరకు రూ.265 కోట్ల మేర విక్రయాలు జరిగాయి. తద్వారా జీసీసీ రూ.4.60 కోట్ల లాభం గడించింది. 12 గ్యాస్ ఏజెన్సీల ద్వారా రూ.31.43 కోట్ల మేర గ్యాస్ విక్రయాలు జరపగా.. రూ.1.60 కోట్ల లాభం వచ్చాయి. మూడేళ్లలో రూ.720.13 కోట్ల విలువైన పెట్రోలియం ఉత్పత్తుల విక్రయాలు జరిగాయి.

తెలంగాణ

ఒక్కమాట అబద్ధమున్నా రాజీనామా


అసెంబ్లీలో సీఎం కేసీఆర్ సవాల్

సాక్షి, హైదరాబాద్: మన్మోహన్‌సింగ్ హయాంతో పోల్చితే ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో వార్షిక వృద్ధిరేటు 6.8 శాతం నుంచి 5.5 శాతానికి పడిపోయిందని సీఎం కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. తలసరి ఆదాయం వృద్ధి రేటు 12.73 శాతం నుంచి 7.01 శాతానికి, ఎగుమతుల వృద్ధి రేటు 19.5 శాతం నుంచి 4.9 శాతానికి, పారిశ్రామిక వృద్ధి రేటు 5.87 శాతం నుంచి 3.2 శాతానికి పడిపోయాయని వివరించారు. పెట్టుబడి వ్యయం 37.5 శాతం నుంచి 31 శాతానికి తగ్గిందని తెలిపారు. రూపాయి విలువ రూ.58.6 నుంచి రూ.82.6 శాతానికి దిగజారిందని చెప్పారు. ద్రవ్య వినిమయ బిల్లుపై ఆదివారం రాష్ట్ర శాసనసభలో జరిగిన చర్చకు కేసీఆర్ జవాబిచ్చారు. మోదీ పాలనను మన్మోహన్ పాలనతో పోల్చుతూ 'ది లాస్ట్ డికేడ్' అనే పుస్తకాన్ని పూజా మెహ్రా రాశారని సీఎం తెలిపారు. 'మోదీ హయాంలో ఏ ఒక్క రంగంలోనైనా వృద్ధి ఉందా? అంటే లేదు..' అని విమర్శించారు. జీడీపీలో అప్పుల శాతం 52 శాతం నుంచి 56.2 శాతానికి, ద్రవ్యలోటు 4.77 శాతం నుంచి 5.1 శాతానికి పెరిగాయన్నారు. తాను చెప్పిన వాటిల్లో ఒక్కమాట అబద్ధమున్నా రాజీనామా చేస్తానని సీఎం సవాల్ విసిరారు. అన్ని రంగాల్లో అత్యంత చెత్తగా పనితీరు చూపిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది మోదీ ప్రభుత్వమేనని ధ్వజమెత్తారు. 'ఎన్పీయేల పేరుతో రూ.14 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేశారు. రూ.20 లక్షల కోట్లు ఏ ఎంఎస్ఎంఈలకు ఇచ్చారో భగవంతుడికే తెలుసు. పార్లమెంటులో అడిగితే నో డేటా అవైలబుల్ అన్నారు. ఎన్డీయే అంటే నో డేటా అవైలబుల్ (ఎన్డీఏ)..' అని కేసీఆర్ ఎద్దేవా చేశారు.

ఇల్లు 'చిల్'అయ్యేలా!

అందుబాటులోకి విండో ఫిల్మ్‌లు

- కిటికీలకు అతికిస్తే ఇల్లు కూలయిపోతుంది
- శీతాకాలంలో ఇంట్లో వేడిని బంధిస్తుంది
- ప్రపంచ ఇంధన వినియోగంలో కేవలం గది చల్లదనానికే 15 శాతం ఖర్చు
- దీనిని తగ్గించేందుకు 'ట్రాన్స్‌పరెంట్ రేడియేటివ్ కూలర్' టెక్నాలజీ
- గ్లాస్ కిటికీల నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాలకు చెక్
- తక్కువ ఖర్చులోనే ఫిల్మ్‌లు లభ్యం



విద్యుత్‌ను ఆదా చేయడంతో పాటు ఇళ్లలోకి అతినీలలోహిత కిరణాలు చొరబడకుండా కాపాడే విండో ఫిల్మ్‌ను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. కాంతిని నిరోధించకుండానే గదిని చల్లబరచగలగటం దీని ప్రత్యేకత. 'పారదర్శక రేడియేటివ్ కూలర్లు'గా పిలిచే ఈ ఫిల్మ్‌ను కిటికీలకు వినియోగిస్తే.. ఒక్క వాట్ విద్యుత్ కూడా వాడక్కర్లేకుండా భవనాల లోపలి ఉష్ణోగ్రత తగ్గిపోతుంది. ఈ ఫిల్మ్‌లు మన దేశీయ మార్కెట్‌లోనూ లభ్యమవుతున్నాయి.

సాక్షి, అమరావతి: ప్రపంచవ్యాప్తంగా ప్రజల జీవన విధానంలో అనేక మార్పులొస్తున్నాయి. వాటికి తగ్గట్టుగానే సరికొత్త వ్యాపారాలూ పుట్టుకొస్తున్నాయి. కిటికీ అద్దాలకు విండో ఫిల్మ్‌ను అతికిస్తే ఇల్లు మొత్తం కూల్‌గా మారిపోయే విండో ఫిల్మ్ మార్కెట్‌లోకి వచ్చేసింది. విద్యుత్ బిల్లులను తగ్గించడంతోపాటు అల్ట్రా వయొలెట్ (అతినీలలోహిత) కిరణాల నుంచి రక్షణ కల్పించేలా దీనిని అభివృద్ధి చేశారు. ట్రాన్స్‌పరెంట్ రేడియేటివ్ కూలర్లుగా పిలుస్తున్న ఈ ఫిల్మ్‌లను వినియోగించటం వల్ల ఏసీలు, కూలర్లతో పని లేకుండా గదులన్నీ కూల్ అయిపోతాయి. ప్రపంచంలో దాదాపు 15 శాతం విద్యుత్‌ను కేవలం గదుల శీతలీకరణకే వినియోగిస్తున్నారు. ఈ సాంకేతికత వల్ల ఒక్క యూనిట్ విద్యుత్ కూడా వాడాల్సిన అవసరం లేకుండా భవనాల లోపల ఉష్ణోగ్రతను తగ్గించగలదు. అమెరికన్ కెమికల్ సొసైటీ ఎనర్జీ లెటర్స్ నివేదిక ప్రకారం.. భవనాలు, వాహనాల్లో చల్లదనం కోసం కొత్తగా అభివృద్ధి చేసిన 'ట్రాన్స్‌పరెంట్ రేడియేటివ్ కూలర్లు' విండో మెటీరియల్‌గా ఉపయోగపడతాయి. ఇవి వాతావరణ మార్పులను పరిష్కరించడంలోనూ తోడ్పడతాయి.



విండో గ్లాస్ ఫిల్మ్

ప్రయోజనాలెన్నో..!

విండో ఫిల్మ్ అనేది ఒక సన్నని పదార్థం. దీనిని పాలిస్టర్ పొరలతో తయారు చేస్తారు. ప్రతిబింబం కనిపించేలా పూత పూస్తారు. ఇలా తయారైన విండో ఫిల్మ్‌ను కిటికీలకు అమర్చడం వల్ల సూర్యరశ్మిని గదిలోకి రానివ్వకుండా అడ్డుకుంటుంది. సూర్య కిరణాల్లో ఉండే హానికరమైన అతినీలలోహిత (అల్ట్రా వయొలెట్) కిరణాలను ఈ ఫిల్మ్ 97 శాతం అడ్డుకుంటుంది. సాధారణ గ్లాస్ కిటికీలకు కూడా ఈ ఫిల్మ్ వేస్తే బ్రాండెడ్ కిటికీల్లా మారతాయి. భవనంలోకి ప్రవేశించే సౌరశక్తిలో 80 శాతం వరకూ నిరోధించడానికి ఈ ఫిల్మ్‌లను రూపొందించారు. ఇవి సాధారణ కిటికీల కంటే 31 శాతం ఎక్కువ చల్లదనాన్ని ఇస్తాయి. చూడ్డానికి కూడా అందంగా ఉంటాయి. గదికి, ఇంటికి కొత్త కళ వస్తుంది. అన్నిటికంటే ముఖ్యంగా ఈ ఫిల్మ్‌ను కిటికీ అద్దాలకు అతికించడం వల్ల ఇంటిలో వేడి వాతావరణం తగ్గి గది చల్లబడుతుంది. తద్వారా ఫ్యాన్లు, ఏసీల వినియోగం తగ్గి విద్యుత్ ఆదా అవుతుంది. శీతాకాలంలో ఇంట్లోని వేడిని బయటకు పోనివ్వకుండా నిలుపుదల చేస్తూ.. బయట వాతావరణంలోని చల్లదనాన్ని ఇంట్లోకి రానివ్వకుండా చేసి గృహస్తుల ఆరోగ్యానికి కారణమవుతుంది.

భారీగా పెరుగుతున్న మార్కెట్

యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రచురించిన గ్లోబల్ స్టేటస్ రిపోర్ట్ ఆఫ్ బిల్డింగ్స్ అండ్ కన్‌స్ట్రక్షన్ నివేదిక ప్రకారం.. బిల్డింగ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఖర్చులు 2019లో ప్రపంచవ్యాప్తంగా 152 బిలియన్ డాలర్లకు పెరిగాయి. 2018తో పోలిస్తే ఇది 3 శాతం ఎక్కువ. దీంతో ఇంధన సామర్థ్యం, సమర్థ వినియోగం చేయగల భవనాలకు డిమాండ్ పెరుగుతోంది. అదే విండో ఫిల్మ్ మార్కెట్ వృద్ధికి కారణమవుతోంది. విండో ఫిల్మ్ మార్కెట్ ఆసియా–పసిఫిక్, పశ్చిమ యూరప్, తూర్పు యూరప్, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, మధ్యప్రాచ్యం, ఆఫ్రికాలో బాగా విస్తరించింది. భారత్ సహా 30 దేశాల మార్కెట్లను అధ్యయనం చేసిన తరువాత విండో ఫిల్మ్ గ్లోబల్ మార్కెట్ ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా ఈ మార్కెట్ 2021లో 13.08 బిలియన్ డాలర్లుగా ఉంటే.. 2022లో 13.90 బిలియన్ డాలర్లకు చేరింది. 2026 నాటికి 6.40 శాతం వార్షిక వృద్ధితో 17.79 బిలియన్ డాలర్లకు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ ఫిల్మ్‌లు ఆఫ్‌లైన్‌లోనే కాకుండా ఆన్‌లైన్ మార్కెట్‌లోనూ దొరుకుతున్నాయి. ధరలు కూడా కనిష్ఠంగా ఒక్కో ఫిల్మ్ కేవలం రూ.150 నుంచే మొదలవుతున్నాయి. ఆన్‌లైన్‌లో కొనే ముందు నాణ్యత తెలుసుకుంటే మంచిది.

ఏపీ కొత్త గవర్నర్‌గా జస్టిస్ అబ్దుల్ నజీర్

▶ మొదటి పేజీ తరువాయి

గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన విషయం విదితమే. జస్టిస్ అబ్దుల్ నజీర్ కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లా బెళువాయికానాలో 1958 జనవరి 5న జన్మించారు. ఈ పట్టణం మంగళూరుకు 35 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మూడబిద్రిలోని మహావీర్ కాలేజీలో బీకాం, మంగళూరులోని ఎస్‌డీఎం లా కాలేజీలో ఎల్‌ఎల్‌బీ పట్టా పొందారు. 1983లో కర్ణాటక హైకోర్టులో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 2003 మే 12న కర్ణాటక హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనంతరం పూర్తి స్థాయి న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టాక 2017 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. మూడో స్థానంలో ఉన్న న్యాయమూర్తి ఏ హైకోర్టులోనూ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టకుండా నేరుగా సుప్రీంకోర్టుకు పదోన్నతి పొందడం అదే తొలిసారి. 2023 జనవరి 4న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీవిరమణ పొందారు. అభినందన సభలో జస్టిస్ అబ్దుల్ నజీర్ గురించి సీజేఐ డీవై చంద్రచూడ్ మాట్లాడుతూ.. 'జస్టిస్ అబ్దుల్ నజీర్ సౌమ్యుడు, సామాన్యుడు. ఇటీవలి వరకు డ్రైవింగ్ లైసెన్స్ లేదా న్యాయమూర్తి కార్డును గుర్తింపు కార్డుగా ఉపయోగించారు. 2019లో పాస్‌పోర్టు తీసుకున్నారు. అదీ అత్యవసరంగా మాస్కో వెళ్లాల్సివచ్చినపుడు తీసుకున్నారు. పాస్‌పోర్టుపై తొలిస్టాంపు అదే'అని వ్యాఖ్యానించారు.

కీలక ధర్మాసనాల్లో బాధ్యతలు

జస్టిస్ అబ్దుల్ నజీర్ సుప్రీంకోర్టులో పలు కీలక ధర్మాసనాల్లో న్యాయమూర్తిగా పని చేశారు. 2017లో ట్రిపుల్ తలాక్ కేసులో ఏకైక ముస్లిం న్యాయమూర్తిగా ఉన్నారు. ఐదుగురు న్యాయమూర్తులున్న ఈ ధర్మాసనంలో ముస్లిం షరియా చట్టం ప్రకారం ట్రిపుల్ తలాక్ ఆచరణకు అనుమతి ఉందని జస్టిస్ నజీర్ తన తీర్పులో పేర్కొన్నారు. 3:2తో ట్రిపుల్ తలాక్ చెల్లదని ఆ ధర్మాసనం తీర్పు చెప్పిన విషయం విదితమే. 2019లో అయోధ్య రామ మందిరం కేసులోనూ రాజ్యాంగ ధర్మాసనంలో సభ్యుడిగా ఉన్నారు. వివాదాస్పద ప్రాంతంలో హిందూ నిర్మాణం ఉనికి గురించి ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా పేర్కొన్న విషయాన్ని జస్టిస్ నజీర్ సమర్థించారు. రామ మందిరానికి అనుకూలంగా తీర్పునిచ్చారు. పదవీ విరమణకు ముందు రాజ్యాంగ ధర్మాసనానికి నేతృత్వం వహించిన జస్టిస్ నజీర్ పెద్దనోట్ల రద్దు సహా పలు కేసులు విచారించారు.

కొత్త గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు శుభాకాంక్షలు: సీఎం జగన్



ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా నియమితులైన హరిచందన్‌కూ అభినందనలు

సాక్షి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మార్గనిర్దేశంలో రాష్ట్రం మరింత పురోగమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయ నిపుణులైన జస్టిస్ నజీర్ అనుభవం ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేయడంలో, రాష్ట్రానికి చక్కటి మార్గనిర్దేశం చేయడంలో ఉపయోగపడుతుందని ఆకాంక్షిస్తూ ఆదివారం ట్వీట్ చేశారు. ఇప్పటి దాకా రాష్ట్ర గవర్నర్‌గా వ్యవహరించిన విశ్వభూషణ్ హరిచందన్ ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా నియమితులవ్వడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్‌గా ఆయన రాష్ట్రానికి అందించిన సేవలను కొనియాడారు. రాష్ట్ర ప్రజలు ఆయన్ను ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు. మచ్చలేని వ్యక్తిత్వం హరిచందన్ సొంతమని పేర్కొన్నారు. కోవిడ్‌లాంటి విపత్కర పరిస్థితులను దాటుకుని రాష్ట్రం ప్రగతి పథంలో పయనించడానికి ఆయన మరువలేని సహకారాన్ని అందించారని చెప్పారు. అధికార కార్యకలాపాల నిర్వహణలో ప్రజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లేలా, నిండైన హుందాతనంతో వ్యవహరించారని, అత్యుత్తమ రాజకీయ పరిణతి చూపించారన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంలో, వాటి మధ్య సంబంధాలు సజావుగా సాగడంలో అత్యంత కీలక పాత్ర పోషించి, రాజ్యాంగానికి వన్నె తెచ్చారన్నారని ముఖ్యమంత్రి జగన్ కొనియాడారు. తండ్రి తరహాలో వాత్సల్యాన్ని చూపారని, తెలుగు ప్రజలకు ఆత్మీయతను పంచారని ప్రశంసించారు. రాష్ట్రం నుంచి ఆయన వెళ్లి పోవడం బాధాకరమైనా, దేశంలో మరో రాష్ట్రానికి ఆయన గవర్నర్‌గా వెళ్లడం అక్కడి ప్రజలకు తప్పకుండా మేలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ ట్వీట్ చేశారు.

కొత్త గవర్నర్‌కు అభినందనలు : చంద్రబాబు

ఏపీ నూతన గవర్నర్‌గా నియమితులైన ఎస్ అబ్దుల్ నజీర్‌కు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు అభినందనలు తెలిపారు. చిత్తశుద్ధి, నిజాయితీ గల వ్యక్తిగా పేరొందిన ఆయన రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడంలో ముందంజలో ఉంటారని ఆశిస్తున్నానని ఆదివారం ట్వీట్ చేశారు.

మంత్రి బుగ్గన, పవన్, సోము వీర్రాజు శుభాకాంక్షలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఆదివారం వేర్వేరుగా శుభాకాంక్షలు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ సేవలు మరవలేమని మంత్రి బుగ్గన కొనియాడారు.

వడివడిగా జీవనాడి

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చులో రూ.2,948.04 కోట్లను కేంద్రం రీయింబర్స్ చేయడంలో తీవ్ర జాప్యం చేస్తోంది. కేంద్రం నిధులు ఇవ్వకున్నప్పటికీ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ.. రాష్ట్ర ఖజానా నుంచే నిధులు కేటాయిస్తూ ప్రణాళికా బద్ధంగా ప్రాజెక్టు పనులను రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా పూర్తి చేస్తోంది. రైతులకు ఫలాలను అందించే దిశగా అడుగులు వేస్తోంది.

దిగువ కాఫర్ డ్యామ్ దాదాపు పూర్తి

గోదావరి వరదల ఉధృతికి ఇసుక తిన్నెలు కోతకు గురవడం వల్ల దిగువ కాఫర్ డ్యామ్ 0 నుంచి 680 మీటర్ల వరకు ఏర్పడిన అగాధాన్ని డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానల్ (డీడీఆర్పీ), కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) మార్గదర్శకాల మేరకు మేఘా సంస్థ జియో మెంబ్రేన్ బ్యాగ్‌లలో ఇసుక నింపి.. జెట్ గ్రౌటింగ్, వైబ్రో కాంపాక్షన్ చేస్తూ పూడ్చింది. ఆ తర్వాత 20 మీటర్ల ఎత్తుతో దిగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసింది. కానీ.. జూలై 10న గోదావరికి వచ్చిన భారీ వరద ముంచెత్తడంతో దిగువ కాఫర్ డ్యామ్ పనులకు ఆటంకం కలిగింది. వరదలు తగ్గడంతో నవంబర్‌లో పనులను ప్రారంభించి.. 31.5 మీటర్ల ఎత్తుతో దిగువ కాఫర్ డ్యామ్‌ను దాదాపుగా పూర్తి చేసింది. కేవలం రివిట్‌మెంట్ పనులు మాత్రమే మిగిలాయి. రివిట్‌మెంట్‌తో సహా దిగువ కాఫర్ డ్యామ్ పనులను నెలాఖరుకు పూర్తి చేస్తామని పోలవరం ఎస్ఈ నరసింహమూర్తి 'సాక్షి'కి తెలిపారు. దిగువ కాఫర్ డ్యామ్ పూర్తవడంతో గోదావరికి ఎంత పెద్ద వరద వచ్చినా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు చేపట్టవచ్చని చెప్పారు.

శరవేగంగా అగాధాల పూడ్చివేత

గోదావరి ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా మళ్లించడానికి 2,840 మీటర్ల పొడవున 43 మీటర్ల ఎత్తుతో పూర్తి చేయాల్సిన ఎగువ కాఫర్ డ్యామ్‌ను టీడీపీ సర్కార్ పూర్తి చేయలేక చేతులెత్తేసింది. కుడి, ఎడమ వైపున 680 మీటర్ల ఖాళీ ప్రదేశాన్ని వదిలేసింది. దాంతో 2019లో 2,454 మీటర్ల వెడల్పుతో ప్రవహించాల్సిన గోదావరి.. ఎగువ కాఫర్ డ్యామ్ అడ్డంకిగా మారడం వల్ల ఖాళీగా వదిలిన 680 మీటర్లకు కుంచించుకుపోయి ప్రవహించాల్సి వచ్చింది. దాంతో వరద ఉధృతి మరింత పెరిగి ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై.. నాలుగు ప్రదేశాల్లో –12 నుంచి –22 మీటర్ల లోతుతో అగాధాలు ఏర్పడ్డాయి. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో 1,750 మీటర్ల పొడవునా పునాది డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. డీడీఆర్పీ, సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు అధికారులు అగాధాల పూడ్చివేతకు గతేడాది 11 రకాల పరీక్షలు చేశారు. వాటి ఫలితాలను డీడీఆర్పీ, సీడబ్ల్యూసీ విశ్లేషించి, జారీ చేసిన మార్గదర్శకాల మేరకు.. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య ఉన్న నీటిని మోటార్లతో తోడేస్తున్నారు. పురుషోత్తపట్నం వద్ద గోదావరిలోని ఇసుకను వందలాది టిప్పర్లతో తెచ్చి, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో అగాధాలు ఏర్పడిన చోట పోసి, రోలింగ్ చేస్తున్నారు. ఆ తర్వాత వైబ్రో కాంపాక్షన్ (వైబ్రో కాంపాక్టర్ యంత్రంతో బోరు వేసి.. అధిక ఒత్తిడితో మెలి తిప్పడం) చేస్తూ ఆ ప్రాంతాన్ని యథాస్థితికి తెచ్చే పనులను ముమ్మరం చేశారు.



అగాధాల్లోని ఇసుకను రోలింగ్ చేసి.. యథాస్థితికి తెచ్చేందుకు వైబ్రో కాంపాక్షన్ చేస్తున్న దృశ్యం

ఎన్‌హెచ్‌పీసీ నివేదికే కీలకం

ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ సామర్థ్యాన్ని తేల్చేందుకు జనవరి 26 నుంచి ఈ నెల 10వ తేదీ వరకు 16 రోజులపాటు హై రెజల్యూషన్ జియోఫిజికల్ రెసిస్టివిటీ ఇమేజింగ్, సెస్మిక్ టోమోగ్రఫీ పరీక్షలను ఎన్‌హెచ్‌పీసీ (నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్) బృందం నిర్వహించింది. ఈ పరీక్షల ఫలితాలను విశ్లేషించి.. నెలాఖరులోగా డయాఫ్రమ్ వాల్ భవితవ్యాన్ని తేల్చుతూ నివేదిక ఇవ్వనుంది. డయాఫ్రమ్ వాల్ పటిష్టంగా ఉన్నట్లు తేలితే.. ఆ వెంటనే ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులను చేపట్టి, వరదల్లోనూ నిర్విఘ్నంగా కొనసాగించి, పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఒకవేళ డయాఫ్రమ్ వాల్ సామర్థ్యంపై ఎన్‌హెచ్‌పీసీ నివేదిక అనుమానం వ్యక్తం చేస్తే.. సీడబ్ల్యూసీ, డీడీఆర్పీ మార్గదర్శకాల మేరకు ముందడుగు వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

డెల్టాకు నీటిని సరఫరా చేస్తూ మిగతా పనులు


- గోదావరి ప్రవాహాన్ని అప్రోచ్ ఛానల్ మీదుగా స్పిల్ వే వైపు మళ్లించడానికి.. స్పిల్ వేకు ఎగువన ఎడమ వైపున ఉన్న కొండకు సమాంతరంగా సుమారు 1.3 కి.మీల పొడవు, 52 మీటర్ల ఎత్తుతో గైడ్ వాల్ పనులను ప్రభుత్వం పూర్తి చేసింది. ఇదే రీతిలో ఎగువ కాఫర్ డ్యామ్‌కు ఎగువన కుడి వైపున ఉన్న కొండకు సమాంతరంగా గైడ్ బండ్ నిర్మిస్తోంది.
- గోదావరి డెల్టాలో రబీ పంటలకు పోలవరం స్పిల్ వే రివర్ స్లూయిజ్‌ల ద్వారా నీటిని విడుదల చేస్తూ.. అప్రోచ్ ఛానల్‌లో మిగిలిపోయిన 36.54 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పని, స్పిల్ ఛానల్‌లో 1.20 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి పని, 1.96 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టింది.
- పోలవరం ప్రాజెక్టు నుంచి కుడి కాలువకు నీటిని విడుదల చేసే అనుసంధానాలలో హెడ్ రెగ్యులేటర్, ఈ–శాడిల్ డ్యామ్, ఎఫ్–శాడిల్ డ్యామ్ ఇప్పటికే పూర్తయ్యాయి. జంట సొరంగాల్లో 8.63 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకం పనులను జూన్‌లోగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టారు.
- పోలవరం ప్రాజెక్టు నుంచి ఎడమ కాలువకు నీటిని విడుదల చేసే అనుసంధానాలలో సొరంగం పనులు దాదాపుగా పూర్తికావొచ్చాయి. హెడ్ రెగ్యులేటర్, కేఎల్ బండ్, నావిగేషన్ కెనాల్, నావిగేషనల్ లాక్ పనులను పూర్తి చేయడంపై దృష్టి సారించారు.

స్పిల్ వే పనితీరు అత్యద్భుతం

గోదావరి ప్రవాహాన్ని మళ్లించే స్పిల్ వేను టీడీపీ సర్కార్ పునాది స్థాయిలోనే వదిలేస్తే.. కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ కేంద్రం నిధులు రీయింబర్స్ చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నప్పటికీ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ.. రాష్ట్ర ఖజానా నుంచే నిధులను వ్యయం చేసి 2021 జూన్ 11 నాటికే 48 గేట్లతో సహా సీఎం వైఎస్ జగన్ పూర్తి చేశారు. స్పిల్ వే మీదుగా అప్రోచ్ ఛానల్, స్పిల్ ఛానల్, పైలట్ ఛానల్ ద్వారా 6.1 కి.మీల పొడవునా గోదావరి ప్రవాహాన్ని మళ్లించారు. 2021లో 3,690.38 టీఎంసీలు, 2022లో 6,150.04 టీఎంసీలు వెరసి 9,840.42 టీఎంసీలను పోలవరం స్పిల్ వే మీదుగా సమర్థవంతంగా దిగువకు విడుదల చేశారు. ఈ గణాంకాలను పరిశీలించిన సీడబ్ల్యూసీ అధికారులు.. ప్రపంచంలో అతి పెద్దదైన పోలవరం స్పిల్ వే పనితీరు అత్యద్భుతమని ప్రశంసించారు.

చంద్రబాబు పాపం.. ప్రపంచ వింత

- పశ్చిమగోదావరి జిల్లా రామన్నగూడెం వద్ద గోదావరి నదిలో ఉన్న భూ భౌగోళిక పరిస్థితుల వల్ల నదీ గర్భంలో ప్రధాన డ్యామ్ అంటే ఈసీఆర్ఎఫ్ డ్యామ్‌ను, నది తీరానికి ఆవల కుడి వైపున వరద ప్రవాహాన్ని మళ్లించే స్పిల్ వేను నిర్మించేలా పోలవరం ప్రాజెక్టు డిజైన్‌ను సీడబ్ల్యూసీ ఆమోదించింది. నీటి నిల్వ సామర్థ్యం 194.6 టీఎంసీలు.
- కేంద్రం నిర్మించాల్సిన పోలవరం నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించే వరకూ టీడీపీ సర్కార్ ఎత్తలేదు. ఆపై అధికంగా కమీషన్లు వచ్చే పనులనే సబ్ కాంట్రాక్టర్ల ద్వారా చేపట్టారు. వరదను మళ్లించేలా స్పిల్ వే, కాఫర్ డ్యామ్‌లు పూర్తి చేయకుండానే.. డయాఫ్రమ్ వాల్‌ను 2018 జూన్ నాటికే పూర్తి చేశారు.
- స్పిల్ వేను పునాది స్థాయిలో.. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయలేక టీడీపీ సర్కార్ వదిలేసింది. దాంతో 2019లో గోదావరి వరద కాఫర్ డ్యామ్ ద్వారా అధిక ఉధృతితో ప్రవహించడం వల్ల ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో, దిగువ కాఫర్ డ్యామ్‌లో ఇసుక తిన్నెలు కోతకు గురై భారీ అగాధాలు ఏర్పడ్డాయి. డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది.
- డయాఫ్రమ్ వాల్ సామర్థ్యాన్ని తేల్చే పరీక్షలు చేయడానికి ఇటీవల పోలవరానికి వచ్చిన ఎన్‌హెచ్‌పీసీ బృందం.. చంద్రబాబు పాపాన్ని ప్రపంచ వింతగా అభివర్ణించిందని అధికార వర్గాలు తెలిపాయి. దీనివల్ల పోలవరం పనుల్లో జాప్యం చోటుచేసుకుంటోందని తేల్చి చెప్పాయి.




డయాఫ్రమ్ వాల్ ధ్వంసమైన భాగం

ఈ పాటికే పూర్తయ్యేది..

గతంలో ప్రణాళికా రాహిత్యంతో చేపట్టిన పనుల వల్ల గోదావరి వరదల ఉధృతికి ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ఈసీఆర్ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై నాలుగు ప్రదేశాల్లో భారీ అగాధాలు ఏర్పడ్డాయి. వాటిని సరిదిద్దేందుకు 2020 నుంచి డీడీఆర్పీ, సీడబ్ల్యూసీ, దేశంలోని ఢిల్లీ, చెన్నై, తిరుపతి తదితర ఐఐటీల ప్రొఫెసర్లతో సంప్రదింపులు జరుపుతున్నాం. డయాఫ్రమ్ వాల్ సామర్థ్యం తేల్చడానికి ఎన్‌హెచ్‌పీసీ ఇటీవలే పరీక్షలు చేసింది. వరదల ఉధృతి ప్రభావం లేకపోయిఉంటే.. ఈపాటికి ఎప్పుడో పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేది.

– సుధాకర్ బాబు, సీఈ, పోలవరం ప్రాజెక్టు

ఎంత పెద్ద వరద వచ్చినా భయం లేదిక



పోలవరం ప్రాజెక్టును సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కేంద్రం నిధులివ్వకున్నా రాష్ట్ర ఖజానా నుంచే ఇస్తున్నారు. నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తూనే.. కరోనా కష్టకాలంలోనూ రికార్డు సమయంలో స్పిల్ వే ను పూర్తి చేశాం. ఎంత వరద వచ్చినా తట్టుకునేలా ఎగువ కాఫర్ డ్యామ్ ఎత్తును 44 మీటర్లకు పెంచాం. ఇప్పటికే దిగువ కాఫర్ డ్యామ్ పూర్తి చేశాం. గోదావరికి ఎంత పెద్ద వరద వచ్చినా ఇక భయం లేదు. ఎన్‌హెచ్‌పీసీ నివేదిక మేరకు.. వరదల్లోనూ ఈసీఆర్ఎఫ్ పనులు చేపట్టి పూర్తి చేస్తాం.

– సి.నారాయణరెడ్డి, ఈఎన్‌సీ, జల వనరుల శాఖ

గ్రామాల్లో రీసైక్లింగ్ రోడ్లు



▶ మొదటి పేజీ తరువాయి

ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్‌కు తరలించేలా ఒక వాహనాన్ని కూడా ఏర్పాటు చేస్తారు. ప్రతివారం రూట్ల వారీగా ఆ వాహనంతో అన్ని గ్రామాల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్ యూనిట్లకు తరలిస్తారు. అనంతరం ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను మెషిన్ల సాయంతో బండిల్స్ రూపంలో అణచివేసి.. ఆ తర్వాత చిన్నచిన్న ముక్కలు ముక్కలుగా మార్చి నిల్వ చేస్తారు.

రోడ్ల నిర్మాణంలో వినియోగించేలా..

ప్లాస్టిక్ బాటిల్స్ వంటివి మట్టిలో కలవడానికి కనీసం 240 సంవత్సరాలు పడుతుంది. ఇలాంటి ప్లాస్టిక్ వ్యర్థాలు వర్షం నీటిని భూమిలో ఇంకిపోకుండా అడ్డుపడుతుంటాయి. దీనివల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యే అవకాశం కూడా ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఉమ్మడి నిధులతో పీఎంజీఎస్‌వై (గ్రామీణ సడక్ యోజన) కింద చేపట్టే రోడ్ల నిర్మాణంలో కంకరతో పాటు కొంతమేర ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ప్లాస్టిక్ కవర్లు వంటి వాటిని సిమెంట్ పరిశ్రమలలో మండించడానికి ఉపయోగించేలా ప్రభుత్వాలు దృష్టి పెట్టాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే రీసైక్లింగ్ యూనిట్లలో సిద్ధం చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్ల నిర్మాణంలో ఉపయోగించాల్సి ఉంటుంది. రీసైక్లింగ్ యూనిట్ల ద్వారా రోడ్లు నిర్మించే కాంట్రాక్టర్లకు ఎక్కడికక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను విక్రయించే ఆలోచన చేస్తున్నారు. రానున్న రోజుల్లో రోడ్ల నిర్మాణంలో వీటి వాడకం పెరిగే పక్షంలో జిల్లాల వారీగా ప్రత్యేక వేలం కేంద్రాలను ఏర్పాటు చేసే ఆలోచన కూడా ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.

ఇప్పటికే 232 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ

పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా 2021 అక్టోబర్ నుంచి క్లీన్ ఏపీ నినాదంతో జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం కూడా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి కొనసాగిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే 232 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. వాటిలో స్థానికంగా అమ్మడానికి వీలున్న వాటిని గ్రామ స్థాయిలోనే చిరు వ్యాపారులకు అమ్మేశారు. అమ్మకానికి పనికి రాని వాటిని నాశనం చేసినట్టు చెబుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సేకరించే ప్లాస్టిక్ వ్యర్థాలను కొత్తగా ఏర్పాటు చేస్తున్న రీసైక్లింగ్ యూనిట్ల ద్వారా రోడ్ల నిర్మాణం లేదా సిమెంట్ పరిశ్రమలో మండించడానికి ఉపయోగించేలా రీసైక్లింగ్ ప్రాసెస్ చేయనున్నట్టు అధికారులు వెల్లడించారు.

క్లుప్తంగా...

బ్యాంకులకు సీఆర్డీఏ బకాయి లేదు

- అన్ని వాయిదాలు సకాలంలోనే చెల్లింపు
- జనవరి 31 నాటికే అంతా క్లియర్ చేశాం
- అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు: సీఆర్డీఏ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఆర్డీఏ) ఏ ప్రభుత్వ రంగ బ్యాంక్‌కు బకాయిలు పెండింగ్‌లో పెట్టలేదని సీఆర్డీఏ అకౌంట్స్ అండ్ ఫైనాన్స్ డైరెక్టర్ బండ్ల శ్రీనివాసరావు తెలిపారు. ఆయా బ్యాంకులకు సకాలంలో చెల్లింపులు చేస్తున్నామని, రుణాలపై అసలు, వడ్డీ కలిపి రూ.13.92 కోట్లను జనవరి 31వ తేదీనే చెల్లించినట్లు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో వివరించారు. బ్యాంకుల నుంచి సీఆర్డీఏ తీసుకున్న రుణాలను చెల్లించడం లేదని కొన్ని పత్రికలు, ప్రసార మాధ్యమాలలో అసత్య కథనాలు ప్రచారం చేస్తున్నారని, ఇది సరికాదని ఆయన ఖండించారు. ఏపీ సీఆర్డీఏకు రుణాలు ఇచ్చిన ఏ బ్యాంకుకూ వాయిదాలు బాకీ లేమన్నారు. తమ సంస్థ బ్యాంకులకు సకాలంలో రుణ చెల్లింపులు చేస్తున్నందునే క్రిసిల్ సంస్థ క్షేత్రస్థాయిలో సమీక్షించి రేటింగ్‌ను సైతం సవరించిందని ఆయన తెలిపారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం సరికాదని, అలాంటివారిపై చర్యలు తీసుకుంటామని శ్రీనివాసరావు హెచ్చరించారు. అవసరమైతే రికార్డు పరిశీలించుకోవచ్చని పేర్కొంటూ మూడు జాతీయ బ్యాంకులకు బకాయిలు చెల్లించిన స్టేట్‌మెంట్‌ను ఆయన విడుదల చేశారు.

'మోదీ@20 డ్రీమ్స్ మీట్ డెలివరీ' తెలుగు పుస్తకావిష్కరణ రేపు

సాక్షి, అమరావతి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ 20 ఏళ్ల రాజకీయ జీవితంపై రచించిన 'మోదీ@20 డ్రీమ్స్ మీట్ డెలివరీ' తెలుగు అనువాదం పుస్తకావిష్కరణ కార్యక్రమం మంగళవారం సాయంత్రం విజయవాడ పుస్తక మహోత్సవంలో నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని వెల్లడించింది. కిషన్ రెడ్డి మంగళవారం ఉదయం అమరావతిలో బుద్ధ సర్క్యూట్‌ను ప్రారంభిస్తారని, సాయంత్రం విజయవాడ చేరుకుని దుర్గమ్మను దర్శించుకుంటారని తెలిపింది.

కులం మీద బతికేవాడు అయ్యన్నపాత్రుడు

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ రెబల్‌గా పోటీకి దిగుతున్నా..
- టీడీపీ సీనియర్ నేత ఈర్లె శ్రీరామ్మూర్తి



సాక్షి,అనకాపల్లి: మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత అయ్యన్నపాత్రుడు వెలమ కుల ద్రోహి అని టీడీపీ సీనియర్ నేత, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ స్థానానికి పోటీపడుతున్న టీడీపీ రెబల్ అభ్యర్థి ఈర్లె శ్రీరామ్మూర్తి విమర్శించారు. కులం కోసం కాదు.. కులం మీద బతికేవాడే అయ్యన్నపాత్రుడు అని, తాను తప్ప ఎవరూ ఎదగకూడదని అనుకునే వాడని మండిపడ్డారు. రాజకీయంగా తన ఎదుగుదలను అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేస్తూ వస్తున్నారని ఆరోపించారు. ఆదివారం అనకాపల్లిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను 2018లో రెవెన్యూ ఉద్యోగానికి రాజీనామా చేసి టీడీపీకి సేవలు చేస్తున్నానని తెలిపారు. బీసీ వర్గానికి చెందిన తనకు గతంలో చంద్రబాబు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇస్తానని హామీ ఇచ్చారని.. కానీ మాట తప్పారని ధ్వజమెత్తారు. బీసీ కులాలంటే టీడీపీ అధిష్టానానికి గౌరవం ఎక్కడ ఉందని ప్రశ్నించారు. తనకు ఉపాధ్యాయ సంఘాలు, పట్టభద్రులతో మంచి సన్నిహితం ఉందని, టీడీపీ రెబల్ అభ్యర్థిగా, ఇండిపెండెంట్‌గానైనా నామినేషన్ వేసి గెలుస్తానని శ్రీరామ్మూర్తి ధీమా వ్యక్తం చేశారు. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుతో సన్నిహితంగా ఉంటాననే అక్కసుతోనే అయ్యన్నపాత్రుడు అడుగడుగునా తనపై కక్షసాధింపు చర్యలు చేపడుతున్నారని మండిపడ్డారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం కోటనందూరు మండలం అల్లిపూడి అయ్యన్నపాత్రుడి స్వగ్రామమని, ఆయనది ఉత్తరాంధ్ర కాదని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని వలస నేతలు పాలిస్తున్నారనే ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న అయ్యన్నకు ఆ అర్హత లేదన్నారు.

సుబ్బన్న ఆయిల్ ఫ్యాక్టరీ కేసులో నిందితులకు రిమాండ్

సామర్లకోట: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామంలోని అంబటి సుబ్బన్న ఆయిల్ ఫ్యాక్టరీలో ఏడుగురు కార్మికుల మృతి కేసులో ముగ్గురు నిందితులకు న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. ఈ నెల 9వ తేదీన సుబ్బన్న ఆయిల్ ఫ్యాక్టరీలో ట్యాంకు శుభ్రం చేయడానికి దిగి ఊపిరి ఆడక ఏడుగురు కార్మికులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు ఫ్యాక్టరీ సూపర్‌వైజర్ అక్కిరెడ్డి శ్రీనివాస్, ప్రతినిధులు సింగవరపు విశ్వనాథ్, సింగవరపు రఘురామ్‌లను బాధ్యులుగా పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు. వారిని శనివారం అరెస్టు చేసి, ఆదివారం పెద్దాపురం కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, 14రోజులు రిమాండ్ విధించారు. నిందితులను పెద్దాపురం సబ్ జైలుకు తరలించారు.

అటు మూత.. ఇటు కోత

నేడు రాష్ట్రంలో వెన్నుతట్టి ప్రోత్సాహం

ఇదీ జాతీయ స్థాయిలో ఇంజనీరింగ్ కాలేజీలు, కోర్సుల పరిస్థితి

కొన్ని కోర్సులకే ఆదరణ

- తగ్గిపోతున్న ప్రవేశాలు.. కొరవడుతున్న నైపుణ్యాలు
- టీడీపీ హయాంలో రాష్ట్రంలో 65 కాలేజీల మూసివేత
- విద్యారంగంపై నిర్లక్ష్యం, అరకొర రీయింబర్స్‌మెంట్ కారణం
- మూడేళ్లుగా సంస్కరణలతో మారిన పరిస్థితులు
- ప్రమాణాలు పెరిగేలా కాలేజీలకు మార్గదర్శనం.. మూత మాటేలేదు
- జగనన్న విద్యాదీవెనతో సకాలంలో పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్
- వసతి దీవెనతో విద్యార్థులకు అదనంగా రూ.20 వేలు
- గతంలో ఏటా 37 వేలు ప్లేస్‌మెంట్స్.. ఇప్పుడు ఏకంగా 85 వేలు





దేశవ్యాప్తంగా ఏటా కనీసం 50కిపైగా ఇంజనీరింగ్ కాలేజీలు మూసివేత కోసం దరఖాస్తు చేసుకుంటున్నాయి. మరి కొన్ని వేల సంఖ్యలో కోర్సులను రద్దు చేసుకుంటున్నాయి. ఇబ్బడిముబ్బడిగా కాలేజీలు ఏర్పాటు కావడం, కొన్ని కోర్సులకే ఆదరణ ఉండటం, చేరికలు తగ్గి కాలేజీల నిర్వహణ భారంగా మారడం, నైపుణ్యాలు కొరవడి ప్లేస్‌మెంట్లు తగ్గిపోవడం ఈ దుస్థితికి కారణమని నిపుణుల కమిటీలు స్పష్టం చేస్తున్నాయి. నిపుణుల కమిటీల సూచనల మేరకు ఏఐసీటీఈ 2019లో కొత్త కాలేజీలకు అనుమతులపై మారటోరియం విధించింది. 2014-15 నుంచి జాతీయస్థాయిలో 767 ఇంజనీరింగ్ కాలేజీలు మూతపడినట్లు అఖిల భారత సాంకేతిక విద్యామండలి 2021-22 నివేదికలో వెల్లడించింది. మరికొన్ని కాలేజీలు ఆదరణ లేకపోవడంతో 10,539 కోర్సులను రద్దు చేసుకున్నాయి. 2021-22 నాటికి దేశంలో ఇంజనీరింగ్ తదితర సాంకేతిక కోర్సుల్లో 24 లక్షల సీట్లు అందుబాటులో ఉన్నాయి. 2014-15లో మొత్తం సీట్ల సంఖ్య 31.8 లక్షలు కాగా తరువాత నుంచి ఏటా తగ్గుతూ వస్తోంది. ఏడెనిమిదేళ్లుగా జాతీయస్థాయిలో ఇంజనీరింగ్ తదితర కోర్సుల్లో సగం సీట్లు మాత్రమే భర్తీ అవుతున్నాయి.

- సాక్షి, అమరావతి

2014-15 నుంచి ఇప్పటివరకు మూసివేసిన కాలేజీలు, రద్దయిన కోర్సుల వివరాలు ఇలా..

సంవత్సరం	జాతీయస్థాయిలో		ఏపీలో	
--	కాలేజీలు	కోర్సులు	కాలేజీలు	కోర్సులు
2021-22	43	1,044	0	171
2020-21	63	2,212	0	221
2019-20	92	2,444	7	164
2018-19	89	1,011	2	66
2017-18	134	1,445	20	69
2016-17	163	686	10	18
2015-16	126	1,093	11	74
2014-15	77	604	15	74
మొత్తం	767	10,539	65	857

నాడు 65 కాలేజీల మూసివేత

టీడీపీ హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో 65 కాలేజీల యాజమాన్యాలు తమ విద్యా సంస్థలను మూసివేసినట్లు ఏఐసీటీఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత సర్కారు విద్యారంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేయడంతో ఇంజనీరింగ్ విద్య ప్రమాణాలు కొరవడి అధ్వానంగా మారింది. కాలేజీల ఫీజు ఎంత ఉన్నా రూ.35 వేలు మాత్రమే రీయింబర్స్‌మెంట్‌గా ఇస్తామనడం, అరకొర ఫీజులు కూడా ఏటా సక్రమంగా ఇవ్వకపోవడంతో ఇంజనీరింగ్ విద్య అస్తవ్యస్థమైంది. 2019లో టీడీపీ సర్కారు దిగిపోయే నాటికి కాలేజీలకు రూ.1,800 కోట్ల మేర ఫీజులు బకాయి పెట్టడం గమనార్హం. దీంతో మూసివేత దిశగా విద్యాసంస్థలు సాగాయి.

విద్యారంగ సంస్కరణలు చేపట్టి ఉన్నత చదువులు ఏమాత్రం భారం కాకుండా విద్యార్థులను ప్రోత్సహిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తున్నారు. విద్యార్థి చదువుకు అయ్యే మొత్తం ఫీజును జగనన్న విద్యాదీవెన కింద ప్రభుత్వమే చెల్లిస్తోంది. ప్రతి త్రైమాసికంలో నిర్దిష్టంగా చెల్లిస్తూ చదువులకు భరోసా కల్పిస్తోంది. అంతే కాకుండా వసతి దీవెన కింద రూ.20 వేలు చొప్పున విద్యార్థులకు అందజేస్తోంది. మరోవైపు గత సర్కారు బకాయిపెట్టిన ఫీజులను కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే చెల్లించి విద్యార్థులను ఆదుకుంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 2019 తరువాత రాష్ట్రం నుంచి ఒక్క ఇంజనీరింగ్ కాలేజీ కూడా మూసివేత కోసం దరఖాస్తు చేయలేదని ఏఐసీటీఈ గణాంకాలు పేర్కొంటున్నాయి.

- అన్ని కాలేజీల్లో నిబంధనల ప్రకారం సదుపాయాలు, బోధనా సిబ్బంది, న్యాక్ అక్రిడిటేషన్ తప్పనిసరి.
- సిలబస్‌లో సంస్కరణలు. కాలేజీల్లో కొత్త కోర్సులు అందుబాటులోకి.
- ఇంటర్న్‌షిప్ తప్పనిసరి. స్కిల్ ఆధారంగా 30 శాతం కోర్సులకు రూపకల్పన.
- మైక్రోసాఫ్ట్ ద్వారా 1.62 లక్షల మందికి నైపుణ్యాభివృద్ధిపై ఉచిత శిక్షణ.
- నాస్కామ్, ఏపీఎస్ఎస్‌డీసీ సంస్థల ద్వారా యువతకు శిక్షణ కార్యక్రమాలు.
- 2018-19లో రాష్ట్రంలో ప్లేస్‌మెంట్ల సంఖ్య 37 వేలు కాగా 2019-20లో 52 వేలకు, 2020-21లో 69 వేలకు, 2021-22లో 85 వేలకు పెరగడం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయనేందుకు నిదర్శనం.

విద్యారంగంలో సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలకు వ్యయం ఇలా..

పథకం	లబ్ధిదారులు	వ్యయం (రూ.కోట్లలో)
జగనన్న విద్యాదీవెన	24,74,544	9,051.57
జగనన్న వసతి దీవెన	18,77,863	3,349.57
అమ్మ ఒడి	44,48,865	19,617.53
నాడు-నేడు	57,000 విద్యాసంస్థలు	16,450.00
జగనన్న గోరుముద్ద	43,26,782	3,239.43
జగనన్న విద్యాకానుక	47,32,065	2,328.33
8వ తరగతికి ట్యాబ్‌లు	5,18,000	688.00
ఐఎఫ్‌పీ పరికరాల ఏర్పాటు	30,230	511.28

- పుట్టగొడుగుల్లా వెలిసిన కాలేజీల్లో ఏఐసీటీఈ / ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన ప్రకారం మౌలిక సదుపాయాలు, బోధనా సిబ్బంది ఉండడం లేదు. ధనార్జనే ధ్యేయంగా మొక్కుబడిగా నిర్వహించడంతో ప్రమాణాలు పడిపోయి విద్యార్థులకు నైపుణ్యాలు కొరవడ్డాయి. ఫలితంగా ప్లేస్‌మెంట్లు సన్నగిల్లాయి. చదువులు ముగియగానే ఉద్యోగావకాశాలు దొరకడం గగనంగా మారింది. అదనపు నైపుణ్యాలు, సర్టిఫికేషన్ కోర్సులను కూడా పూర్తి చేస్తే కానీ ఉద్యోగాలు దక్కడం లేదు.
- ఇంజనీరింగ్, టెక్నాలజీ రంగాల్లో ఆధునిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతూ నిరంతరం కొత్త అంశాలు రూపుదిద్దుకుంటున్నాయి. వాటిలో నైపుణ్యాలను సాధించిన వారికి అవకాశాలు లభిస్తున్నాయి. పలు కాలేజీల్లో కోర్సులు, బోధనా వనరులు, సదుపాయాలు లేవు. వరుసగా మూడేళ్లు 25 శాతం కన్నా చేరికలు తక్కువగా ఉండే కాలేజీలు, కోర్సులకు ఏఐసీటీఈ అనుమతులు రద్దు చేస్తోంది.
- ఇండియా స్కిల్ నివేదిక ప్రకారం ఇంజనీరింగ్ పూర్తిచేసిన వారిలో 48శాతం మందికే ఉద్యోగాలు దక్కుతున్నాయి.

నూతన ఆవిష్కరణలతోనే రైతుల ప్రగతి

అగ్రిథాన్-2023 ముగింపు సదస్సులో వక్తలు




విద్యార్థుల బృందాలతో అధ్యాపకులు, పరిశోధకులు

ఏర్పేడు(తిరుపతి జిల్లా): వ్యవసాయరంగంలో నూతన ఆవిష్కరణల ద్వారానే రైతుల ప్రగతి సాధ్యమవుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఏర్పేడు మండలం మేర్లపాకలోని ఐఐటీ తిరుపతి క్యాంపస్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న 'అగ్రిథాన్-2023' కార్యక్రమం ఆదివారం ముగిసింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 116 మంది విద్యార్థులు 35 బృందాలుగా ఏర్పడి తమ ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. వ్యవసాయ రంగంలో రైతులు వివిధ దశల్లో ఎదుర్కొంటున్న పలు సమస్యలపై దృష్టి పెట్టి, వాటిని ప్రాజెక్ట్ రూపంలో వివరించారు. వీటికి సహాయ సహకారాలు అందిస్తే రైతుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని విద్యార్థులు తెలిపారు. అత్యుత్తమ ప్రాజెక్టులు ప్రదర్శించిన మూడు బృందాలను విజేతలుగా ప్రకటించారు. వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులకు ప్రథమ బహుమతి, ఐఐటీ తిరుపతి విద్యార్థులకు ద్వితీయ బహుమతి, ఎస్ఎస్ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థుల బృందానికి తృతీయ బహుమతి అందజేశారు. విజేతలకు వరుసగా రూ.15, రూ.10, రూ.5 వేలు చొప్పున ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ద గెయిన్ సంస్థ అధినేత వరదకృష్ణన్, ఏలినా జియోసిస్టమ్స్ ఐటీ అధిపతి అంబాశంకర్, ఐఐటీ తిరుపతి కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ సునీల్‌కుమార్, ఐసర్ అధ్యాపకురాలు డాక్టర్ అన్నపూర్ణాదేవి, ఐఐటీ తిరుపతి నవ విష్కార్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రోషన్ శ్రీవాత్సవ్, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ హర్షవర్ధన్‌రెడ్డి ప్రసంగించారు.

ఏడాదిలోగా రూ.25 వేల కోట్ల రక్షణ ఎగుమతులు

- ఏరో ఇండియా-2023 పరిచయ కార్యక్రమంలో రాజ్‌నాథ్‌సింగ్ వెల్లడి
- నేటి నుంచి ఏరో ఇండియా ప్రదర్శన



ప్రసంగిస్తున్న రాజ్‌నాథ్‌సింగ్

సాక్షి, బెంగళూరు: వచ్చే ఏడాదిలోగా రూ.25 వేల కోట్ల విలువైన రక్షణ ఉత్పత్తులను ఎగుమతి చేస్తామని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం బెంగళూరులోని తాజ్ వెస్ట్ ఎండ్ హోటల్‌లో ఏరో ఇండియా-2023 పరిచయ సభలో (కర్టన్‌రైజర్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ మాట్లాడుతూ.. ప్రపంచస్థాయి దేశీ రక్షణ రంగ ఉత్పత్తులను తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఏరో ఇండియా సదస్సు ఆ దిశగా అడుగులు వేసేందుకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత 14వ ఎడిషన్ ఏరో ఇండియాలో సుమారు 100 దేశాల రక్షణ శాఖ ప్రతినిధులు, దౌత్యవేత్తలు, 800 మంది ఎగ్జిబిటర్లు పాల్గొంటున్నారని వెల్లడించారు. రక్షణ రంగంలో భారతదేశాన్ని స్వయంశక్తిగా మార్చేందుకు అంకితభావంతో పని చేస్తున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ ఆశించిన రీతిగా మేకిన్ ఇండియాలో భాగంగా అధునాతన సాంకేతికతను రక్షణ రంగంలో తీసుకొచ్చి దేశ నవనిర్మాణానికి కృషి చేస్తామన్నారు. కర్ణాటక సీఎం బసవరాజ బొమ్మై మాట్లాడుతూ ఏరో ఇండియా అనే ప్రతిష్టాత్మక ప్రపంచస్థాయి ఈవెంట్ నిర్వహించే అదృష్టం మళ్లీ మళ్లీ బెంగళూరుకు ఇస్తున్నందుకు ప్రధాని మోదీకి, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కోవిడ్ సమయంలోనూ కొన్ని నిబంధనల మధ్య ఏరో ఇండియాను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఏరోస్పేస్ రంగంలో కర్ణాటక ముఖ్యపాత్ర పోషిస్తోందని, దాదాపు అన్ని తయారీ రంగ పరిశ్రమలు, పరిశోధనాభివృద్ధి రంగ కంపెనీలు బెంగళూరులోనే 60 శాతం కొలువై ఉన్నాయని సీఎం గుర్తుచేశారు.

ఆసియాలోనే అతిపెద్ద ఎయిర్ షో

ఆసియాలోనే అతిపెద్ద ఎయిర్ షో 'ఏరో ఇండియా-2023' ఫిబ్రవరి 13 నుంచి 17 వరకు బెంగళూరులోని యలహంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో జరగనుంది. ఈ క్రమంలోనే ఎయిర్ షో ఏరో ఇండియా-2023 కోసం రిహార్సల్స్ జరుగుతున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి మోదీ సోమవారం ప్రారంభించనున్నారు.

టీడీపీ గూండాల బరితెగింపు



టీడీపీ నేతలు కత్తులతో దాడి చేయడంతో బాధితులకు అయిన గాయాలు

మొదటి పేజీ తరువాయి



వడ్డాది నరేష్

టీడీపీ నాయకుడు వడ్డాది నరేష్ ఇంటి వద్దకు వెళ్లారు. ఆ సమయంలో టీడీపీ నేతలు రమణ, నరేష్ ఇంటి వద్ద లేరు. జరిగిన విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు చెప్పి.. మరోసారి ఇలా జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించి వచ్చేశారు.

మా ఇంటి వద్దకే వస్తారా..

బాధితులు తమ ఇంటి వద్దకు వచ్చి వెళ్లారనే విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు వడ్డాది రమణ, నరేష్.. 20 మంది అనుచరులతో కలిసి వివాహిత ఇంటిపైకి దాడికి వెళ్లారు. 'మా ఇంటికే వచ్చి హెచ్చరిస్తారా.. మీకెంత ధైర్యం.. ఇప్పుడు మీకు ఎవరు అడ్డువస్తారో చూస్తాం..' అని బూతులు తిడుతూ వివాహిత మామ ఏడుకొండలు, అత్త భారతి, మరిది అరుణ్‌కుమార్‌తో పాటు స్థానిక యువకుడు హేమంత్‌పై కత్తులతో దాడి చేశారు. అరుణ్‌కుమార్‌కు పొత్తి కడుపులో, మిగిలిన వారి ఒంటిపై పలు చోట్ల గాయాలయ్యాయి. స్థానికులు వారిని హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు వడ్డాది రమణ, వడ్డాది నరేష్, మరో నలుగురిపై కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా.. టీడీపీ నేతలు రౌడీల్లా వ్యవహరిస్తూ కత్తులు పట్టుకుని ఇలా ఇంటి పైకి రావడం దారుణం అని, వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

2019లో టీడీపీ కాదు రాష్ట్ర ప్రజలు ఓడిపోయారు

జగన్ పాలనంతా మోసమే.. పాదయాత్రలో లోకేశ్ ఆరోపణ

సాక్షి, చిత్తూరు/కార్వేటినగరం: గత 2019 ఎన్నికల్లో ఓడిపోయింది తెలుగుదేశం పార్టీ కాదని, రాష్ట్ర ప్రజలు, యువతీ యువకులే ఓడిపోయారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర 17వ రోజు ఆదివారం చిత్తూరు జిల్లా, గంగాధరనెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరం మండలంలోని కొత్తూరు నుంచి సురేంద్రనగరం వరకు సాగింది. ఈ సందర్భంగా కొత్తూరు వద్ద ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనంతా మోసం, దగా అని ఆరోపించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో జగన్ మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపించారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ అంటూ యువతను మోసం చేశారన్నారు. రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ ధరలు పెంచి ఆటో, ట్యాక్సీవాలాల నడ్డి విరుస్తున్నారని చెప్పారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తే పరిశ్రమలను తెచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి పరిశ్రమలు తీసుకురాకుండా కోడిగుడ్డు గురించి మాట్లాడుతున్నాడని విమర్శించారు. జాబ్ రావాలంటే బాబు రావాలన్నారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే రైతులను ఆదుకుని, గిట్టుబాటు ధర కల్పించి, నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తామన్నారు. తనకు మైక్ ఇవ్వకుండా గొంతు నొక్కిన జగన్‌ను ప్రజలు నమ్మే ప్రసక్తే లేదన్నారు. మరోవైపు పాదయాత్ర విరామ సమయంలో లోకేశ్‌ను ఆయన సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్ కలిశారు.

లోకేశ్ పాదయాత్రతో టీడీపీ గ్రాఫ్ పడిపోయింది

- ఆయన యాత్ర 400 రోజులు కొనసాగాలని కోరుకుంటున్నాం
- బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ తిరిగి కోలుకునే పరిస్థితి లేదని, ఆ పార్టీకి మిగిలి ఉన్న కాస్త గ్రాఫ్ కూడా నారా లోకేశ్ పాదయాత్రతో పూర్తిగా పడిపోయిందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. లోకేశ్ పాదయాత్ర పూర్తిస్థాయిలో 400 రోజులపాటు కొనసాగేలా చూడాలని ప్రభుత్వాన్ని తాము కూడా కోరుతున్నామని ఆయన చెప్పారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జీవీఎల్ నరసింహారావు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార పార్టీ ప్రజల నమ్మకాన్ని కోల్పోతోందని, 2024 ఎన్నికల్లో బీజేపీ-జనసేన కలిసి అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. జనసేన పార్టీ కూడా ఇదే కోరుకుంటోందన్నారు. మార్చి 10 తర్వాత 'బీజేపీ పోరుయాత్ర' పేరుతో మళ్లీ తాము ప్రజల్లోకి వెళతామని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2018లో నాటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం తమ వైఫల్యాలను కేంద్రంపైకి నెట్టివేసి లబ్ధి పొందాలని చూసి దెబ్బతిన్నదని పేర్కొన్నారు.

65శాతం గ్రామాల్లో.. డ్రోన్ సర్వే పూర్తి

8,800 గ్రామాల్లో ఎగిరిన డ్రోన్లు, విమానాలు, హెలికాప్టర్లు

- సర్వే చేయాల్సిన మొత్తం విస్తీర్ణంలో 59 శాతం పూర్తి
- దాదాపు 65,900 చ.కి.మీలలో సాగిన సర్వే
- ఈ ఏడాది ఏప్రిల్ నాటికి మిగిలిన 35 శాతం గ్రామాల్లో పూర్తికి సన్నాహాలు



సాక్షి, అమరావతి:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వేలో మొదటి ఘట్టమైన డ్రోన్ సర్వే దాదాపు 65 శాతం గ్రామాల్లో పూర్తయింది. రాష్ట్రంలోని 17,460 గ్రామాలకుగాను 13,481 గ్రామాల్లో ఈ డ్రోన్ సర్వే చేయాల్సి వుండగా.. ఇప్పటివరకు 8,804 గ్రామాల్లో పూర్తయింది. విస్తీర్ణపరంగా చూస్తే రాష్ట్రవ్యాప్తంగా 1,12,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న వ్యవసాయ భూములు, గ్రామ కంఠాలను సర్వే చేయాల్సి వుండగా ఇప్పటివరకూ 65,866 చ.కి.మీ.లలో (59 శాతం) ఈ సర్వే పూర్తయింది. డ్రోన్లు, విమానాలు, హెలికాప్టర్లతో దేశంలో ఏ రాష్ట్రం ఎప్పుడూ చేయని విధంగా రాష్ట్రంలో ఈ డ్రోన్ సర్వేను నిర్వహిస్తున్నారు. మిగిలిన 4,677 గ్రామాల్లో (46,134 చ.కి.మీ.) ఏప్రిల్ 23కల్లా పూర్తిచేయడానికి సర్వే, రెవెన్యూ యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. రెండు నెలల వ్యవధిలోనే 1,500 గ్రామాల్లో దీనిని పూర్తిచేయగలిగారు. ఇంత తక్కువ వ్యవధిలోనే ఆ స్థాయిలో సర్వే పూర్తిచేయడాన్ని బట్టి ఎంత వేగంగా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

అత్యాధునికంగా.. శరవేగంగా..

డ్రోన్ సర్వేను తొలుత సర్వే ఆఫ్ ఇండియాకు అప్పగించారు. సర్వేను అనుకున్న గడువులోపు పూర్తిచేయాలన్న లక్ష్యంతో మళ్లీ ప్రైవేటు ఏజెన్సీలను ఆహ్వానించి వాటితో చేయిస్తున్నారు. దీంతోపాటు సర్వే, సెటిల్మెంట్ శాఖ సైతం స్వయంగా ఈ సర్వే చేపట్టింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా 30 డ్రోన్లు కొనుగోలు చేసింది. తమ సర్వేయర్లకే డ్రోన్ పైలెట్లుగా శిక్షణ ఇప్పించి మరీ సర్వే చేయిస్తోంది. సర్వే ఆఫ్ ఇండియా, ప్రైవేటు డ్రోన్ ఏజెన్సీలు, ప్రభుత్వం కలిసి శరవేగంగా ఈ డ్రోన్ సర్వే నిర్వహిస్తున్నాయి. అక్కడక్కడా ఆలస్యమవుతుందనుకున్న ప్రాంతాల్లో ఏరియల్‌గా (విమానాలు, హెలీకాప్టర్లతో) చేస్తున్నారు. ఇలా రాష్ట్రంలోని మొత్తం భూముల రీసర్వే చేయడం దేశంలో ఇదే మొదటిసారి దీన్నికూడా ఇంత అత్యాధునికంగా, పెద్దఎత్తున డ్రోన్లు, విమానాలతో చేస్తుండడాన్ని మిగిలిన రాష్ట్రాలు ఆశ్చర్యంతో పరిశీలిస్తున్నాయి. ఇప్పటికే మహారాష్ట్ర బృందాలు రాష్ట్రానికి వచ్చి ఇక్కడ జరుగుతున్న భూముల సర్వే, డ్రోన్ సర్వే తీరును పరిశీలించి వెళ్లాయి. నిర్దేశించిన లక్ష్యం మేరకు ఏప్రిల్ నాటికి డ్రోన్లతో సర్వే పూర్తికి రెవెన్యూ, సర్వే శాఖలు ముమ్మరంగా పనిచేస్తున్నాయి.

2,079 గ్రామాల్లో తుది రెవెన్యూ రికార్డులు రెడీ..

ఇక డ్రోన్ సర్వే పూర్తిచేసిన తర్వాత ఆయా గ్రామాలకు సంబంధించిన డ్రోన్ చిత్రాలను సర్వే యంత్రాంగానికి ఇవ్వాల్సి వుంటుంది. ఇప్పటివరకు డ్రోన్ సర్వే పూర్తిచేసిన 8,804 గ్రామాలకుగాను 5,264 గ్రామాల డ్రోన్ చిత్రాలను సర్వే బృందాలకు అందాయి. 4,006 గ్రామాలకు చెందిన ఓఆర్ఐ (ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్)లను జారీచేశారు. వీటిని క్షేత్రస్థాయిలో భూమితో పోల్చి నిజనిర్ధారణ (గ్రౌండ్ ట్రూతింగ్) సర్వే చేయాలి. ఇప్పటివరకు 3,191 గ్రామాల్లో క్షేత్రస్థాయి సర్వేను పూర్తిచేశారు. 2,464 గ్రామాల్లో గ్రౌండ్ వ్యాలిడేషన్‌ను పూర్తిచేయగా, 2,242 గ్రామాల్లో అన్ని దశల సర్వే పూర్తయింది. 2,079 గ్రామాలకు సంబంధించిన తుది రెవెన్యూ రికార్డుల తయారీ పూర్తయింది.



నీకు ప్రియమైనవాళ్లను మానవ ప్రేమతో ప్రేమించగలవు.
కానీ శత్రువును ప్రేమించడం దైవిక ప్రేమతోనే సాధ్యం.
– లియో టాల్‌స్టాయ్

సాక్షి

సోమవారం, ఫిబ్రవరి, 13

అమృత వేణువు

'లోకంలో ఇన్ని చెట్లు, లతలు, తీవెలు ఉన్నాయి. కొన్నింటికి పండ్లు, కొన్నింటికి పూలు, కొన్నింటి పత్రాలు వర్ణభరితం... కాని ఈ వెదురు పొదను చూడండి. నిరాడంబరమైన ఈ వెదురులోని ప్రతి చిన్న భాగానికి అమృతమయమైన నాదాన్ని వెలువరించే శక్తి ఉంది... వేణుగానాన్ని వినిపించే జీవం ఉంది' అంటాడు హరిప్రసాద్ చౌరాసియా.

'మా నాన్న అలహాబాద్‌లో పహిల్వాన్. ఆరేళ్ల వయసులో నేను తల్లిని కోల్పోతే ఆయన తిరిగి పెళ్లి చేసుకోలేదు. తల్లి లేని పిల్లాడు క్రమశిక్షణలో ఉండాలంటే అఖాడాలో దించి కుస్తీ లడాయిస్తూ ఉండాలని భావించాడాయన. నాకేమో చెవిన సరిగమలు పడితే ఆత్మ ఆగదు. గాత్రం నేర్చుకోవాలనుకున్నాను. తొలి రోజుల్లో పాఠాలు చెప్పిన గురువు... హరిప్రసాద్... నీకు పైస్వరం పలకదు. కాని దమ్ము చాలాసేపు నిలబెట్టగలవు. దమ్ము నిలిపే వాద్యం నేర్చుకో పైకి వస్తావు అన్నాడు. నాకు వేణువు గుర్తుకు వచ్చింది. అది ఖరీదైన వాద్యం కాదు. తీగలు ఉండవు. చర్మ వాద్యం కాదు పాడవడానికి. ఏ సంతలోనైనా దొరుకుతుంది. ఎక్కడికైనా తీసుకెళ్లడం సులభం. పెదాలతో గాలి నింపితే శబ్దాన్ని వెలువరిస్తుంది. అందుకని వేణువును ఎంచుకున్నాను' అంటాడాయన.

ఇక్కడ మీరు చదవడం ఆపి తలత్ మెహమూద్ ప్రఖ్యాత గీతం 'ఫిర్ వహీ షామ్...' వినండి. అందులో ఎంతో మృదువైన తలత్ గొంతును అనుసరిస్తూ మరింత మృదువైన వేణుగానం వినిపిస్తుంది. అది హరిప్రసాద్ చౌరాసియా తొలి సినీ పాట వాద్యకారుడిగా. ఇంకా అర్థం కావాలంటే 'విధాత తలపున ప్రభవించినది' వినండి... అందులో పాటంతా కొనసాగే వేణువును అంత అద్భుతంగా ఎవరు పలికిస్తారు చౌరాసియా తప్ప. 'సిరివెన్నెల'లో హీరో పాత్ర పేరు అదే– హరిప్రసాద్.

ఇప్పుడు దేశంలో రెండు గురుకులాలను వేణుగాన ఉపాసకుల కోసం నిర్వహిస్తున్నాడు హరిప్రసాద్ చౌరాసియా. ఒకటి భువనేశ్వర్‌లో ఉంది. ఒకటి ముంబైలో. 'పిల్లలకు వేణువు నేర్పిస్తాను' అని చౌరాసియా అడిగిందే తడవు నాటి ఒరిస్సా ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ స్థలం కేటాయించాడు. ముంబైలో కూడా ప్రభుత్వమే స్థలం ఇచ్చింది. 'ముంబైలో గురుకులం కట్టడానికి డబ్బు లేదు. రతన్ టాటాను వెళ్లి అడిగాను. సంగీతం కోసం ఇబ్బందులా... అని రెండు కోట్లు ఇచ్చాడు. రెండు చోట్లా పిల్లలకు ఉచితంగానే నేర్పిస్తాను. నిజానికి వాళ్ల నుంచి నేను నేర్చుకుంటాను... నా నుంచి వాళ్లు... తుది శ్వాస వరకూ నేర్చుకుంటూ ఉండటమే నాకు ఇష్టం' అంటాడు చౌరాసియా.

నేర్చుకోవడాన్ని ఒక దశలో కొందరు మానేస్తారు. ఒక దశ నుంచి కొందరు అక్కర్లేదనుకుంటారు. వేణువులో పాండిత్యం గడించాక, కటక్ రేడియో స్టేషన్‌లో ఆ తర్వాత ముంబై రేడియో స్టేషన్‌లో పని చేశాక, వందల సినిమా పాటలకు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌లకు వేణువు పలికించాక, విపరీతంగా డబ్బు గడించాక 'నేనింకా నేర్చుకోవాలి' అనుకున్నాడు తప్ప చాలు అనుకోలేదు చౌరాసియా. 'సినిమాలో వాయించే ఆ కాసేపుతో నా ఆత్మ ఆకలి తీరడం లేదు... నేను శాస్త్రీయ సంగీతపు కెరటాలలో మునకలు వేయాలి..' అనుకున్నాడు చౌరాసియా. కాని గురువు ఎవరు? శిష్యుల్ని ఎంచుకోవడంలో అతి కఠినంగా, అతి పరిమితంగా ఉండే అన్నపూర్ణా దేవి దగ్గర నేర్చుకోవాలని సంకల్పించాడు. అన్నపూర్ణా దేవి మహామహుడైన ఉస్తాద్ అల్లావుద్దీన్ ఖాన్ కుమార్తె. సితార్ మేస్త్రో పండిట్ రవిశంకర్ భార్య. కాని ఆమె ఇతడికి కనీసం తలుపు కూడా తీయలేదు. ఒకటి కాదు.. రెండు కాదు... మూడేళ్లు ఆమె ఇంటి చుట్టూ తిరిగి చివరకు శిష్యుడిగా స్వీకరించబడ్డాడు. 'నువ్వు నేర్చుకున్నదంతా మర్చిపోవాలి' అనేది ఆమె చెప్పిన మొదటి పాఠం. అంతవరకూ చౌరాసియా అందరిలా కుడివైపు వేణువు ధరించేవాడు. ఇప్పుడు ఎడమవైపున. నవ శిశువుగా మళ్లీ జన్మించాడు.

ఒకప్పుడు ఆల్ ఇండియా రేడియోలో బి గ్రేడ్ అర్టిస్ట్‌గా సెలెక్ట్ అయిన హరిప్రసాద్ చౌరాసియా ఇవాళ ప్రపంచానికి వేణునాద గురువు. ఒక నెల నెదర్లాండ్స్‌లో పాఠాలు చెప్తాడు. ఒక నెల కెనడాలో చెప్తాడు. ఒక రోజు అచట కచ్చేరి. మరోరోజు ఏదో దేశ ఔన్నత్య పురస్కార స్వీకరణ. అలహాబాద్‌లో రణగొణ ధ్వనుల మధ్య ఏకాంత సాధన కోసం స్థలాన్ని వెతుక్కుంటూ తిరిగిన హరిప్రసాద్ చౌరాసియాకు ఇవాళ ప్రపంచ దేశాలన్నీ స్వాగతం చెప్పి తమ దగ్గర ఉండిపొమ్మంటాయి. ఆ గౌరవం అతనిలోని కళకా? దాని పట్ల అతని అర్పణకా?

నిరంతర అభ్యాసం, వినమ్రత, లోపలి ఎదుగుదలపట్ల తపన, పంచేగుణం, స్వీకరించే తత్త్వం, స్థిరాభిప్రాయాలను త్యజించగలిగే నిరహంభావం, ఎదుటి వారిని గుర్తించి ప్రోత్సహించే గుణం... ఇవి లేకుంటే మనిషి మహనీయుడు ఎలా అవుతాడు? మహనీయుడే కానక్కర్లేదు... ప్రేమాస్పదుడు ఎలా అవుతాడు? ఇవాళ సంఘంలో ప్రతి రంగంలో ఎందరో పెద్దలు. కాని కొందరే గౌరవనీయులు. అతికొద్దిమందే ప్రేమాస్పదులు. చౌరాసియా నుంచి నేర్చుకోవచ్చా మనం ఏదైనా?

తాజాగా వెలువడ్డ హరిప్రసాద్ చౌరాసియా అఫిషియల్ బయోగ్రఫీ 'బ్రెత్ ఆఫ్ గోల్డ్' చదువుతున్నప్పుడు వెదురు పొదల మధ్య తిరుగాడినట్టు ఉంటుంది. త్రివేణీ సంగమంలో దేహాన్ని కడిగినట్టు ఉంటుంది. ముంబైలో మదన్ మోహన్ పాట రికార్డింగ్‌ను చూస్తున్నట్టు ఉంటుంది. శివ్‌తో కలిసి హరి చేస్తున్న జుగల్‌బందీకి ముందు వరుస సీటు దొరికినట్టు ఉంటుంది.

మన జీవిత పాఠాలు మనల్ని చేరే దరులు, దారులు పరిమితం. ఇదిగో ఇలాంటి మహనీయులే చరిత్రలే మున్ముందుకు నడిపే ప్రభాత నాదం.

ట్రెజర్ హంట్ - ఎంపవర్‌మెంట్!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

ఆశయాల నడుమ సంఘర్షణ సహజం. సిద్ధాంతాల నడుమ వైరుధ్యాలు సహజం. ఈ వైరుధ్యాల్లోంచే, సంఘర్షణలోంచే సత్యం ప్రభవిస్తుందని నమ్ముతారు. అందుకే వికాస ప్రియులందరూ భిన్న ఆశయాలను స్వాగతిస్తారు. విభిన్నమైన ఆలోచనల స్వేచ్ఛా ప్రసారానికి కిటికీలు తెరుస్తారు. జగమెరిగిన మావో జెడాంగ్ సుభాషితాన్ని కూడా మరోసారి ప్రస్తావించవచ్చు. నూరు పువ్వులు వికసించాలి, వెయ్యి భావాలు పోటీ పడాలన్నారు మావో. ఈ భావ సంఘర్షణ కాలక్రమంలో రకరకాల పరిణామాలకు లోనై ఉండవచ్చు. ఎన్నెన్నో సరికొత్త ఛాయలను ఆవిష్కరించి ఉండవచ్చు. నేటి ఆంధ్రప్రదేశ్‌లో అది కొందరి ఆశలకు, కోట్లాదిమంది ఆకాంక్షలకు మధ్యన ఏర్పడిన ఘర్షణగా మారింది. ఇక్కడ ప్రధాన రాజకీయ భూమికగా మారిన ఇతివృత్తం కూడా ఇదే. కొందరి ఆశ – ట్రెజర్ హంట్ అనే మృగయా వినోదం. కోట్లమంది ఆకాంక్ష –ఎంపవర్‌మెంట్‌తో సమకూరే ఆత్మగౌరవం.

ఈ ట్రెజర్ హంట్ (నిధుల వేట) అనేది ఎంత అమానవీయమైనదో, ఎంత నేరపూరితమైనదో, ఎంత క్రూరముఖీనమైనదో మనకు తెలియని విషయం కాదు. 'మెకన్నాస్ గోల్డ్' నుంచి 'పైరేట్స్ ఆఫ్ ది కరేబియన్' సిరీస్ వరకు ఎన్నెన్నో సినిమాలు ఆ కర్కశ స్వభావాన్ని మనకు తెరపరిచాయి. నవలల్లో, కథల్లో కూడా చదివి వుండవచ్చు. విని ఉండవచ్చు. ఇక్కడున్న ట్రెజర్ హంట్ ముఠా కార్యస్థానం రాజకీయం కనుక, ప్రజల ఓట్లతోనే పబ్బం గడుస్తుంది కనుక దూసే కత్తులు మెత్తగా, పువ్వుల గుత్తుల్లా ఉంటాయి. మోముల్లో క్రౌర్యానికి బదులు మోసపూరితమైన నవ్వులుంటాయి. కానీ స్వభావం నేరపూరితమే. లక్ష్యం స్వార్థమే. అప్పుడప్పుడూ ఈ వ్యాఘ్రం తగిలించుకున్న గోముఖం ముఖోటా జారిపోతూనే ఉంటుంది. కప్పుకున్న మేక తోలు చెదిరిపోతూనే ఉంటుంది. సాధికారత కోరుకుంటున్న బలహీన వర్గాలపై ఛీత్కారాలు బహిరంగమవుతూనే ఉంటాయి.

ఈ చర్చలో ముఖోటాలకూ, ముసుగులకూ తావు లేదు. ఆ ట్రెజర్ హంట్ ముఠా తెలుగుదేశం పార్టీ, దాని అనుంగు ఎల్లో కూటమే. ఇది ఆరోపణ కాదు. విభజిత రాష్ట్రంలో ఐదేళ్లు అధికారంలో ఉండగా ఆ పార్టీ తీసుకున్న విధాన నిర్ణయాలు, ప్రతిపక్షంగా ఈ మూడున్నరేళ్లలో చేపట్టిన కార్యక్రమాల విశ్లేషణ అనంతరమే ఈ నిర్ధారణ. తెలుగుదేశం పార్టీ తీసుకున్న విధానాలు, కార్యక్రమాలు తెలిసినవే కనుక సొంతంగా విశ్లేషించడానికి ఎవరైనా పూనుకోవచ్చు. సత్యాన్ని నిర్ధారించుకోవచ్చు. పరంపరగా వస్తున్న కొన్ని సంక్షేమ కార్యక్రమాలను అరకొరగా అమలు చేయడం తప్ప పేదవర్గాల అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏ ఒక్క పథకాన్ని అమలు చేయలేదు. రాజధాని పేరుతో అమరావతి పలవరింత, కమీషన్ల కోసం పోలవరాన్ని పట్టాలు తప్పించడం మినహా మరో మహత్కార్యం తెలుగుదేశం పార్టీ ఖాతాలో లేదు. ఈ రెండూ ట్రెజర్ హంట్‌లో భాగం కావడమే అవి చేసుకున్న మహద్భాగ్యం.

ఆంధ్రప్రదేశ్ విభజన నేపథ్యంలో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు. కేంద్ర నిధులతో కేంద్రమే ఆ ప్రాజెక్టును నిర్మించి ఇవ్వాలి. కేంద్రమే నిర్మిస్తే తమకు కమీషన్లు ముట్టవు కదా అనే దుగ్ధ తెలుగుదేశం అధినేతలకు ఏర్పడింది. అప్పుడు ఎన్డీఏ కూటమి భాగస్వాములుగా ఉన్నారు కనుక ఆ పలుకుబడిని వాడుకొని నిర్మాణ కార్యక్రమాన్ని తామే చేపట్టేలా కేంద్రాన్ని ఒప్పించుకున్నారు. ఇందుకోసం ప్రత్యేక హోదాను కూడా తాకట్టుపెట్టారు. తమ పార్టీ ఎంపీ కంపెనీకి పనులు అప్పగించారు. ఆ కంపెనీకి అంత సామర్థ్యం లేదని తెలిసినా కమీషన్ల కక్కుర్తితో లక్ష్యపెట్టలేదు. చేతగాని సంస్థ బిల్లులెత్తుకోవడమే తప్ప పనులు చేయకుండా కాలయాపన చేసింది. పుణ్యకాలం గడిచిపోతున్న నేపథ్యంలో పట్టిసీమ పేరుతో ఎత్తిపోతల పథకాన్ని రంగంలోకి తెచ్చారు. పోలవరానికి దిగువ నుంచి నీళ్లు ఎత్తి ప్రధాన ప్రాజెక్టు కుడి కాల్వలో పోసే పథకం. ఈ పోలవరం కుడి కాలువ 90 శాతం రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే పూర్తయింది. పోలవరం పూర్తయితే ఈ ఎత్తిపోతల ఆరో వేలు అవుతుంది. అయినా 1900 కోట్లు దీని మీద తగలేయడమంటే, సదరు ఔదార్యం వెనుకనున్న మతలబు కమీషన్లేనన్న విషయం సామాన్యుడికి కూడా అర్థమైంది. అలాగే ఎడమ కాలువ గట్టుమీద 1900 కోట్లతో పురుషోత్తమపట్నం ఎత్తిపోతలను తలకెత్తుకున్నారు. ఈ 3800 కోట్లు ప్రధాన ప్రాజెక్టుపై ఖర్చు చేసి ఉంటే కథ వేరుగా ఉండేది.

ప్రధాన ప్రాజెక్టులో ఇంకో ఘనకార్యముంది. కాలూ చెయ్యి కదిలించలేకపోయిన సొంత పార్టీ కాంట్రాక్టర్‌ను తప్పించి మరో అస్మదీయ సంస్థను రంగంలోకి దించారు. ప్రాజెక్టుల ప్రొటోకాల్ ప్రకారం ప్రధాన డ్యామ్ కట్టే ప్రదేశానికి ఎగువన... దిగువన మట్టి కట్టలు (కాఫర్ డ్యామ్) కట్టి, స్పిల్‌వే, స్పిల్ ఛానల్ గుండా ప్రవాహాన్ని మళ్లించిన తర్వాతనే ప్రధాన డ్యామ్‌కు పునాది వేయాలి. ఈ పునాదినే డయాఫ్రమ్ వాల్ అంటారు. మట్టి కట్టలు కడితే కమీషన్లేం గిట్టుబాటవుతాయి. అందుకని ఎగువ కాఫర్ డ్యామ్‌ను కొంత మేరకు కట్టి డయాఫ్రమ్ వాల్ నిర్మాణాన్ని చేపట్టారు. 2019లో వరదలు వచ్చినప్పుడు మట్టి కట్ట గ్యాప్‌లోంచే మొత్తం ప్రవాహం వెళ్లాల్సి రావడంతో ఉరవడి పెరిగి డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్నది. దాంతో కథ



మొదటికి వచ్చింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్పిల్‌వే, స్పిల్ ఛానల్, కాఫర్ డ్యామ్‌లను పూర్తిచేసినప్పటికీ డయాఫ్రమ్ వాల్ సంగతి తేలవలసి ఉన్నది. 'చిత్తం శివుడి మీద, భక్తి చెప్పుల మీద' అనే సామెత తెలుగుదేశం పార్టీ వ్యవహారానికి అతికినట్టు సరిపోతుంది. ట్రెజర్ హంట్ వ్యామోహంలో పడి ప్రాజెక్టు పనిని కోతిపుండు బ్రహ్మరాక్షసిగా మార్చిపారేసింది.

రాజధాని వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం వేసిన స్పెషల్ లీవ్ పిటీషన్‌పై సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నది. న్యాయస్థానం ఆదేశాల మేరకు కేంద్రం మొన్న ఒక అఫిడవిట్‌ను దాఖలు చేసింది. అఫిడవిట్‌లో పేర్కొన్న అంశాలను ఎల్లో మీడియా కవర్ చేసిన తీరును చూస్తే చాలు, ట్రెజర్ హంట్ ముఠా అమరావతి విషయంలో ఎంత ఆకలితో ఉన్నదో, ఎంత ఆత్రంతో ఉన్నదో అర్థమవుతుంది. అమరావతే రాజధానిగా కేంద్రం అఫిడవిట్‌లో పేర్కొన్నట్టు, రాజధాని మార్చే అధికారం రాష్ట్రానికి లేదని తేల్చినట్టు పత్రికల్లో, ఛానళ్లలో పెద్దఎత్తున ప్రచారం చేసుకున్నారు. కేంద్రం ఆ మాట ఎక్కడా అనలేదు. అందులో కేంద్రం ప్రస్తావించిన అంశాలు ఇవి. 1. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం 2014, సెక్షన్ 5 ప్రకారం పదేళ్లపాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంటుంది. 2. సెక్షన్ 6 ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధానిని సూచించడానికి నిపుణుల కమిటీని నియమించాలి. ఆమేరకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేసీ శివరామకృష్ణన్‌ను నియమించడం, ఆ కమిటీ నివేదికను సమర్పించడం జరిగింది. కమిటీ ఇచ్చిన నివేదికను తదుపరి చర్యల నిమిత్తం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి పంపించడం జరిగింది. 3. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని రాజధానిగా నోటిఫై చేయడం జరిగింది. 4. సెక్షన్ 94 ప్రకారం కొత్త రాజధానిలో వసతుల ఏర్పాటుకు కేంద్రం ఆర్థిక సాయం చేయవలసి ఉన్నది. ఇందుకోసం 2500 కోట్ల రూపాయలను కేంద్రం రాష్ట్రానికి అందజేసింది. 5. 2020లో రాష్ట్ర ప్రభుత్వం రెండు చట్టాలను తీసుకొచ్చింది. సీఆర్‌డీఏ (తొలగింపు) చట్టంతోపాటు వికేంద్రీకరణ – అన్ని ప్రాంతాల సమ్మిళిత అభివృద్ధి చట్టాలను రాష్ట్రం చేసింది. దీని ప్రకారం అమరావతి శాసన రాజధానిగా, కర్నూలు న్యాయ రాజధానిగా, విశాఖపట్నం కార్యనిర్వాహక రాజధానిగా ఉంటాయి. ఈ వ్యవహారాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సంప్రదింపులు జరపలేదు, కనుక పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలతో కేంద్రానికి సంబంధం లేదని మాత్రమే అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

రాజధాని అంశం రాష్ట్రానికి సంబంధించినదిగానే కేంద్ర ప్రభుత్వం పరిగణిస్తున్నది. పార్లమెంట్ సభ్యులు గతంలో అడిగిన ప్రశ్నలకు కూడా ఇదే వైఖరితో సమాధానాలు ఇచ్చింది. అఫిడవిట్‌ను పరిశీలిస్తే కూడా అదే అంశం స్పష్టమవుతుంది. చట్టం ప్రకారం కేంద్రం నిపుణుల కమిటీని వేసిందనీ, ఆ నివేదికను రాష్ట్రానికి పంపించిందనీ పేర్కొన్నారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని నోటిఫై చేసిందనే చెప్పారు తప్ప నిపుణుల కమిటీ సిఫారసులకు భిన్నంగా రాజధానిని ఎంపిక చేయడాన్ని కూడా ఎత్తిచూపలేదు. ఎందుకంటే మొదటినుంచీ కేంద్రం దీనిని రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన విషయంగానే పరిగణిస్తున్నది కనుక! రాజధాని కోసం కేంద్రం ఇచ్చిన 2500 కోట్లతో చంద్రబాబు ప్రభుత్వం ఏం చేసిందన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 600 కోట్లతో అద్భుతంగా నిర్మించిన తెలంగాణా కొత్త సచివాలయం కళ్లెదుట కనిపిస్తుంటే అంత డబ్బును బాబు ఏం చేసి ఉంటాడనే ప్రశ్న మెదులుతూనే ఉంటుంది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికార వికేంద్రీకరణ ఒక కీలకమైన అంశం. తద్వారా పాలనలో పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం పెరుగుతుంది. అవినీతి తగ్గుతుంది. ఆమేరకు ప్రజల సాధికారత పెరుగుతుంది. రాష్ట్ర విభజనకు ముందు వేసిన జస్టిస్ శ్రీకృష్ణ కమిషన్, రాజధాని గుర్తింపు కోసం వేసిన శివరామకృష్ణన్ కమిటీ కూడా ఈ అంశాలను ప్రస్తావించాయి. వెనుకబడిన ప్రాంతాల్లో ఉన్న ప్రజలు నిర్లక్ష్యానికి గురయ్యామన్న అభిప్రాయంతో ఉన్నారని విభజనకు ముందే శ్రీకృష్ణ కమిషన్ గుర్తించింది. పరిపాలనను వీలైనంతమేరకు వికేంద్రీకరించాలని శివరామకృష్ణన్ కమిటీ చెప్పింది. కొత్తగా రాజధాని నిర్మాణానికి (గ్రీన్‌ఫీల్డ్) పూనుకోవద్దనీ, రాజధాని కోసం పంట భూములను వాడుకోవద్దనీ, విజయవాడ – గుంటూరు నగరాల మధ్యన అసలే వద్దని నిపుణుల కమిటీ సూచించింది. ఈ మూడు కీలక సూచనలనూ చంద్రబాబు ప్రభుత్వం నగ్నంగా ఉల్లంఘించింది.

అమరావతిని రాజధానిగా ఎంపిక చేయడానికి కూడా చంద్రబాబు అప్పటి మంత్రి నారాయణ ఆధ్వర్యంలో ఓ కమిటీని వేశారు. అది నిపుణుల కమిటీ కాదు. నారాయణ రిటైర్డ్ న్యాయమూర్తో, రిటైర్డ్ ఐఏఎస్ అధికారో కాదు. పట్టణాభివృద్ధి వ్యవహారాల నిపుణుడో, ఆర్థికవేత్తో కాదు. విద్యను వ్యాపారంగా దిగజార్చిన బేహారుల్లో ముఖ్యుడు. 'ఆకలితో చావనైనా చస్తాను గానీ సరస్వతీ దేవిని అంగట్లో పెట్టన'ని ప్రతిన చేసి, అమ్మవారి కాటుక కంటి నీరు తుడిచిన పోతన పుట్టిన తెలుగు నేలపై చదువుకు ఖరీదు కట్టి తూకం వేసిన వారిలో అగ్రగణ్యుడు నారాయణ. అటువంటి నారాయణతో కమిటీ వేయడమంటే అది అక్షరాలా ట్రెజర్ హంట్ కాకుంటే మరేముంటుంది? అదే నిజమని ఆచరణలో తేలిపోయింది. బినామీ పేర్లతో వేలాది ఎకరాల సమీకరణ వెనుకనున్న రహస్యం, సింగపూర్ కంపెనీలతో కుదుర్చుకున్న అభివృద్ధి ఒప్పందాల వెనుకనున్న లోగుట్టు లక్షలకోట్ల కుంభకోణంగా అంచనా వేస్తున్నారు. అరవైమంది ఆందోళనకారులు ఆధార్ కార్డులను చూపలేక చేతులెత్తేయడంతో అమరావతి రైతుల ఉద్యమం బినామీల ఉద్యమంగా తేలిపోయింది. ఈ మూడున్నరేళ్లలో అమరావతి ట్రెజర్ హంట్ కోసం ఆందోళన చేయడం, అడ్డుగా ఉన్న వైఎస్ జగన్ ప్రభుత్వంపై శాపనార్థాలు పెట్టడం, ఆడిపోసుకోవడం, విష ప్రచారాలు ఎక్కుపెట్టడం తప్ప ఎల్లో కూటమి చేసిన ఘన కార్యాలేమీ లేవు.

ఇందుకు పూర్తి భిన్నంగా పేద ప్రజల పక్షాన వైఎస్ జగన్ ప్రభుత్వం నిలబడింది. పరిపాలనా వికేంద్రీకరణను అత్యున్నత స్థాయికి తీసుకొని వెళ్లి పేదవాడి ఇంటి తలుపు తట్టింది. ధనికుల పిల్లలతో సమానంగా నాణ్యమైన విద్యను అభ్యసించే అవకాశాన్ని పేద పిల్లలకూ కలుగజేసింది. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలలోని కడగొట్టు వ్యక్తికి కూడా ఆరోగ్య హక్కును కల్పించి, ప్రజారోగ్య విప్లవ పతకాన్ని ఎగురవేసింది. చిన్నరైతు కూడా తలెత్తుకొని నిలబడగలిగేలా చేయందిస్తున్నది. మహిళా సాధికారత కోసం చేపట్టిన పలు కార్యక్రమాలు విజయవంతంగా ఫలాలనందిస్తున్నాయి. పేద ప్రజల సాధికారత ఈ మూడున్నరేళ్లలో ఉద్యమ రూపం దాల్చింది. పేద ప్రజల ఎంపవర్‌మెంట్‌కూ – పెత్తందార్ల ట్రెజర్ హంట్‌కూ పొత్తు పొసగదు. యుద్ధం జరగవలసిందే. అదే జరుగుతున్నది. పెత్తందార్లది స్వార్థపూరిత యుద్ధం. పేద ప్రజలది న్యాయమైన పోరాటం. న్యాయమే గెలవాలి. గెలుస్తుంది.

vardhelli1959@gmail.com

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.అష్టమి తె.4.06 వరకు (తెల్లవారితే మంగళవారం), తదుపరి నవమి, **నక్షత్రం:** విశాఖ రా.10.20 వరకు తదుపరి అనూరాధ, **వర్జ్యం:** రా.2.14 నుండి 3.45 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.36 నుండి 1.23 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.40 వరకు, **అమృతఘడియలు:** ప.1.35 నుండి 3.11 వరకు.

సూర్యోదయం : 6.33
సూర్యాస్తమయం: 5.56
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

హోమ్‌వర్క్ మజా



హోమ్‌వర్క్‌ను ఎంత ఆనందం కలిగించేదిగా పాఠశాలలు రూపొందించాలంటే, విద్యార్థులు తామే సొంతంగా చేయడానికి ఉత్సాహపడాలి. ఆ 'ఛాట్ జీపీటీ'(కృత్రిమ మేధ)కి ఎందుకు ఆ సంతోషాన్ని ఇవ్వాలి?
– ఆండ్రూ ఎన్జీ, ఏఐ నిపుణుడు

అదీ తేడా !



పరిశోధనల్లో వైఫల్యం అనేది సాధారణంగా ఆ పరిశోధకుల ధైర్యానికి సూచిక, అంతేగానీ అది సమర్థతకు కొలమానం కాదు.
– జెన్ హీమ్‌స్ట్రా, ప్రొఫెసర్

దోస్తీ కచ్చి



చిన్నతనంలో మనం ఎవరికైనా ఇవ్వగలిగే అతిపెద్ద శిక్ష ఏమిటంటే, 'కట్టీ' (కటీఫ్) చెప్పడం. మనం మళ్లీ అలా అవగలిగితే బాగుండు.
– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

ఇదీ అదే



ట్విటర్‌లో ఎవరినైనా 'బ్లాక్' చేయడం కూడా 'కట్టీ' చెప్పడం లాంటిదే. చాలాసార్లు ఇది కూడా కట్టీ చెప్పినంత సేపే ఉంటుంది.
– జిగీశ్ ఎస్., సీఈఓ

అదేంటో... ప్రతి పాత్రా గుర్తుంటుంది!

ఒక సినిమా హీరో, హీరోయిన్‌కో... లేదా డైరెక్టర్, మ్యూజిక్ డైరెక్టర్‌కో పేరు తెస్తుంది. కానీ కె. విశ్వనాథ్ సినిమాలు నటీనటులకి, టీచర్స్‌కి కూడా గొప్ప పేరు తెస్తాయి. ఆడియన్స్‌గా మనకి కూడా! ఆయన సినిమాలో ఏ పాత్ర మనకి గుర్తు లేదు? 'శంకరాభరణం' శంకర శాస్త్రి సరేసరి! ఆఖరికి కాసేపు కనిపించే అప్పు ఇంక ఇవ్వలేనని చెప్పే షాప్ వాడి పాత్ర కూడా గుర్తుండి పోతుంది... అదేంటో!

జీవితం, విలువలు ఇవన్నీ పుట్టుకతో రావాలి, పుట్టుకతో మాత్రమే రావాలి అని అనుకునే వారికి... ముక్కున వేలేసుకునేలా ఉంటుంది ఆ సినిమాలో మంజు భార్గవి పాత్ర. ఒక వేశ్య కూతురు, అయితేనేం? విలువల్లో ఏ మాత్రం తీసిపోదు. మన ఇళ్లల్లో మర చెంబు చూసిన ప్రతీసారీ నిర్మలమ్మ తిట్లు గుర్తు రానివారుంటారా?



ఏ సినిమాకు ఆ సినిమా ఓ కళాఖండం! 'ఆత్మగౌరవం' సినిమాతో మొదలు పెట్టి, ఎన్నో మంచి సినిమాలు, మరెన్నో గొప్ప సినిమాలు తీసి, తెలుగువారి ఆత్మగౌరవం కొన్ని లక్షల పాళ్లు పెంచారు విశ్వనాథ్.

'శంకరాభరణం'లో పంచె కట్టుకుని పాశ్చాత్య సంగీతం పాడినా, 'స్వయంకృషి'లో సూట్ వేసుకుని చెప్పులు కుట్టినా, 'స్వర్ణకమలం'లో రోడ్ మీద హోర్డింగ్స్‌పై పెయింటింగ్ వేసుకుంటూ కూడా కళని ప్రోత్సహించాలనీ, కళాకారుల్ని గౌరవించాలనీ తపన కలిగి ఉన్నా, 'స్వాతి కిరణం'లో గొప్ప కళ ఉండి, తన శిష్యుడు నేర్పిన జీవిత పాఠంతో మళ్ళీ అదే కళలో 'అఆ'లు నేర్చుకునే స్థితికి వెళ్ళినా, 'ఆపద్బాంధవుడు'లో మట్టితో శివలింగాన్ని చేసి మరీ శివుడి మీద కోపం తెచ్చుకున్నా, 'సాగర సంగమం'లో అంత మైకంలో కూడా బొట్టు చెదరకుండా చెయ్యి అడ్డు పెట్టినా, 'స్వాతిముత్యం'లో కడిగిన ముత్యం లాంటి మనసున్న స్వభావం అడుగడుగునా ప్రదర్శించే శివయ్య అయినా... ఇంకా ఇలా చెప్పుకుంటూ పోతే ఇప్పటికయ్యేనా! ఎప్పటికయ్యేను? అలాంటి పాత్రలు ఊహించడమే కష్టం. వాటితో సినిమాలు తీయడం, నటులతో చేయించడం ఎలా సాధ్యం?

తీసిన ప్రతి సినిమా, అందులో చేసిన ప్రతి పాత్రా మనకెందుకు గుర్తుంది? ఒక సినిమాలో... క్లైమాక్స్‌లో ఎమోషనల్ అవ్వొచ్చు, లేదా కొన్ని సీన్లలో కళ్లు చెమర్చవచ్చు. ప్రతీ సినిమా, ప్రతీ సీన్‌కి అఫ్టగా మన ఎమోషన్స్ కూడా మారడం అనేది, గొప్ప విషయం. కేవలం విశ్వనాథ్ సినిమాలకే సాధ్యం. పేజీలకి పేజీలు డైలాగ్‌లు అయినా, ఒక్క కనుసైగ అయినా, పాత్రలు మనతో మాట్లాడు తున్నట్లే ఉంటాయి.

అలాంటి గొప్ప వ్యక్తిని కలిసి, సెల్ఫీ అడిగితే 'గౌరవం లేదా?' అని కసురుకుంటారేమో అని, చిన్న జంకుతో అడగకుండా, దాదాపు రెండు గంటలకుపైగా ఆయన్నే అలా చూస్తూ ఒక ఈవెంట్‌లో ఆడియన్స్‌లో ఉన్న నాకు... ఆయనతో ఒక ఫొటో దిగే ఛాన్స్ అనుకోకుండా దొరకడంతో ఆయన సినిమాలోనే ఒక గొప్ప పాత్ర లభించినంత కేరింతతో గెంతేసిన రోజు ఇప్పటికీ నాకు గుర్తే!

'శంకరాభరణం' రిలీజ్ అయిన రోజే (ఫిబ్రవరి 2న) సరిగ్గా ఆయన నిజంగా శంకరుడికి మరో ఆభరణంగా వెళ్ళడం కేవలం యాదృచ్ఛికమే అంటే నమ్మగలమా? అసలు, మరింకెప్పుడైనా మనకి దొరకునా ఇటువంటి సేవ?!

– ముష్టి (తెంపల్లె) సహజ
కొలంబస్ (ఇండియానా)

మాటలు చెబుతున్నారు సరే! చేస్తున్నదేమిటి?

అభిప్రాయం



బచ్చు శ్రీనివాస్

రాష్ట్రపతి బడ్జెట్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేందుకు పార్లమెంట్‌కు వస్తూ ప్రధాని మోదీ ప్లాస్టిక్ బాటిళ్లను రీసైకిల్ చేసి తయారు చేసిన జాకెట్ ఒకటి వేసుకున్నారు. బెంగళూరులో నిర్వహించిన 'ఇండియా ఎనర్జీ వీక్–2023'లో భాగంగా ప్లాస్టిక్ బాటిళ్లను రీసైకిల్ చేసి తయారు చేసిన జాకెట్‌ను ధరించి... ఆయన సుస్థిరత, హరిత వృద్ధి, పర్యావరణం గురించిన సందేశం ఇచ్చారు. ఆయన సందేశాలకు, వ్యాఖ్యానాలకు కొదవ ఉండదు కానీ ఆచరణ లోపమే కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ప్రపంచంలో అత్యధికంగా ప్లాస్టిక్ వ్యర్థాలను ఉత్పత్తి చేసే దేశాల్లో భారత్ ఐదో స్థానంలో ఉండటం ఇందుకు నిదర్శనం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2019లో తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో భారత దేశాన్ని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నుంచి విముక్తి చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అయితే దీని రీసైక్లింగ్ విషయంలో మన దేశం పరిస్థితి ఎలా ఉందనే విషయం ఇక్కడ చెప్పుకోవాల్సిన అవసరం ఉన్నది.

గ్రీన్ ఎనర్జీకి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెబుతున్న మోదీ ప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విషయంలో పేద ఆఫ్రికా దేశాల కంటే వెనుకబడి ఉండటం గమనార్హం. రువాండా, టాంజానియా, కెన్యా వంటి కొన్ని తూర్పు ఆఫ్రికా దేశాలు ప్లాస్టిక్ విషయంలో ఆచరణీయ పరిష్కారాలను రూపొందించి విజయవంతంగా అమలు చేస్తున్నాయి.

కేంద్ర స్థాయిలో ప్లాస్టిక్ వినియోగం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణకు సంబంధించి సరైన విధానాల రూపకల్పన చేయకపోవడం, చేసినా వాటిని పక్కాగా అమలు చేయకపోవడం... వెరసి దేశం ప్లాస్టిక్ కట్టడిలో వెనకబడి ఉంది. భారత ప్రభుత్వం 2022 జూలై 1 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, స్ట్రాలు, ట్రేలు, పాలీస్టయిరిన్ వంటి గుర్తించిన వస్తువుల... తయారీ, అమ్మకం, వినియోగాన్ని నిషేధించింది. ఈ లిస్ట్‌లో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు కూడా ఉన్నాయి.

ప్లాస్టిక్ మేనేజ్మెంట్, హ్యాండ్లింగ్ రూల్స్ 2011 ప్రకారం... 40 మైక్రాన్ల కంటే తక్కువ మందంతో చేసే ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు నిషిద్ధం. తర్వాత ఆ మందాన్ని 50 మైక్రాన్లు, 75 మైక్రాన్లకు సవరించింది. 2023 జనవరి 1 నుంచి సవరించిన నిబంధనల ప్రకారం 120 మైక్రాన్లకు పెంచింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ క్యారీ బ్యాగులపై నిషేధం ఉన్నా, దేశంలో అవి విచ్చలవిడిగా ఉత్పత్తి అవుతున్నాయి. జనం వాడుతున్నారు కూడా. దీన్ని నియంత్రించే పని కేంద్ర ప్రభుత్వం చేయడం



లేదు. ఈ విషయంలో మన కంటే చిన్న దేశాలు, అత్యంత పేద దేశాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తున్నాయి.

కెన్యాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగ్‌ల దిగుమతి, తయారీ లేదా అమ్మకం చేసే కంపెనీలకు 40 వేల డాలర్లు, వ్యక్తులకు 500 డాలర్లు జరిమానాగా విధిస్తారు. కెన్యా మాదిరిగానే రువాండా కూడా క్యారీబ్యాగ్‌ల మందంతో సంబంధం లేకుండా వాటిపై పూర్తిగా నిషేధం విధించింది. 2019 అక్టోబర్‌లో రువాండా... ఆఫ్రికాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగ్‌లపై పూర్తి నిషేధాన్ని జారీ చేసిన మొదటి దేశంగా అవతరించింది. మరో చిన్న దేశమైన టాంజానియా అదే దారిలో నడుస్తోంది. వైద్య సేవలు, పారిశ్రామిక ఉత్పత్తులు, నిర్మాణ పరిశ్రమ లేదా వ్యవసాయ రంగం వంటి వాటి కోసం ఉపయోగించే కొన్ని పరిమిత ప్లాస్టిక్ ప్యాకేజింగ్ సామగ్రికి మినహాయింపులు ఉన్నాయి.

జింబాబ్వే 2010లోనే ప్లాస్టిక్ ప్యాకేజింగ్, బాటిళ్లను నిషేధించింది. ఆంటిగ్వా, బార్బుడా 2016లో సింగిల్ యూజ్ క్యాటరింగ్, టేక్ ఎవే వస్తువులను నిషేధించాయి. పసిఫిక్ ద్వీపం వనాటు కూడా 2018లో డిస్పోజబుల్ కంటైనర్‌ల కోసం అదే పని చేసింది. ఈ దేశాల నుంచి ఇండియా ఎన్నో అంశాలకు సంబంధించి పాఠాలు నేర్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కాలుష్యం కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తి 2019 నుంచి 2021 వరకు 6 మిలియన్ టన్నులు పెరిగిందని ఆస్ట్రేలియా నుంచి వెలువడే 'వేస్ట్ మేకర్స్ ఇండెక్స్' ఇటీవల పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా నిబంధనలు ఉన్నా, ఆశించిన స్థాయిలో కట్టడి జరగడం లేదని ఈ రిపోర్ట్ పేర్కొంది.

భారత ప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్ (ఎస్‌యూపీల)పై నిషేధం విధించినా, దేశవ్యాప్తంగా ప్రబలంగా 21 ఎస్‌యూపీలు చలామణిలో ఉన్నాయి. నిషేధం విధించిన తరువాత ఉల్లంఘనలపై ఎలాంటి జరిమానాలూ విధించిన దాఖలాలు లేవు. భారతదేశంలో ఒక వ్యవస్థీకృత ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ లేదు. దీని ఫలితంగా నదులు, మహా సముద్రాలు, ఖాళీ ప్రదేశాల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ చెత్త పారబోత కొనసాగుతున్నది. తక్షణం కఠినమైన నిర్దిష్ట చర్యలతో కేంద్రం పరిస్థితిని చక్కదిద్దాలి.

వ్యాసకర్త బీఆర్‌ఎస్ నాయకులు । 93483 11117

క్లుప్తంగా...

శ్రీవారి దర్శనానికి 30 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శనివారం అర్ధరాత్రి వరకు 75,728 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 38,092 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.4.15 కోట్లు వేశారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 30 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శాస్త్రోక్తంగా కొనసాగుతున్న లక్ష చండీ మహా యజ్ఞం



యజ్ఞాన్ని పర్యవేక్షిస్తున్న స్వరూపానందేంద్ర

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠం పర్యవేక్షణలో హరియాణ రాష్ట్రం కురుక్షేత్రలో ప్రారంభించిన లక్ష చండీ మహా యజ్ఞం రెండో రోజు ఆదివారం శాస్త్రోక్తంగా కొనసాగింది. యజ్ఞశాలలోని 110 హోమగుండాల వద్ద బ్రాహ్మణోత్తములు యాగం నిర్వహించారు. చండీ పారాయణ చేశారు. శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి, గుంటీమాత యజ్ఞాన్ని పర్యవేక్షించారు. సాయంత్రం చండీమాతని ఆరాధిస్తూ మహా మంగళ హారతి ఇచ్చారు. ఈ నెల 26వ తేదీతో యజ్ఞం ముగిసే సమయానికి లక్ష చండీ పారాయణ హోమాలు పూర్తయ్యేలా ప్రణాళికబద్ధంగా యజ్ఞభూమిలో వ్యవహరించాలని ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి సూచించారు.

ఇది ఉద్యోగుల సంక్షేమం కోరే ప్రభుత్వం

- ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి

కడప రూరల్: ఇది ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పనిచేసే ప్రభుత్వమని, త్వరలో ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బండి శ్రీనివాసరావు, కేవీ శివారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఆదివారం వైఎస్సార్ జిల్లా కడప జిల్లా పరిషత్ కార్యాలయంలోని వైఎస్సార్ సమావేశ మందిరంలో ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. అసోసియేషన్ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు త్వరలో ఒక డీఏను ప్రకటిస్తుందన్నారు. అలాగే పీఆర్సీ, ఇతర సమస్యలన్నీ అతి త్వరలో పరిష్కారమవుతాయని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం లేదన్న అపోహలో కొంతమంది ఉన్నారన్నారు. తాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఉద్యోగుల సమస్యలను తీసుకెళ్లనున్నట్లు వివరించారు.

జగన్ మళ్లీ సీఎం కావాలంటూ బైక్ యాత్ర

- భాగ్యనగరం నుంచి విజయనగరం బయలుదేరిన టెకీ



బైక్ యాత్ర చేస్తూ చిత్తూరు చేరుకున్న వీరబాబు

చిత్తూరు (కార్పొరేషన్): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానంతో ఓ యువకుడు హైదరాబాద్ నుంచి బైక్ యాత్ర చేపట్టాడు. ఈ నెల 6న ప్రారంభమైన ఈ యాత్ర ఆదివారం చిత్తూరు చేరుకుంది. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌కు వీరాభిమాని అయిన వీరబాబు మాట్లాడుతూ.. 'మాది పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం. 2009లో ఖమ్మంలోని వజీర్ సుల్తాన్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్‌లో చేరాను. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్స్ ద్వారా నాలుగేళ్ల (రూ.1.60 లక్షల ఖర్చుతో) బీటెక్ పూర్తి చేశా. ఆ తరువాత హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం సాధించా. వైఎస్సార్ తనయుడు సీఎం వైఎస్ జగన్‌పై ఉన్న అభిమానంతో హైదరాబాద్ నుంచి విజయనగరానికి బైక్ యాత్ర మొదలుపెట్టా. ఉదయం 10 గంటలకు యాత్ర ప్రారంభించి సాయంత్రం 6 గంటలకు ముగిస్తున్నా. రోజుకు 100 నుంచి 120 కిలోమీటర్లు వెళ్తున్నా. రాత్రివేళ ఎక్కడికక్కడ లాడ్జిలో బస చేస్తూ 'వర్క్ ఫ్రమ్ హోమ్' కింద నైట్ షిఫ్ట్ డ్యూటీ చేస్తున్నా. జగనన్న అందిస్తున్న పథకాలు ఎంతగానో నచ్చాయి. అందుకే.. ఆయనే మరోసారి సీఎం కావాలని ఆకాంక్షిస్తూ బైక్ యాత్ర చేపట్టా' అని వివరించారు.

ఇక కల్తీ పాలకు చెక్!

పులివెందులలో అత్యాధునిక స్టేట్-సెంట్రల్ ల్యాబ్

- రూ.11కోట్లతో ఏర్పాటు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- పాలు, పాలఉత్పత్తుల్లో కల్తీని వెంటనే గుర్తించవచ్చు
- యాంటి బయోటిక్ అవశేషాలనూ కనిపెట్టవచ్చు



ఏపీ స్టేట్ సెంట్రల్ ల్యాబరేటరీలో రూ.8 కోట్లతో ఏర్పాటుచేసిన అత్యాధునిక పరికరాలు

సాక్షి, అమరావతి: రోజుకు ఒక గ్లాసు పాలు తాగితే మనిషి శరీరానికి కావాల్సిన పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి. అయితే, ప్రస్తుతం మార్కెట్‌లో తెల్లనివన్నీ పాలు అని నమ్మే పరిస్థితి లేదు. ఈ తరుణంలో వినియోగదారులకు నాణ్యమైన, సురక్షితమైన పాలను అందించాలనే లక్ష్యంతో సహకార పాల డెయిరీల్లో అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకువస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. పులివెందులలోని ఆంధ్రప్రదేశ్ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ఆన్ లైవ్‌స్టాక్ (ఏపీ కార్ల్)లో రూ.11కోట్లతో స్టేట్-సెంట్రల్ ల్యాబ్ ఏర్పాటు చేస్తోంది. ఈ ల్యాబ్ ద్వారా పాలు, పాల ఉత్పత్తుల్లో విషపూరిత రసాయనాలను గుర్తించి, నివారణకు చర్యలు చేపట్టనుంది.

నాణ్యత ఇలా...

గేదె పాలల్లో 5.5 శాతం కొవ్వు, 8.7 శాతం ఎస్ఎన్ఎఫ్ (ఘన పదార్థాలు), ఆవు పాలల్లో 3.2 శాతం కొవ్వు, 8.3 శాతం ఎస్ఎన్ఎఫ్ ఉంటే మంచి పోషక విలువలు ఉన్న పాలుగా పరిగణిస్తారు. ప్రస్తుతం మార్కెట్‌లో దొరికే పాలల్లో స్వచ్ఛత ప్రశ్నార్థకంగా మారింది. రంగు, రుచి, చిక్కదనం కోల్పోకుండా ఉండేందుకు పాలల్లో వివిధ రకాల రసాయనాలను కలిపి కల్తీకి పాల్పడుతున్నారు. నాసిరకం దాణా వల్ల పాలు, పాల ఉత్పత్తుల్లో ప్రమాదకరస్థాయిలో విషపూరిత రసాయనాలు ఉంటున్నాయని పలు పరిశోధనల్లో గుర్తించారు. కొందరు ఏకంగా ప్రమాదకర రసాయనాలతో కృత్రిమ పాలను తయారు చేస్తున్న విషయం పలుమార్లు వెలుగులోకి వచ్చింది. ఇటువంటి నాసిరకం, కల్తీ, నకిలీ పాల వల్ల వివిధ రకాల క్యాన్సర్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పాలల్లో నాణ్యతను గుర్తించేందుకు రాజమహేంద్రవరం, జి.కొత్తపల్లి, ఒంగోలు, మదనపల్లి, పులివెందుల, అనంతపురం సహకార పాల డెయిరీల్లో అత్యాధునిక పరికరాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోంది. తాజాగా ఏపీ కార్ల్‌లో దేశంలోనే అతి పెద్ద స్టేట్, సెంట్రల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తోంది.

మూడు నెలల్లో అందుబాటులోకి...

ఏపీ కార్ల్‌లో ఇప్పటికే ల్యాబ్ ఏర్పాటు ప్రక్రియ పూర్తి కాగా, నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ ల్యాబొరేటరీస్ నుంచి ధ్రువీకరణ కోసం దరఖాస్తు చేశారు. ఇప్పటి వరకు రాష్ట్ర పరిధిలోని శాంపిల్స్‌ను పరీక్షించేందుకు కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు పంపాల్సి వచ్చేది. ఒక్కో శాంపిల్‌కు రూ.2,500 నుంచి రూ.30వేల వరకు ఖర్చయ్యేది. పులివెందులలోని ల్యాబ్ అందుబాటులోకి వస్తే తక్కువ ఖర్చుతో ఏడాదికి 500 నుంచి 1,000 వరకు పరీక్షలు చేయవచ్చు. ఈ ల్యాబ్‌లో ఎలక్ట్రానిక్ మిల్క్ ఎనలైజర్, బ్యాక్టీరియా, సోమాటిక్ సెల్ ఎనరైజర్, ఎఫ్‌టీఐఆర్ సాంకేతికత ఆధారిత పాల విశ్లేషణ పరికరం, ట్రిపుల్ ట్యాడ్రపుల్ మాస్ డిటెక్టర్‌తో ఎస్‌సీఎంఎస్, ఎఫ్ఐడీతో జీసీ ఎంఎస్, సోడియం పొటాషియం ఎనలైజర్, మెలమైన్ టెస్టింగ్ స్ట్రిప్, మఫిల్ ఫర్నేస్, ఆటో క్లాప్, డబుల్ డిస్టిలేషన్ యూనిట్, గెర్బర్ సెంట్రిఫ్యూజ్, అడల్టరెంట్ డిటెక్షన్ టెస్టింగ్ కిట్ వంటి పరికరాలు అందుబాటులో ఉంటాయి. సుమారు 15 మంది నిపుణులైన సిబ్బందిని నియమిస్తున్నారు. మూడు నెలల్లో ఈ ల్యాబ్ అందుబాటులోకి రానుంది.

రసాయన అవశేషాలను గుర్తించవచ్చు



స్టేట్ సెంట్రల్ ల్యాబ్ సేవలు అందుబాటులోకి వస్తే రాష్ట్రంలోని పాల సహకార సంఘాలు, పాడి రైతులు, వాటాదారులకు ఎంతో మేలు కలుగుతుంది. ఎగుమతులను పెంపొందించేందుకు వీలుగా పాలు, పాల ఉత్పత్తుల్లో పురుగుమందుల అవశేషాలు, యాంటీ బయోటిక్, పశువైద్య అవశేషాలు, భారీ లోహాలు, మైకో టాక్సిన్‌లు, వ్యాధి కారకాలను గుర్తించవచ్చు. భౌతిక, రసాయన, జీవ నాణ్యతను విశ్లేషించి ధ్రువీకరణ పత్రాలు పొందవచ్చు. కల్తీలకు పూర్తిగా చెక్ పెట్టవచ్చు.

– అహ్మద్ బాబు, ఎండీ, ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్

బాబును గద్దెనెక్కించేందుకే

కులవాదుల కుట్ర

- బహుజన పరిరక్షణ సమితి నాయకులు
- 868వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



రిలే దీక్షలో బహుజనులు

తాడికొండ: బాబును గద్దెనెక్కించాలనే యోచనతో అన్ని వ్యవస్థలలోని కులవాదులు కుట్రలు చేస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 868వ రోజుకు చేరాయి. పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. తమ ప్రాబల్యం కోల్పోతున్నామనే ఆవేదనతో రాష్ట్రంలో ఓ సామాజిక వర్గం అసత్య ప్రచారాలకు పూనుకుంటూ పొంతన లేని అంశాలను ప్రస్తావిస్తూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు నానా తంటాలు పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో సుభిక్షమైన పాలన కొనసాగుతుంటే ఓర్వలేని బాబు అండ్ కో రాష్ట్రం అప్పుల పాలు అయిందంటూ ఎల్లో మీడియాలో విష ప్రచారం చేస్తుండటం సిగ్గుచేటన్నారు. అభివృద్ధి అంటే 29 గ్రామాల్లోని కులవాదులు, వారి ఆస్తుల కోసమే చేస్తే అభివృద్ధి కాదని, రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, వేలాది గ్రామాల్లో కూడా జరిగితేనే నిజమైన అభివృద్ధి అని తెలుసుకొని మాట్లాడితే మంచిదన్నారు. లోకేష్ పాదయాత్ర హరికథలు, పిట్ట కథలతో సాగిపోతుందని, ఓ అజెండా లేకుండా ప్రజా సమస్యలు గాలికొదిలి సినిమా డైలాగులతో పాదయాత్ర చేస్తున్న లోకేష్ యాత్రతో టీడీపీకి పతనం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పల్లె బాబు పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఇరు కుటుంబాల్లో విషాదం నింపిన చేపల వేట

- పెన్నానది ఊబిలో చిక్కుకొని ఇద్దరు దుర్మరణం
- వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో ఘటన

ప్రొద్దుటూరు క్రైం: చేపల వేట సరదా ఇద్దరి ప్రాణాలను తీసింది. ఇరు కుటుంబాల్లో విషాదం నింపింది. పెన్నానదిలోని ఊబిలో చిక్కుకొని ఎద్దుల విజయ్‌కుమార్ (15), పాలిమేర సుధాకర్ (19) మృతి చెందిన ఘటన వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో జరిగింది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం... హనుమాన్‌నగర్‌కు చెందిన విజయ్‌కుమార్, సుధాకర్ దగ్గరి బంధువులు, ఇద్దరి ఇళ్లు ఒకే వీధిలో ఉన్నాయి. వారి ఇళ్లలో ఉన్న బొంతలను శుభ్రం చేయడానికి ఆదివారం స్నేహితులతో కలిసి ఇద్దరూ గంగమ్మ దేవాలయం సమీపంలోని పెన్నా నదికి వెళ్లారు. బొంతలను నీళ్లలో నాన బెట్టిన తర్వాత చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడిపోయారు. గుంతలో ఊబి ఉండటంతో బయటికి రాలేదు. దీంతో ఒడ్డున ఉన్న స్నేహితులు గట్టిగా కేకలు వేశారు. స్థానికులు వచ్చి వారిని బయటికి తీయగా, అప్పటికే వారు మృతి చెందారు. విజయ్‌కుమార్ దొరసానిపల్లె హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. కుటుంబానికి అండగా ఉంటాడుకున్న కుమారుడు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు సుబ్బమ్మ, నాగయ్య కన్నీరు మున్నీరవుతున్నారు. ఇంటర్ వరకు చదువుకున్న సుధాకర్ కుటుంబాన్ని పోషించేందుకు స్థానికంగా ఉన్న ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్నాడు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న కుమారుడి దుర్మరణంతో అంగవైకల్యం కలిగిన తండ్రి ఎర్రన్న, కుటుంబ సభ్యులు మాకు దిక్కెవరని వాపోయారు.

దేశంలో ప్రకటించని ఎమర్జెన్సీ అమలు

- అరసం 19వ రాష్ట్ర మహాసభల్లో అఖిల భారత అరసం కార్యదర్శి వినీత్ తివారి



మాట్లాడుతున్న వినీత్ తివారి. వేదికపై జ్యోతిశ్రీ, సీఎస్సార్ ప్రసాద్, చిన్నం పెంచలయ్య

తెనాలి: ప్రస్తుతం దేశంలో ప్రకటించని ఎమర్జెన్సీ అమలులో ఉందని అఖిల భారత అరసం కార్యదర్శి వినీత్ తివారి అన్నారు. ఫలితంగా అభ్యుదయ రచయితలపై బాధ్యత మరింతగా పెరిగిందన్నారు. మతతత్వం, హిందూత్వ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తమ కలాలను ఎక్కుపెట్టాలని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) 80వ వార్షికోత్సవాలు, 19వ రాష్ట్ర మహాసభలు రెండోరోజైన ఆదివారం కొనసాగాయి. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఉదయం 'ప్రగతిశీల సాహిత్య, సాంస్కృతిక శక్తులపై దాడులు-కర్తవ్యాలు' అంశంపై జరిగిన సదస్సుకు అరసం రాష్ట్ర కార్యదర్శి కె.శరశ్చంద్ర జ్యోతిశ్రీ అధ్యక్షత వహించారు. వినీత్ తివారి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవకాశవాద మతతత్వ భావనతో వ్యవహరిస్తే, ప్రస్తుతం దేశంలో బహిరంగంగానే మతతత్వ భావజాలం పనిచేస్తోందన్నారు. విప్లవ రచయితల సంఘం (విరసం) నేత సీఎస్సార్ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య ప్రసంగించారు. అరసం రాష్ట్ర కార్యదర్శి బీఎస్ సాగర్ సమన్వయకర్తగా వ్యవహరించారు. అఖిల భారత అరసం ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ సుఖదేవ్ సింగ్ సిర్సా, కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు పాల్గొన్నారు.

అరసం అధ్యక్షుడిగా మరోసారి రాచపాళెం



ఆర్.చంద్రశేఖరరెడ్డి



వి.శివప్రసాద్

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అధ్యక్షుడిగా ప్రముఖ రచయిత ప్రొఫెసర్ రాచపాళెం చంద్రశేఖర రెడ్డి (కడప), ప్రధాన కార్యదర్శిగా ప్రముఖ నాటక, కథా రచయిత వల్లూరు శివప్రసాద్ (గుంటూరు) మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా డాక్టర్ పి.సంజీవమ్మ, అధ్యక్ష వర్గంగా డాక్టర్ కేతు విశ్వనాథరెడ్డి, ప్రొఫెసర్ ఎస్.ఈశ్వరరెడ్డి, సాయిమాధవ్ బుర్రా, ప్రొఫెసర్ కిన్నెర శ్రీదేవి, నల్లి ధర్మారావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా జీఎస్ చలంను ఎన్నుకున్నారు. కార్యదర్శివర్గంలో కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ, బీఎస్ సాగర్, కలం ప్రహ్లాద, ఉప్పల అప్పలరాజు, గంటా మోహన్, యువశ్రీ మురళి, సామాజిక కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శిగా ఏఎంఆర్ ఆనంద్ ఎన్నికయ్యారు. మరో 28 మంది కార్యవర్గసభ్యులు ఉన్నారు.

బీసీల అభ్యున్నతి కోసం సీఎం జగన్ కృషి

- మంత్రులు చెల్లుబోయిన, రజిని
- గుంటూరులో బీపీ మండల్ విగ్రహావిష్కరణ, బీసీల ఆత్మగౌరవ సభ





గుంటూరు రూరల్: బీసీల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, విడదల రజిని చెప్పారు. నగర శివారు అమరావతిరోడ్డులో ఆదివారం బీపీ మండల్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన బీసీల ఆత్మగౌరవ సభలో మంత్రులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న నేత సీఎం జగన్ అని కొనియాడారు. గత ప్రభుత్వాలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూశాయని, కానీ నేడు జగనన్న ప్రభుత్వంలో బీసీల అభివృద్ధి జరిగిందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీలకు మంత్రి పదవులు, చట్ట సభల్లో ప్రాధాన్యం దక్కిందన్నారు. బీపీ మండల్ బీసీల అభివృద్ధికి దేశ వ్యాప్తంగా తిరిగి జనాభా ప్రాతిపదికన ఎన్నో సంస్కరణలు చేశారని, వాటిని అమలు చేయాలని కోరారు. బీసీల అభివృద్ధికి జనగణన చేపట్టాలంటూ బీసీలంతా ఐకమత్యంగా ఒక వేదికపైకి రావడాన్ని అభినందించారు. జనగణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, జోగి రమేష్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, డొక్కా మాణిక్యవరప్రసాద్, కల్పలతారెడ్డి, ఎంపీ బీద మస్తాన్‌రావు, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరిధరరావు, నగర డిప్యూటీ మేయర్ షేక్ సజిల, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, బీపీ మండల్ మనుమడు ప్రొఫెసర్ సూరజ్‌మండల్, ద్రవిడ కజగం ప్రెసిడెంట్ వీరమణి, తమిళనాడు ఎంపీ తిరుమావళన్, బీసీ సంక్షేమ సంఘం నేత డాక్టర్ శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

భృంగి వాహనంపై మల్లన్న విహారం



శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం శ్రీశైల మల్లికార్జున స్వామి భ్రమరాంబ సమేతుడై భృంగి వాహనంపై ఊరేగాడు. భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను భృంగి వాహనంపై అధిష్టింపజేసి అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పుస్తక మహోత్సవంలో విద్యాకానుకను పరిశీలించిన వెంకయ్య

విజయవాడలో జరుగుతున్న పుస్తక మహోత్సవాన్ని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఆదివారం సందర్శించారు. బుక్ ఫెస్టివల్‌లో పాఠశాల విద్యాశాఖ- సర్వశిక్ష ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించారు. జగనన్న విద్యాకానుక కింద విద్యార్థులకు అందిస్తున్న వస్తువులను ఆసక్తిగా పరిశీలించారు. బైజూస్ కంటెంట్‌తో 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబ్‌ను కూడా వెంకయ్య నాయుడు పరిశీలించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



జగనన్న విద్యాకానుక వస్తువులను ఆసక్తిగా పరిశీలిస్తున్న వెంకయ్యనాయుడు

అనాథ శవాలకు ఆత్మ బంధువులు

ఎక్కడ మృతదేహం కనిపించినా వారికే పిలుపు



రైల్వే ట్రాక్ నుంచి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలిస్తున్న పెద్దోడు, చిన్నోడు

- చిన్నోడు, పెద్దోడు రానిదే పోస్ట్‌మార్టానికి వెళ్లని మృతదేహాలు
- కుళ్లిన, ఛిన్నాభిన్నమైన మృతదేహాలను వెలికితీసి.. ఖననం చేసేది వాళ్లే

సాక్షి, నెల్లూరు/బారకాసు: నెల్లూరు నగర పరిధిలోని రైల్వే ట్రాక్‌పై ఛిద్రమైన తల.. కాళ్లు, చేతులు వేర్వేరుగా పడి ఉన్నాయి. చుట్టూ ఈగలు ముసురుతుండగా.. ఆ శవం దుర్వాసన వెదజల్లుతోంది. పోలీసులు సైతం ముక్కుమూసుకుని నిలబడగా.. పెద్దోడు, చిన్నోడు అనే వ్యక్తులు చకచకా వచ్చి శరీర భాగాలను సేకరించారు. వాటన్నిటినీ ఓ దుప్పట్లో కట్టుకుని వాహనంలోకి ఎక్కించారు. అక్కడి నుంచి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆ తరువాత ఛిద్రమైన శవ భాగాలను శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు జరిపారు. కట్టె కాలుతుండగా ఎగిసిపడే చితి మంటలు.. వారి ఔదార్యానికి సలాం చేస్తాయి. ఇలా ఒకటి కాదు రెండు కాదు.. వేలాది మృతదేహాలకు పెద్దోడు, చిన్నోడు అసామాన్య సేవలందిస్తున్నారు.

రైలు బోగీలకు మంటలంటుకున్న వేళ

2011లో నెల్లూరు రైల్వేస్టేషన్‌లో తమిళనాడు ఎక్స్‌ప్రెస్ బోగీల్లో మంటలు చెలరేగి ఘోర ప్రమాదం జరిగింది. చాలామంది ప్రయాణికులు అగ్నికీలల్లో చిక్కుకుని గుర్తు పట్టలేనంతగా కాలిపోయారు. ఆ సమయంలో చిన్నోడు, పెద్దోడు కృషి అంతా ఇంతా కాదు. వీరిద్దరి సహకారంతోనే మంటల్లో కాలిపోయిన వారి మృతదేహాలను బోగీల్లోంచి వెలికితీసి రక్త సంబంధీకులకు అప్పగించారు. కరోనా విజృంభించిన సమయంలోనూ పెద్దోడు, చిన్నోడు ప్రాణాలకు తెగించి మృతదేహాలకు అంత్యక్రియలు చేయించారు.

ఇదీ పెద్దోడు కథ..

విశాఖపట్టణానికి చెందిన బత్తిన గురుమూర్తి (పెద్దోడు) 30 ఏళ్ల క్రితం కుటుంబ కలహాల కారణంగా సొంతూరిని వదిలేసి నెల్లూరు చేరుకున్నాడు. ప్రధాన రైల్వేస్టేషన్‌లో ఫుట్‌పాత్‌నే నివాసంగా మార్చుకుని కడుపు నింపుకునేందుకు చేతనైన పనిచేస్తూ జీవనం సాగిస్తుండగా.. ఓ రోజు రాత్రి రైలు పట్టాలపై శవం ఉందన్న సమాచారం రైల్వే పోలీసులకు అందింది. అర్ధరాత్రి వేళ శవాన్ని ఎవరు తీస్తారని ఎదురుచూస్తున్న సమయంలో వారికి గురుమూర్తి కనిపించాడు. అతడిని నిద్రలేపిన పోలీసులు శవాన్ని తీసుకొచ్చేందుకు రావాలని కోరారు. పెద్దోడు కాదనకుండా శవం ఉన్న ప్రాంతానికి వెళ్లి.. అక్కడ చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహం భాగాలను ఓ సంచిలో వేసుకుని చెక్కబండిపై నెట్టుకుంటూ పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. దీంతో పోలీసులు గురుమూర్తికి రూ.300 ఇచ్చారు. ఆ నగదుతో 4 రోజులపాటు కడుపునింపుకున్న పెద్దోడు మరోసారి కూడా అదే తరహాలో అనాథ మృతదేహాన్ని తరలించాడు. ఇలా మొదలైన ఆయన జీవన ప్రయాణం 30 ఏళ్లుగా అనాథ శవాలకు ఆత్మబంధువుగా.. పోలీసులకు సహాయకారిగా మారాడు. నెల్లూరు నగర పరిసరాల్లో ఎక్కడ ప్రమాదవశాత్తు లేదా ఇతరత్రా కారణాలతో ఎవరైనా మృతి చెందితే పోలీసుల నుంచి ఫోన్‌కాల్ వచ్చేది పెద్దోడికే.

చిన్నోడు ఎవరంటే..

నెల్లూరులోని కొత్తూరుకు చెందిన సురేష్‌కుమార్ (చిన్నోడు) కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంటి నుంచి వచ్చేశాడు. ప్రధాన రైల్వేస్టేషన్ ఎదుట ఫుట్‌పాత్‌నే నివాసంగా మార్చుకున్నాడు. యాచిస్తూ కడుపు నింపుకునే సురేష్‌కు గురుమూర్తితో స్నేహం ఏర్పడింది. అప్పటినుంచి ఎక్కడ మృతదేహం ఉన్నా పోలీసుల నుంచి పిలుపు రాగానే ఇద్దరూ కలసి వెళ్తున్నారు.

అలా చేయడంలోనే తృప్తి



అది మంచో చెడో మాకు తెలియదు. శవాలు కనిపిస్తే సాయం చేయాలనిపిస్తుంది. పోలీసులిచ్చే డబ్బు కోసం కాదు. మాకు అందులోనే తృప్తి ఉంటోంది కాబట్టే ఆ పనికి ఒప్పుకుని చేస్తున్నాం.

– గురుమూర్తి (పెద్దోడు)

అప్పుడప్పుడూ బాధేస్తుంది



ఏదైనా ప్రమాదంలో ఎవరైనా చనిపోతే వారి పరిస్థితిని చూసి బాధ కలుగుతుంది. వారి శరీర భాగాలు ముక్కలు ముక్కలు గా పడి ఉంటాయి. కొన్నిసార్లు కుక్కలు సైతం పీక్కు తింటుంటాయి. కుళ్లిపోయిన శవాలనూ చూస్తుంటాం. ఇలాంటప్పుడు మాకు బాధ కలుగుతుంది.

– సురేష్‌కుమార్ (చిన్నోడు)

క్లుప్తంగా...

వాలెంటైన్స్ డే స్పెషల్... చాట్‌జీపీటీతో ప్రేమలేఖలు



న్యూఢిల్లీ: వాలెంటైన్స్ డే వచ్చేస్తోంది. ప్రేమికులంతా ఈ ఉత్సవాన్ని జరుపుకోవడానికి కొత్త జోష్‌తో ఉన్నారు. మనసులో ప్రేమ భావనలు ఉప్పొంగుతున్నా వాటిని చక్కగా కాగితంపై పెట్టలేని వారు చాట్‌జీపీటీ సాయంతో ప్రేమలేఖలు రాయడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు! 62% మంది ప్రేమికులు ఈ వాలెంటైన్స్‌డేకి చాట్‌జీపీటీ సాయంతో తమ మనసులో ఉన్న మాటల్ని రాస్తామని ఒక సర్వేలో వెల్లడించారు. 30% మంది తమ లవర్‌కి ఈ టూల్ సాయంతో ప్రేమలేఖ రాస్తామని చెప్పారు. మోడరన్ లవ్ రీసెర్చ్ తొమ్మిది దేశాల్లో 5 వేల మందిని ప్రశ్నించి ఒక నివేదిక రూపొందించింది. సహజసిద్ధంగా పుట్టే ప్రేమను వ్యక్త పరచడానికి కృత్రిమ మేధపై ఆధారపడతామని చెప్పిన వారిలో అత్యధికులు భారతీయులే!

వాట్సాప్ కాల్ సాయంతో ప్రసవం


శ్రీనగర్: నొప్పులతో విలవిల్లాడుతున్న గర్భిణికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) సిబ్బంది వాట్సాప్ కాల్ సాయంతో సురక్షితంగా ప్రసవం చేసిన సంఘటన జమ్మూకశ్మీర్‌లో జరిగింది. కుప్వారా జిల్లాలోని కెరాన్ పీహెచ్‌సీకి నెలలు నిండి, నొప్పులు మొదలైన గర్భిణిని కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి తీసుకొచ్చారు. ఎక్లామ్‌ప్సియా, ఎపిసియోటోమీతో బాధపడుతున్న ఆమెకు ప్రసవం జరగడం కష్టతరంగా మారింది. తీవ్రంగా మంచు కురుస్తుండడంతో హెలికాప్టర్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించడం వీలు కాలేదు. దీంతో కెరాన్ పీహెచ్‌సీ డాక్టర్లు క్రాల్‌పొరాలోని జిల్లా ఉప ఆసుపత్రి వైద్యులను సంప్రదించారు. ఆ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ పర్వేజ్ వాట్సాప్ కాల్‌లో సూచనలు ఇస్తుండగా, కెరాన్ పీహెచ్‌సీ వైద్యులు మహిళకు విజయవంతంగా ప్రసవం చేశారు. ఆడ శిశువు జన్మించిందని, తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు చెప్పారు.

రాహుల్‌కు నోటీసులు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ నేత, ఎంపీ రాహుల్ గాంధీకి లోక్‌సభ సెక్రెటేరియట్ నోటీసులిచ్చింది. లోక్‌సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై చేసిన వ్యాఖ్యలపై ఈ నెల 15వ తేదీలోగా వివరణ ఇవ్వాలని సూచించింది. ఈ మేరకు ఆయనకు ఓ లేఖ రాసింది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రధాని మోదీపై రాహుల్ చేసిన విమర్శల పట్ల బీజేపీ సభ్యులు నిశికాంత్ దూబే, ప్రహ్లాద్ జోషీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయనకు వ్యతిరేకంగా సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చారు. వీటిపై లోక్‌సభ సెక్రెటేరియట్ రాహుల్‌కు లేఖ రాసింది.

మన తెల్ల బంగారం

కశ్మీర్‌లో 59 లక్షల టన్నుల లిథియం
- బ్యాటరీల తయారీలో అత్యంత కీలకం
- అంతరిక్ష పేలుళ్ల వల్ల ఏర్పడిన అరుదైన లోహం
- అమెరికా కంటే భారత్‌లోనే అధిక నిల్వలు



రియాసీ జిల్లాలో లిథియం ఖనిజం ఉన్న శిలలను చూపుతున్న గ్రామస్తుడు

ఆధునిక యుగంలో ఎలక్ట్రిక్ వాహనాల ప్రాధాన్యం నానాటికీ పెరిగిపోతోంది. సౌర విద్యుదుత్పత్తిని పెంచుకోవాల్సిన ఆవశ్యకతను ప్రపంచ దేశాలు ఎప్పుడో గుర్తించాయి. ఇక స్మార్ట్‌ఫోన్ చేతిలో లేకపోతే పొద్దు గడవదు. మరి ఈ అవసరాలన్నీ తీరాలంటే ఏం కావాలో తెలుసా? లిథియం. అత్యంత విలువైన ఈ ఖనిజాన్ని పూర్తిగా విదేశాల నుంచే దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఇకపై ఆ అవసరం పెద్దగా ఉండదు. ఎందుకంటే 59 లక్షల టన్నుల నాణ్యమైన లిథియం నిల్వలు జమ్మూకశ్మీర్‌లోని రియాసీ జిల్లాలో మాతా వైష్ణోదేవి పుణ్యక్షేత్రం కొలువైన కొండల దిగువన సలాల్ హైమన గ్రామం వద్ద ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) ఇటీవల గుర్తించింది. భారత్‌లో ఈ స్థాయిలో లిథియం నిల్వలు బయటపడడం ఇదే తొలిసారి! - సాక్షి, నేషనల్ డెస్క్

తవ్వకాలతో నీటి నిల్వలకు ముప్పు!

ఖనిజ తవ్వకాల వల్ల పర్యావరణానికి ముప్పు తప్పదు. లిథియం తవ్వకాల కారణంగా విపరీతమైన కాలుష్యం ఏర్పడుతుందని, ప్రకృతిపై ప్రతికూల ప్రభావం పడుతుందని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా లిథియం తవ్వకాలు చేపట్టిన ప్రాంతాల్లో నీటి నిల్వలు అంతరించిపోతాయని హెచ్చరిస్తున్నారు. భూమిపై తేమ తగ్గిపోయి, కరువు నేలగా మారుతుందని పేర్కొంటున్నారు. ఒక టన్ను లిథియం కోసం తవ్వకాలు సాగిస్తే ఏకంగా 15 టన్నుల కార్బన్ డయాక్సైడ్ విడుదల అవుతుందని సమాచారం. ఒక టన్ను లిథియం తవ్వకానికి దాదాపు రూ.64 లక్షల ఖర్చవుతుంది. లిథియం వెలికితీతకు భారీస్థాయిలో నీరు అవసరం.

లిథియం అంటే?

తెల్ల బంగారంగా పిలిచే లిథియం అనే పదం గ్రీక్ భాషలోని లిథోస్ (రాయి) నుంచి పుట్టింది. ఇది ఆల్కలీ మెటల్ గ్రూప్‌కు చెందినది. తేలికగా, మృదువుగా, తెల్లటి రంగులో వెండిలాగా మెరిసే లోహం. పీరియాడిక్ గ్రూప్ 1(ఐఏ)లో లిథియంను చేర్చారు. ఇది భూగోళంపై సహజంగా ఏర్పడింది కాదు. అంతరిక్షంలో సంభవించిన పేలుళ్ల వల్ల ఏర్పడినట్లు గుర్తించారు. బిగ్‌బ్యాంగ్ వల్ల విశ్వం పుట్టిన తొలినాళ్లలో భూగోళంపై లిథియం నిల్వలు మొదలైనట్లు తేల్చారు. ఇతర గ్రహాలపైనా లిథియం ఉంది.



500 పీపీఎం నాణ్యత

సాధారణ లిథియం నాణ్యత 220 పీపీఎం (పార్ట్స్ పర్ మిలియన్) ఉంటుంది. కానీ కశ్మీర్‌లో కనుగొన్న లిథియం నాణ్యత ఏకంగా 500 పీపీఎంగా ఉండటం విశేషం. లిథియంను ఇతర లోహాలతో కలిపి మిశ్రమ లోహాలను తయారు చేస్తారు. విద్యుత్‌తో నడిచే వాహనాల బ్యాటరీల తయారీకి లిథియం కీలకం. ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు, డిజిటల్ కెమెరాలు, కంప్యూటర్లు, ఇతర విద్యుత్ పరికరాల బ్యాటరీల తయారీలోనూ ఉపయోగిస్తారు. గాజు, సెరామిక్ పరిశ్రమల్లో లిథియం వాడకం అధికంగా ఉంది. పవన, సౌర విద్యుత్‌ను నిల్వచేసే బ్యాటరీలు లిథియంతో తయారవుతాయి. రీచార్జి చేయడానికి వీల్లేని బ్యాటరీల్లోనూ వాడుతారు. పేస్‌మేకర్లు, బొమ్మలు, గడియారాల్లోని బ్యాటరీల్లో లిథియం ఉంటుంది. 2030 నాటికి మన దేశంలో 27 గిగావాట్ల గ్రిడ్–స్కేల్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్స్ కావాలని అంచనా. అంటే రానున్న రోజుల్లో లిథియం అవసరం ఎన్నో రెట్లు పెరిగిపోనుంది. అంతర్జాతీయంగా లిథియం మార్కెట్ వేగంగా విస్తరిస్తోంది. 2008 నుంచి 2018 నాటికి దీనికి వార్షిక ఉత్పత్తి 25,400 టన్నుల నుంచి 85,000 టన్నులకు చేరింది.

ఏ దేశంలో ఎన్ని నిల్వలు(టన్నుల్లో)

దేశం	లిథియం నిల్వలు
బొలీవియా	3,90,00,000
చిలీ	1,99,03,332
ఆస్ట్రేలియా	77,17,776
చైనా	66,90,180
భారత్	59,00,000
అమెరికా	57,62,917

ఐదో స్థానంలో భారత్

3.9 కోట్ల టన్నులతో బొలీవియా ప్రపంచంలో తొలిస్థానంలో ఉంది. చిలీ, ఆస్ట్రేలియా, చైనా, అమెరికా, అర్జెంటీనా తదితర దేశాల్లో కోట్ల టన్నుల నిల్వలున్నట్లు కనిపెట్టారు. భారత్‌లో కర్ణాటకలోని మండ్యా జిల్లాలో 1,600 టన్నుల లిథియం ఉన్నట్లు రెండేళ్ల క్రితం గుర్తించారు. తాజాగా కశ్మీర్‌లో బయటపడ్డ 59 లక్షల టన్నులతో కలిపితే ప్రపంచంలో భారత్ ఐదో స్థానంలో నిలుస్తోంది. అమెరికాలో కంటే భారత్‌లోనే అధిక నిల్వలున్నాయి. ఉత్పత్తి, ఎగుమతుల్లో ఆస్ట్రేలియా, చిలీ, చైనా తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. ఆస్ట్రేలియా, చిలీ, అర్జెంటీనా నుంచి భారత్ లిథియంను దిగుమతి చేసుకుంటోంది. ముడి లిథియంను శుద్ధి చేసి, బ్యాటరీల తయారీకి అనువైన లోహంగా మార్చడం కఠినమైన ప్రక్రియ. ఇందులో సాధించేదాకా మరో రెండేళ్లపాటు దిగుమతులపై ఆధారపడక తప్పదని నిపుణులు చెబుతున్నారు.

అదే దైన్యం..!

కోలుకోని తుర్కియే, సిరియా
- 33 వేలు దాటేసిన భూకంప మృతులు
- సంక్షోభంగా మారుతున్న పెను విపత్తు
- బాధితుల్లో కట్టలు తెంచుకుంటున్న ఆగ్రహం
- 128 గంటల తర్వాత బయటపడ్డ పసికందు



హతాయ్‌లో 150 గంటల తర్వాత సజీవంగా బయటపడ్డ చిన్నారి



హతాయ్‌లోనే 151 గంటల తర్వాత బయటపడ్డ ఓ వ్యక్తి

అంటాక్యా (తుర్కియే): ఆరు రోజులు గడిచినా భూకంప ప్రకోపం ప్రభావం నుంచి తుర్కియే, సిరియా ఏమాత్రమూ తేరుకోలేదు. కుప్పకూలిన వేలాది భవనాల శిథిలాల నుంచి ఇంకా మృతదేహాలు బయట పడుతూనే ఉన్నాయి. మరోవైపు లక్షలాది మంది సర్వం పోగొట్టుకుని కట్టుబట్టలతో నిరాశ్రయులుగా మిగలడంతో ఈ విపత్తు క్రమంగా పెను మానవీయ సంక్షోభంగా మారుతోంది. వారికి కనీస వసతులు కల్పించడం కూడా ప్రభుత్వానికి సవాలుగా పరిణమిస్తోంది. దాంతో బాధితుల్లో ఆక్రోశం ఆగ్రహంగా మారి కట్టలు తెంచుకుంటోంది. మరోవైపు రెండు దేశాల్లో మృతుల సంఖ్య ఇప్పటికే 33 వేలు దాటేసింది. తుర్కియేలోనే కనీసం 80 వేల మందికి పైగా గాయపడ్డారు. మృతదేహాలను సామూహికంగా ఖననం చేస్తున్న దృశ్యాలు కంటతడి పెట్టిస్తున్నాయి. వెలికితీత, సహాయ కార్యక్రమాలు నత్తనడకన నడుస్తుండటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. భూకంపం రావచ్చని ముందే సమాచారమున్నా దాన్ని ఎదుర్కొనేందుకు సరైన చర్యలు తీసుకోలేదంటూ కూడా ఇంటా బయటా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవన నిర్మాణ నిబంధనలను ఉల్లంఘించి భారీ జన నష్టానికి కారకులయ్యారంటూ తుర్కియేలో వందలాది మంది కాంట్రాక్టర్లను అరెస్టు చేస్తున్నారు. తుర్కియేలో ఈ శతాబ్ది విపత్తుగా పరిగణిస్తున్న ఈ భూకంపం ధాటికి 500 కిలోమీటర్ల పరిధిలో 1.3 కోట్ల మంది తీవ్రంగా ప్రభావితులయ్యారు. సిరియాలోనూ పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. భూకంప ప్రభావిత ప్రాంతాలు ప్రభుత్వ, వేర్పాటువాదుల అధీనంలోని ప్రాంతాల మధ్య విస్తరించడం సహాయ చర్యలకు అడ్డంకిగా మారింది. ఇప్పటిదాకా 4,000కు పైగా మరణించారని అంచనా.

వీరంతా మృత్యుంజయులు

తుర్కియేలో ఓ రెండు నెలల చిన్నారిని ఏకంగా 128 గంటల తర్వాత శిథిలాల నుంచి సజీవంగా రక్షించారు! అదియమాన్ నగరంలో ఓ ఆరేళ్ల బాలున్ని ఏకంగా 151 గంటల అనంతరం ఆదివారం కాపాడారు. ఈ కార్యక్రమాన్ని టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం చేయడం విశేషం! మరో చిన్నారి బాలికను కూడా 150 గంటల తర్వాత కాపాడారు. అంటాక్యాలో మరో 35 ఏళ్ల వ్యక్తిని 149 గంటల తర్వాత కాపాడారు. శిథిలాల కింద చిక్కిన వారిని గుర్తించేందుకు థర్మల్ కెమెరాలు తదితర మార్గాల్లో తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. భారత్‌తో పాటు పలు దేశాల నుంచి వచ్చిన సిబ్బంది అహోరాత్రాలు సహాయ, పునరావాస కార్యక్రమాల్లో చెమటోడుస్తున్నారు.



అంటాక్యాలో ఆప్తులను కోల్పోయి రోదిస్తున్న మహిళ


నాలుగు హైకోర్టులకు సీజేలు

వీరిలో ఇద్దరు ఈ నెలాఖరులో పదవీ విరమణ

న్యూఢిల్లీ: దేశంలోని నాలుగు హైకోర్టులకు నూతనంగా ప్రధాన న్యాయమూర్తు(సీజే)లు నియమితులయ్యారు. వీరిలో ఇద్దరు ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనుండటం గమనార్హం. గుజరాత్ హైకోర్టులో అత్యంత సీనియర్ జడ్జి అయిన జస్టిస్ సోనియా గిరిధర్ గోకానీని అదే హైకోర్టు సీజేగా నియమించారు. అదేవిధంగా, ఒరిస్సా హైకోర్టులో అత్యంత సీనియర్ జడ్జి జస్టిస్ జస్వంత్ సింగ్ త్రిపుర హైకోర్టు సీజేగా నియమితులయ్యారు. ఈయన ఈ నెల 22న రిటైర్ కానున్నారు. ఇంతకుముందు జస్టిస్ సింగ్‌ను ఒరిస్సా హైకోర్టు సీజేగా నియమించాలంటూ చేసిన సిఫారసును కొలీజియం ఆతర్వాత ఉపసంహరించుకుంది. రాజస్తాన్ హైకోర్టుకు చెందిన జడ్జి జస్టిస్ సందీప్ మెహతాను గౌహతి హైకోర్టు సీజేగా నియమించారు. గౌహతి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్ జమ్మూకశ్మీర్ అండ్ లద్దాఖ్ హైకోర్టు సీజేగా నియమితులయ్యారు. తాజా నియామకాలను న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజిజు ఆదివారం ట్విట్టర్‌లో ప్రకటించారు. కాగా, జస్టిస్ గోకానీ బాధ్యతలు స్వీకరించాక దేశంలో ఉన్న 25 హైకోర్టుల్లో ఏకైక మహిళా ప్రధాన న్యాయమూర్తి అవుతారు. గుజరాత్ జ్యుడీషియల్ సర్వీస్ నుంచి వచ్చిన ఈమెకు 62 ఏళ్లు నిండటంతో ఫిబ్రవరి 25న పదవీ విరమణ చేయనున్నారు. జస్టిస్ సబీనా ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక సీజేగా ఉన్నారు. గుజరాత్ హైకోర్టు చీఫ్ జస్టిస్ అరవింద్ కుమార్ సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో జస్టిస్ గోకానీని తక్షణమే నియమించాలంటూ గత వారం కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. ఇలా ఉండగా, రెండు రోజుల క్రితం సుప్రీంకోర్టు జడ్జిలుగా నియమితులైన జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో సోమవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

ట్రిపుల్ ట్రబుల్ నుంచి త్రిపురను కాపాడేది

డబుల్ ఇంజిన్ సర్కారే: అమిత్ షా



చండీపూర్(అగర్తలా): త్రిపురను కాంగ్రెస్, సీపీఎం, తిప్రా మోతా అనే ట్రిపుల్ ట్రబుల్ నుంచి బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కారే కాపాడుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. త్రిపుర రాష్ట్రం ఉనాకోటి, సెపాహిజలా జిల్లాల్లో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో మంత్రి మాట్లాడారు. ఈ మూడు సమస్యల నుంచి బయటపడాలనుకుంటే బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వానికే ఓటేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఏళ్లపాటు రాష్ట్రంలోని గిరిజనులను నిర్లక్ష్యం చేసిన సీపీఎం ప్రజలను మోసగించడానికే ఇప్పుడు గిరిజన నేతను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించిందని ఆయన విమర్శించారు. బీజేపీని ఓడించటానికే సీపీఎం, కాంగ్రెస్ ఏకమయ్యాయని మంత్రి ఆరోపించారు. ఈ మూడు పార్టీలకు అధికారమిస్తే రాష్ట్రంలో తిరిగి ఆటవిక పాలన వచ్చినట్లేనన్నారు. సీపీఎం, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో పలు కుంభకోణాలు జరిగాయని చెప్పారు. ఈ నెల 16న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం, కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే.

ఢిల్లీ–ముంబై ఎక్స్‌ప్రెస్ వే

తొలి దశ ప్రారంభం

సోహ్నా–దౌసాల మధ్య రహదారిని ప్రారంభించిన ప్రధాని ● ఎక్స్‌ప్రెస్‌వేలతో దేశం ఆర్థికంగా బలోపేతమవుతుందన్న మోదీ



ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించి ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

దౌసా (రాజస్తాన్): కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణంలో మరో మైలు రాయిని అందుకుంది. దేశంలో అతి పెద్దదైన జాతీయ ఎక్స్‌ప్రెస్ హైవే ఢిల్లీ–ముంబై మహా రహదారిలో 246కి.మీ. భాగాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఆవిష్కరించారు. ఢిల్లీలోని సోహ్నా నుంచి రాజస్తాన్‌లో దౌసా మధ్య నిర్మాణం జరుపుకున్న తొలిదశను దౌసా వద్ద రిమోట్ కంట్రోల్ బటన్ ద్వారా ప్రధాని ప్రారంభించారు. 8 లేన్లతో నిర్మించిన ఢిల్లీ–దౌసా–లాల్‌సోట్ రహదారి అందుబాటులోకి రావడంతో ఢిల్లీ, జైపూర్ మధ్య దూరం సగానికి సగం తగ్గిపోతుంది. ఇన్నాళ్లు 5 గంటలు పట్టే ప్రయాణం ఈ ఎక్స్‌ప్రెస్ వే మీదుగా వెళితే మూడున్నర గంటలే పడుతుంది. దీంతోపాటు రూ.5,940 కోట్ల జాతీయ హైవే ప్రాజెక్టులకి శంకుస్థాపన చేశారు. తమ ప్రభుత్వం హైవే ప్రాజెక్టులు, పోర్టులు, రైల్వేలు, ఆప్టికల్ ఫైబర్, మెడికల్ కాలేజీల మీద అత్యధికంగా దృష్టి సారించిందని ఈ సందర్భంగా మోదీ చెప్పారు. ఇలాంటి హైవేలతో పారిశ్రామికవేత్తలతో పాటు, వ్యాపారులు, చిరు వ్యాపారులు కూడా ఆర్థికంగా బలోపేతమవుతారని తెలిపారు. మౌలిక సదుపాయాలపై ఖర్చు చేస్తే మరిన్ని పెట్టుబడుల్ని ఆకర్షించవచ్చునని మోదీ చెప్పారు. ఢిల్లీ–ముంబై తొలిదశతో ఈ ప్రాంతం ఆర్థికంగా మరింత బలోపేతమవుతుందన్నారు. ఎక్స్‌ప్రెస్‌వే అందుబాటులోకి రావడంతో జైపూర్, అజ్మీర్‌లకు మరిన్ని ప్రయోజనాలు చేకూరుతాయన్నారు.

సరిహద్దు ప్రాంతాలపై కాంగ్రెస్ నిర్లక్ష్యం: ప్రధాని

మన దేశ సైనికుల శక్తి సామర్థ్యాలను కాంగ్రెస్ తక్కువగా అంచనా వేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నన్నాళ్లు సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని, దేశంలోకి చొరబడడానికి మన శత్రువులు కొత్త మార్గాలు వెతుక్కుంటారన్న భయంతో ఏమీ చేయలేదని ధ్వజమెత్తారు. దౌసాలో ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించిన తర్వాత బీజేపీ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ రాజస్తాన్‌లో అభివృద్ధి కార్యక్రమాలన్నీ కాంగ్రెస్ కాగితాలకే పరిమితం చేసిందని ఆరోపించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉంటేనే రాజస్తాన్ అభివృద్ధి పథంలో దూసుకువెళుతుందని అన్నారు.

దయానంద సరస్వతి 200వ జయంత్యుత్సవాలు

ఆర్యసమాజ్ వ్యవస్థాపకుడు స్వామి దయానంద సరస్వతి 200వ జయంత్యుత్సవాలను మోదీ ఆదివారం ప్రారంభించారు. ఆయన చూపిన మార్గం కోట్లాది మందిలో ఆశల్ని నింపుతోందని ఈ సందర్భంగా ఆయనన్నారు. నిరుపేదలకు సేవ చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, అణగారిన వర్గాల అభ్యున్నతి మొట్టమొదటి యజ్ఞంగా చేపట్టామని తెలిపారు.

ఢిల్లీ ముంబై ఎక్స్‌ప్రెస్ వే విశేషాలు

మొత్తం పొడవు: 1,380 కి.మీ.
మొత్తం వ్యయం: దాదాపుగా రూ. లక్ష కోట్లు
ఢిల్లీ ముంబై మధ్య ప్రయాణ సమయం: 12 గంటలు (ప్రస్తుతం 24 గంటలు పడుతోంది)
తొలి దశ పొడవు : 246 కి.మీ. (సోహ్నా నుంచి దౌసా)
వ్యయం: రూ.12,150 కోట్లు
- ఢిల్లీ నుంచి జైపూర్ మధ్య సగానికి సగం తగ్గనున్న ప్రయాణ సమయం. (ఇన్నాళ్లూ 5 గంటలు పట్టేది. ఇకపై మూడున్నర గంటల్లో చేరుకోవచ్చు).
- ఆరు రాష్ట్రాల మీదుగా వెళ్లనున్న ఎక్స్‌ప్రెస్ వే

90 గంటలు, 10 సమావేశాలు, 10,800కి.మీ..

నాలుగు రోజుల వ్యవధిలో ప్రధాని నరేంద్ర మోదీ అక్షరాలా సుడిగాలి పర్యటనలు చేపట్టారు. మొత్తం 90 గంటల్లో ఏకంగా 10 బహిరంగ సమావేశాల్లో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో ఆయన 10,800 కి.మీ. దూరం ప్రయాణిస్తారు. ఫిబ్రవరి 10న ఢిల్లీ నుంచి యూపీకి వెళ్లి ప్రపంచ పెట్టుబడుల సదస్సుని ప్రారంభించారు. ముంబైకి వచ్చి వందేభారత్ రైళ్లకు పచ్చ జెండా ఊపారు. ఫిబ్రవరి 11న త్రిపురలో రెండు బహిరంగ సదస్సుల్లో పాల్గొన్నారు. ఆదివారం ఢిల్లీ నుంచి రాజస్తాన్ వెళ్లి దౌసాలో ఎక్స్‌ప్రెస్ వేను ప్రారంభించారు. రెండు బహిరంగ సమావేశాల్లో ప్రసంగించారు. సోమవారం బెంగుళూరులో ఏరో ఇండియా 2023ను ప్రారంభిస్తారు. అక్కడ్నుంచి మళ్లీ త్రిపురకి వెళ్లి అగర్తాలా ర్యాలీలో పాల్గొని సోమవారం రాత్రి ఢిల్లీకి చేరుకుంటారు.

ఓం, అల్లా.. ఒక్కటే: మౌలానా మదానీ

న్యూఢిల్లీ: జామియత్ ఉలెమా–ఇ–హింద్(అర్షద్ వర్గం) అధ్యక్షుడు మౌలానా సయ్యద్ అర్షద్ మదానీ వ్యాఖ్యలు వివాదమయ్యాయి. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఆదివారం 'జామియత్ ఉలెమా–ఇ–హింద్' 34వ సదస్సులో ఓం, అల్లా ఒక్కటేనని వ్యాఖ్యానించారు. 'దైవస్వరూపం అందుబాటులో లేకుంటే ఓంను పూజిస్తామని కొందరు నాతో చెప్పారు. అంటే ఒకే ఓం లేదా అల్లా ఉన్నట్లు లెక్క. అవి రెండూ ఒక్కటే. ఓంను మేము అల్లా అంటాం. హిందువులు ఈశ్వరుడంటారు. పార్సీలు ఖుదా అంటారు. ఆంగ్లేయులు గాడ్ అంటారు' అని చెప్పుకొచ్చారు. సదస్సులో పాల్గొన్న జైన మతపెద్ద ఆచార్య లోకేశ్ ముని తదితరులు ఈ వ్యాఖ్యలపై ఆగ్రహిస్తూ నిష్క్రమించారు.

మరో 'వస్తువు'ను కూల్చేసిన అమెరికా

వాషింగ్టన్: గగనతలంలో అనుమానాస్పదమైన వస్తువుల్ని అమెరికా వరసగా రెండో రోజూ కూల్చేసింది. కెనడా గగనతలంలోకి వచ్చిన గుర్తు తెలియని సిలిండర్ ఆకారంలోని వస్తువును అమెరికా యుద్ధ విమానం ఎఫ్–22 కూల్చేసినట్టు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడియో చెప్పారు. అమెరికా అధ్యక్షుడు బైడన్‌తో మాట్లాడి ఈ చర్య తీసుకున్నట్టు తెలిపారు.

50 లీటర్ల పెట్రోల్ ట్యాంకుకు 57 లీటర్ల బిల్లు!

మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జికి బంకు నిర్వాహకుల టోకరా

జబల్పూర్: మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో ఓ పెట్రోల్ పంపు సిబ్బంది ఏకంగా హైకోర్టు న్యాయమూర్తికే టోకరా ఇచ్చారు! ఆయన కారు ట్యాంక్ సామర్థ్యమే 50 లీటర్లయితే ఏకంగా 57 లీటర్ల పెట్రోల్ కొట్టినట్టు బిల్లు చేతికిచ్చారు. న్యాయమూర్తి ఫిర్యాదు మేరకు అధికారులు పెట్రోల్ బంకును సీల్ చేశారు.ఆ ప్రాంతంలోని ఇతర బంకుల నిర్వహణ తీరుపై విచారణకు ఆదేశించారు. ఈ నెల 9వ తేదీన ఈ ఘటన చోటుచేసుకుంది.

12 రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు



రమేశ్ బైస్

సాక్షి, న్యూఢిల్లీ: అయోధ్య రామాలయ వివాదంతో పాటు ట్రిపుల్ తలాక్ వంటి పలు చరిత్రాత్మక తీర్పులు వెలువరించిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా కేంద్రం నియమించింది. ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా పంపింది. మొత్తం ఆరుగురు కొత్త గవర్నర్లను నియమించడంతో పాటు ఏడుగురిని మారుస్తూ ఆదివారం నిర్ణయం తీసుకుంది. ఈ నియామకాలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేశారు. వివాదాస్పద మహారాష్ట్ర గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారీతో పాటు లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ ఆర్.కె.మాథుర్ రాజీనామా చేశారు. కొత్త గవర్నర్లలో నలుగురు బీజేపీకి చెందినవారు. జస్టిస్ నజీర్ కర్నాటక హైకోర్టు న్యాయమూర్తిగా ఉంటూ 2017లో నేరుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. గత జనవరిలో రిటైరయ్యారు. ఇక 80 ఏళ్ల కోశ్యారీ మహారాష్ట్ర గవర్నర్‌గా ఛత్రపతి శివాజీ, ముంబైపై వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. ఎన్సీపీ, కాంగ్రెస్, శివసేన (ఉద్ధవ్) కోశ్యారీ రాజీనామాను స్వాగతించాయి.

కొత్త గవర్నర్లు

ఆంధ్రప్రదేశ్	జస్టిస్ ఎస్.ఎ.నజీర్
మహారాష్ట్ర	రమేశ్ బైస్
బిహార్	విశ్వనాథ్ రాజేంద్ర అర్లేకర్
ఛత్తీస్‌గఢ్	విశ్వభూషణ్ హరిచందన్
జార్ఖండ్	సి.పి.రాధాకృష్ణన్
హిమాచల్‌ప్రదేశ్	శివప్రతాప్ శుక్లా
అస్సాం	గులాబ్‌చంద్ కటారియా
అరుణాచల్‌ప్రదేశ్	త్రివిక్రమ్ పర్నాయక్
మణిపూర్	అనసూయ ఉయికె
సిక్కిం	లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య
నాగాలాండ్	ఎల్.ఎ.గణేశన్
మేఘాలయ	ఫగు చౌహాన్
లద్దాఖ్	బి.డి.మిశ్రా

మహిళలది జీతం బత్తెం లేని చాకిరి

- రోజుకి 7.2 గంటల ఇంటి పనిలో మహిళలు
- అహ్మదాబాద్ ఐఐఎం అధ్యయనంలో వెల్లడి

అహ్మదాబాద్ : మహిళలు ఇంట్లో జీతం బత్తెం లేకుండా బండెడు చాకిరీ చేస్తున్నారని, రోజుకున్న 24 గంటల సమయం సరిపోవడం లేదని గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) తాజా అధ్యయనంలో వెల్లడైంది. జీతం లేని ఇంటి పనిని పురుషులు 2.8 గంటలు చేస్తే మహిళలు 7.2 గంటల సేపు ఇంటిపనుల్లోనే ఉంటున్నారని ఆ అధ్యయనంలో తేలింది.

అధ్యయనం ఏం చెప్పిందంటే..

ఆఫీసులో పని చేస్తూ సంపాదిస్తున్న మహిళలు కూడా పురుషుల కంటే రెండు రెట్లు ఎక్కువగా ఇంటి పనుల్లో నిమగ్నమైపోతున్నారు. ఇల్లు శుభ్రం చేయడం, వంట చేయడం, పిల్లల్ని చూసుకోవడం వంటి పనులన్నీ మగవారి కంటే మహిళలే ఎక్కువగా చేస్తున్నారు. 15 నుంచి 60 ఏళ్ల వయసున్న మహిళలందరూ రోజుకి 7 గంటలకు పైగా ఇంటి పనులు చేస్తున్నారు. ఈ విషయం జగమెరిగిన సత్యమే అయినప్పటికీ ''టైమ్ యూజ్ డేటా : ఏ టూల్ ఫర్ జెండర్డ్ పాలసీ అనాలిసిస్'' పేర ఎంత సేపు మహిళలు జీతం లేని చాకిరీ చేస్తున్నారో సర్వే చేయగా మహిళలు సగటున రోజుకి 7.2 గంటలు ఇంటి పనులు చేస్తూ వస్తూ ఉంటే , మగవాళ్లు 2.8 గంటలు మాత్రమే చేస్తున్నారని తేలినట్టుగా ఐఐఎంఏ ప్రొఫెసర్ నమ్రత చందార్కర్ తెలిపారు.

దేశంలోనే ఖరీదైన పెంట్ హౌస్

రూ.240 కోట్లు!



ముంబై: దేశంలోనే అత్యంత ఖరీదైన పెంట్‌హౌస్‌ను వెల్‌స్పన్ గ్రూప్ చైర్మన్ బీకే గోయెంకా ఇటీవలే కొనుగోలు చేశారు. ముంబైలోని వర్లీ ప్రాంతం అన్నీబీసెంట్ రోడ్డులో ఉన్న లగ్జరీ టవర్లలో త్రీసిక్స్‌టీ వెస్ట్ ఒకటి. ఇందులోని పెంట్‌హౌస్ ఖరీదు రూ.240 కోట్లు. టవర్ 63, 64, 65 ఫ్లోర్లలోని 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ పెంట్ హౌస్ కొనుగోలుకు సంబంధించిన వ్యవహారాలను గత బుధవారం బీకే గోయెంకా పూర్తి చేసినట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం తెలిపింది. దేశంలో ఇప్పటి వరకు ఇదే అత్యంత ఖరీదైన అపార్ట్‌మెంటని పేర్కొంది. దీనిని ఆనుకునే ఉన్న మరో పెంట్‌హౌస్‌ను కూడా నిర్మాణ సంస్థ యజమాని వికాస్ ఒబెరాయ్ రూ.240 కోట్లు పెట్టి కొన్నట్లు ఆ కథనంలో వివరించింది.



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి:దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన సీహెచ్ ధనలక్ష్మి రూ.1,00,001 విరాళాన్ని ఆదివారం అందించారు.



సాగరతీరంలో పర్యాటకుల సందడి

కోడూరు:హంసలదీవి సాగరతీరం ఆదివారం పర్యాటకుల రాకతో సందడిగా మారింది. ఇసుక తిన్నెలు, సముద్ర అలల మధ్య కేరింతలు కొడుతూ గడిపారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు. డివిజన్, మండలస్థాయిలోనూ స్పందన ఉంటుందన్నారు.

న్యూస్‌రీల్

దుర్గమ్మ సేవలో జస్టిస్ దుర్గా ప్రసాదరావు



ఇంద్రకీలాద్రిపై న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాదరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గా ప్రసాదరావు ఆదివారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన జస్టిస్ దుర్గా ప్రసాదరావుకు ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, అర్చకులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న న్యాయమూర్తి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, అమ్మవారి ప్రసాదాలు, పట్టువస్త్రాలు అందజేశారు.

15న అఖండ ఖచ్చపీ సంగీత మహోత్సవం

విజయవాడ కల్చరల్:సుబ్రహ్మణ్య మహతీ సంగీత సమితి ఆధ్వర్యంలో ఈ నెల 15న దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో 8 వ జాతీయ అఖండ ఖచ్చపీ (వీణ) సంగీత మహోత్సవం 12 గంటలపాటు నిర్వహిస్తున్నట్లు సంగీత సమితి ప్రధాన కార్యదర్శి సీవీ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు త్యాగరాజ కృతుల వీణా వాద్య సమ్మేళనం ఉంటుందని పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వీణ విద్వాంసులు పాల్గొంటారన్నారు. కేవలం వీణ కచేరీలు మాత్రమే ఉంటాయని చెప్పారు.

వేదోక్తంగా సూర్యారాధన



విజయవాడ కల్చరల్: జగద్గురు భారతీ తీర్థ మహాస్వామి 73 వ జన్మదిన వేడుకల కార్యక్రమంలో భాగంగా దుర్గాపురంలోని శృంగేరీ శారదా పీఠ పాలిత శివరామకృష్ణ క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన సూర్యారాధన వేదోక్తంగా నాలుగు గంటలపాటు సాగింది. వేదపండితులు దెందుకూరి సుబ్రహ్మణ్య శాస్త్రి నిర్వహణలో సూర్య యంత్రానికి మాఘమాసం సప్తమితో కూడిన పుణ్యతిథి కావడంతో సామూహిక ఆదిత్య హృదయ పఠనం, సూర్య నమస్కారాలు, త్రిచ మహా సౌరాక్షరీ మహామంత్రం, అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ లోక శాంతికోసం భారతీ తీర్థ మహాస్వామి ఆదేశంతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు తెలిపారు.

సంఘటితంగా సమస్యల పరిష్కారానికి కృషి

అప్సా జిల్లా అధ్యక్షుడు మోహన్‌రావు



పామర్రు: ఏపీ ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్(అప్సా) సంఘ సభ్యులు సంఘటితంగా ఉండి సంఘ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.మోహన్‌రావు అన్నారు. స్థానిక యలమర్రు రోడ్డులోని ఏఎస్ఎం హైస్కూల్ ఉమ్మడి కృష్ణా జిల్లా సభ్యులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తూ వారు ఉత్తమ మార్కులు సాధించేలా కృషి చేయాలని అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటుగా నైతిక విలువలు పెంపొందేందుకు నిష్ణాతులైన సీనియర్ ఉపాధ్యాయులతో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. అప్సా భవిష్యత్ నిధిని ఏర్పాటు చేసి దాని ద్వారా నిరుపేదలైన వారికి సహాయ సహకారాలను అందజేయాలని అన్నారు. అసోసియేషన్‌లో ఉన్న యువత కార్యవర్గంలోకి రావాలని పిలుపు నిచ్చారు. విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాలని అన్నారు. పదేళ్లు ఉంటే పాఠశాల రిజిస్ట్రేషన్‌ను మూడేళ్లకు కుదించారని, దీనిని పదేళ్ల పాటు ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర సభ్యులు ఎ.పూర్ణచంద్రారెడ్డి, కార్యదర్శి వి.నాగ ప్రవీణ్, అడిషనల్ జనరల్ సెక్రటరీ ఎండీ రఫీ, కోశాధికారి ఎ.ప్రసాద్, కన్వీనర్ కె.చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

టూరిస్ట్.. పోలీస్

- ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఆరు ప్రదేశాల్లో అవుట్ పోస్ట్‌లు
- పర్యాటకులు రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు
- 24 గంటలూ అందుబాటులో పోలీస్ సేవలు
- త్వరలో ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఏర్పాటు చేసిన టూరిస్ట్ అవుట్ పోస్ట్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ప్రముఖ పర్యాటక ప్రదేశాలు, దేవాలయాల్లో పటిష్ట భద్రత కల్పించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో 26 ప్రాంతాలను గుర్తించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఆరు ప్రదేశాల్లో భద్రత చర్యలు చేపట్టనున్నారు. వీటిలో ఇంద్రకీలాద్రి, భవానీ ఐలాండ్, పవిత్ర సంగమం, మంగినపూడి బీచ్, మోపిదేవి దేవస్థానం, హంసల దీవి ఉన్నాయి. పర్యాటకులకు అవసరమైన భద్రత, సమాచారం అందించేందుకు వీలుగా టూరిస్ట్..పోలీస్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో అవుట్ పోస్టులను ఏర్పాటు చేశారు. అక్కడ పనిచేసే సిబ్బందికి ప్రత్యేకంగా జాకెట్స్, సామగ్రి, మైకు , ఫస్ట్ ఎయిడ్ బాక్సు ఇవ్వడంతో పాటు, ప్రత్యేకంగా 108 అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచుతారు. టూరిస్ట్ పోలీస్ అవుట్ పోస్టులను ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై ఆదివారం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా, కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమీక్షించారు.

ఎన్టీఆర్ జిల్లాలో...

ప్రకాశం బ్యారేజీ సమీపంలో ఇంద్రకీలాద్రి, భవానీ ఐలాండ్, పవిత్ర సంగమం వద్ద అవుట్ పోస్టులను ఏర్పాటుచేస్తున్నారు. పర్యాటకులకు భద్రతతో పాటు, ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా, ప్రశాంతంగా వారి పర్యటనలు పూర్తి చేసుకొనేందుకు వీలుగా ఈ అవుట్ పోస్టులు 24 గంటలూ పనిచేయనున్నాయి, ఇక్కడ మూడు షిఫ్టులలో పోలీసు సిబ్బంది పనిచేస్తారు. విజయవాడ నగరంతో పాటు, చుట్టుపక్కల అన్ని ప్రముఖ పర్యాటక ప్రదేశాలు, ఆస్పత్రులు, హోటల్స్ సమాచారంపై పూర్తి అవగాహన కలిగి ఉంటారు. వచ్చిన యాత్రికులకు వారికి కావాల్సిన సమాచారం అందించే విధంగా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ ప్రాంతాలు ఎప్పుడూ భక్తులు, పర్యాటకులతో రద్దీగా ఉంటాయి. ప్రత్యేకంగా పండుగల సమయంలో లక్షల మంది భక్తులు, పర్యాటకులు ఆయా ప్రదేశాలకు రానున్నట్లు పోలీసులు అంచనా వేశారు.

కృష్ణా జిల్లాలో....

మచిలీపట్నానికి 13 కిలోమీటర్ల దూరంలోనే మంగినపూడి బీచ్ ఉంది. ఇది చారిత్రాత్మక విశిష్టత కలిగిన ప్రకృతి సిద్ధ బీచ్. ఇక్కడికి వారాంతంలో సరాసరి 8 వేల నుంచి 10 వేల మంది సందర్శకులు వస్తారు. కార్తీక పౌర్ణమి పర్వదినాన 2 లక్షల మందికి పైగా భక్తులు పవిత్ర పుణ్యస్నానాలు చేస్తారు. బీచ్‌లో పర్యాటకుల కోసం ఎన్నో క్రీడా, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఏడాదికి సుమారు 12 నుంచి 15 లక్షల మంది ఈ బీచ్‌కు పర్యాటకులు వస్తారని పోలీసుల అంచనా. పర్యాటకుల కోసం అవుట్ పోస్టులో పోలీసులు అందుబాటులో ఉండి సేవలు అందిస్తారు. చిన్న పిల్లలు ఎవరైనా తప్పిపోతే , వారి తల్లిదండ్రులకు వెతికి అప్పగిస్తారు. సముద్రంలోకి వెళ్లేటప్పుడు లోతు ప్రాంతంలోకి వెళ్లవద్దని హెచ్చరిస్తారు. పొరపాటున వెళితే వీరు అందుబాటులో ఉండి వెంటనే రక్షిస్తారు. బీచ్‌లో అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతుంటే వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తారు. పర్యాటకులు అనారోగ్యానికి గురైతే వారికి సపర్యలు చేసి, వెంటనే ఆస్పత్రికి తీసుకెళతారు. అక్కడ షాపుల్లో ఉండే ఆహార పదార్థాలు ఎలా ఉన్నాయో పరిశీలించి తగు చర్యలు తీసుకొంటారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా

పోలీసు వ్యవస్థకు మంచి పేరు



టూరిస్ట్ పోలీస్ అవుట్ పోస్టులు ఏర్పాటు చేసే ప్రాంతాలను డీజీ లా అండ్ ఆర్డర్ రవి శంకర్ అయ్యన్నార్ ఆధ్వర్యంలో వర్చువల్ ట్రయల్ రన్ నిర్వహించాం. టూరిస్ట్ అవుట్ పోస్టుల్లో విధులు నిర్వహించే సిబ్బంది వచ్చిన ప్రతి ఒక్కరితో మర్యాదగా మాట్లాడి వారికి కావాల్సిన సమాచారం ఇవ్వాలి. పోలీస్ వ్యవస్థకు మంచి పేరు తీసుకొచ్చే విధంగా సేవలు అందించాలి.

– టీకే రాణా, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్

పర్యాటకులకు భద్రత కల్పిస్తున్నాం



టూరిస్ట్ పోలీస్ ద్వారా పర్యాటకులకు పటిష్టమైన భద్రత కల్పించడంతో పాటు, సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. మంగినపల్లి బీచ్‌లో వర్చువల్ విధానంలో ప్రారంభించేందుకు వీలుగా ఏర్పాట్లను పర్యవేక్షించాం. త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా వీటిని ప్రారంభిస్తాం. ఈ అవుట్ పోస్టుల ద్వారా పర్యాటకులకు పోలీసులు తమ వంతు సహాయ సౌకర్యాలు అందించనున్నారు.

– జాషువా, ఎస్పీ, కృష్ణా జిల్లా

ఉత్కంఠగా షూటింగ్ బాల్ పోటీలు



రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ సాధించిన నెల్లూరు జిల్లా బాలుర జట్టు

హనుమాన్‌జంక్షన్ రూరల్:ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్–2023 పోటీలు ఆదివారం ఉత్కంఠభరితంగా సాగాయి. నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన 41వ రాష్ట్ర స్థాయి పోటీలకు వందలాది మంది క్రీడాకారులు తరలివచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 21 జిల్లాలకు చెందిన బాలుర జట్లు, 16 జిల్లాలకు చెందిన బాలికల జట్లు పోటీల్లో తలపడ్డాయి. ఆయా జిల్లా జట్ల మధ్య లీగ్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. అనంతరం క్వార్టర్స్, సెమీ ఫైనల్ పోటీల్లో బాలురు, బాలికల జట్లు విశేష ప్రతిభను కనబర్చి ఉత్కంఠకు తెరలేపాయి. నువ్వానేనా అన్నట్లు సాగిన ఫైనల్ మ్యాచ్‌లు ఏలూరు, గుంటూరు, విశాఖపట్నం, అనంతపురం, బాపట్ల, విజయనగరం జిల్లా జట్ల మధ్య రసవత్తరంగా జరిగాయి. ఆయా జట్ల క్రీడాకారులు ఒకరిని మించి మరొకరు అబ్బుర పరిచే ప్రతిభను చాటారు. నెల్లూరు జిల్లా జట్టు విజేతగా నిల్చి చాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. గుంటూరు, విజయనగరం జిల్లాల జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలు సొంతం చేసుకున్నాయి. బాలికల విభాగంలో శ్రీకాకుళం జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని దక్కించుకుంది. నెల్లూరు, అనకాపల్లి జిల్లాల జట్లు ఆ తర్వాతి స్థానాల్లో నిల్చాయి. పోటీల నిర్వహణకు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ వైస్ చైర్మన్ లంబు వెంకట శివన్నారాయణ అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. విజేతకు షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సంయుక్త కార్యదర్శి కూచిపూడి జోసఫ్ చేతుల మీదగా ట్రోఫీలను అందజేశారు. జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ నాగ వెంకట దుర్గా ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

రూపురేఖలు మార్చేస్తారు!

- వైద్య రంగంలో కీలకంగా మాక్సిల్లో ఫేషియల్ సర్జన్లు
- ఆరోగ్యశ్రీలోకి ఫేషియల్ సర్జరీలు
- కాస్మోటిక్, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు కేంద్రం అనుమతి
- రోడ్డు ప్రమాదాల్లో ముఖ ఎముకల ఫ్యాక్చర్లకు సర్జరీలు



మాక్సిల్లో ఫేషియల్ సర్జరీలు

లబ్బీపేట(విజయవాడతూర్పు):రోడ్డు ప్రమాదాల్లో ముఖ ఎముకలు విరిగినా, దవడ ఎముకలు చిట్లినా వాటికి ఫేషియల్ సర్జన్స్ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారు. పుట్టుకతో ముఖ ఎముకల్లో ఎత్తు పల్లాలు ఉన్నా ఆపరేషన్‌తో వారి రూపురేఖలు మార్చేస్తుంటారు. గ్రహణం మొర్రితో పుట్టిన చిన్నారులకు శస్త్ర చికిత్సతో సాధారణ స్థితికి తీసుకొస్తారు. ఎత్తు, వంకర ముక్కు ఉంటే కాస్మోటిక్ సర్జరీతో సరిచేస్తారు. వీరికి హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు సైతం అనుమతినిస్తూ ఇటీవల కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. వైద్య రంగంలో ప్రసుత్తం మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ కీలకంగా మారారు. ట్రామాకేర్ బృందంలోనూ సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. ఫిబ్రవరి 13 అంతర్జాతీయ ఫేషియల్ సర్జన్స్ డే సందర్భంగా వీరి సేవలపై కథనం...

ఆరోగ్యశ్రీలో ఫేషియల్ సర్జరీలు....

ఒకప్పుడు రోడ్డు ప్రమాదాల్లో ముఖ ఎముకలకు గాయాలైతే ఆరోగ్యశ్రీ వర్తించేది కాదు. ఈ విషయాన్ని మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ అసోసియేషన్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లింది. మాక్సిల్లో ఫేషియల్ సర్జరీలను సైతం ఆరోగ్యశ్రీలో చేరుస్తూ ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఎంతో మందికి ఊరట లభించింది. రోడ్డు ప్రమాదాల్లో ముఖ ఎముకలు, దవడ ఎముకలు గాయాలైన వారికి ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. నగరంలో ప్రతి నెలా 100 నుంచి 150 వరకూ ఫేషియల్ సర్జరీలు చేస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

ట్రామాకేర్ బృందంలో సభ్యులుగా...

ప్రమాదాల బారిన పడిన వారికి చికిత్సలు అందించే ట్రామా కేర్ వైద్యుల బృందంలో మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్‌ను సైతం సభ్యులుగా చేర్చారు. ఆర్థోపెడిక్, న్యూరోసర్జరీ, క్రిటికల్‌కేర్ నిపుణులతో పాటు, ఫేషియల్ సర్జన్స్ సభ్యులుగా ఉంటున్నారు. రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయమైన, ముఖ ఎముకల ఫ్యాక్చర్ అయినా న్యూరోసర్జన్‌తో పాటు, ఫేషియల్ సర్జన్స్ సేవలు అందిస్తున్నారు. దవడ ఎముక ఫ్యాక్చర్‌తో ఆహారం తినలేని స్థితిలో ఉన్న వారికి శస్త్ర చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకొస్తున్నారు. అంతేకాదు కరోనా సెకండ్‌వేవ్‌లో వచ్చిన బ్లాక్ ఫంగస్‌కు సైతం ఫేషియల్‌సర్జన్స్ శస్త్ర చికిత్సలు నిర్వహించారు.

కాస్మోటిక్ సర్జరీలు సైతం...

ప్రస్తుతం మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ కాస్మోటిక్, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు చేసేందుకు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ అనుమతి ఇచ్చింది. దీంతో పుట్టుకతో వచ్చే ముఖ ఎముకల్లో తేడాలను సరిచేస్తారు. అంద విహీనంగా ఉన్న ముఖ ఎముకలను బాపు గీసిన బొమ్మలా తీర్చిదిద్దుతున్నారు. అంతేకాదు ముఖాన్ని సైతం ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసే స్థాయికి ఫేషియల్ సర్జన్స్ ఎదిగారు. ప్రస్తుతం కాస్మోటిక్ సర్జన్స్‌లుగా పలువురు మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ రాణిస్తున్నారు.

విజయవంతంగా ఫేషియల్ సర్జరీలు



ప్రస్తుతం మాక్సిల్లో ఫేషియల్ సర్జరీలను ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో చేర్చింది. దీంతో ఎంతో మందికి ఊరట లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వం సైతం కాస్మోటిక్, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు అనుమతి ఇచ్చింది. పుట్టుకతో వచ్చే గ్రహణం మొర్రి శస్త్ర చికిత్సలతో పాటు, ఫేషియల్ సర్జరీలను కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ మెహబూబ్ షేక్, డీసీఐ సభ్యులు, మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు

వైద్య రంగంలో కీలకం



ప్రస్తుతం వైద్య రంగంలో మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ కీలకంగా మారారు. ఒకప్పుడు పళ్లు పీకే దంత వైద్యులుగా ఉన్న ఫేషియల్ సర్జన్స్ ఇప్పుడు ట్రామాకేర్ బృందంలో సభ్యులుగా చేరారు. అంతేకాదు కాస్మొటిక్, హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీలను సైతం విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం కూడా ఫేషియల్ సర్జన్స్‌ను గుర్తించి ఆరోగ్యశ్రీలో చేర్చింది. శాశ్వత దంతాలకు ఇంప్లాంట్ అమర్చడం, గ్రహణం మొర్రి సర్జరీలు, దవడ ఎముకలు విరిగితే సర్జరీలు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ ఎస్. కోటేశ్వరరావు, అధ్యక్షుడు, అసోసియేషన్ ఆఫ్ మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్, ఆంధ్రప్రదేశ్

జాతీయ సమైక్యతను చాటిన నృత్యాలు



కూచిపూడి నృత్యాలు ప్రదర్శిస్తున్న విశాఖపట్నం కళాకారులు

విజయవాడ కల్చరల్:వాగ్దేవీ కూచిపూడి నృత్యాలయ ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు జాతీయ సమైక్యతను చాటాయి. కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్రనాట్య, కథక్, కథకళి సంప్రదాయాల్లో జె.సురేష్, కె. వాసుదేవరావు, వెంకట్, కె.తులసీదాస్, గోపిక, వెన్నెల, పట్టెం మేఘన, అపర్ణ, గొల్లపల్లి లలిత, ధనలక్ష్మి తమ బృందాలతో వాగ్గేయకార కీర్తనలకు నృత్యాలు అభినయించారు. ప్రతిభ ఆధారంగా కళాకారులకు వెంకటేశ్వర, నటరాజ పురస్కారాలతో సత్కరించారు. కూచిపూడి నాట్యరంగంలో విశేషకృషి చేసిన ఉమ్మడి మహేష్‌బాబు, వేదాంతం పాండురంగ శర్మ, వేదాంతం పార్థసారథిని సత్కరించారు.

నాట్యం తపస్సులా భావించాలి...

సంప్రదాయ నృత్యాలను తపస్సులా భావించాలని నాట్యాచార్యుడు పార్థసారథి తెలిపారు. సంప్రదాయ కళలు మాత్రమే సాంస్కృతిక వైభవాన్ని చాటుతాయని పేర్కొన్నారు. కళాకారులు నటరాజ సేవలో తరించాలని ఆయన సూచించారు. ఏటా నృత్యోత్సవాలు నిర్వహిస్తున్న నిర్వాహకుల కృషిని అభినందించారు. కార్యక్రమంలో నాట్యాచార్యులు సప్పా శివకుమార్, మాగలూరి త్రినాథాచారి, పెదప్రోలు అజయ్ శ్రీనివాస చక్రవర్తి, శారదా కళా సమితి వ్యవస్థాపకుడు డి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి మహేష్‌బాబును సత్కరిస్తున్న శివకుమార్, పాండురంగ శర్మ, పార్థసారథి

పుస్తక పఠనంతో సామాజిక చైతన్యం

- మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు
- మల్లంపల్లి సోమశేఖర శర్మ వ్యాసాల సంకలనం ఆవిష్కరణ



మల్లంపల్లి సోమశేఖర్ శర్మ వ్యాసాల సంకలనం ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పుస్తక పఠనంతో సామాజిక చైతన్యం సాధ్యమవుతుందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తెలిపారు. పుస్తకాలు భాషా సంస్కృతులకు ప్రతిబింబాలని చెప్పారు. పుస్తక మహోత్సవంలో భాగంగా సుప్రసిద్ధ కవి ముదివర్తి కొండమాచార్యుల శత జయంతి సభ ఆదివారం రాత్రి గొల్లపూడి మారుతీరావు సాహితీవేదికపై నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు కొండమాచార్యులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లంపల్లి సోమశేఖరశర్మ వ్యాసాల సంకలనాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుమారు మూడు దశాబ్దాల పాటు అధ్యాపకుడిగా పని చేసిన కొండమాచార్యులు తదనంతర జీవితం సాహిత్య సేవలో గడిపారని తెలిపారు. ఆయన జీవితం, సాహిత్యం, ఆదర్శవంతంగా నిలిచాయని పేర్కొన్నారు. నిరాడంబరమైన జీవితాన్ని గడిపిన ఆయన, రచనల్లో సరళమైన, మధురమైన శైలిని అనుసరించారన్నారు. ఆంధ్రదేశ చరిత్రనే తన జీవితంగా మలచుకున్న ఘనత సోమశేఖరశర్మ సొంతమన్నారు. ఆర్థిక ప్రయోజనాన్ని ఆశించకుండా వివిధ విషయాలపై 30 వేల పేజీలను అందించారని ప్రశంసించారు. అక్షరానికి భారతీయ సంస్కృతి భగవంతుడితో సమానమైన ప్రాధాన్యతనిచ్చిందన్నారు. దేశాభివృద్ధి, విజ్ఞాన శాస్త్ర పురోగతి, యుద్ధం–శాంతి, దేశ పునర్నిర్మాణంలో పుస్తకాలే సమస్త మానవాళికి అండగా నిలిచాయని వెల్లడించారు. ఐఏఎస్ అధికారి బుడితి రాజశేఖర్, సాహితీవేత్త వాడ్రేవు చినవీరభద్రుడు, ఎమెస్కో సంపాదకులు డాక్టర్ డి.చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పబ్లిషర్ డి.విజయ కుమార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.



పుస్తకాలు తిలకిస్తున్న ప్రజలు

విద్యాశాఖ స్టాల్స్ సందర్శన...

రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను వెంకయ్యనాయుడు పరిశీలించారు. బోధనా పద్ధతుల్లో వినియోగించే వివిధ అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యాశాఖ విద్యార్థులకు అందిస్తున్న యూనిఫామ్, ఇతర వస్తువులు చూశారు. వాటి గురించి ఉపాధ్యాయులు వెంకయ్యనాయుడుకు వివరించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ సైన్స్ నమూనాలు గమనించారు. విద్యా శాఖ సంక్షేమ పథకాలు, నాడు–నేడు అభివృద్ధి పనుల ఫొటోలు తిలకించారు.

కవులకు సాహితీ పురస్కారాలు ప్రదానం

ప్రముఖ కవి అరుణ్‌సాగర్ స్మారకార్థం ఆయన స్నేహితులు, సాహితీ మిత్రులు ఆధ్వర్యంలో అరుణ్‌సాగర్ సాహితీ గుభాళింపు పేరుతో కవులకు సాహితీ పురస్కారాలు ప్రదానం చేశారు. గొల్లపూడి మారుతీరావు సాహితీవేదికపై ఈ కార్యక్రమం నిర్వహించారు. రచయిత్రి ఝాన్సీకి సాహితీ మిత్ర, న్యాయవాది సాయికి స్నేహమిత్ర, జర్నలిస్టు తులసీచంద్‌కు యువజర్నలిస్టు పురస్కారాలు అందించారు. చినుకు పత్రిక సంపాదకులు రాజగోపాల్ అరుణ్‌సాగర్ సాహితీ సేవలను కొనియాడారు. కవి అనీల్‌డాని, న్యాయవాది సంపర శ్రీనివాసరావు, కథకుడు కూనపరాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు. 'రష్యన్ – తెలుగు అనువాద సాహిత్యం' చెకోవ్ కరచుజోన్ పుస్తకాల పరిచయ కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించారు.

క్లుప్తంగా

త్రిపుర అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరపాలి

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బేబి, రాఘవులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): త్రిపురలో ఈ నెల 16న అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు దేశంలోని ప్రజాస్వామిక శక్తులు కృషి చేయాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబి, బి.వి.రాఘవులు అన్నారు. విజయవాడ గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో త్రిపుర సంఘీభావ సభ ఆదివారం జరిగింది. ముఖ్య అతిథులు బేబి, రాఘవులు మాట్లాడుతూ బీజేపీ తన అధికారాన్ని వినియోగించి ఎన్నికల్లో గెలిచేందుకు అనేక అప్రజాస్వామిక ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌గా కృష్ణాజట్టు

కడప ఎడ్యుకేషన్: కడప డీఎస్‌ఏ మైదానంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలు ఆదివారం ముగిశాయి. కార్యక్రమానికి జిల్లా డీఎస్‌ఏ చీఫ్ కోచ్ అమృతరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో కృష్ణాజట్టు చాంపియన్‌గా నిలిచింది. టీం ఈవెంట్ మహిళల విభాగంలో కృష్ణాజట్టు ప్రథమ, గుంటూరు జట్టు ద్వితీయ, కడప జట్టు తృతీయ స్థానాలు సాధించాయి. పురుషుల టీం ఈవెంట్ విభాగంలో కృష్ణా, అనంతపురం, కడప జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. మహిళల సింగిల్స్ విభాగంలో కృష్ణాజిల్లాకు చెందిన లావణ్య ప్రథమ, అనంతపురం జిల్లాకు చెందిన యశస్వి ద్వితీయ, కృష్ణాజిల్లాకు చెందిన అనూష తృతీయ స్థానాలు సాధించారు. పురుషుల సింగిల్స్ విభాగంలో వహీద్, సూర్య ఆకాష్ ప్రణయ్ రాణించారు.

ఉత్సాహంగా 10కే రన్ పోటీలు

గుడివాడటౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో పర్వతనేని జగన్మోహనరావు మెమోరియల్ 10కే రన్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుంచి నెహ్రూచౌక్, ఏలూరు రోడ్, ఇంజినీరింగ్ కళాశాల, టెలిఫోన్ నగర్, జనార్ధనపురం సమీపం వరకు వెళ్లి తిరిగి స్టేడియంకు చేరుకోవడంతో 10 కిలోమీటర్ల పరుగు పూర్తయినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ పోటీలు మూడు విభాగాలుగా నిర్వహించారు. పురుషులకు 10 కిలోమీటర్లు, మహిళలకు 6 కిలోమీటర్లు, బాలబాలికలకు 4 కిలోమీటర్ల విభాగాలలో పోటీలు జరిగాయి. మొత్తం 700 మంది పైబడి పాల్గొన్న ఈ పోటీలను స్టేడియం పాలకవర్గ సభ్యులు ప్రారంభించారు. 10 కిలోమీటర్ల పరుగులో బి.పవన్ (రూ.6,120), వై.ఢిల్లీనాయుడు(రూ 4,120), ఎన్ వెంకట కృష్ణనాయక్(రూ.3,120), 6 కిలోమీటర్లు విభాగంలో బి.నాగసుశీల(రూ. 4,120), కె.కుమారి(రూ 3,120), డీవీఎస్‌డీ భవాని(రూ.2,120), నాలుగు కిలోమీటర్లు విభాగంలో అండర్–12 బాలురు జి.దివ్య భాస్కర్(రూ.3,120), ఆర్.జగదీష్ (రూ2,120), జి.వరుణ్(రూ1,120), బాలికల విభాగంలో టి.వెన్నెల (రూ.3,120), వి.దేదీప్య(రూ.2,120), జి.సిరి(రూ.1,120), అండర్–15 బాలుర విభాగంలో కె.వెంకటేష్(రూ.4,120), వి.కరుణ్‌సాయి (రూ.3,120), ఎస్‌కే ఫరీద్(రూ.2,120), అండర్–15 బాలికల విభాగంలో ఎ.దేవి (రూ.4,120), జి.అనిత(రూ3,120), డి.చరితశ్రీ(రూ.2,120) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం ఉపాధ్యక్షుడు పాలేటి శివ సుబ్రహ్మణ్యేశ్వరరావు(చంటి), సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, వన్‌టౌన్ సీఐ కె.గోవిందరాజులు, స్టేడియం కమిటీ సభ్యులు బొగ్గరపు తిరుపతయ్య, నెరుసు శేషగిరిరావు, పిన్నమనేని వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.దుర్గాప్రసాదు, స్టేడియం కోచ్‌లు పాల్గొన్నారు.



10కే రన్ విజేతలతో స్టేడియం కమిటీ సభ్యులు

కళామతల్లి ముద్దుబిడ్డ కె.విశ్వనాథ్



విశ్వనాథ్ సంస్మరణ సభలో మాట్లాడుతున్న కృష్ణాజీ, వేదికపై మండలి బుద్ధప్రసాద్, ఎంసీ దాస్ తదితరులు

విజయవాడ కల్చరల్: కళామతల్లి ముద్దు బిడ్డ దర్శకుడు కాశీనాథుని విశ్వనాథ్ అని అభిరుచి సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు పులిపాక కృష్ణాజీ అన్నారు. అభిరుచి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ గాంధీనగర్‌లోని ఒక హోటల్‌లో ఆదివారం సినీ దర్శకుడు, నటుడు విశ్వనాథ్ సంస్మరణ సభ నిర్వహించారు. సభలో కృష్ణాజీ మాట్లాడుతూ దర్శకుడు విశ్వనాథ్ తన అద్భుతమైన ప్రతిభ ద్వారా ఆణిముత్యాల్లాంటి సినిమాలను అందించారన్నారు. ఆయన చిత్రాలు సామాజిక చైతన్యానికి ప్రతీకలని, సప్తపది, కాలం మారింది, శంకరాభరణం, శుభసంకల్పం లాంటి చిత్రాల ద్వారా ఆ విషయం రుజువు చేశారన్నారు. అభిరుచి సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎంసీ దాస్ విశ్వనాథ్‌కు నగరంతో విడదీయలేని అనుబంధం ఉందన్నారు. సమావేశంలో మాజీ డెప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, అభిరుచి కార్యదర్శి పిళ్లా మోహన్‌రావు, మాజీ మేయర్ జంధ్యాల శంకర్ తదితరులు విశ్వనాథ్ సినీ రంగ సేవలను కొనియాడారు. తొలుత అతిథులు విశ్వనాథ్ చిత్రపటానికి నివాళి అందించారు.

తెలుగు కళావాహిని ఆధ్వర్యంలో...

తెలుగు కళావాహిని, కళాభారతి, జీఆర్‌కే పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికమీద శనివారం సినీ దర్శకుడు, నటుడు కె.విశ్వనాథ్‌కు స్వరాంజలి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ కళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ దర్శకుడు విశ్వనాథ్ సినీ రంగ సేవలను వివరించారు. వివిధ కళాసంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, గోళ్ల నారాయణరావు ప్రసంగించారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు దుర్గానాగమణి. రాజేంద్ర ప్రసాద్, పద్మశ్రీ, ఝాన్సీ విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రాలలోని పాటలను ఆలపించారు.

హరహర శంభో..శంకర

- శివరాత్రికి ముస్తాబైన శివగిరి
- 17 నుంచి 21 వ తేదీ వరకు శివరాత్రి బ్రహ్మోత్సవాలు
- హిమాలయాల్లోని హిందూ సాధువు సంప్రదాయాల ప్రకారం పూజలు



శివగిరిపై ఉన్న 36 అడుగుల మహా శివలింగం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక మొగల్రాజపురంలోని శ్రీవాగ్దేవి జ్యోతిర్లింగ క్షేత్రం (శివగిరి) మహాశివరాత్రికి ముస్తాబయింది. ఇక్కడ 36 అడుగుల ఎత్తు ఉన్న పంచముఖ మహాశివలింగం, నంది ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. 40 అడుగుల ఎత్తు ఉన్న ఓంకార స్థూపం నగరం మొత్తం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. శివగిరి కొండపై శివపార్వతులు, కుమారస్వామి, విఘ్నేశ్వరుడు, వీరభద్రుడు, అయ్యప్ప, నంది, శృంగి, భృంగి, అర్ధనారీశ్వరుడు, నందీశ్వరుడు, దత్తాత్రేయుడు, హరిహరుడు, కనకదుర్గ, గజలక్ష్మి, సరస్వతి అమ్మవార్ల విగ్రహాలున్నాయి. గోశాలతో పాటుగా హోమగుండం కూడా ఉన్నాయి. 108 తాబేళ్లకు ఆవాసం కల్పిస్తూ ప్రత్యేక కొలను, రాహుకేతువులు, శనైశ్వర మందిరం ప్రత్యేక మందిరం ఉన్నాయి. అష్టాదశ శక్తిపీఠాలను కూడా ప్రతిష్ఠించారు. ఏడు అడుగుల నాగ పడగ, నాగ దేవత విగ్రహాలు భక్తులతో పూజలందుకుంటున్నాయి.



శివగిరి కొండపై ఉన్న శివపరివారం విగ్రహాలు


శివరాత్రి రోజున చితాభస్మంతో పూజలు

మహా శివరాత్రి రోజైన 18 వ తేదీ శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు పూజలను నిర్వహించనున్నారు. ఉదయం 4 గంటలకు గణపతి పూజ, 5 గంటలకు స్వర్ణ కపిల గోపూజ, 6 గంటలకు ద్వాదశ జ్యోతిర్లింగాలకు అభిషేకాలు, 9 గంటలకు రుద్ర హోమం, 11 గంటల నుంచి అన్నదానం, సాయంత్రం 5 గంటల నుంచి అర్ధరాత్రి వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, 6 గంటలకు ప్రదోష పూజ, 6.30 గంటలకు (సూర్యాస్తమయం తర్వాత) హిమాలయ నాగ సాధువులతో చితాభస్మాభిషేకం, 7 గంటలకు శివకల్యాణం నిర్వహిస్తామని శివగిరి వ్యవస్థాపకుడు మల్లికార్జున శర్మ తెలిపారు. 19 వ తేదీన మొగల్రాజపురం పరిసర ప్రాంతాల్లో శివగిరి ఉత్సవ మూర్తుల ఊరేగింపు జరుగుతుందన్నారు. శివరాత్రి సందర్భంగా 17వ తేదీ గిరిప్రదక్షిణ కూడా నిర్వహించనున్నామని చెప్పారు. భక్తులు ఎవరైనా ఈ శివగిరిపై సొంత ఖర్చుతో శివలింగాన్ని ప్రతిష్ఠించుకోవచ్చునని తెలిపారు. శివగిరిపై జరిగే పూజలను ఫేస్‌బుక్, యూట్యూబ్‌ల్లో ప్రత్యక్ష ప్రసారం చేస్తామని తెలియజేశారు.

ఎలా వెళ్లాలంటే...

సున్నపుబట్టీల సెంటర్‌లోని ఆంధ్రా మోటారు మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) హాలు ఎదురుగా రోడ్డులో నుంచి శివగిరి పైకి మెట్ల మార్గం ఉంది. స్థానిక ఏడో డివిజన్‌లోని బందుల దొడ్డి సెంటర్ నుంచి సీఎస్‌ఐ స్కూల్ సమీపంలో నుంచి కూడా శివగిరికి వెళ్లవచ్చు. బోయపాటి మాధవరావు రోడ్డులో నుంచి కావేరి అపార్ట్‌మెంట్స్ ఎదురుగా ఉన్న రోడ్డులో నుంచి మెట్ల మార్గం ఉంది. శివగిరి కొండపైనే పూజలకు అవసరమైన పూజాద్రవ్యాలతో పాటుగా తాగునీటి సౌకర్యం కూడా కల్పించారు.

శివరాత్రి రోజున నవ గ్రహాల ప్రతిష్ఠ



శివరాత్రి రోజున శివగిరిపై నవ గ్రహాల నూతన విగ్రహాలను ప్రతిష్ఠ చేస్తున్నాం. ఈ పూజలకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి బందారు శ్యామ్‌సుందర్, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి దంపతులు హాజరై పూజలు చేస్తారు. శివరాత్రి సందర్భంగా 17 వతేదీ శుక్రవారం సాయంత్రం 4 గంటలకు భక్తులతో గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నాం. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలి. పూజలకు సంబంధించిన సమాచారం కోసం 98481 14960 నంబర్‌లో సంప్రదించవచ్చు.

–మల్లికార్జునశర్మ(శివగిరి, వ్యవస్థాపకుడు)

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



మహా మండపం మెట్ల మార్గంలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గామల్లేశ్వర స్వామి వార్లను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. మాఘ మాసం శుభముహూర్తాన ఒక్కటైన నవ వధూ వరులు పెళ్లి బట్టలపై అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. భక్తులు కుటుంబ సమేతంగా చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరో వైపున అమ్మవారికి నిర్వహించిన పలు ఆర్జిత సేవలలో ఉభయదాతలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, చక్రనవార్చన, శాంతి కల్యాణం, ఛండీహోమం, పంచహారతుల సేవలకు భక్తులు, ఉభయదాతలు హాజరయ్యారు. ఈవో భ్రమరాంబ, చైర్మన్‌కర్నాటి రాంబాబు క్యూలైన్లను పర్యవేక్షించారు. లక్ష్మీ గణపతి ప్రాంగణంలో భక్తులు ఎండలోనే వేచి ఉండాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. చలువ పందిళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చైర్మన్ సూచించారు. తాత్కాలికంగా షామియానాను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబుతో పాటు పాలక మండలి సభ్యులు ఆదివారం మహా మండపం మెట్ల మార్గం ద్వారా ఆలయానికి చేరుకున్నారు. కొండపైకి చేరుకునే తరుణంలో భక్తులతో పాలక మండలి సభ్యులు మాట్లాడారు. మెట్ల మార్గంలో తాగునీటి సదుపాయం కల్పించాలని, క్యూలైన్లను పరిశుభ్రంగా ఉంచాలని శానిటేషన్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. క్యూలైన్లను పరిశీలించిన వారిలో పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, బచ్చు మాధవి, చింతా సింహాచలం, చింక శ్రీనివాస్, డీఈఈ సత్యనారాయణ, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి విచ్చేసిన భక్తులు

దైవగ్రంథాల విద్య, పఠనం అవసరం

ఏపీ మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్

ఆటోనగర్(విజయవాడతూర్పు): భావి భారత సమాజ నిర్మాణానికి నైతిక విలువలతో కూడిన దైవ గ్రంథాల విద్య, పఠనం, ఆచరణ, ప్రచారం అవసరం ఎంతైనా ఉందని ఏపీ మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ అహ్మద్‌ఖాన్ అన్నారు. జవహర్ ఆటోనగర్‌లోని ఏటీఏ హాలులో ఆదివారం 8వ రాష్ట్రస్థాయి దివ్య ఖుర్‌ఆన్ కంఠస్థ ప్రతిభా ఫైనల్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ దుర్మార్గాలు, చెడు అలవాట్లు అరాచకాలు, నేరాలు చిన్నపిల్లల్లోనూ పెరిగిపోతున్న ఈ తరుణంలో నైతిక విలువలతో కూడిన దైవ గ్రంథాల విద్య అవసరమన్నారు. తల్లిదండ్రులు, పెద్దల పట్ల గౌరవం, నీతి నిజాయితీలు పెరగడానికి ఖురాన్ గ్రంథం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పిల్లల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఖురానిక్ స్టడీస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్య ఖురాన్ కంఠస్థ పోటీలు వారి జీవితాల్లో వెలుగులు నింపుతాయన్నారు. జమాతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు రఫీక్ అహ్మద్ మాట్లాడుతూ దివ్యఖురాన్ మానవాళికి మార్గదర్శకమని అన్నారు. 3 నుంచి 5 సంవత్సరాలు, 6 నుంచి 8, 9 నుంచి 12 సంవత్సరాల బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరిచారన్నారు. ప్రతి గ్రూపులోని మొదటి విజేతకు రూ.20 వేలు నగదు ఇచ్చారు. రెండవ విజేతకు రూ.15 వేలు, మూడవ విజేతకు రూ.10 వేలతో పాటు ప్రతి ఒక్కరికీ మెమొంటో, స్కూలు బ్యాగ్, స్టీల్‌వాటర్ బాటిల్‌లను అందజేశారు. విజేతలకు ఏపీ మైనారిటీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో యూఎఫ్‌క్యూస్ చైర్మన్ మహమ్మద్ దావూద్ ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏపీ మైనారిటీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్

రోడ్డుప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



మృతి చెందిన లాలుగుప్తా(ఫైల్)



మృతి చెందిన సునీత (ఫైల్)

విస్సన్నపేట: చిన్నకారు ఊక లారీ ఢీకొన్న ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని కొండపర్వ శివారు వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగింది. విస్సన్నపేటకు చెందిన కొత్తా లాలుగుప్తా (52), సంకా సునీత (48), ఆమె భర్త సంకా రాంబాబు కారులో తెనాలిలో బంధువుల ఇంటిలో శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా కొండపర్వ గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న ఊక లారీని ఢీకొంది. కారు నడుపుతున్న లాలుగుప్తా, వెనుక సీటులో కూర్చున్న సునీతకు తీవ్రగాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. సునీత భర్త సంకా రాంబాబుకు తుంటి ఎముక విరిగి పరిస్థితి విషమంగా ఉండటంతో 108 సిబ్బంది క్షతగాత్రుడిని విజయవాడ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని సీఐ రుద్రమరాజు భీమరాజు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. లాలుగుప్తా ప్రైవేటు ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతూ గ్రామంలో అందరికీ సుపరిచితుడు. ఆయన మృతి వార్త విని కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, యూనియన్ సభ్యుల్లో తీవ్ర విషాదం నెలకొంది. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. సంకా సునీతకు భర్త, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఈడుపుగల్లులో వీధికుక్కల స్వైరవిహారం

- 50 పందెం పుంజులు మృత్యువాత
- రూ 3.50 లక్షలు నష్టం

కంకిపాడు: ఈడుపుగల్లులో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. శనివారం అర్ధరాత్రి గ్రామంలోని కోళ్లఫారంలోకి కుక్కలు చొరబడి దాడి చేయటంతో 50 పందెం కోడి పుంజులు మృత్యువాత పడ్డాయి. వివరాల్లోకి వెళితే...గ్రామానికి చెందిన గుంటి సురేష్‌కుమార్ గ్రామంలోని నాటుకోళ్ల ఫారమ్‌ను ఐదేళ్లుగా అద్దెకు తీసుకుని కోళ్ల పెంపకం చేస్తున్నారు. వివిధ జాతులకు చెందిన కోడి పుంజులను పెంచుతున్నారు. శనివారం అర్ధరాత్రి సమయంలో గ్రామంలో యథేచ్ఛగా తిరుగుతున్న వీధికుక్కలు కోళ్ల ఫారమ్‌లోకి చొరబడి సుమారు రూ.3.50 లక్షల విలువైన 50 కోడి పుంజులపై దాడి చేయటంతో అవి మృత్యువాత పడ్డాయి. స్థానికులు అక్కడికి వచ్చే సరికి కుక్కలు బెదిరి పారిపోయాయి.



కుక్కల దాడిలో మృత్యువాత పడిన కోడిపుంజులను చూపుతున్న స్థానికులు



మచిలీపట్నం భాస్కరపురం వద్ద...



మచిలీపట్నం నోబుల్ కళాశాల రోడ్డులో...

మచిలీపట్నాన్ని కప్పేసిన మంచుదుప్పటి

మచిలీపట్నం నగరాన్ని ఆదివారం మంచు దుప్పటి కప్పేసింది. ఈ ఏడాది చలికాలంలో ఏనాడూ కురవని విధంగా తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు కూడా పొగమంచు దట్టంగా కురిసింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

– మచిలీపట్నంటౌన్

క్లుప్తంగా

కూచిపూడి నృత్యంలో శ్రుతి సమన్వి ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వం కల్చరల్, డిఫెన్స్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వందేభారతం నృత్య ఉత్సవ్-2023లో నగరానికి చెందిన కె.శ్రుతి సమన్వి సత్తా చాటింది. శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో ఏడాది చదువుతున్న శ్రుతి జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో కూచిపూడి నృత్యం విభాగంలో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొని మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ, ఇతర అధ్యాపకులు శ్రుతి సమన్వికి అభినందనలు తెలిపారు.

నేడు 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని ఆయా డివిజన్లలో నెలకొన్న వివిధ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో స్థానికులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు, అర్జీలు స్వీకరించేందుకు సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌రూంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే స్పందన జరుగుతుందని పేర్కొన్నారు. నగరవాసులు తమ సమస్యలను అధికారుల దష్టికితీసుకొచ్చి పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు చిట్టినగర్‌లోని సర్కిల్-1, సత్యనారాయణపురంలోని సర్కిల్-2, పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలో కూడా తమ సమస్యలను ఆయా ప్రాంతవాసులు జోనల్ కమిషనర్ల దష్టికి తీసుకెళ్లవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

తోపుడు బండి అందజేత

గుణదల (విజయవాడ తూర్పు): పేదలకు ఉపాధి అవకాశాల కల్పించే దిశగా దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ముందుకు సాగుతోందని నాల్గవ డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గల్లా సదాశివరావు పేర్కొన్నారు. శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పేద మహిళకు జీవనోపాధి నిమిత్తం తోపుడు బండి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తూర్పు నియోజకవర్గం పరిధిలో అనేక సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. అనేక మంది పేదలకు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 4వ డివిజన్‌కు చెందిన నాగలక్ష్మి అనే మహిళకు తోపుడు బండి అందజేశారు. కాలనీ పెద్దలు మన్మోహన్ సింగ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): రామలింగేశ్వరనగర్ సమీపంలోని స్క్రూబ్రిడ్జి విద్యుత్ సెక్షన్, కృష్ణలంక ఉపకేంద్రం, 11కేవీ గీతానగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. తారకరామానగర్, భూపేష్‌గుప్తానగర్, రాణీగారి తోట, బాలాజీనగర్, గీతానగర్‌కట్టతో పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు పేర్కొన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

గుణదల (విజయవాడ తూర్పు): కుటుంబ తగాదాల నేపథ్యంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు గుణదల సెంటర్‌కు చెందిన కృష్ణ అనే వ్యక్తి ప్రైవేటు ఉద్యోగి. కొన్నేళ్ల క్రితం ఓ యువతితో వివాహమైంది. కొంత కాలంగా భార్యాభర్తలిద్దరి మధ్య వివాదాలు తలెత్తాయి. ఇటీవల విడాకులు తీసుకుని ఎవరికి వారు విడిగా ఉంటున్నారు. శనివారం సాయంత్రం ఇంట్లో కుటుంబ సభ్యులతో గడిపిన కృష్ణ రాత్రి తన గదికి వెళ్లాడు. ఆదివారం ఉదయం కృష్ణ గది తలుపులు తెరవలేదు. దీంతో తండ్రి పలు మార్లు తట్టి చూశాడు. ఎంతకీ తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన తండ్రి కిటికీ లోంచి చూస్తే ఫ్యానుకు ఉరివేసుకుని వేళాడుతున్న కృష్ణ కనిపించాడు. దీంతో తండ్రి మాచవరం పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పంచనామా నిమత్తం మార్చురీకి తరలించారు.

హిందీ పరీక్షలకు 156 మంది హాజరు

తిరువూరు: దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో తిరువూరు సర్వోదయ స్కూలులో ఆదివారం నిర్వహించిన హిందీ పరీక్షలకు 156 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర, ప్రవేశిక పరీక్షలు నిర్వహించినట్లు పరీక్షా కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్ రమణమూర్తి తెలిపారు. పరీక్షలను హిందీ ప్రచారక్ రేపాక రఘునందన్ పర్యవేక్షించారు.

● పుస్తక మహోత్సవం









విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పుస్తక మహోత్సవంలో భాగంగా సుప్రసిద్ధ కవి ముదివర్తి కొండమాచార్యుల శత జయంతి సభ ఆదివారం రాత్రి గొల్లపూడి మారుతీరావు సాహితీవేదికపై జరిగింది. సభకు ముఖ్యఅతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు హాజరై కొండమాచార్యులకు నివాళులర్పించారు. అనంతరం పుస్తక ప్రదర్శనను తిలకించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చి పుస్తకాలను ఆసక్తిగా పరిశీలించారు. చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఆకట్టుకున్న చిత్రకళా ప్రదర్శన



చిత్రకళా ప్రదర్శనను తిలకిస్తున్న సందర్శకులు



చిత్రకారులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): చిత్రకారులను ప్రోత్సహించేలా పోటీలు నిర్వహించి బహుమతులందించడం అభినందనీయమని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(హైదరాబాద్) రిజిస్ట్రార్, ప్రొఫెసర్ కొడాలి సుందర్‌కుమార్ అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో క్రియేటివ్ హార్ట్స్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం మాస్టర్ స్ట్రోక్- పేరిట చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన 45 మంది చిత్రకారులు ప్రదర్శించిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుందర్‌కుమార్ ప్రదర్శనను ప్రారంభించి తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణాల్లోనే కాకుండా పల్లెల్లో చిత్రకళ అభివృద్ధికి క్రియేటివ్ ఆర్ట్స్ సంస్థ చేస్తున్న కృషిని కొనియాడారు. సీనియర్ చిత్రకారుడు డి.శివప్రసాద్ మాట్లాడుతూ చిత్రకళ అనేది ప్రతి మనిషిలో ఉన్న అంతర్గత, మానసిక పరిస్థితిని ప్రతిబింబించే గొప్ప సాధనమన్నారు. ఇది మనిషికి ఎంతో ఆనందాన్ని, ఆలోచనలను కలిగిస్తాయన్నారు. చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేసి చిత్రకారులను ప్రోత్సహిస్తున్న నిర్వాహకుడు అంజి ఆకొండిని అభినందించారు. ఏపీ దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కె.శైలజ భరత్ మాట్లాడుతూ చిత్రకళ దేవుడిచ్చిన వరమన్నారు. చిత్రకళా ప్రదర్శన కోసం అమలాపురంలో గ్యాలరీ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలపారు. క్రియేటివ్ హార్ట్స్ వ్యవస్థాపకుడు అంజి ఆకొండి మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా ఎంతోమంది చిన్నారులకు, చిత్రకారులకు వివిధ చిత్రకళ పోటీలు, ప్రదర్శనలు ఏర్పాటు చేస్తూ చిత్రకళ అభివృద్ధికి, చిత్రకారుల గుర్తింపు కోసం కృషి చేస్తున్నానని తెలిపారు. తెలుగు అండ్ సంస్కృతం అకాడమీ మెంబర్ డాక్టర్ కె.రామకృష్ణ, 64 కళలు ఎడిటర్ వై.కళాసాగర్ మాట్లాడారు.

పుస్తక పఠనంతో ఉజ్వల భవిష్యత్

గ్రంథాలయాధికారి రమాదేవి



వియ్ లవ్ రీడింగ్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పుస్తక పఠనంతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని గ్రంథాలయాధికారి కె.రమాదేవి అన్నారు. ప్రతిఒక్కరూ పుస్తక పఠనం అలవరచుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు తమ తరగతి పుస్తకాలతో పాటు నీతి కథలు, మహనీయుల ఆత్మకథల పుస్తకాలు చదవాలని సూచించారు. ఆదివారం బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో వియ్ లవ్ రీడింగ్ కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని పుస్తకాలు చదివారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారానే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావిగా ఎదిగారన్నారు. భారత రాజ్యాంగ రచనకు పుస్తక పఠనం ఎంతగానో దోహదపడిందన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వియ్ లవ్ రీడింగ్ కార్యక్రమానికి తల్లిదండ్రులు తమ పిల్లలు హాజరయ్యేలా చూడాలన్నారు. వారి వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది డి.రమేష్, జి.ఝాన్సీ, సునీత, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పలుచని కాటన్ దుస్తులు ధరించాలి



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చంద్రబొట్ల ఆదిత్య

మధురానగర్(విజయవాడసెంట్రల్): వేసవిలో పలుచని కాటన్ వస్త్రాలు ధరించాలని ఎండలో తిరగకూడదని తరచూ ద్రవ పదార్థాలు తీసుకోవాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ చంద్రబొట్ల ఆదిత్య సూచించారు. స్థానిక దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్లో ఆదివారం వయోవృద్ధచారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు వచ్చిన తరువాత చికిత్స తీసుకునేదానికన్నా రాకుండా చూసుకోవడం మంచిదన్నారు. ట్రస్ట్ చైర్మన్, వైస్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, తేజ్‌రాజ్ సోలంకి మాట్లాడుతూ తాము వృద్ధులకు ఆయుర్వేదం, హోమియో, అల్లోపతి వైద్యనిపుణలతో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నామన్నారు. అలాగే ఇక్కడ వైద్యపరీక్షలు చేయించుకున్న వృద్ధులకు కార్పొరేటర్ శర్వాణీమూర్తి సహకారంతో ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. హోమియో వైద్యనిపుణులు డాక్టర్ రామబ్రహ్మం హోమియో వైద్యసేవలు గురించి వివరించారు. అనంతరం ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టీలు తట్టి అర్జునరావు నీలు సతీష్, కె.మధుసూదనరావు, ఎస్ఎన్ వరప్రసాద్, లక్ష్మీనరసింహరావు పాల్గొన్నారు.

శాంతి, భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ లక్ష్మీనారాయణ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజల శాంతి, భద్రతలకు ఎటువంటి విఘాతం కలిగించినా సహించేది లేదని, అటువంటి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సింగ్‌నగర్ సీఐ ఎస్‌వీవీఎస్ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. ఆ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. చెడు వ్యసనాలు, స్నేహాలతో జీవితాలు పాడైపోతాయన్నారు. ఇప్పటికైనా సత్ప్రవర్తన కలిగి సమాజానికి, కుటుంబానికి ఉపయోగపడేలా జీవించాలని సూచించారు. పాత నేరస్తులపై పోలీసుల నిఘా నిరంతరం ఉంటుందన్నారు. ప్రధానంగా గంజాయి వంటి మత్తు పదార్థాలకు మళ్లీ అలవాటుపడినట్లు తెలిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రవర్తన మార్చుకుని జీవించే వారిపై షీట్లు ఎత్తివేసి, వారికి పోలీసు శాఖ నుంచి కూడా ప్రోత్సాహం అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ తప్పులను సరిదిద్దుకొని మంచిగా జీవించాలని సూచించారు. ఎస్సైలు సౌజన్య, శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రేపు క్యాన్సర్‌పై అవగాహన

గణపవరం(మైలవరం): మైలవరం మండలం గణపవరం గ్రామంలో ఈ నెల 14న క్యాన్సర్‌పై అవగాహన సదస్సు జరుగుతుందని గ్రామ సర్పంచ్ తమ్మ సీతారావమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గణపవరంలో జరిగే వైద్య శిబిరం డాక్టర్ ఆర్.నరేష్, డాక్టర్ ప్రియాంక పర్యవేక్షణలో జరుగుతుంది. కేన్సర్ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పిస్తారు. దీర్ఘకాలిక వ్యాధుల గురించి రక్త పరీక్షలు, ఆరోగ్యశ్రీపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయి.

కుమారుడు కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌కని వెళ్లిన కుమారుడు రెండు రోజులుగా ఇంటికి రాలేదని, కనిపించడంలేదని తండ్రి నున్న రూరల్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు నున్న పవర్ గ్రిడ్‌లో గెద్దం కనకదుర్గ వరప్రసాద్ జూనియర్ ఇంజినీరుగా పనిచేస్తున్నారు. ఈయన పెద్ద కుమారుడు గెద్దం ప్రదీప్‌కుమార్ ట్రిపుల్-ఈ చదివి మొగల్‌రాజ్ పురంలో ఫిల్మ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్‌లో సినిమా ఆటోగ్రఫీ కోర్సు చేస్తున్నాడు. ఈ నెల 10వ తేదీన ఉదయం ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌కని వెళ్లిన ప్రదీప్‌కుమార్ తిరిగి రాలేదు. దీంతో 11వ తేదీ రాత్రి కనకదుర్గ ప్రసాద్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): షాపులో పనికి వెడుతున్నానని చెప్పి వెళ్లిన కుమార్తె షాపునకు వెళ్లలేదని తెలుసుకున్న తల్లి, కుమార్తె కనిపించడంలేదని ఆదివారం నున్న పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు శాంతినగర్‌కు చెందిన షేక్ రహమాన్‌బీ కుమార్తె నాగుర్‌బీ (19)కు సంవత్సరం క్రితం జూనపూడి కోటేశ్వరావు అనే అతడితో వివాహమైంది. నెల రోజుల క్రితం ఫిర్యాది అల్లుడు భార్యను పుట్టింటి వద్ద వదిలి వెళ్లాడు. అప్పటి నుంచి నాగుర్‌బీ పేపర్లప్లేట్లు తయారు చేసే షాపులో పనికి వెళుతుంది. 12వ తేదీ ఉదయం కూడా షాపులో పనికి వెడుతున్నానని ఇంటివద్ద చెప్పి వెళ్లిన నాగుర్‌బీ షాపునకు రాలేదని షాపు నుంచి రహమాన్‌బీకి ఫోనులో చెప్పారు. దీంతో ఆమె తెలిసిన బంధువుల ఇళ్ల వద్ద విచారించగా రాలేదని తేలింది. దీంతో కుమార్తె కనిపించడంలేదని పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

చార్లెస్ డార్విన్ ఆవిష్కరణలు అద్భుతం

జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్



తిరువూరు: జీవపరిణామక్రమ సిద్ధాంతాన్ని విపులీకరించిన చార్లెస్ డార్విన్ ప్రపంచ గతినే మార్చివేశారని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్ అన్నారు. ఆదివారం డార్విన్ జయంతిని సందర్భంగా తిరువూరు సిద్ధార్థ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. జీవుల ఆవిర్భావంపై ఉన్న మూఢ నమ్మకాలు, విశ్వాసాలను పటాపంచలు చేస్తూ డార్విన్ ప్రతిపాదించిన సిద్ధాంతం ప్రపంచవ్యాప్తంగా విశేషంగా ఆదరణ పొందిందని ఆయన పేర్కొన్నారు. డార్విన్ జీవిత విశేషాలను, ఆయన ఆవిష్కరణలను ఉపాధ్యాయులు రాంప్రదీప్, సుదర్శన్, చక్రపాణి వివరించారు. పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ మహిళా విభాగం అధ్యక్షురాలు ధనలక్ష్మి

కృష్ణలంక(విజయవాడతూర్పు): మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధన కోసం ఉద్యమాలు, పోరాటాలు చేసేందుకు సిద్ధం కావాలని సీఐటీయూ మహిళా విభాగం అధ్యక్షురాలు ధనలక్ష్మి పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ సర్కిల్ కార్యదర్శి ఎస్.కృష్ణబాలాజీ, జిల్లా కార్యదర్శి వి.రవికుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి కె.రమాదేవి అధ్యక్షతన ఆదివారం యూనియన్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ వర్కింగ్ ఉమెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ధనలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు పనిప్రదేశాల్లో ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్‌లో మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు.

మన ఇంటి నుంచే భద్రతా చర్యలు ప్రారంభిద్దాం

సెంట్రల్ ఏసీపీ ఖాదర్ బాషా



ఐజీఎం స్టేడియంలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఏసీపీ ఖాదర్‌బాషా

లబ్బీపేట(విజయవాడతూర్పు): రోడ్డు ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు పాటించడం మన ఇంటి నుంచే ప్రారంభిద్దాం.. సమాజానికి ఆదర్శంగా నిలుద్దామని సెంట్రల్ ఏసీపీ ఖాదర్‌బాషా పేర్కొన్నారు. అంతర్జాతీయ మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ డేను పురస్కరించుకుని అసోసియేషన్ ఆఫ్ ఓరల్ అండ్ మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ ఆధ్వర్యంలో ఆదివారం రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ఈ ర్యాలీని ఏసీపీ ఖాదర్‌బాషా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు, డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు డాక్టర్ మెహబూబ్‌షేక్ అధ్యక్షతన జరిగిన సభలో ఏసీపీ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వైద్యుల ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి నుంచే జాగ్రత్తలు పాటించాలని, అప్పుడే మానవ తప్పిదాల వలన జరిగే ప్రమాదాలను అరికట్టగలుగుతామన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కారు ప్రయాణికులు సీటు బెల్టు ధరించడం తమ బాధ్యతగా భావించాలన్నారు. అలా చేస్తే రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం లేకుండా బయటపడవచ్చన్నారు. అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ ఎస్.కోటేశ్వరరావు, డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రమాదాలతో యువకులు చిన్న వయస్సులోనే తలకు, ముఖాలకు గాయాలై జీవచ్ఛవాలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది వారికి, వారి కుటుంబానికే నష్టం కాకుండా యావత్ దేశానికి నష్టమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఐజీఎం స్టేడియం వద్ద ప్రారంభమైన ర్యాలీ ఎంజీ రోడ్డులో హోటల్ డీవీ మానర్, అక్కడి నుంచి టిక్కిల్ రోడ్డులో నుంచి సిద్ధార్థ ఆడిటోరియం వరకూ కొనసాగింది. ఈ ర్యాలీలో 200 మందికిపైగా వైద్యులు, దంత వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

జ్వరాలపై వైద్యశాఖ అప్రమత్తం

డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని



పాలిటెక్నిక్ హాస్టల్లో లార్వా గుర్తింపు చర్యలు చేపడుతున్న వైద్య సిబ్బంది, డీఎంహెచ్ఓ సుహాసిని

లబ్బీపేట(విజయవాడ తూర్పు): ప్రభుత్వ పాలిటెక్నిక్ హాస్టల్‌లోని విద్యార్థులకు జ్వరాలు సోకడంపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. అందులో భాగంగా ఆ ప్రాంతానికి చెందిన లబ్బీపేట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందితో కలిసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదివారం ప్రభుత్వ పాలిటెక్నిక్ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి, నిర్ధారణ పరీక్షలు చేశారు. వారిలో ఎనిమిది మంది టైఫాయిడ్, ఒకరు డెంగీతో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. వారిలో ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా డెంగీ కేసు నమోదు కావడంతో ఆ ప్రాంతంలో డెంగీ లార్వాను గుర్తించేందుకు జల్లెడ పడ్డారు. నిల్వనీటిని గుర్తించి, వాటిలోని లార్వాను నిర్వీర్యం చేశారు. లార్వా నాశన మందులు చల్లి, ఫాగింగ్ చేశారు. లబ్బీపేట పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మెబీనా తన సిబ్బందితో అక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేసి జ్వరబాధితులకు చికిత్స చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందిని పిలిపించి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అందరికీ జ్వర నిర్ధారణ పరీక్షలు చేశామని, ఒకరికి డెంగీగా నిర్ధారణ కావడంతో అప్రమత్తమైనట్లు తెలిపారు. ఇక్కడే వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జె.నరసింహనాయక్, బయాలజిస్ట్ సూర్యకుమార్ పాల్గొన్నారు.

అలరించిన ఘంటసాల స్వరార్చన



ఘంటసాల స్వరార్చన కార్యక్రమంలో పాటలు పాడుతున్న గాయకులు

నూజివీడు: పట్టణంలో ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకుని ఘంటసాల స్వరార్చన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. నూజివీడు కళా వేదిక, శ్రీ సత్య సంగీత, నృత్య అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించారు. ముందుగా ఘంటసాల చిత్రపటానికి పూలవేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు ఔత్సాహిక గాయనీ గాయకులు ఘంటసాల పాడిన పాటలు ఆలపించారు. ఘంటసాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఘంటసాల పాటలు అజరామరమని, గాయకుడిగానే కాకుండా సంగీత దర్శకుడిగా కూడా రాణించిన ఘనత ఘంటసాలకే దక్కుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పురాణం కృష్ణప్రసాద్, వేంపాటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బొండా ఉమా ఆరోపణలు చేయడం సిగ్గుచేటు



సమావేశంలో మాట్లాడుతున్న ఇసరపు రాజు, పక్కన వైఎస్సార్ సీపీ నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): న్యూఆర్‌ఆర్‌పేట ఇళ్ల రిజిస్ట్రేషన్ల కల సాకారం అయితే అభినందించాల్సింది పోయి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకులపై మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా ఆరోపణలు చేయడం సిగ్గుచేటని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇసరపు రాజా రమేష్, మల్లెల చెన్నకేశవరెడ్డి, కాళ్ల ఆదినారాయణ మండిపడ్డారు. 57వ డివిజన్ న్యూఆర్‌ఆర్‌పేటలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ న్యూరాజరాజేశ్వరీపేట వాసులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ల సౌకర్యాన్ని కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు జీఓ నంబర్ 4, 32ను తీసుకొచ్చి వాటి ద్వారా 2816 ఫ్లాట్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యం అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయంలో బొండా ఉమా, ఎరుబోతు రమణాలు ఇక్కడివారికి ఇళ్ల రిజిస్ట్రేషన్లు చేయిస్తామని ప్రజలను ఇష్టం వచ్చినట్లు దోచుకున్నారని మండిపడ్డారు. 2019 ఎన్నికల ముందు జీవో నంబర్ 74ను హడావుడిగా తీసుకువచ్చి దాని ద్వారా కేవలం వారికి పనికి వచ్చే 127 దొంగ ఫ్లాట్లకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించి ఎన్నికల కోడ్ వచ్చేసిందని నిలిపివేశారని ఆరోపించారు. 74 జీఓ ప్రకారం ఇచ్చేది కేవలం పట్టా మాత్రమే నని అది బ్యాంకు లోన్లు కానీ, ఎవరికైనా అమ్ముకోవడానికి కానీ పనికి రాదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు వాటిపై పూర్తి అధికారం అందించారని, ఏదైనా బ్యాంకుల్లో లోన్ల కోసం పెట్టుకోవడానికి కానీ, లేదా అమ్ముకోవడానికి కూడా అర్హత కల్పించారన్నారు. జీఓ వచ్చిన వారం రోజుల్లోనే 29 మందికి రిజిస్ట్రేషన్ చేశామన్నారు. అయితే శనివారం విలేకరుల సమావేశంలో బొండా ఉమా, ఎరుబోతు రమణారావు మాట్లాడుతూ ఇళ్ల రిజిస్ట్రేషన్లకు చీకటి ఒప్పందాలు జరుగుతున్నాయని, ఒక్కొక్కరి నుంచి రూ.10, రూ.20 వేలు వసూళ్లు చేస్తున్నారనే అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. డబ్బులు వసూళ్లు చేశారని నిరూపిస్తే మేమంతా రాజీనామాకు సిద్ధమని, నిరూపించకపోతే బొండా ఉమా రాజకీయాల నుంచి తప్పుకోవాలని సవాల్ విసిరారు. న్యూఆర్‌ఆర్‌పేటలో పురుగుల ఆంజనేయస్వామి గుడిలో మాపై చేసిన ఆరోపణలు నిజమని ప్రమాణం చేయాలని, లేనిపక్షంలో మా ఎమ్మెల్యేకు, కార్యకర్తలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని లేకపోతే వారిద్దరూ రాజకీయాల నుంచి తప్పుకోవాలని సవాల్ చేశారు. సోమవారం ఉదయం 11 గంటలలోపు మాపై చేసిన ఆరోపణలు నిజమని నిరూపించే దమ్ము, ధైర్యం ఉంటే బొండా ఉమా, ఎరుబోతు రమణా లేదా ఆ పార్టీ నాయకులెవరైనా కానీ రావాలని, లేకపోతే మీరు చెప్పినవన్నీ అవాస్తవాలేనని భావించాల్సివస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు పఠాన్ నజీర్‌ఖాన్, శ్రీనివాసరెడ్డి, చెన్నారెడ్డి, ప్రేమ్, ఎస్‌కే మౌలాలి, కొఠారి ఉత్తమ్ పాల్గొన్నారు.


శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తాటిపర్తిపాలెంలో వృద్ధురాలికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


ఏలూరు జిల్లా కె.కన్నాపురంలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

గడప గడపకు మన ప్రభుత్వం


ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో వృద్ధుడికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి


బాపట్ల జిల్లా ఇంటూరులో మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

బాబు, లోకేశ్‌ను ప్రజలు నమ్మరు

శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



విజయనగరం: ప్రతిపక్ష నేత చంద్రబాబు రాష్ట్రమంతటా దొర్లినా.. ఆయన కుమారుడు లోకేశ్ పాదయాత్ర, పరుగు యాత్రలు చేసినా రాష్ట్ర ప్రజలు వారిని విశ్వసించే పరిస్థితి లేదని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఎద్దేవా చేశారు. తన నివాసంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పాదయాత్ర పేరుతో చంద్రబాబే లోకేశ్ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, లోకేశ్‌కు ఏదైనా జరిగితే ఆ సానుభూతితో చంద్రబాబు సీఎం అయ్యేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పరోక్షంగా ఆయన మరణానికి కారణమైన చంద్రబాబు ఎంతకైనా తెగిస్తారన్న విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు. మరోవైపు.. తమ ఉనికిని కాపాడుకునేందుకు టీడీపీ నవలా రచయితలు వైఎస్ జగన్‌పై విషం చిమ్మేందుకు రాస్తున్న పుస్తకాలనూ ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

రాజకీయ భిక్ష పెట్టిన బాబుపై విమర్శలా!?

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న

అనకాపల్లి టౌన్ : రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు దమ్ముంటే గడిచిన నాలుగేళ్లలో ఏ వ్యాపారం చేసి ఆస్తులు కూడబెట్టారో ప్రజల ముందుకొచ్చి చెప్పాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న సవాల్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గుడివాడ గురునాథరావు మరణం తర్వాత అమర్‌నాథ్ తల్లికి, ఆయనకు రాజకీయ భిక్ష పెట్టిన చంద్రబాబును, ఏ కులంతో రాజకీయం చేస్తున్నారో అదే కులానికి చెందిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను విమర్శించడం శోచనీయమన్నారు.

నర్సింగ్‌లో ఏపీ టాప్



రాష్ట్రంలో 1.39 లక్షల మంది నర్సులు

- ఏపీ తరువాత రాజస్థాన్‌లో 1.10 లక్షల మంది నర్సులు
- డాక్టర్ల సంఖ్యలో నాలుగో స్థానంలో ఏపీ
- అత్యధికంగా మహారాష్ట్రలో 1.88 లక్షల డాక్టర్లు
- ఏపీలో 1.05 లక్షల మంది వైద్యులు
- కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడి

సాక్షి, అమరావతి: ఆస్పత్రుల్లో రోగులకు నిరంతరం సేవలందించేది నర్సులే. వైద్యుల సూచనలకు అనుగుణంగా రోగికి క్యాన్యులా అమర్చడం నుంచి సమయానికి మందులివ్వడం, వైద్య పరికరాలను అమర్చడం, వాటిని నిరంతరం పర్యవేక్షించి రోగి ఆరోగ్య పరిస్థితిని వైద్యులకు తెలియజేస్తుండటం వంటి ఎన్నో రకాల సేవలు అందిస్తుంటారు. ఆస్పత్రుల్లో వీరి సేవలు అత్యంత కీలకం. అందుకే ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆస్పత్రుల్లో వైద్యులతోపాటు నర్సుల నియామకానికీ అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. దేశంలో శిక్షణ పొందిన నర్సులు ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికంగా ఉన్నట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఇటీవల పార్లమెంటులో వెల్లడించింది. దేశంలో మొత్తం 35.14 లక్షల నర్సులు నమోదైతే అందులో అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో 1.39 లక్షల మంది ఉన్నారు. అలాగే డాక్టర్ల సంఖ్య కూడా రాష్ట్రంలో పెరుగుతోందని ఆ శాఖ తెలిపింది. దేశంలో డాక్టర్ల సంఖ్యలో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో ఉందని తెలిపింది. శిక్షణ పొందిన నర్సుల సంఖ్యలో రెండో స్థానంలో రాజస్థాన్, మహారాష్ట్ర మూడో స్థానంలోఉన్నాయి. దేశంలో 13,08,009 మంది వైద్యులు నమోదైనట్లు ఆ శాఖ తెలిపింది. వైద్యుల సంఖ్యలో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉండగా తమిళనాడు రెండో స్థానంలో ఉన్నాయి. దేశంలో ప్రస్తుతం డాక్టర్ల నిష్పత్తి 1:834గా ఉందని కేంద్ర మంత్రిత్వ శాఖ తెలిపింది. అలాగే నర్సుల సంఖ్య ప్రతి వెయ్యి జనాభాకు 2.06గా ఉందని పేర్కొంది. మెడికల్ కాలేజీల సంఖ్యను పెంచడం ద్వారా ఎంబీబీఎస్ సీట్ల సంఖ్యను పెంచినట్లు కేంద్ర మంత్రిత్వ శాఖ తెలిపింది. 2014కు ముందు దేశంలో వైద్య కళాశాలలు 387 ఉండగా ఇప్పుడు 654కు పెరిగినట్లు పేర్కొంది. దేశంలో 2014కు ముందు 51,348 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా ఇప్పుడు 99,763కు పెరిగినట్లు తెలిపింది. దేశంలో నర్సింగ్ సీట్లను పెంచేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా నర్సింగ్ విద్యలో విద్యార్థి, రోగి నిష్పత్తిలో మినహాయింపులు ఇచ్చినట్లు తెలిపింది. విద్యార్థి, రోగి నిష్పత్తిని 1:5 నుంచి 1:3కు తగ్గించినట్లు పేర్కొంది.

రాష్ట్రంలో మరింతగా పెరగనున్న వైద్యులు, నర్సులు

ప్రభుత్వ రంగంలో వైద్య విద్య, ఆరోగ్య రంగం అభివృద్ధికి రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలతో కలిపి ప్రతి జిల్లాలో మెడికల్, నర్సింగ్ కాలేజీల ఏర్పాటునకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఇవన్నీ కార్యరూపం దాల్చితే రాష్ట్రంలో డాక్టర్లు, నర్సుల సంఖ్య మరింతగా పెరుగుతుంది. మరో పక్క దేశంలో వైద్య సిబ్బంది కొరత నివారించడానికి కేంద్ర ప్రభుత్వమూ పలు చర్యలు చేపట్టిందని, తద్వారా డాక్టర్లు, నర్సుల సంఖ్య బాగా పెరిగినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది.

దేశంలో వివిధ రాష్ట్రాల్లో డాక్టర్ల సంఖ్య ఇలా

మహారాష్ట్ర	తమిళనాడు	కర్ణాటక	ఉత్తరప్రదేశ్	ఆంధ్రప్రదేశ్
1,88,545	1,48,217	1,34,426	89287	1,05,799

దేశంలో వివిధ రాష్ట్రాల్లో నర్సుల సంఖ్య ఇలా

ఆంధ్రప్రదేశ్	రాజస్థాన్	మహారాష్ట్ర	ఉత్తరప్రదేశ్	ఒడిశా
1,39,812	1,10,443	81218	75671	70679



తెలంగాణ

శ్రీరామనగరంలో ముగిసిన సమతా కుంభ్ ఉత్సవాలు

శంషాబాద్ రూరల్: శ్రీరామనగరంలో సమతా కుంభ్ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. పది రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాల్లో చివరి రోజు దివ్య సాకేతాలయంలో దేవతా మూర్తులకు ప్రోక్షణ జరిపారు. చినజీయర్ స్వామి పర్యవేక్షణలో ఘనంగా శ్రీపుష్పయాగంతో పాటు యాగశాలలో మహా పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీఅహోబిల జీయర్‌స్వామి, శ్రీ దేవనాథ జీయర్‌స్వామి, మైహోం గ్రూపు అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు పాల్గొన్నారు.

హాస్టల్‌లో ఉండలేక ఆత్మహత్యాయత్నం

మూడో అంతస్తు నుంచి దూకిన పదో తరగతి విద్యార్థిని

- కరీంనగర్ జిల్లా గంగాధర మహాత్మా జ్యోతిబాపూలే స్కూల్‌లో ఘటన

గంగాధర(చొప్పదండి): చదువంటే ఇష్టం లేక, హాస్టల్‌లో ఉండలేక ఓ పదో తరగతి విద్యార్థిని పాఠశాల భవనం మూడో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు యత్నించింది. అయితే ప్రాణాపాయం తప్పిపోగా, కాలువిరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. గంగాధర ఎస్సై రాజు వివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ గ్రామానికి చెందిన స్వప్న-లక్ష్మినారాయణ కూతురు హాసిని గంగాధర మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే విద్యాలయంలో పదోతరగతి చదువుతోంది. అయితే చదువంటే ఇష్టం లేదని, హాస్టల్‌లో ఉండనని మొండికేసి కొద్దిరోజులుగా ఇంట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో తల్లిదండ్రులు కుమార్తెను బ్రతిమిలాడి ఒప్పించి ఐదురోజుల క్రితం హాస్టల్‌లో చేర్పించి వెళ్లారు. ఆదివారం సాయంత్రం హాసిని వసతిగృహం మూడో అంతస్తుపైకి వెళ్లింది. అక్కడికి ఎవరూ రాకుండా తలుపులు బిగించి వెళ్లి రెయిలింగ్‌పై కూర్చొంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు గమనించి ఎంతవారించినా వినకుండా పైనుంచి దూకేసింది. అయితే ఎడమకాలు విరిగి, ప్రాణాపాయం తప్పింది. తీవ్రంగా గాయపడిన హాసినిని అంబులెన్స్‌లో కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఐదో తరగతి నుంచి హాసిని ఇక్కడే చదువుతోందని, ఈ ఏడాది చాలారోజులు పాఠశాలకు గైర్హాజరైందని, ప్రీఫైనల్ పరీక్షలు ఉన్నాయని సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు ఇటీవలే పాఠశాలలో చేర్పించారని వైస్ ప్రిన్సిపాల్ మంజుల చెప్పింది.

శునకాలకు పరుగు పోటీ

అయిజ: జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలోని తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్రాష్ట్ర శునకాల పరుగు పోటీ నిర్వహించారు. పోటీలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 9 కుక్కలు పాల్గొనగా.. అన్ని బహుమతులను కర్ణాటక రాష్ట్రానికి చెందిన శునకాలు కైవసం చేసుకోవడం విశేషం. ఇండి జిల్లాకు చెందిన వీఐపీ లల్యా ప్రథమ బహుమతిగా రూ.15,016, సుల్తాన్ ద్వితీయ బహుమతిగా రూ.10,016, తేజకళ్ల తృతీయ బహుమతిగా రూ.8,016, బాపురం జిల్లాకు చెందిన అంజి నాలుగో బహుమతిగా రూ.5,016 గెలుపొందాయి. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాదిమంది తరలివచ్చారు.


పరుగు పందెంలో పాల్గొంటున్న శునకాలు

జిల్లా వార్తలు

శ్రీశైల మల్లన్న తలపాగాకు ప్రత్యేక పూజలు


తలపాగాతో ఎమ్మెల్సీ హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి తదితరులు

తాడేపల్లి రూరల్ : మంగళగిరిలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం శ్రీ శైలం మల్లన్న తలపాగాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి మల్లన్న తలపాగాను శిరస్సులపై ఉంచుకుని భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా లావేరులో తయారు చేసిన శ్రీశైల మల్లన్న తలపాగాను అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం మంగళగిరిలో భక్తుల దర్శనార్థం ఉంచడం అభినందనీయమన్నారు. శివరాత్రి ఉత్సవాల్లో మల్లికార్జునస్వామికి అర్ధరాత్రి లింగోద్భవ కాలానికి ముందు తలపాగా అలంకరించే ఘట్టం అత్యంత విశిష్టమైనదని తెలిపారు. సుమారు 200 ఏళ్ల నుంచి శ్రీశైలంలో ఈ సంప్రదాయం కొనసాగుతోందని వివరించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మునగాల మల్లేశ్వరరావు, దేవాంగ సంఘ అధ్యక్షుడు బుల్లా వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి అలక తాతారావు, కోశాధికారి అలక నమశ్శివాయ, మునగపాటి వెంకటేశ్వరరావు, నేరెళ్ల మురళి, పెడన మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాగరమాత ఆలయంలో భక్తుల రద్దీ


ఆలయ ప్రాంగణంలో తేరు ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సాగర్‌మాత పుణ్యక్షేత్రానికి తరలి వచ్చారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తులు మొక్కుబడులు జరుగుతున్నాయి. ఉదయం భక్తులు కృష్ణా నదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలిపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షిణ నిర్వహించారు. ఆ తరువాత జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీరమ్మతల్లికి భక్తుల జేజేలు

- తిరునాళ్లకు పోటెత్తిన భక్తజనం
- చల్లని తల్లికి పొట్టేళ్ల ప్రభ బండ్లు కానుక
- పొంగలి నైవేద్యాల సమర్పణ

ఉయ్యూరు(పెనమలూరు): ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్లకు ఆదివారం భక్తులు పోటెత్తారు. వేలాదిగా తరలివచ్చి శ్రీకనక చింతయ్య సమేత వీరమ్మ తల్లిని దర్శించుకున్నారు. చల్లని తల్లీ.. కాపాడమ్మా అంటూ వేడుకున్నారు. మహిళలు పాల పొంగళ్లు సిద్ధం చేసి నైవేద్యం సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావటంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. పలువురు పొట్టేళ్ల ప్రభ బండ్లు, చలువ కావిళ్లతో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆకట్టుకున్న జోడు పొట్టేళ్ల ప్రభ బండ్లు

తిరునాళ్లలో జోడు పొట్టేళ్ల ప్రభ బండ్లు ఆకట్టుకున్నాయి. డప్పు వాయిద్యాలతో, జోడు పొట్టేళ్ల ప్రభ బండ్లుతో తరలివచ్చిన భక్తులు అమ్మకు ప్రభ బండ్లు కానుకగా సమర్పించి భక్తిపారవశ్యం చెందారు. ఉయ్యూరు కూరగాయల మార్కెట్ ఆధ్వర్యంలో ప్రభ బండి ఊరేగింపును ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కౌన్సిలర్లు డాక్టర్ జంపాన పూర్ణిమ, రాజులపాటి చిన్ని, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, మాజీ ఏఎంసీ చైర్మన్ అబూ కలాం, మునిసిపల్ మాజీ చైర్మన్ జంపాన పూలా, ఏఎంసీ మాజా చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు పాల్గొన్నారు. సాయి మహల్ సెంటరులో జంపాన రవి, గారపాటి నాని యూత్ ఆధ్వర్యంలో పొట్టేళ్ల ప్రభ బండి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. పమిడిముక్కల మండలం తాడంకి గ్రామం నుంచి వ్యాపారవేత్త కూచిపూడి కృష్ణారావు ఆధ్వర్యంలో భక్తులు ఊరేగింపుగా తరలివచ్చి అమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.


కనక చింతయ్య సమేత వీరమ్మతల్లి


అమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తజనం


ప్రభబండిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి


జోడు పొట్టేళ్ల ప్రభ బండి ఊరేగింపులో మునిసిపల్ చైర్మన్ వల్లభనేని నాని, ఇతర ప్రజాప్రతినిధులు

మిస్టర్ ఇండియాకు పౌర సన్మానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరానికి చెందిన తనుబుద్ధి సాయిభరద్వాజరెడ్డి మిస్టర్ ఇండియా టైటిల్ గెలవడం తెలుగుజాతికే గర్వకారణమని వక్తలు కొనియాడారు. నగరంలోని కొండవీడు అకాడమీలో మిస్టర్ ఇండియా టైటిల్ విజేత సాయిభరద్వాజరెడ్డికి ఆదివారం పౌర సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ పూనూరు గౌతంరెడ్డి, వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజారెడ్డి పాల్గొని సాయిభరద్వాజరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. అతి చిన్న వయసులో మిస్టర్ ఇండియాకు ఎంపిక కావడం, మిస్టర్ యూనివర్స్ టైటిల్ రేసులో ఉండటం ఎంతో సంతోషదాయకమన్నారు. విజయవాడకు చెందిన భరద్వాజరెడ్డి ఈ ఖ్యాతి గడించడం తెలుగు రాష్ట్రాలకే గర్వకారణమన్నారు. గతంలో తెలుగు వారెవ్వరూ ఈ పోటీలకు వెళ్లిన దాఖలాలు కూడా లేవని పేర్కొన్నారు. ఓ వైపు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే ఈ రంగంలో పేరు సాధించడం కచ్చితంగా స్వయం కృషేనన్నారు. వచ్చే నెలలో ఇండోనేషియాలోని బాలిలో జరిగే మిస్టర్ యూనివర్స్ పోటీల్లో విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. సాయిభరద్వాజరెడ్డి మిస్టర్ యూనివర్స్‌గా నిలవాలని ఆకాంక్షించారు. ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ.. అందాల పోటీలో నెగ్గిన తనుబుద్ధి సాయిభరద్వాజరెడ్డి రాబోయే రోజుల్లో మంచి హీరో కావాలని ఆకాంక్షించారు. సాయిభరద్వాజరెడ్డిని అఖిల భారత రెడ్ల సమాఖ్య, మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి, కాపు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ల చైర్మన్‌లు అడపా శేషు, తోలేటి శ్రీకాంత్, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఎన్టీఆర్ జిల్లా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులురెడ్డి, రైతు సాధికారత చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, రెడ్డి సత్రాల సమైఖ్య అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి, మానసిక వైద్యుడు ఇండ్ల రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సాయిభరద్వాజరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, పూనూరు గౌతంరెడ్డి

రామలింగేశ్వరస్వామి సేవలో వెంకయ్యనాయుడు

పెనమలూరు: మండలంలోని యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకాభిషేకం చేయించారు. అనంతరం పార్వతి అమ్మ వారిని దర్శించుకున్నారు. ఆయన్ను రాష్ట్ర ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు శేషవస్త్రాలతో సత్కరించి దేవాలయం ఫొటోను అందజేశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ధర్మాన్ని పరిరక్షిస్తే, అది మనల్ని కాపాడుతుందన్నారు. చెట్లు, నీరు, గాలి, వెలుతురును కాపాడుకున్నప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటామన్నారు. గ్రామాల్లో దేవాలయాలు ధర్మానికి, కర్తవ్య బోధనకు, మానసిక ప్రశాంతతకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అందుకే పూర్వీకులు ప్రతి గ్రామంలోనూ దేవాలయాలను నిర్మించారని వివరించారు. ఉదయాన్నే సూర్య నమస్కారాలు చేయడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందన్నారు. భారతీయ ధర్మం, సంస్కృతికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న మహాసౌర యాగశాలను వెంకయ్యనాయుడు సందర్శించారు. రాష్ట్ర ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు, ప్రముఖులు వల్లూరు శ్రీమన్నారాయణ, వెలగపూడి నాగభూషణం, సంగా సింగయ్య, గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, తహసీల్దార్ టి.వి.సతీష్, డీఎస్పీ విజయ్‌పాల్, ఆలయ కార్యదర్శి గంగాధరరావు, ప్రధాన అర్చకుడు సాగర్ తదితరులు పాల్గొన్నారు.


వెంకయ్యనాయుడిని సత్కరిస్తున్న ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు తదితరులు

రేపటికి కొండ దారులు సిద్ధం

- కోటప్పకొండలో పర్యటించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- తిరునాళ్ల పనుల పరిశీలన

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా చేపట్టిన రోడ్ల విస్తరణ, మరమ్మతులను 14వ తేదీలోగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీ కోటప్పకొండలో నిర్వహించనున్న తిరునాళ్ల ఏర్పాట్లను ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పరిశీలించారు. కోటప్పకొండ నుంచి నరసరావుపేట వరకు రూ.17 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల ప్రగతిపై అధికారులతో సమీక్షించారు. యల్లమంద బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేస్తున్న అప్రోచ్ రోడ్డు పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ప్రభలు, వాహనాల రాకపోకలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేయాలన్నారు. చిలకలూరిపేట మేజర్ వద్ద చిన్మయ ఆశ్రమం వెనుక వైపు నుంచి తాత్కాలిక రోడ్డు పనులను పరిశీలించారు. రెడ్ల సత్రం నుంచి చిలకలూరిపేట మేజర్ వరకు ట్రాఫిక్ నియంత్రణ ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రభలను మాత్రమే కాలువపై ఉన్న బ్రిడ్జిపై నుంచి అనుమతివ్వాలని, ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను కెనాల్ మీద నుంచి చిన్మయ ఆశ్రయం వెనుక వైపు నుంచి ఏర్పాటు చేస్తున్న రోడ్డు నుంచి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. కెనాల్ వద్ద ఏర్పాటు చేసే స్నానాలఘాట్‌ను విశాలంగా, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోటప్పకొండ నుంచి పమిడిమర్రు మీదగా జేఎన్‌టీయూ కళాశాల వరకు నిర్మిస్తున్న రోడ్డును పరిశీలించి నాణ్యతతో పనులు పూర్తిచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ యల్లమంద బ్రిడ్జి వద్ద అప్రోచ్ రోడ్డును బీటీతో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. అప్రోచ్ రోడ్డుపై కొంత మంది చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ప్రభల నిర్వాహకులకు సూచించారు. ప్రభల నిర్వాహకులు ఒకసారి బ్రిడ్జి వద్దకు వచ్చి అప్రోచ్ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించుకోవాలని సూచించారు. కోటప్పకొండ నుంచి పమిడిమర్రు-వినుకొండ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ప్రస్తుతం బీటీ వేస్తున్నారని ఈ నెల 14వ తేదీకి పనులు పూర్తవుతాయని తెలిపారు. ట్రాఫిక్ సమస్య లేకుండా ఉండేందుకు రహదారులను సిద్ధం చేస్తున్నామన్నారు. తిరునాళ్ల ఏర్పాట్లపై ఈ నెల 14వ తేదీ కోటప్పకొండలో మూడో సమీక్షా సమావేశం ఉంటుందని, అప్పటికీ అన్ని పనులు పూర్తిచేస్తామని తెలిపారు. ఈ నెల 16వ తేదీ కొండమీద చేపట్టిన అన్నదాన మండపం, డార్మెటరీ, వసతి గృహాలు, ఆలయం చుట్టూ రేకుల షెడ్లు, కొండ దిగువున సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్‌లు వెన్నపూస నాగిరెడ్డి, దాసరి శ్రీనివాసరావు, మేకల మురళి, వైఎస్సార్ సీపీ నాయకులు మూరే రవీంద్రారెడ్డి, కనకా పుల్లారెడ్డి, వంపుగుడి జాన్ తదితరులు పాల్గొన్నారు.


యల్లమంద వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

సన్నిధి

సువార్త

భయం నుండి విడుదల



కీడు వచ్చునన్న భయము లేక నెమ్మదిగా ఉండును (సామె 1:33). మానవుని పట్టి పీడుస్తున్న అనేక భయాల్లో ఒకటి 'భవిష్యత్తును గూర్చిన భయం'. తనకు వచ్చే రోగాల్ని బట్టి, కుటుంబ సమస్యలను బట్టి, గత జీవితాన్ని గురించి భయపడేది కేవలం పది శాతమైతే మిగతా తొంభైశాతం భయం భవిష్యత్తులో ఏం జరగబోతుంది... అనే దానిపై ఆధారపడి ఉంటుందని మానసిక శాస్త్ర వేత్తల వివరణ. భవిష్యత్తును గూర్చి తెలీదు గనుక దాని గురించి భయపడడం సహజం. అయితే కొందరు ప్రతి చిన్నదానికి భయపడి తమ చుట్టూ ఉన్నవారిని భయపెడుతుంటారు. దినదినం మానవుడు భయం గుప్పిట్లోకి వెళ్ళిపోతున్నాడన్నది వాస్తవ దూరం కాదు. భయంతో మనిషి తన జీవితాన్ని ఆస్వాదించలేకపోతున్నాడు. ఆనందమయం చేసుకోలేకపోతున్నాడు.

భయం మనిషిలో ఉన్న స్వాభావిక ధైర్యాన్ని నిర్వీర్యం చేస్తుంది. భయం వలన మానవుడు తాను చేయాలనుకున్న పనులు చేయలేడు. అనేక మంచికార్యాలను నిలువరించే శక్తి భయానికి మాత్రమే ఉంది. భవిష్యత్తు చాలా అందమైనది. సర్వశక్తుడైన క్రీస్తులో అది సురక్షితమైనది. భవిష్యత్తు మీద ఉన్న ఆశలను నిర్వీర్యం చేసేది నీలో ఉన్న భయమే. జీవితంలో కొన్ని కొన్ని విషయాల్లో కొన్ని నిర్దిష్ట పరిధుల్లో భయం ఉండడం సహజమే కానీ కొంతమంది భయ కారణం లేని చోట కూడా విపరీతంగా భయపడుతూ ఉంటారు.

ప్రభువైన యేసుక్రీస్తు ఈ లోకానికి రావడానికి గల కారణాల్లో ఒకటి మనిషిలో ఉన్న భయాన్ని పోగొట్టుట. రాత్రివేళ తమ మందను కాచుకొంటున్న గొర్రెల కాపరులకు ఇయ్యబడిన వాగ్దానం భయపడకుడి. వారికున్న భయం బహుశా ఇంకెంత కాలం ఈ గొర్రెలను మేపుతూ ఉండాలి? వాటిని ప్రజల పాపపరిహారార్థమై దేవాలయానికి తరలించాలి? దూత చెప్పిన వర్తమానం వారి కోసం రక్షకుడు వచ్చాడు. ఆయన సర్వలోక పాపాన్ని మోసికొని పోవు దేవుని గొర్రెపిల్ల. దేవుని వాక్యమైన బైబిల్‌లో అనేకచోట్ల భయపడకుడి అనే వాగ్దానం స్పష్టంగా కనిపిస్తుంది. మనిషి గుండెల్లో గూడు కట్టుకుపోయిన భయాన్ని రూపుమాపడానికే దేవుడు ఈ లోకానికి అరుదెంచాడు. ఆయన ధైర్యవంతుడు గనుకనే ఆయనలో ఉన్న ధైర్యాన్ని ఉచితంగా మనకు ఇవ్వాలని ఆశిస్తున్నాడు.

యేసుక్రీస్తు నీ హృదయంలో ఉంటే 'దేవుడు నాకు వెలుగును రక్షణయునై యున్నాడు నేను ఎవరికి భయపడుదును' అని దావీదు వలే నువ్వు కూడా చెప్పగలవు (కీర్తన 27:1). శత్రువులతో తరుమబడినప్పుడు తల దాచుకోవడానికి కూడా అవకాశం లేని సందర్భాల్లో దేవునియందు విశ్వాసముంచి తనలో ఉన్న ప్రతి భయాన్ని జయించిన దావీదు ధన్యజీవిగా మారాడు. నీవు దేవునియందు నమ్మికయుంచి ధైర్యంతో ముందుకు సాగిపో మిత్రమా!

– డా. జాన్ వెస్లీ, క్రైస్ట్ వర్షిప్ సెంటర్

మంచి మాట

ప్రేమ కోసం ప్రేమగా

ధనం వృద్ధి పొందటానికి కొంత సమయం పడుతుంది. విత్తనాన్ని భూమిలో నాటితే ఫలం చేతికి అందటానికి సమయం పడుతుంది, కానీ క్షణంలో ఫలితాన్ని అందజేసేది ప్రేమ ఒక్కటే.

ప్రేమతో కూడిన ఒక్క మాట, ఒక చర్య అద్భుతాలను సృష్టిస్తుంది.

ఈ ప్రేమకు వయసుతో పనిలేదు. రక్తసంబంధం ఉండాలని నియమం లేదు. కుల మతాల ప్రసక్తే లేదు.

మరో గొప్ప విషయం ఏమిటీ అంటే ఇచ్చే వారికీ, పుచ్చుకునే వారికీ సంతోషం కలిగించే శక్తి కేవలం ప్రేమకు మాత్రమే ఉంది.

ఒక్కసారి ప్రేమ గొప్పతనం అర్థం అయ్యాక, ప్రేమను పంచటంలోని మాధుర్యం అనుభవం అయిన తరువాత కఠినంగా కఠోరంగా ఉండటం సాధ్యం కాదు.

పరిస్థితుల దృష్ట్యా కొన్నిసార్లు కావాలని కఠినంగా ఉండాలని ప్రయత్నించినా రాతి అడుగున దాగిన నీటి బుగ్గలాగా పెల్లుబికి వస్తుంది ప్రేమ.

మట్టితో కూడిన చెరువు నీటి కుండలో చిన్న పటిక ముక్క వేస్తే మట్టి విడిపోయి స్వచ్ఛమైన నీరు తయారవుతుంది.

అనేక సమస్యలు, ఒత్తిడులతో మనశ్శాంతికి దూరం అయిపోతున్న నేటి సమాజంలో శాంతిని చేకూర్చగల ఏకైక మార్గం ప్రేమ.

కేవలం యువతీ యువకుల మధ్య కలిగేదే ప్రేమ అనే భ్రమ నుంచి బయటపడితే ప్రతిజీవి తోటి వారి అందరిపట్ల పశుపక్ష్యాదుల పట్ల, ప్రకృతి పట్ల చూపించేది అంతా ప్రేమే.

ఒక కర్మాగారం చాలా చిక్కు సమస్యలలో మునిగి పోయింది. కార్మికుల మధ్య తగులాటలు, శత్రుత్వాలు. అప్పటివరకు ఉన్న అధికారి ఆ ఒత్తిడిని తట్టుకోలేక పదవికి రాజీనామా చేసి వెళ్లిపోయాడు. అతని స్థానంలో మరొక అధికారిని నియమించారు. కొద్దికాలంలోనే కర్మాగారం పరిస్థితి చక్కబడింది.

మునుపటి శత్రుత్వం నిండిన వాతావరణం మారిపోయి చక్కని వాతావరణం ఏర్పడింది.

పైవారు కొత్త అధికారిని ప్రశంసలతో ముంచెత్తారు.

ఇటువంటి మార్పు కోసం ఆ కొత్త అధికారి ఉపయోగించిన ఏకైక ఆయుధం ప్రేమ.

ఉదయం రాగానే అందరినీ ఒక్కొక్కరినీ పిలిచి ప్రేమగా పలకరించేవాడు. వారి యోగ క్షేమాలను విచారించేవాడు. మీకు ఏ కష్టం వచ్చినా చెప్పండి నేను ఉన్నాను. మనందరం ఒక కుటుంబం అని ప్రేమగా మాట్లాడేవాడు. ఆ చిన్న పని వల్ల ఆయన అందరికీ ఆత్మీయుడిగా మారిపోయాడు.

ఆయన సంతోషం కోసం అందరూ గొడవలు మానేసి పరస్పరం స్నేహంగా ఉండటం ప్రారంభించారు.

మనం ప్రస్తుతం నివసిస్తున్న ఈ సమాజంలో అన్నీ వుండి కూడా కాస్తంత ప్రేమ కోసం అలమటించే వారు ఎందరో ఉన్నారు. అయిన వారందరూ దూరప్రాంతాలకు తరలిపోగా ఒంటరితనంతో బాధపడుతూ కాస్తంత ఆప్యాయత కోసం, తపించి పోయే వారికి ఊరట కలిగేలా మనకు ఉన్న సమయంలో కొద్ది సమయం ఇటువంటి వారికోసం కేటాయించి ప్రేమతో నాలుగు మాటలు మాట్లాడితే వారికి ఎంతో ఉత్సాహం కలుగుతుంది. జీవితం పట్ల ఆసక్తి నశించిపోయి జీవించే వారికి జీవితం పట్ల ఆసక్తి కలుగుతుంది. అంతేకాదు, ప్రేమను చవిచూసిన వారు ఇతరులకు ప్రేమను పంచగలుగుతారు.

మన దైనందిన జీవితంలో మనకు సేవలందించే వారిపట్ల ప్రేమతో నాలుగు మంచి మాటలు మాట్లాడితే, వారంతా మనకు మరింత దగ్గరవుతారు. వారితోపాటు మన జీవితం కూడా ఆనందమయంగా మారుతుంది.

– పొత్తూరి విజయలక్ష్మి

గురువాణి

ఆ రుతువు వచ్చేవరకూ ఆగాలి... తప్పదు



మామిడి కాయలంటే ఇష్టం. మొక్క తెచ్చావు. నీళ్ళుపోసావు... ఇంకా కాయలు రాలేదని రోజూ బిందెలకు బిందెలు నీళ్ళు పోస్తే కాయలు రావు. మొక్క చెట్టు కావాలి... అయినా వసంత రుతువుకూడా రావాలి.. అప్పుడే పూత పూస్తుంది, అది పిందెగా మారుతుంది. ఆ పిదప కొంత కాలానికి కాయ... ఆ తరువాతే పండు... అప్పటిదాకా ఓర్పు ఉండాలి. వేచి చూడాలి. ఎప్పుడో కాయ కాస్తుందని ఇప్పటినుంచే నీళ్ళెందుకు పోయడం .. అని మానేస్తే మొక్క బతకదు... అంటే ఓర్పుతోపాటు నీ ప్రయత్నం కూడా పూర్తిగా ఉండాలి. ప్రతి దానికీ ఒక నియమం, ఒక సమయం ఉంటాయి. అప్పటిదాకా వేచి చూడగల ఓర్పు ఉండడంతో పాటూ ప్రయత్నం కూడా పూర్తిగా ఉండాలి.

వెనకటికి ఓ రాజుపై శత్రువులు విరుచుకు పడ్డారు. రాజు ఓడిపోయాడు. నిరాశతో రాజు అన్నీ వదిలేసుకొని ఒంటరిగా వెళ్ళిపోతుంటే... సైనికులు, ఆంతరంగికులు అందరూ నచ్చచెప్పారు. మనం కొంతకాలం ఆగుదాం.. మళ్ళీ శత్రువుపై యుద్ధం ప్రకటిద్దాం.. అని చెప్పినా వినకుండా అడవుల్లోకి వెళ్ళిపోయాడు. ఓరోజున రాజు ఒక చెట్టుకింద కూర్చుని... దగ్గర్లోనే ఒక సాలెపురుగు గూడు అల్లడానికి నానా తంటాలు పడడాన్ని ఆసక్తిగా గమనించాడు.. అది గూడు అల్లే క్రమంలో చాలాసార్లు పోగు తెగి కిందపడిపోతున్నది... పలు మార్లు అలా చేసిన తరువాత చివరికి అది గూడు పూర్తిగా అల్లి మధ్యలో సౌకర్యవంతంగా కూర్చుని గూడుకు చిక్కుకున్న పురుగులను హాయిగా తింటున్నది. ఇది చూసిన రాజుకు జ్ఞానోదయమయింది. వెంటనే వెళ్ళి తన పరివారాన్ని చేరదీసి సర్వసన్నద్ధం అయ్యేవరకు ఆగి... ఓ రోజున యుద్ధం ప్రకటించాడు. శత్రురాజును సునాయాసంగా ఓడించి తిరిగి తన రాజ్యాన్ని పొందాడు. ప్రతిదానికీ ఒక నియమం ఉంటుంది. ఆ నియమాన్ని అర్థం చేసుకుని ప్రయత్నం ఎక్కడా ఆపకుండా పూర్తిచేయాలి, ఫలితం వచ్చేవరకూ ఓర్పుగా వేచి చూడాలి.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తొలితరానికి చెందిన ప్రఖ్యాత భారతీయ శాస్త్రవేత్తల్లో ఒకరైన సర్ జగదీశ్ చంద్రబోస్ ఆంగ్లేయ ప్రొఫెసర్లతో సమానమైన అర్హతలు, ప్రతిభాపాటవాలు కలిగినా, వారితో సమానంగా తనకు వేతనం ఇవ్వనందుకు నిరసనగా జీతం ముట్టుకోకుండా తన వృత్తిని మూడేళ్ళపాటు ఆర్థికంగా ఇబ్బందులు పడుతూనే అదే అంకితభావంతో కొనసాగిస్తే... చివరకు అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం దిగొచ్చి ఆయన్ని సన్మానించి పెంచిన జీతం పాత బకాయిలతో సహా చెల్లించింది. కార్యసాధనలో ఓర్పు ఎంత ముఖ్యమో... ప్రయత్నాలను చివరిదాకా కొనసాగించడం కూడా అంతే ముఖ్యం.

ఇస్లాం వెలుగు

పరలోక సాఫల్యం దిశగా...

సృష్టిలోని ప్రతి జీవికీ మరణం తప్పదు. ఇది సృష్టిధర్మం, ఎవరూ తిరస్కరించలేని సత్యం. నాస్తికులూ, ఆస్తికులూ అందరూ మరణాన్ని నమ్ముతారు. దేవుడున్నాడా అనే విషయంలో భేదాభిప్రాయాలున్నాయి గాని, మరణం ఉందా.. లేదా..? అనే విషయంలో ఎటువంటి భిన్నాభిప్రాయమూ లేదు. కాని,'మరణం తథ్యం' అని తెలిసినా మనం దాన్ని పట్టించుకోం. బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు,స్నేహితులు, తెలిసిన వాళ్ళు, తెలియని వాళ్ళు ఎంతోమంది ప్రతిరోజు ఎక్కడో ఒకచోట పోతూనే ఉన్నారు. మనం వారి అంత్యక్రియల్లో పాల్గొని, స్వయానా మన భుజాలపై మోసి, సమాధిలో దించి, స్వహస్తాలతో వారిపై మట్టికప్పి వస్తున్నాం. వారు సంపాదించిన ఆస్తిపాస్తులు, ఆభరణాలు, హోదా, అధికారం ఏదీ వారు తమవెంట తీసుకు వెళ్ళడం లేదు. రిక్తహస్తాలతో వచ్చారు. అలానే వెళ్ళిపోతున్నారు.

పవిత్ర ఖురాన్ ఇలా అంటోంది: 'ఈ ప్రాపంచిక జీవితం ఒక ఆట, వినోదం తప్ప మరేమీ కాదు. అసలు జీవితం పరలోక జీవితమే. ఈ యథార్థాన్ని వారు అర్థం చేసుకుంటే ఎంత బాగుండు' (29-64) అందుకని ప్రపంచమే సర్వస్వంగా బతక్కూడదు. ధర్మాధర్మాల విచక్షణ పాటించాలి. మంచి పనులు చేయాలి. రేపు మనల్ని కాపాడేవి ఇవే. ఎందుకంటే, మనం సంపాదించిన డబ్బూదస్కం, ఆభరణాలు, ఆస్తిపాస్తులు సమస్తం ఊపిరి ఆగిన మరుక్షణమే మనతో సంబంధాన్ని తెంచుకుంటాయి. భార్యాబిడ్డలు, బంధుగణం, మిత్రబృందం... వీరంతా మనల్ని సమాధి వరకు మాత్రమే సాగనంపుతారు. సమాధిలో దించి, మట్టిలో కలిపేసి వెళ్ళిపోతారు. మన వెంట వచ్చేది, కాపాడేది కేవలం మనం చేసుకున్న మంచి పనులు మాత్రమే. అడ్డదారులు తొక్కి, వారినీ వీరినీ వంచించి సంపాదించేదంతా సుఖమయ జీవితం కోసమేగదా.. రేపటి మన సంతోషం, మన పిల్లల భవిష్యత్తు కోసమేగదా? అక్రమ సంపాదనలో నిజమైన సంతోషం ఉండకపోగా, అది ఎప్పుడూ మనసులో కెలుకుతూనే ఉంటుంది. అయినా అంతరాత్మను అణగదొక్కి అడ్డదారికే ప్రాధాన్యతనిస్తాం.



కేవలం కొన్ని సంవత్సరాల ప్రాపంచిక జీవితం కోసమే ఇంతగా ఆలోచించే మనం, మరి శాశ్వతమైన రేపటి (పరలోకం) కోసం ఏం సంపాదిస్తున్నామన్నది కూడా ఆలోచించాలి. ఈ 'రేపు' మూన్నాళ్ళ ముచ్చట. కాని ఆ 'రేపు 'శాశ్వతం. దానికోసం ఏం చేస్తున్నాం.. ఏం దాస్తున్నాం? ఇదికదా అసలు ప్రశ్న. ఇహలోక జీవితం ఎలా గడిచినా పరలోక సాఫల్యం లభిస్తే అంతకన్నా అదృష్టం ఇంకేముంటుంది. దాని కోసం ఆలోచించాలి. దానికోసం శ్రమించాలి. మంచీ చెడుల విచక్షణతో, ధర్మబద్ధంగా ముందుకు సాగితే, ఆ క్రమంలో ఎంత లభిస్తే అంతతో సంతృప్తి చెందితే అదే అసలు విజయం, అసలు సాఫల్యం.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

సినిమా



● ఎన్టీఆర్

ముహూర్తం ఫిక్స్?

'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో మరో కొత్త సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ నటించనున్న ఈ 30వ చిత్రాన్ని నందమూరి కల్యాణ్‌రామ్, మిక్కిలినేని సుధాకర్ నిర్మించనున్నారు. కాగా ఈ సినిమా ప్రారంభోత్సవానికి ముహూర్తం కుదిరిందనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిస్తోంది. ఈ నెల 23న ఈ మూవీని గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నారట ఎన్టీఆర్, కొరటాల శివ అండ్ కో. అలాగే మార్చి మూడోవారం నుంచి రెగ్యులర్ షూటింగ్‌కి యూనిట్ ప్లాన్ చేస్తోందట. ఇందుకోసం హైదరాబాద్ శివార్లలో ఓ పోర్టు సెట్‌ను కూడా వేస్తున్నారని సమాచారం. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. ఇతర నటీనటులు, టెక్నీషియన్స్ వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారట కొరటాల శివ. అయితే ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ మూవీని 2024 ఏప్రిల్ 5న విడుదల చేయనున్నట్లు ఎన్టీఆర్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.



● మృణాల్ ఠాకూర్

ఆర్టిస్టులు కూడా మనుషులే!

'సీతారామం'(2022) చిత్రంతో తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయమయ్యారు హీరోయిన్ మృణాల్ ఠాకూర్. తాజాగా ఆమెపై సోషల్ మీడియా వేదికగా కొద్దిపాటి ట్రోలింగ్ జరిగింది.. దీనిపై ఆమె కాస్త అసహనానికి లోనయ్యారు. సోషల్ మీడియాలో నెటిజన్లతో చిట్ చాట్ చేశారు మృణాల్. అయితే తనకు కాబోయే భర్త మంచి వ్యక్తిత్వం ఉన్నవాడు అయితే చాలు, అందం గురించి పెద్దగా ఆలోచించనని ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు మృణాల్. ఇటీవల జరిగిన ఓ షోలో పాల్గొని తనకు కాబోయే భర్త అందంగా ఉండాలని చెప్పారామె. రెండు విభిన్నమైన అభిప్రాయాల వీడియోలను కొందరు నెటిజన్లు షేర్ చేసి, 'కొద్ది రోజుల్లోనే కాబోయే భర్త గురించి విభిన్నమైన అభిప్రాయాలు చెప్పడం సరైంది కాదు' అంటూ మృణాల్‌ను ట్రోల్ చేశారు. దీనిపై మృణాల్ కూడా స్పందించారు. ''ఆర్టిస్టులు కూడా మనుషులే అనే విషయాన్ని కొందరు కొన్నిసార్లు ఎందుకో మర్చిపోతుంటారు. కొత్త విషయాలు నేర్చుకుంటూ ప్రజలు తెలివైనవారు అవుతున్నారు. అయినా జీవితాంతం ఒకే ఆలోచనకు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదనుకుంటున్నా'' అన్నారు మృణాల్.



● రకుల్, తేజస్

హ్యాపీ హ్యాపీగా...

రకుల్ ప్రీత్‌సింగ్ ప్రధాన పాత్రలో సుమిత్ వ్యాస్, సతీష్ కౌశిక్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'ఛత్రీవాలి'. తేజస్ ప్రభ విజయ్ దేవాస్కర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం గత నెల 20 నుంచి ఓ ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమాకు వీక్షకుల నుంచి మంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చిందని హ్యాపీగా ఫీలవుతున్నారు రకుల్. కొత్త ఏడాది తొలి విజయం దక్కడంతో ఆమె ముంబయ్‌లోని సిద్ధి వినాయక స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆమెతో పాటు తేజస్ ప్రభ విజయ్ దేవాస్కర్ కూడా ఈ పూజల్లో పాల్గొన్నారు. ఈ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు రకుల్. కాగా కమల్‌హాసన్ హీరోగా నటిస్తున్న 'ఇండియన్ 2'లో చిత్రంలో రకుల్ కీలక పాత్ర చేస్తున్నారు.

ఫారిన్‌లో ఫైట్



● అఖిల్

ఫారిన్‌లో యాక్షన్ ప్లాన్ చేశారు 'ఏజెంట్'. అఖిల్ హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న స్టైలిష్ యాక్షన్ స్పై థ్రిల్లర్ 'ఏజెంట్'. ఇందులో సాక్షీ వైద్య హీరోయిన్. ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, సురేందర్ 2 సినిమా పతాకాలపై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ తుది దశకు చేరుకుంటోంది. ఇందులో భాగంగా ఓ ఫారిన్ షెడ్యూల్‌ను ప్లాన్ చేశారట యూనిట్. ఓ ఫైట్ సీక్వెన్స్ కోసం వచ్చే వారంలో చిత్ర బృందం విదేశాలకు వెళ్లనుందట. ఈ షెడ్యూల్‌తో 'ఏజెంట్' షూటింగ్ దాదాపు పూర్తవుతుందట. అయితే ఈ విషయాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. కాగా ఏప్రిల్ 28న 'ఏజెంట్' రిలీజ్ కానుంది. మమ్ముట్టి కీలక పాత్ర చేస్తున్న ఈ సినిమాకు సహ నిర్మాతలు: అజయ్ సుంకర, దీపా రెడ్డి, కెమెరా: రసూల్ ఎల్లోర్, సంగీతం: హిప్ హాప్ తమిజా.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

దివంగత నటి, దర్శక–నిర్మాత విజయనిర్మల మనవడు శరణ్ కుమార్ (నటుడు నరేశ్ కజిన్ రాజ్ కుమార్ తనయుడు) హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'మిస్టర్ కింగ్'. శశిధర్ చావలి దర్శకత్వం వహించారు. యశ్విక నిష్కల, ఊర్వీ సింగ్ కథానాయికలు. హన్విక క్రియేషన్ బ్యానర్‌పై బీఎన్ రావు నిర్మించిన ఈ మూవీ ఈ నెల 24న విడుదలకానుంది. శరణ్ కుమార్ మాట్లాడుతూ– ''మిస్టర్ కింగ్ నా మొదటి సినిమా. ప్రేక్షకుల ప్రేమ, సపోర్ట్ కావాలి.



● శశిధర్, శరణ్ కుమార్, ఊర్వీ సింగ్, బీఎన్ రావు, యశ్విక

మా సినిమాని చూసి ఆశీర్వదించాలి'' అన్నారు. ''యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. అమ్మాయి ఉన్న ప్రతి కుటుంబం, ఆత్మగౌరవం ఉన్న ప్రతి అబ్బాయి చూడాల్సిన మూవీ'' అన్నారు శశిధర్ చావలి. ''మా చిత్రాన్ని అందరూ థియేటర్‌లో చూడాలి'' అన్నారు బీఎన్ రావు. ఈ కార్యక్రమంలో యశ్విక నిష్కల, ఊర్వీ సింగ్, కెమెరామేన్ తన్వీర్, నటుడు రాజ్ కుమార్ మాట్లాడారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: రవి కిరణ్ చావలి, సంగీతం: మణిశర్మ.

కొత్త కబురు



● మాధవన్

హీరో మాధవన్ కొత్త కబురు చెప్పారు. తన తర్వాతి సినిమా డైరెక్టర్ మిత్రన్‌తో చేయనున్నట్లు పేర్కొన్నారాయన. తమిళ చిత్ర పరిశ్రమలో గత ఏడాది హిట్ కొట్టిన చిత్రాల్లో 'తిరుచిత్రంబలం' (తెలుగులో 'తిరు') ఒకటి. ధనుష్ హీరోగా నటించిన ఈ సినిమాకు మిత్రన్ ఆర్.జవహర్ దర్శకత్వం వహించారు. ఆ సినిమా హిట్ కావడంతో మిత్రన్‌కి మరో మంచి అవకాశం లభించింది. మాధవన్ హీరోగా ఆయన దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. ''దర్శకుడు మిత్రన్‌తో సినిమా చేయడానికి ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నాను'' అన్నారు మాధవన్. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ మొదలు కానుంది.

18 నుంచి సీసీఎల్ సందడి



● సుశాంత్, ప్రిన్స్, అఖిల్, సుధీర్ బాబు, అశ్విన్ బాబు

పాన్ ఇండియా 'సెలబ్రిటీ క్రికెట్ లీగ్' (సీసీఎల్) సందడి మళ్లీ మొదలు కాబోతుంది. ఈ నెల 18 నుంచి సీసీఎల్ ప్రారంభం కానుంది. ఎనిమిది చలన చిత్ర పరిశ్రమలకు చెందిన బిగ్గెస్ట్ స్టార్స్ జట్లు పోటీపడనున్నాయి. రాయ్‌పూర్, బెంగళూరు, హైదరాబాద్, జోధ్‌పూర్, త్రివేండ్రం, జైపూర్ నగరాలు 19 గేమ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

సీసీఎల్ జట్లు ఇవే.. సల్మాన్ ఖాన్ బ్రాండ్ అంబాసిడర్‌గా రితేష్ దేశ్‌ముఖ్ కెప్టెన్‌గా ముంబై హీరోస్, ఆర్య కెప్టెన్‌గా చెన్నై రైనోస్, వెంకటేష్ కో ఓనర్– అఖిల్ కెప్టెన్‌గా తెలుగు వారియర్స్, మనోజ్ తివారీ కెప్టెన్‌గా భోజ్‌పురి దబాంగ్స్, మోహన్ లాల్ కో ఓనర్‌గా కుంచాకో బోపన్ కెప్టెన్‌గా కేరళ స్ట్రైకర్స్, బోనీ కపూర్ కో ఓనర్‌గా జిసుసేన్ గుప్తా కెప్టెన్‌గా బెంగాల్ టైగర్స్, సుదీప్ కెప్టెన్‌గా కర్ణాటక బుల్డోజర్స్, సోనూసూద్ కెప్టెన్‌గా పంజాబ్ దే షేర్.

సినీ రచయిత యడవల్లి మృతి



● యడవల్లి

తెలుగు, కన్నడ భాషల్లో పలు చిత్రాలకు రచన చేసిన యడవల్లి వెంకట లక్ష్మీ నరసింహశాస్త్రి (వైవీఎల్ఎన్ శాస్త్రి) (75) అనారోగ్యంతో విజయవాడలో శనివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. నెల్లూరుకు చెందిన యడవల్లి విజయవాడలో స్థిరపడ్డారు. నిర్మాత రాధాకృష్ణమూర్తి తెలుగుకి, నటీమణి లక్ష్మి కన్నడ సినీపరిశ్రమకు యడవల్లిని పరిచయం చేశారు. యడవల్లి ప్రస్తుతం కేంద్ర సెన్సార్ బోర్డ్ (సీబీఎఫ్‌సీ) సభ్యునిగా, లాంగ్వేజ్ ఎక్స్‌పర్ట్‌గా కొనసాగేవారు. ఆదివారం విజయవాడలో యడవల్లి అంత్యక్రియలు జరిగాయి.

పాము నిద్ర లేస్తే?

లిక్వెన్ లుట, వాంగ్ జియోలాంగ్, వెంకీ జాట, గాట షెంగ్వు కీలక పాత్రల్లో గుట మింగర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బిగ్ స్నేక్ కింగ్'. గత ఏడాది మే 11న చైనాలో విడుదలైన ఈ చిత్రం మార్చి 3న ఇండియాలో విడుదలకానుంది. తెలుగులో యేలూరు సురేంద్ర రెడ్డి సమర్పణలో బుద్ధ భగవాన్ పతాకంపై రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ని మంగళవారం విడుదల చేస్తున్నారు. ''చైనాలోని ఒక గ్రామానికి చెందిన లీ అనే వ్యక్తి అక్రమ తవ్వకాల కోసం కొంతమందిని ఓ గుహ వద్దకు తీసుకెళతాడు. వారి కారణంగా ఆ గుహలో నిద్రపోతున్న అతిపెద్ద పాము నిద్ర లేస్తుంది? ఆ తర్వాత ఏం జరిగింది? అనే కథ ఆసక్తిగా ఉంటుంది'' అన్నారు యేలూరు సురేంద్ర రెడ్డి.



● 'బిగ్ స్నేక్ కింగ్' పోస్టర్

మహంకాళి వస్తోందయ్యా...



● హ్రిదు హరూన్

ప్రముఖ నృత్య దర్శకురాలు బృందా గోపాల్ డైరెక్షన్‌లో రూపొందిన పాన్ ఇండియా చిత్రం 'థగ్స్'. ఈ చిత్రం ద్వారా నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ శిబు తమీన్స్ కుమారుడు హ్రిదు హరూన్ హీరోగా పరిచయమవుతున్నారు. హెచ్ఆర్ పిక్చర్స్ బ్యానర్ సమర్పణలో జియో స్టూడియోస్‌తో కలిసి శిబు నిర్మించారు. ఈ చిత్రం తెలుగులో 'కోనసీమ థగ్స్' పేరుతో విడుదలకానుంది. శామ్ సీఎస్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'వీర శూర మహంకాళి వస్తోందయ్యా...' అంటూ సాగే ఈ పాటని విడుదల చేశారు. వనమాలి సాహిత్యం అందించిన ఈ గీతాన్ని కాలభైరవ పాడారు.



సెమీస్‌లో పోరాడి ఓడిన సాకేత్ జోడీ

డాలస్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ సెమీఫైనల్లో ఓటమి పాలైంది. పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాకేత్-యూకీ ద్వయం 6-7 (11/13), 5-7తో లామోన్స్-విత్రో (అమెరికా) జోడీ చేతిలో ఓడింది. గంటా 43 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్-యూకీ మూడుసార్లు బ్రేక్ పాయింట్ అవకాశాలను వృథా చేసుకున్నారు. సాకేత్-యూకీలకు 12,230 డాలర్ల (రూ. 10 లక్షలు) ప్రైజ్‌మనీ, 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



ఫైనల్ చేరిన తొలి చైనా ప్లేయర్‌గా...

మహిళల టెన్నిస్‌లో చైనా నుంచి గ్రాండ్‌స్లామ్ చాంపియన్స్ ఉన్నా... పురుషుల టెన్నిస్‌లో మాత్రం ఇప్పటివరకు ఒక్కరు కూడా కనీసం ఏటీపీ టోర్నీలోనూ ఫైనల్‌కు చేరుకోలేకపోయారు. అయితే డాలస్ ఓపెన్‌లో 23 ఏళ్ల యిబింగ్ వు ఈ లోటును తీర్చాడు. ఈ టోర్నీ సెమీఫైనల్లో 97వ ర్యాంకర్ యిబింగ్ వు 6-7 (3/7), 7-5, 6-4తో 8వ ర్యాంకర్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)ను ఓడించి ఏటీపీ టోర్నీలో ఫైనల్ చేరిన తొలి చైనా ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు.

నేడు డబ్ల్యూపీఎల్ వేలం

మధ్యాహ్నం గం. 2:30 నుంచి స్పోర్ట్స్ 18 చానెల్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ముంబై: బీసీసీఐ ఆధ్వర్యంలో తొలిసారి నిర్వహించనున్న మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 టోర్నీ క్రికెటర్ల వేలం కార్యక్రమం నేడు జరగనుంది. మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు మొదలయ్యే ఈ కార్యక్రమాన్ని స్పోర్ట్స్ 18 చానెల్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. మహిళా లీగ్ వేలం మహిళ మల్లిక సాగర్ నేతృత్వంలో జరగనుండటం విశేషం. మల్లిక 2021లో ప్రొ కబడ్డీ లీగ్ వేలం కార్యక్రమాన్ని నిర్వహించింది. మొత్తం 90 బెర్త్‌ల కోసం 409 మంది క్రికెటర్లు వేలం బరిలో ఉన్నారు. ఇందులో భారత్ నుంచి 246 మంది... విదేశీ జట్ల నుంచి 163 మంది ఉన్నారు. హర్మన్ ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, షఫాలీ వర్మ, దీప్తి శర్మ, రేణుక సింగ్, రిచా ఘోష్ (భారత్), ఎలీస్ పెర్రీ, బెత్ మూనీ, అలీసా హీలీ, మేగన్ షుట్ (ఆస్ట్రేలియా), నాట్ సివెర్, సోఫీ ఎకిల్‌స్టోన్ (ఇంగ్లండ్), డియాండ్ర డాటిన్ (వెస్టిండీస్) తదితరులకు భారీ మొత్తం లభించే అవకాశముంది. ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, ఆర్‌సీబీ, గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్జ్ జట్లు పాల్గొంటున్న డబ్ల్యూపీఎల్ మార్చి 4 నుంచి 26 వరకు ముంబైలో జరుగుతుంది.

ధర్మశాల టెస్టు వైజాగ్‌లో?

భారత్, ఆస్ట్రేలియా మూడో టెస్టు వేదిక మార్పు!



న్యూఢిల్లీ: భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య మార్చి 1 నుంచి ధర్మశాలలో జరగాల్సిన మూడో టెస్టు వేదిక మారనుంది. హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌పీసీఏ)కు చెందిన ఈ మైదానంలో అసంపూర్తి పనులవల్ల మ్యాచ్ వేదికను మార్చాల్సి వస్తుందని బీసీసీఐ ఉన్నతస్థాయి వర్గాలు తెలిపాయి. ధర్మశాల స్టేడియంలోని అవుట్ ఫీల్డ్ సహా పిచ్‌పై పచ్చికను కొత్తగా పరిచారు. పిచ్‌ను ఇంకా పరీక్షించలేదు. అక్కడక్కడ పనులు ఇంకా పూర్తవలేదు. ప్యాచ్ వర్క్ అలాగే మిగిలిపోయింది. అందువల్లే ఐదు రోజుల ఆట (టెస్టు మ్యాచ్)ను అసంపూర్ణమైన మైదానంలో నిర్వహించడం సమంజసం కాదని బీసీసీఐ భావిస్తోంది. మూడో టెస్టుకు ప్రత్యామ్నాయ వేదికలుగా వైజాగ్, బెంగళూరు, ఇండోర్, రాజ్‌కోట్‌లను బోర్డు పరిశీలిస్తోంది.

మన అమ్మాయిలు...

అదరగొట్టారు

గత మెగా టోర్నీ రన్నరప్ భారత్... ఈ టి20 ప్రపంచకప్‌లో పాకిస్తాన్ పనిపట్టి శుభారంభం చేసింది. చిరకాల ప్రత్యర్థి నుంచి క్లిష్టమైన లక్ష్యమే ఎదురైనా... కీలకమైన ఈ మ్యాచ్‌కు డాషింగ్ ఓపెనర్ స్మృతి మంధాన గాయంతో గైర్హాజరైనా... టాపార్డర్ బాధ్యతాయుతమైన బ్యాటింగ్‌తో భారత మహిళలు చక్కని విజయం సాధించారు.

- పాక్‌పై 7 వికెట్లతో భారత్ జయభేరి
- రాణించిన జెమీమా, షఫాలీ, రిచా
- బిస్మా మారూఫ్ శ్రమ వృథా
- మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీ

కేప్‌టౌన్: భారత్ మహిళల జట్టు ముందున్న లక్ష్యం 150. కానీ 93 పరుగుల వద్ద 14వ ఓవర్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (16; 2 ఫోర్లు) అవుటైంది. 16వ ఓవర్లో రిచా ఘోష్‌ను ఎల్బీగా అంపైర్ ప్రకటించింది. భారత్ రివ్యూకెళ్లింది. స్కోరేమో 109/3. విజయానికి 24 బంతుల్లో 41 పరుగులు కావాలి. ఈ దశలో రివ్యూలో బంతి రిచా గ్లౌజ్‌ను తాకినట్లు తేలడంతో బతికిపోయింది. అక్కడి నుంచి టీమిండియా ఆట మారిపోయింది. కాస్త కఠినమైన సమీకరణాన్ని జెమీమా-రిచా జోడీ 19వ ఓవర్లోనే ముగించింది. దాంతో టి20 ప్రపంచకప్ టోర్నీ గ్రూప్ 'బి' మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌పై గెలిచింది. టాస్ గెలిచిన పాక్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. పాకిస్తాన్ 12.1 ఓవర్లలో 68 పరుగులకే కీలకమైన 4 వికెట్లను కోల్పోయిన దశలో కెప్టెన్ బిస్మా మారూఫ్ (55 బంతుల్లో 68 నాటౌట్; 7 ఫోర్లు), అయేషా నసీమ్ (25 బంతుల్లో 43 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆదుకున్నారు. వీరిద్దరు అబేధ్యమైన ఐదో వికెట్‌కు 81 పరుగులు జోడించారు. అనంతరం భారత్ 19 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 151 పరుగులు చేసి గెలిచింది. ప్రపంచకప్ మ్యాచ్‌లో భారత్‌కిదే అత్యధిక ఛేదన కావడం విశేషం. ఓవరాల్‌గా టి20 ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌పై భారత్‌కిది ఐదో విజయం. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జెమీమా రోడ్రిగ్స్ (38 బంతుల్లో 53 నాటౌట్; 8 ఫోర్లు), రిచా ఘోష్ (20 బంతుల్లో 31 నాటౌట్; 5 ఫోర్లు) గెలిపించారు. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను ఈనెల 15న వెస్టిండీస్‌తో ఆడుతుంది.



జెమీమా విజయ గర్జన



రిచా

గెలిపించిన జెమీమా

ఓపెనింగ్‌లో షఫాలీ వర్మ (25 బంతుల్లో 33; 3 ఫోర్లు) మెరుగ్గానే ఆడినప్పటికీ... యస్తిక భాటియా (17) తక్కువ స్కోరుకే వెనుదిరిగింది. క్రీజులోకి జెమీమా రాగా భారీ షాట్లపై గురిపెట్టిన షఫాలీ... సిద్రా అమీన్ చక్కని క్యాచ్‌కు పెవిలియన్ చేరింది. రెండు బౌండరీలతో ఊపు మీదున్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌ను నష్రా సంధు బోల్తా కొట్టించింది. దీంతో రిచా ఘోష్ క్రీజులోకి రాగా... 15వ ఓవర్లో జట్టు స్కోరు వంద పరుగులు దాటింది. కలిసొచ్చిన రివ్యూతో రిచా, మరోవైపు జెమీమా బౌండరీలతో జట్టు విజయాన్ని సులువు చేశారు. జెమీమా బౌండరీతో భారత విజయాన్ని ఖరారు చేసింది.



అయేషా నసీమ్

బిస్మా మారూఫ్

స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: మునీబా (స్టంప్డ్) రిచా (బి) రాధ 12; జవేరియా (సి) హర్మన్‌ప్రీత్ (బి) దీప్తి 8; బిస్మా మారూఫ్ (నాటౌట్) 68; నిదా దార్ (సి) రిచా (బి) పూజ 0; సిద్రా అమీన్ (సి) రిచా (బి) రాధ 11; అయేషా (నాటౌట్) 43; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 149.** **వికెట్ల పతనం:** 1-10, 2-42, 3-43, 4-68. **బౌలింగ్:** రేణుక సింగ్ 3-0-24-0, దీప్తి శర్మ 4-0-39-1, రాజేశ్వరి గైక్వాడ్ 4-0-31-0, రాధా యాదవ్ 4-0-21-2, పూజ 4-0-30-1, షఫాలీ వర్మ 1-0-3-0.

భారత్ ఇన్నింగ్స్: యస్తిక (సి) ఫాతిమా (బి) సాదియా 17; షఫాలీ (సి) సిద్రా (బి) నష్రా సంధు 33; జెమీమా (నాటౌట్) 53; హర్మన్‌ప్రీత్ (సి) బిస్మా (బి) నష్రా సంధు 16; రిచా ఘోష్ (నాటౌట్) 31; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (19 ఓవర్లలో 3 వికెట్లకు) 151.** **వికెట్ల పతనం:** 1-38, 2-65, 3-93. **బౌలింగ్:** ఫాతిమా 4-0-42-0, సాదియా 4-0-25-1, ఐమన్ 3-0-33-0, నిదా దార్ 4-0-36-0, నష్రా సంధు 4-0-15-2.

'రికార్డు'తో మెరిసిన జ్యోతి

- ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రజతం
- 60 మీటర్ల హర్డిల్స్‌లో కొత్త జాతీయ రికార్డుతో రెండో స్థానం
- ఈ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళా అథ్లెట్‌గా గుర్తింపు



అస్తానా (కజకిస్తాన్): కొన్నాళ్లుగా అంతర్జాతీయస్థాయిలో నిలకడగా రాణిస్తున్న భారత యువ అథ్లెట్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ తన కెరీర్‌లో గొప్ప విజయం సాధించింది. ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జ్యోతి మహిళల 60 మీటర్ల హర్డిల్స్ విభాగంలో రజత పతకం గెల్చుకుంది. వైజాగ్‌కు చెందిన 24 ఏళ్ల జ్యోతి ఫైనల్ రేసును 8.13 సెకన్లలో ముగించి రెండో స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో జ్యోతి ఈ విభాగంలో మళ్లీ కొత్త జాతీయ రికార్డును నమోదు చేసింది. ఈ ఏడాది 60 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి జాతీయ రికార్డును నెలకొల్పడం ఇది ఐదోసారి కావడం విశేషం. శనివారం జరిగిన హీట్స్‌లో జ్యోతి 8.16 సెకన్లతో జాతీయ రికార్డు సృష్టించగా... రోజు వ్యవధిలోనే తన పేరిటే ఉన్న రికార్డును ఆమె సవరించడం విశేషం. ఫైనల్లో మాసుమి ఆకో (జపాన్; 8.01 సెకన్లు) అందరికంటే వేగంగా లక్ష్యాన్ని దాటి స్వర్ణ పతకం సొంతం చేసుకోగా... చెన్ జియామిన్ (చైనా; 8.15 సెకన్లు) కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఆదివారం ముగిసిన ఈ మెగా ఈవెంట్‌లో భారత్ ఒక స్వర్ణం, ఆరు రజతాలు, ఒక కాంస్యంతో కలిపి మొత్తం ఎనిమిది పతకాలు సాధించి నాలుగో స్థానంలో నిలిచింది.

1 తాజా ప్రదర్శనతో జ్యోతి 19 ఏళ్ల ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ చరిత్రలో 60 మీటర్ల హర్డిల్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారతీయ అథ్లెట్‌గా నిలిచింది. 2008లో దోహా ఆతిథ్యమిచ్చిన ఆసియా ఈవెంట్‌లో భారత్‌కే చెందిన లీలావతి వీరప్పన్ 9.21 సెకన్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం సాధించింది. జ్యోతి రజతం గెలిచి ఈ ఘనత సాధించిన తొలి భారత అథ్లెట్‌గా గుర్తింపు పొందింది.

రంజీ ట్రోఫీ ఫైనల్లో సౌరాష్ట్ర, బెంగాల్



సౌరాష్ట్ర జట్టు

బెంగళూరు: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో మాజీ చాంపియన్స్ సౌరాష్ట్ర, బెంగాల్ జట్లు ఫైనల్లోకి దూసుకెళ్లాయి. బెంగళూరులో ఆదివారం ముగిసిన సెమీఫైనల్లో సౌరాష్ట్ర నాలుగు వికెట్ల తేడాతో కర్ణాటక జట్టును... ఇండోర్‌లో జరిగిన మరో సెమీఫైనల్లో బెంగాల్ 306 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ మధ్యప్రదేశ్‌పై గెలుపొందాయి. ఈనెల 16 నుంచి కోల్‌కతాలో జరిగే ఫైనల్లో సౌరాష్ట్ర, బెంగాల్ తలపడతాయి. ఆట చివరిరోజు ఓవర్‌నైట్ స్కోరు 123/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కర్ణాటక 234 పరుగులకు ఆలౌటైంది. అనంతరం సౌరాష్ట్ర 115 పరుగుల లక్ష్యాన్ని ఆరు వికెట్లు కోల్పోయి ఛేదించింది. మరోవైపు బెంగాల్ నిర్దేశించిన 548 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన మధ్యప్రదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 241 పరుగులకు ఆలౌటైంది.

మోతీ మాయాజాలం



బులవాయో: వెస్టిండీస్ ఎడంచేతి వాటం స్పిన్నర్ గుడకేశ్ మోతీ (7/37) మాయాజాలానికి... రెండో టెస్టులో జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 40.5 ఓవర్లలో 115 పరుగులకే కుప్పకూలింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ ఆట ముగిసే సమయానికి 4 వికెట్లకు 133 పరుగులు చేసింది. రీఫెర్ (53; 4 ఫోర్లు, 1 సిక్స్), తేజ్‌నారాయణ్ (36; 4 ఫోర్లు) రాణించారు. కైల్ మేయర్స్ (8 బ్యాటింగ్), రోస్టన్ ఛేజ్ (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.


భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-4 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com



సివిల్స్-2023

టార్గెట్ ఐఏఎస్

యూపీఎస్సీ.. సివిల్స్ ఎగ్జామ్..పరిచయం అక్కర్లేని పరీక్ష! ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి..అత్యున్నత సర్వీసులకు మెరికల్లాంటి అభ్యర్థులను ఎంపిక చేసే.. పరీక్ష! తాజాగా..యూపీఎస్సీ సివిల్స్-2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 1,105 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో..సివిల్స్ ఎంపిక విధానం, పోస్టుల సంఖ్య, భర్తీ చేయనున్న సర్వీసులు, విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు..

» సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్-2023 నోటిఫికేషన్
» 1,105 పోస్టులు భర్తీ చేయనున్న యూపీఎస్సీ
» ఐఏఎస్, ఐపీఎస్,ఐఎఫ్ఎస్ సహా 21 సర్వీసులు
» ఈ ఏడాది కొత్తగా పాండిచ్చేరి పోలీస్ సర్వీస్
» మే 28న తొలి దశ ప్రిలిమినరీ ఎగ్జామ్

21 సర్వీసులు..1,105 పోస్టులు

సివిల్స్ 2023 ద్వారా 21 సర్వీసుల్లో మొత్తం 1,105 పోస్టులను భర్తీ చేయనున్నారు. గత ఏడాది సివిల్స్-2022 సవరణ నోటిఫికేషన్‌లో చేర్చిన ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్‌ను ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నారు. అదే విధంగా పాండిచ్చేరి పోలీస్ సర్వీస్ గ్రూప్-బిని ఈ ఏడాది నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. గతేడాది కంటే పోస్టుల సంఖ్య పెరగడం అభ్యర్థులకు కలిసొచ్చే అంశంగా చెప్పొచ్చు. గత సంవత్సరం 1,011పోస్టులనే భర్తీ చేశారు.

అర్హతలు

- బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. 2023 చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వారు మెయిన్ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే సమయానికి ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.
- **వయసు:** ఆగస్ట్ 1, 2023 నాటికి 21 నుంచి 32 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

అయిదు లక్షలకు పైగా

గత కొన్నేళ్లుగా సివిల్స్ తొలిదశ ప్రిలిమ్స్‌కు దాదాపు అయిదు లక్షల మంది హాజరవుతున్నారు. వాస్తవానికి దరఖాస్తులు పది లక్షలకు పైగా ఉంటున్నాయి. పరీక్షకు హాజరయ్యే వారి సంఖ్య మాత్రం 50 శాతానికి కొంచెం అటు, ఇటుగా ఉంటోంది. పోస్టుల సంఖ్యను.. పోటీ పడే వారి సంఖ్యను దృష్టిలో పెట్టుకుంటే.. ఒక్కో పోస్టుకు దాదాపు అయిదు వందల మంది పోటీ పడుతుంటారు. వీరిలో రెండో దశ మెయిన్స్‌కు ఎంపికయ్యే వారి సంఖ్య.. 13 వేల వరకు ఉంటోంది. అంటే.. తొలి దశ ప్రిలిమ్స్‌లో రాణించడమే అత్యంత కీలకమైన ఘట్టంగా పేర్కొనొచ్చు.

దరఖాస్తు ఉపసంహరణకు నో ఛాన్స్

ఈ ఏడాది సివిల్స్‌లో దరఖాస్తు ఉపసంహరణ అవకాశాన్ని తొలగించారు. దీంతో అభ్యర్థులు దరఖాస్తు దశలోనే ఎంతో అప్రమత్తంగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత నెలకొంది. పరీక్ష రాయదలచుకున్న మాధ్యమం, ఆప్షనల్ సబ్జెక్ట్స్ పేర్కొనడం వంటి విషయాల్లో ముందుగానే పూర్తి స్పష్టత ఏర్పరచుకుని దరఖాస్తుకు ఉపక్రమించాలి.

మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ

- సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియను మొత్తం మూడు దశల్లో నిర్వహిస్తారు. అవి..
- ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ(పర్సనాలిటీ టెస్ట్).

400 మార్కులకు ప్రిలిమ్స్

- సివిల్స్ ఎంపిక ప్రక్రియలో తొలి దశ ప్రిలిమ్స్ పరీక్ష రెండు పేపర్లలో నాలుగు వందల మార్కులకు నిర్వహిస్తారు. అవి..
- **పేపర్-1:** జనరల్ స్టడీస్: 100 ప్రశ్నలు-200 మార్కులు.
- **పేపర్-2:** ఆప్టిట్యూడ్ టెస్ట్: 80 ప్రశ్నలు-200 మార్కులు; ప్రిలిమినరీ పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో మల్టిపుల్ ఛాయిస్ కొశ్చన్స్‌తో నిర్వహిస్తారు.
- ప్రిలిమ్స్ పేపర్-1(జనరల్ స్టడీస్)లో నిర్దిష్ట కటాఫ్ మార్కులను సాధించిన వారిని రెండో దశ మెయిన్ ఎగ్జామినేషన్‌కు ఎంపిక చేస్తారు.
- పేపర్-2లో కనీసం 33 శాతం మార్కులు సాధించాలనే నిబంధన కూడా ఉంది.
- ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు.. ఒక్కో పోస్టుకు 12 లేదా 13 నిష్పత్తిలో ఎంపిక చేస్తారు.

మెయిన్ ఏడు పేపర్లు..1750 మార్కులు

- సివిల్స్ ఎంపిక ప్రక్రియలో రెండో దశ పరీక్ష మెయిన్‌లో రెండు లాంగ్వేజ్ పేపర్లు, ఒక జనరల్ ఎస్సే పేపర్, నాలుగు జనరల్ స్టడీస్ పేపర్లు, రెండు ఆప్షనల్ పేపర్లతో నిర్వహిస్తారు. అర్హత పేపర్లలో సాధించిన మార్కులను తుది జాబితా రూపకల్పనలో పరిగణనలోకి తీసుకోరు. కానీ వీటిలో తప్పనిసరిగా కనీస అర్హత మార్కులు సాధిస్తేనే మెయిన్ ఎగ్జామ్‌లోని మిగతా పేపర్లను మూల్యాంకన చేస్తారు.
- **అర్హత పేపర్లు:** పేపర్ ఏ-ఇండియన్ లాంగ్వేజ్ 300 మార్కులకు, పేపర్ బీ-ఇంగ్లిష్ 300 మార్కులకు ఉంటాయి. ఇండియన్ లాంగ్వేజ్, ఇంగ్లిష్ పేపర్లు కేవలం అర్హత పేపర్లే. ఇండియన్ లాంగ్వేజ్‌కు సంబంధించి అభ్యర్థులు 21 భాషల్లో పరీక్ష రాయొచ్చు. ప్రతి పేపర్‌లోనూ తప్పనిసరిగా 25శాతం మార్కులు సాధించాలి.
- **మెయిన్.. ర్యాంకింగ్ పేపర్స్:** పేపర్ 1 జనరల్ ఎస్సే(1)- 250 మార్కులు, పేపర్ 2 జనరల్ స్టడీస్-1(ఇండియన్ హెరిటేజ్, కల్చర్, హిస్టరీ అండ్ జాగ్రఫీ ఆఫ్ ద వరల్డ్ అండ్ సొసైటీ) 250 మార్కులకు; పేపర్ 3 జనరల్ స్టడీస్-2(గవర్నెన్స్,కాన్‌స్టిట్యూషన్, పాలిటీ, సోషల్ జస్టిస్, అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్) 250 మార్కులకు; పేపర్-4 జనరల్ స్టడీస్-3(టెక్నాలజీ, ఎకనామిక్ డెవలప్‌మెంట్, బయో డైవర్సిటీ, ఎన్విరాన్‌మెంట్, సెక్యూరిటీ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్) 250 మార్కులకు; పేపర్-5 జనరల్ స్టడీస్-4 (ఎథిక్స్, ఇంటిగ్రిటీ, ఆప్టిట్యూడ్) 250 మార్కులకు; పేపర్-6 ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్-1 ,250 మార్కులకు; పేపర్-7 ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్-2, 250 మార్కులకు ఉంటాయి.
- మొత్తం ఏడు పేపర్లలో 1750 మార్కులకు పూర్తి డిస్క్రిప్టివ్ విధానంలో మెయిన్ పరీక్ష ఉంటుంది. మెయిన్‌లో అర్హత పేపర్లు కాకుండా.. మిగతా పేపర్లనే మెరిట్ జాబితా రూపకల్పనలో పరిగణనలోకి తీసుకుంటారు.
- మెయిన్ ఎగ్జామ్ తర్వాత చివరగా పర్సనాలిటీ టెస్ట్ నిర్వహిస్తారు.
- మెయిన్‌లో ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్టుకు ఇద్దరు లేదా ముగ్గురిని(1:2 లేదా 1:3 నిష్పత్తిలో) పర్సనాలిటీ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు.
- పర్సనాలిటీ టెస్ట్‌కు కేటాయించిన మార్కులు 275.
- మెయిన్‌తోపాటు పర్సనాలిటీ టెస్ట్‌లోనూ చూపిన ప్రతిభ ఆధారంగా తుది విజేతలను ప్రకటించి సర్వీసులు కేటాయిస్తారు.

ప్రిలిమ్స్ సన్నద్ధత

తొలిదశ ప్రిలిమ్స్‌లో పేపర్-1(జనరల్ స్టడీస్)లో.. హిస్టరీ, జాగ్రఫీ, పాలిటీ, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ ఇంటర్నేషనల్ ఈవెంట్స్‌కు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. రెండో పేపర్ సీశాట్‌లో.. రీడింగ్ కాంప్రహెన్షన్, న్యూమరికల్ ఎబిలిటీ, డెసిషన్ మేకింగ్ అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. విద్యార్థులు బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్,పదోతరగతి స్థాయి మ్యాథమెటిక్స్, అర్థమెటిక్ అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.

సమకాలీనంపై పట్టు

సివిల్స్ ప్రిలిమ్స్‌కు సన్నద్ధమయ్యే అభ్యర్థులు కరెంట్ అఫైర్స్‌కు ప్రాధాన్యం ఇవ్వడం ఉపయుక్తంగా ఉంటుంది. కారణం.. గత మూడు, నాలుగేళ్లుగా కరెంట్ అఫైర్స్‌కు సంబంధించిన ప్రశ్నలు కొంత పెరుగుతున్నాయి. అదేవిధంగా కరెంట్ అఫైర్స్ అంశాలను కోర్ టాపిక్స్‌తో అన్వయం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి.

విశ్లేషణాత్మక దృక్పథం

సివిల్స్‌కు సన్నద్ధమయ్యే అభ్యర్థులు పూర్తిగా విశ్లేషణాత్మక దృక్పథంతో ఆయా సబ్జెక్ట్‌లను అధ్యయనం చేయాలి. ఆబ్జెక్టివ్ విధానంలో ఉండే ప్రిలిమ్స్ పరీక్షకు కూడా ఈ దృక్పథాన్ని అనుసరించాలి. ఫలితంగా ఒక విషయంపై అన్ని కోణాల్లో అవగాహన లభిస్తుంది. ఇది మెయిన్స్ ప్రిపరేషన్‌ను సులభతరం చేస్తుంది.

సమ్మిళిత అధ్యయనం

ప్రిలిమ్స్ ప్రిపరేషన్‌లో భాగంగా అభ్యర్థులు ఒక సబ్జెక్ట్‌ను మరో సబ్జెక్ట్‌తో అనుసంధానం చేసుకుంటూ అధ్యయనం చేయాలి. ఉదాహరణకు పాలిటీనే పరిగణనలోకి తీసుకుంటే.. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బిల్లులు.. అవి ఆర్థికంగా, సామాజికంగా ప్రభావం చూపిన పరిస్థితులను ఒకే సమయంలో చదివే అవకాశం ఉంటుంది. అభ్యర్థులు ఈ దృక్పథాన్ని అలవర్చుకోవాలి. గత అయిదారేళ్లుగా ప్రిలిమ్స్‌లో అడుగుతున్న ప్రశ్నల తీరును గమనిస్తే.. ప్రభుత్వం తీసుకున్న శాసన నిర్ణయాలు.. ఆర్థికంగా వాటి ప్రభావం ఎలా ఉంటుంది అనే విధంగా ఉంటున్నాయి.

వీటికి ప్రాధాన్యం

ప్రిలిమ్స్‌లో అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎకాలజీ, జాగ్రఫీలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇటీవల కాలంలో చర్చనీయాంశంగా మారిన పర్యావరణ కాలుష్యం, అందుకు సంబంధించి అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో చేపడుతున్న చర్యలు వంటి అంశాలపై ప్రశ్నలు అడుగుతున్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి ఇటీవల కాలంలో మన దేశం ప్రయోగించిన ఉపగ్రహాలు, వాటి లక్ష్యాలు వంటి వాటి గురించి తెలుసుకోవాలి.

పేపర్-2(సీశాట్-ఆప్టిట్యూడ్ టెస్ట్)కు.. ఇలా

అర్హత పేపర్‌గానే పేర్కొంటున్న పేపర్-2 ఆప్టిట్యూడ్ టెస్ట్‌పై అభ్యర్థులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఈ పేపర్‌లో కనీసం 33 శాతం మార్కులు సాధిస్తేనే పేపర్-1ను మూల్యాంకన చేస్తారు. దాని ఆధారంగా మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. పేపర్ 2 కోసం అభ్యర్థులు బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్, రీడింగ్ కాంప్రహెన్షన్‌లపై పట్టు సాధించాలి. ఇంగ్లిష్ దిన పత్రికలను చదవడం అలవాటు చేసుకోవాలి. న్యూమరికల్ ఎబిలిటీకి సంబంధించి పదో తరగతి స్థాయిలో మ్యాథమెటిక్స్, ప్రధానంగా అర్థమెటిక్‌కు సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలి.

మెయిన్స్‌తో కలిపి

ప్రిలిమ్స్ ప్రిపరేషన్ సమయంలోనే మెయిన్‌తో అనుసంధానం చేసుకుంటూ చదవాలి. ప్రస్తుతం సిలబస్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. మెయిన్‌లో ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్లు, ఎథిక్స్ పేపర్ మినహా మిగతా అన్ని పేపర్లు ప్రిలిమ్స్ జనరల్ స్టడీస్‌లో నిర్దేశించిన విభాగాలకు సంబంధించినవే. కాబట్టి ఆయా సబ్జెక్ట్‌లను డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో చదివితే మెయిన్‌కు కూడా ఉపయుక్తంగా ఉంటుంది. అంతేకాకుండా ఒక టాపిక్‌ను నేపథ్యంతోపాటు సమకాలీన పరిణామాలతోనూ అనుసంధానం చేసుకుంటూ చదివితే.. ప్రిలిమ్స్‌లో అడుగుతున్న విభిన్న శైలి ప్రశ్నలకు సమాధానం ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది.

ఇలా చేస్తే మేలు

సిలబస్‌పై స్పష్టత

ప్రిలిమ్స్ అభ్యర్థులు ముందుగా సిలబస్‌పై స్పష్టత ఏర్పరచుకోవాలి. సిలబస్‌లో పేర్కొన్న అంశాలు, సదరు అంశాల్లో తమ వ్యక్తిగత సామర్థ్య స్థాయి తెలుసుకోవాలి. ఫలితంగా తాము ఎక్కువగా దృష్టి సారించాల్సిన అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. దీనిద్వారా సదరు అంశాలకు ఏ స్థాయిలో సమయం కేటాయించాలి? ఏ పుస్తకాలు చదవాలి? అనే విషయాలపైనా స్పష్టత వస్తుంది.

ప్రామాణిక పుస్తకాలు

అభ్యర్థులు పుస్తకాల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలి. సిలబస్‌కు అనుగుణంగా ప్రామాణిక పుస్తకాలను చదవాలి. ముఖ్యంగా ఒకట్రెండు పుస్తకాలకు పరిమితం అవడం మేలు. అదే విధంగా.. గత ప్రశ్న పత్రాలను పరిశీలించి.. ప్రశ్నల శైలిపైగా అవగాహన పెంచుకోవాలి.

టైమ్ మేనేజ్‌మెంట్

నిర్దిష్ట సమయ పాలన పాటిస్తూ ప్రిపరేషన్ సాగించాలి. ప్రతి రోజు కనీసం ఎనిమిది గంటలు ప్రిపరేషన్ సాగించే విధంగా సమయ ప్రణాళిక రూపొందించుకోవాలి.ప్రతిరోజు అన్ని సబ్జెక్ట్‌లను చదివే విధంగా వ్యవహరించాలి.ఒక సబ్జెక్ట్ పూర్తయ్యాక మరో సబ్జెక్ట్ చదువుదాం అనే ధోరణి సరికాదు.

రివిజన్‌కు ప్రాధాన్యం

అభ్యర్థులు సిలబస్ అంశాల అధ్యయనంతో పాటు వాటి రివిజన్‌కు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రిలిమ్స్ పరీక్ష తేదీకి నెల రోజుల ముందు నుంచి పూర్తిగా రివిజన్‌కే సమయం కేటాయించాలి. అదేవిధంగా మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లకు హాజరు కావడం కూడా మేలు చేస్తుంది.

పట్టు సాధించాల్సిన అంశాలు

- **చరిత్ర:** ఆధునిక చరిత్ర; జాతీయోద్యమం; ప్రాచీన, మధ్యయుగ చరిత్రకు సంబంధించి సాహిత్యం, కళలు, మత ఉద్యమాలు, రాజకీయ-సామాజిక- ఆర్థిక చరిత్ర అంశాలు.
- **పాలిటీ: రాజ్యాంగం:** రాజ్యాంగ పరిషత్, రాజ్యాంగ సవరణ ప్రక్రియ, పీఠిక, ముఖ్య రాజ్యాంగ సవరణలు, రాష్ట్రపతి, గవర్నర్, పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు, సుప్రీంకోర్టు, హైకోర్టు, ఎన్నికల కమిషన్, ఆర్థిక కమిషన్, పబ్లిక్ సర్వీస్ కమిషన్లు, అటార్నీ జనరల్, అడ్వకేట్ జనరల్,పంచాయతీరాజ్ వ్యవస్థ: కేంద్ర-రాష్ట్ర సంబంధాలు; ఇటీవల కాలంలో చర్చనీయాంశంగా మారిన అంశాలు.
- **ఎకానమీ:** ఆర్థికాభివృద్ధిలో సహజవనరులు-మూలధన వనరుల పాత్ర; ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాల ప్రగతి(వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, సేవారంగం); ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో దేశంలో ఆర్థిక-సాంఘికాభివృద్ధి; పారిశ్రామిక తీర్మానాలు-వ్యవసాయ విధానం; నీతి అయోగ్; బ్యాంకింగ్ రంగం ప్రగతి-సంస్కరణలు; తాజా మానవాభివృద్ధి, ప్రపంచ అభివృద్ధి నివేదికలు; ఎకనామిక్ సర్వే, బడ్జెట్.
- **సైన్స్ అండ్ టెక్నాలజీ:** పరీక్షకు ముందు ఏడాది కాలంలో ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాలు; ఇటీవల కాలంలో సంభవిస్తున్న వ్యాధులు-కారకాలు; ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అందుకు సంబంధించి ప్రభుత్వ పరంగా తీసుకుంటున్న చర్యలు; రక్షణ రంగంలో కొత్త మిస్సైల్స్ ప్రయోగాలు; ముఖ్యమైన ఘట్టాలు, సంఘటనలు; ఏడాది కాలంలో జరిగిన జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** ఫిబ్రవరి 21, 2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** ఫిబ్రవరి 22-28, 2023
- **ప్రిలిమ్స్ పరీక్ష తేదీ:** మే 28, 2023
- **తెలుగు రాష్ట్రాల్లో ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
124	37
60,683	17,856

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

నాస్‌డాక్	11,718	▽	71
డోజోన్స్	33,869	△	169
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,882	△	29
డాక్స్	15,308	△	215
షాంఘై	3,261	▽	10
నికాయ్	27,671	△	87

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎంతం	80.67	84.35
£	బ్రిటన్ పౌండ్	ఎంతం	86.60	90.50
€	యూరో	ఎంతం	97.57	102.35
¥	జపాన్ ఎన్ (100)	ఎంతం	50.00	76.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎంతం	54.74	59.55
S$	సింగపూర్ డాలర్	ఎంతం	59.83	64.37
SAR	సౌదీ రియాల్		21.00	22.68
UAE D	యూఏఈ దిర్హామ్		21.56	23.36
¥	చైనా యువాన్		10.99	13.07

ఇల్లు కొనాలా.. అద్దెకు ఉండాలా..?

రెండింటికీ పన్ను ప్రయోజనాలు
- అవసరాన్ని బట్టి నిర్ణయం
- వేర్వేరుగా పన్ను భారం
- రుణంపై ఇంటితో ఆస్తి సమకూరినట్లే
- కానీ అద్దెతో పోలిస్తే రుణ ఈఎంఐ అధికం

సొంతంగా ఇల్లు సమకూర్చుకోవాలా..? లేదంటే అద్దె ఇంట్లో ఉంటే ప్రయోనమా? ఈ విషయంలో చాలా మంది అయోమయాన్ని ఎదుర్కొంటూ ఉంటారు. నిజానికి గణాంకాల సహితంగా తెలుసుకుంటే కానీ, తీరే సందేహం కాదు ఇది. అప్పు తీసుకుని అయినా ఇల్లు సమకూర్చుకోవాలని, అదే లాభదాయకమని కొందరు బలంగా నమ్ముతుంటారు. భూమి ధర ఎప్పటికైనా పెరిగేదే కదా, దీనితో ఆస్తి విలువ ఇతోధికం అవుతుందని భావిస్తుంటారు. కానీ, గతంలో ఉన్నంతగా భూమి విలువ వృద్ధి ఇక ముందూ ఉంటుందని చెప్పలేం. అలాగే, సొంతిల్లు పనిచేస్తున్న ప్రదేశానికి సమీపంలో ఉంటుందని కూడా చెప్పలేం. ఇదే నిజమైతే కార్యాలయానికి వచ్చి వెళ్లేందుకు రోజూ అదనపు సమయం, ఇంధనం రూపేణా అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుంది. అయినా కానీ, ఇల్లంటే నాలుగు గోడలు కాదు.. ఎన్నో జ్ఞాపకాలు, కలల నిలయం అని ఎక్కువ మంది చెబుతారు. కనుక సొంతింటి కలను రుణం రూపంలో నెరవేర్చుకుంటే లేదా అద్దె ఇంట్లో ఉంటే పన్ను కోణంలో ఉండే లాభ, నష్టాలను తెలుసుకుందాం.



ఎవరికి ఎలా ప్రయోజనం..?

ఎక్స్ అనే వ్యక్తి స్థూల వార్షిక ఆదాయం రూ.20లక్షలు. నెలవారీగా అద్దె కింద రూ.30వేలు చెల్లిస్తున్నాడు. వై అనే వ్యక్తి వార్షిక ఆదాయం కూడా రూ.20 లక్షలే. కానీ, అతడు సొంత ఇంట్లో నివసిస్తున్నాడు. ఇంటి రుణంపై ఏటా రూ.3 లక్షలు వడ్డీ కింద, రూ.1.5 లక్షలు అసలు కింద చెల్లిస్తున్నాడు. ఇప్పుడు వీరికి నికర పన్ను భారం (ఆదాయపన్ను పాత విధానం కింద) ఎలా ఉంటుందని చూస్తే.. (పక్క బాక్స్‌లో) →

	ఎక్స్	వై
మూల వేతనం (రూ.లలో)	10,00,00	10,00,000
హెచ్‌ఆర్‌ఏ	5,00,000	5,00,000
స్పెషల్ అలవెన్స్	5,00,000	5,00,000
స్థూల వేతనం	20,00,000	20,00,000
హెచ్‌ఆర్‌ఏ మినహాయింపు	-2,60,000	...
స్టాండర్డ్ డిడక్షన్	-50,000	-50,000
నికర వేతనం	16,90,000	19,50,000
ఇంటిపై ఆదాయం	...	-2,00,00
స్థూల మొత్తం ఆదాయం	16,90,000	17,50,000
80సీ డిడక్షన్	1,50,000	1,50,000
నికర పన్ను ఆదాయం	15,40,000	16,00,000
మొత్తం పన్ను	2,85,480	3,04,200

సొంతింటి కల..

రుణంపై సొంత ఇంటిని సమకూర్చుకుంటే మంచి పన్ను ఆదా ప్రయోజనాలు 'ఆదాయపన్ను పాత విధానం'లో ఉన్నాయి. నెలవారీ చెల్లించే ఈఎంఐ మొత్తంలో అసలు, వడ్డీ రెండు భాగాలు. ఈఎంఐలో భాగంగా చెల్లించే రుణం అసలును సెక్షన్ 80సీ కింద క్లెయిమ్ చేయొచ్చు. అలాగే, ఇంటి కొనుగోలుకు చెల్లించిన స్టాంప్ డ్యూటీ చార్జీలు, రిజిస్ట్రేషన్ ఫీజులను కూడా సంబంధిత ఆర్థిక సంవత్సరంలో సెక్షన్ 80సీ కింద చూపించి పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని పొందొచ్చు. వడ్డీ విషయానికొస్తే.. కొనుగోలు చేసిన ఇంట్లోనే నివాసం ఉండే వారు ఇంటి రుణంపై చెల్లించే వడ్డీ భాగం ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠంగా రూ.2 లక్షల మొత్తంపై పన్ను చెల్లించక్కర్లేదు. అంటే ఆదాయంలో రూ.2 లక్షల మేర గృహ రుణానికి చెల్లిస్తున్న వడ్డీ కింద మినహాయింపు చూపించుకోవచ్చు. ఒకవేళ ఇంటిని అద్దెకు ఇచ్చినట్టయితే.. ఆ ఇంటి రుణానికి ఒక ఆర్థిక సంవత్సరంలో చెల్లించే వడ్డీతో పాటు ఆ ఇంటికి చెల్లించే మున్సిపల్ ట్యాక్స్, అద్దె ఆదాయంలో 30 శాతాన్ని స్టాండర్డ్ డిడక్షన్ కింద క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇక మొదటిసారి ఇంటిని కొనుగోలు చేసిన వారు అదనంగా రూ.1.5 లక్షల వడ్డీ చెల్లింపులను సెక్షన్ 80ఈఈఏ కింద పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. కాకపోతే సదరు రుణం 2019 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 మధ్య కాలంలో మంజూరై ఉండాలి. ఇంటి స్టాంప్ డ్యూటీ విలువ రూ.45లక్షలు మించకూడదన్నది షరతు. ఇప్పటి వరకు చెప్పుకున్న ప్రయోజనాలు ఆదాయపన్ను కొత్త విధానంలో లేవు.

సెటాఫ్, క్యారీఫార్వార్డ్

రుణంపై కొనుగోలు చేసిన ఇంటిలో సొంతంగా నివసించే వారు అద్దె రూపంలో ఎలాంటి ఆదాయం లేనట్టయితే.. ఇంటి రుణంపై చెల్లించే వడ్డీని నష్టంగా చట్టం పరిగణిస్తుంది. దీన్ని వేతనం, ఇతర రూపాల్లో వచ్చే ఆదాయం కింద సర్దుబాటు చేసుకోవచ్చు. గరిష్ఠంగా రూ.2లక్షల మొత్తంపై పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. వడ్డీ మొత్తం ఇంతకంటే ఎక్కువ ఉంటే, ఆ నష్టాన్ని తదుపరి ఎనిమిది ఆర్థిక సంవత్సరాల్లో (క్యారీ ఫార్వార్డ్) ఇతర ఆదాయంతో సర్దుబాటు చేసుకునేందుకు అవకాశం ఉంది. ఒక వ్యక్తి రెండు కంటే ఎక్కువ ఇళ్లు కలిగి ఉంటే నోషనల్ రెంట్ అంశం తెరపైకి వస్తుంది. రెండు ఇళ్లనూ సొంతానికి వినియోగించుకుంటున్నారని అనుకుంటే, మిగిలిన ఇళ్లను అద్దెకు ఇచ్చినా ఇవ్వకపోయినా.. చట్టం కింద ఇచ్చినట్టుగానే పరిగణిస్తారు. మార్కెట్‌లో ఉన్న సగటు అద్దె ధరలపై పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

అనుకూలతలు: అద్దె ఇంటితో పోలిస్తే సొంతిల్లు తీసుకోవడం వల్ల ఆస్తి సమకూరుతుంది. ఇంటి రుణానికి చేసే అసలు, వడ్డీ చెల్లింపులపై పన్ను మినహాయింపు ప్రయోజనాలు పొందొచ్చు.

ప్రతికూలతలు: రుణంపై తీసుకున్నప్పటికీ, పన్ను చెల్లింపుదారుడు డౌన్ పేమెంట్ కింద తన వంతు వాటా కట్టాల్సి ఉంటుంది. ప్రాపర్టీ ట్యాక్స్‌లను ఏటా చెల్లించాలి. రిజిస్ట్రేషన్, స్టాంప్‌డ్యూటీ చార్జీలు అదనం. ఇంటికి మరమ్మతుల కోసం వెచ్చించాలి. విక్రయించాలంటే వెంటనే అమ్ముడుపోకపోవచ్చు. అంటే లిక్విడిటీ తక్కువ. ప్రాపర్టీ ధర పెరుగుతుందని, గణనీయంగా పెరుగుతుందని కచ్చితంగా చెప్పలేం. ఉద్యోగం లేదా ఆదాయం నిలిచిపోయినా రుణం, దానిపై వడ్డీ చెల్లించాల్సిందే. చిన్న ఇంటికి వెళ్లి అద్దె భారం తగ్గించుకునే అవకాశం ఉండదు.

అద్దె ఇంట్లో ఉండే వారికి

కంపెనీలు తమ ఉద్యోగులకు హౌస్ రెంట్ అలవెన్స్ (హెచ్‌ఆర్‌ఏ) ని వేతనంలో భాగంగా ఇస్తుంటాయి. ఈ భాగానికి పన్ను ప్రయోజనం ఉంటుంది. స్థూల పన్ను వేతనంలో గరిష్ఠంగా రూ.5,000 వరకు ఉంటుంది. కాకపోతే హెచ్‌ఆర్‌ఏకి పన్ను మినహాయింపు పొందాలంటే పనిచేస్తున్న కార్యాలయం ప్రాంతంలోనే సొంత ఇల్లు కలిగి ఉండకూడదనేది షరతు.

పన్ను ప్రయోజనాలు: అద్దె ఇంట్లో ఉండే వారు, వేతనంలో భాగంగా పొందిన హెచ్‌ఆర్‌ఏపై పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకోవచ్చు. కాకపోతే, హెచ్‌ఆర్‌ఏపై పన్ను మినహాయింపునకు కొన్ని షరతులు ఉన్నాయి. మూల వేతనం, కరువు భత్యం మొత్తంలో 10 శాతం. లేదంటే ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నైలో నివసించే వారు వేతనంలో 50 శాతం, మిగిలిన పట్టణాల్లో నివసించే వారు 40 శాతాన్ని హెచ్‌ఆర్‌ఏ పన్ను మినహాయింపు కింద చూపించుకోవచ్చు. లేదా అసలు హెచ్‌ఆర్‌ఏ రూపంలో తీసుకున్న మొత్తం.. ఈ మూడింటిలో తక్కువ మొత్తంపైనే పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకోవడానికి ఆదాయ పన్ను చట్టం అనుమతిస్తుంది.

అనుకూలతలు: రుణంతో ఇల్లు కొనుగోలు చేస్తే చెల్లించాల్సిన ఈఎంఐ కంటే, అద్దె ఇంటి కోసం చెల్లించే మొత్తం తక్కువగా ఉంటుంది. అద్దె ఇల్లు అయితే పనిచేసే ప్రాంతానికి అతి సమీపంలో లేదా కావాల్సిన చోట ఉండొచ్చు. సొంతిల్లు అయితే అందుబాటు ధర కోసం, పట్టణానికి వెలుపలి ప్రాంతాల్లో కొనుగోలు చేయాల్సి (ఎక్కువ మంది విషయంలో) వస్తుంది. అద్దె ఇలు అయితే కోరుకున్నప్పుడు ఇల్లు మారిపోవడం సులభం. చెల్లించే అద్దెపై పన్ను మినహాయింపు తీసుకోవచ్చు.

ప్రతికూలతలు: అద్దె ఇంట్లో ఉంటే ఆస్తి సమకూరదు. ఏటా అద్దె పెరుగుతూ ఉంటుంది. నచ్చినట్టుగా ఇంటిని నిర్మించుకోలేరు. ఇంటి యజమానికి నచ్చకపోయినా ఖాళీ చేయాల్సి వస్తుంది.

మిరే అసెట్ నుంచి గోల్డ్ ఈటీఎఫ్



మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ గోల్డ్ ఈటీఎఫ్ పేరిట కొత్త ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్‌ను (ఈటీఎఫ్) ఆవిష్కరించింది. ఇది ఫిబ్రవరి 15 వరకూ పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది. అలాట్‌మెంట్ తర్వాత అయిదు రోజుల్లో ఈటీఎఫ్‌ను లిస్ట్ చేస్తారు. ఫిబ్రవరి 21 నుంచి ఈ ఈటీఎఫ్ యూనిట్ల క్రయవిక్రయాలు ప్రారంభమవుతాయి. కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. ప్రతీ యూనిట్ విలువ 0.01 గ్రాము బంగారానికి సరిసమానంగా ఉంటుంది. ద్రవ్యోల్బణానికి హెడ్జింగ్ సాధనంగా బంగారాన్ని పరిగణిస్తారు. ప్రస్తుతం ద్రవ్యోల్బణం పెరుగుతుండటం, దాన్ని కట్టడి చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను పెంచుతుండటం వంటి అంశాలు బంగారానికి ఊతంగా ఉండగలవని అంచనాలు నెలకొన్నాయి. షేర్ల తరహాలోనే స్టాక్ ఎక్స్ఛేంజీల్లో అమ్మడం, కొనడానికి వీలుగా ఉండటం, భౌతిక బంగారంతో పోలిస్తే సురక్షితంగా డిజిటల్ ఫార్మాట్‌లో భద్రపర్చుకునే వెసులుబాటు ఉండటం తదితర ప్రయోజనాలు గోల్డ్ ఈటీఎఫ్‌లలతో ఉంటాయని సంస్థ హెడ్ (ఈటీఎఫ్ ప్రోడక్ట్) సిద్ధార్థ్ శ్రీవాస్తవ తెలిపారు.

యాక్సిస్ 2027 గిల్ట్ ఫండ్



యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ తాజాగా యాక్సిస్ క్రిసిల్ ఐబీఎక్స్ 50:50 గిల్ట్ ప్లస్ ఎస్‌డీఎల్ సెప్టెంబర్ 2027 ఇండెక్స్ ఫండ్‌ను ప్రకటించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఫిబ్రవరి 21తో ముగుస్తుంది. కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. ప్రస్తుతం కీలక వడ్డీ రేట్లు గరిష్ఠ స్థాయికి చేరుకున్న నేపథ్యంలో రుణ సాధనాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా మధ్య, దీర్ఘకాలంలో అధిక రాబడులను అందించేందుకు ఈ ఫండ్ ప్రయత్నిస్తుందని సంస్థ ఎండీ చంద్రేశ్ నిగమ్ తెలిపారు.


కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-2-2023	
విశాఖ	440-00
చిత్తూరు	448-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	408-00
విజయవాడ	408-00
రిటైల్ ధర (డజను)	66.00
12-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	380-00
వరంగల్	382-00
రిటైల్ ధర	4.40

స్టాక్స్ వ్యూ

ఫెడరల్ బ్యాంక్ | యాక్సిస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 132 టార్గెట్: రూ. 170



ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసికంలో ఫెడరల్ బ్యాంక్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. వార్షికంగా అడ్వాన్సులు(రుణాలు) 19 శాతం వృద్ధి చూపగా.. వీటిలో ఆటో 27 శాతం, సీవీ 65 శాతం, కార్పొరేట్ బుక్ 19 శాతం చొప్పున పుంజుకున్నాయి. నికర వడ్డీ ఆదాయం(ఎన్ఐఐ) 27 శాతం జంప్‌చేసింది. నికర వడ్డీ మార్జిన్లు 0.22% బలపడి 3.49 శాతాన్ని తాకాయి. కీలకమైన ఫీజు ఆదాయంలో సైతం 32 శాతం వృద్ధి నమోదైంది. దీంతో వడ్డీయేతర ఆదాయం 10% మెరుగుపడింది. ప్రొవిజన్లు మందగించగా.. క్రెడిట్ వ్యయాలు 0.47 శాతంగా నమోదయ్యాయి. దీంతో క్యూ3లో బ్యాంక్ లాభదాయకత ఊపందుకుంది. వెరసి నికర లాభం 54 శాతం దూసుకెళ్లింది. పటిష్ట రికవరీల కారణంగా రుణ నాణ్యత స్వల్పంగా మెరుగుపడింది. అయితే పునర్వ్యవస్థీకరించిన రుణాల నుంచి స్లిప్పేజీలు, రిటైల్ విభాగంలో స్వల్పంగా పెరిగాయి. రుణ వృద్ధిలో జోరు, అత్యధిక ఈల్డ్ అందించే ప్రొడక్టుల వాటా పెరగడం, క్రమంగా తగ్గుతున్న నిర్వహణా వ్యయాలు, మందగిస్తున్న క్రెడిట్ వ్యయాల ప్రభావంతో ఆర్‌వోఏ, ఆర్‌వోఈ పెంచుకునే బాటలో సాగుతోంది.

అపోలో హాస్పిటల్స్ | మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 4,408 టార్గెట్: రూ. 5,600



ఎందుకంటే: గత ఐదేళ్లుగా ఆరోగ్య పరిరక్షణ దిగ్గజం అపోలో హాస్పిటల్స్ అత్యుత్తమ పనితీరు చూపుతోంది. వార్షికంగా సగటున నిర్వహణా లాభం(ఇబిటా) 24 శాతం చొప్పున పుంజుకోగా.. నికర రుణ భారాన్ని సగానికి తగ్గించుకుంది. మరోపక్క తక్కువ పన్ను రేటు కారణంగా లబ్ధి పొందుతోంది. రానున్న మూడేళ్ల(2023-25) కాలంలో హెల్త్‌కేర్ సర్వీసుల విభాగం ఔట్‌లుక్ అత్యంత ఆశావహంగా కనిపిస్తోంది. భారీ వృద్ధిని సాధించే అవకాశముంది. వార్షికంగా నిర్వహణ లాభం 17 శాతం మెరుగుపడే వీలుంది. ఇందుకు స్థూల ఆర్థిక అంశాలు, సంస్థ పటిష్ట నిర్వహణ ఇందుకు దోహదం చేయనున్నాయి. బీమా ఆధారిత పేషంట్లు, విదేశీ కస్టమర్ల మిక్స్ ద్వారా ఆదాయం పుంజుకునే అవకాశముంది. హెల్త్‌కేర్ విభాగం ఆదాయంలో బీమా ఆధారిత రోగుల విభాగం నుంచి 45 శాతం సమకూరుతోంది. అంతర్జాతీయ పేషంట్ల సర్వీసుల నుంచి 6 శాతం లభిస్తోంది. ఇది పడక (బెడ్) నిర్వహణ సగటు ఆదాయాన్ని(ఏఆర్‌పీవోబీ) మెరుగుపరిచే వీలుంది. ఈ ఏడాది(2022-23) తొలి అర్ధభాగంలో ఆక్యుపెన్సీ 64 శాతానికి చేరింది. రానున్న ఐదేళ్లలో 2,000 పడకల సామర్థ్యాన్ని పెంచుకునేందుకు సంస్థ భారీ పెట్టుబడులు వెచ్చించనుందని కంపెనీ వర్గాలు పేర్కొంటున్నాయి.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే


రిలయన్స్ 'హెల్త్ ఇన్ఫినిటీ' ప్లాన్‌లో డిస్కౌంట్



హైదరాబాద్: ఆర్థిక సామర్థ్యం దిశగా కస్టమర్లను ప్రోత్సహించేందుకు రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ పరిశ్రమలోనే ఓ కొత్త ప్రయత్నానికి నాంది పలికింది. మంచి క్రెడిట్ స్కోర్ ఉన్న వారికి రిలయన్స్ హెల్త్ ఇన్ఫినిటీ ప్లాన్ ప్రీమియంలో 7.5 శాతం తగ్గింపునిస్తోంది. బాడీ మాస్ ఇండెక్స్ ఆరోగ్యకర స్థాయిలో ఉండే వారికి కూడా ప్రీమియంలో డిస్కౌంట్ ఇస్తోంది. తద్వారా మంచి ఆరోగ్య అలవాట్ల దిశగా పాలసీదారులను ప్రోత్సహించనుంది. ముందస్తు వ్యాధి నిరోధక టీకాలను తీసుకునే కస్టమర్లకు కూడా ప్రీమియంలో 2.5 శాతం డిస్కౌంట్ ఇస్తోంది. న్యూమోకొక్కల్, హ్యూమన్ పాపిలోమా వైరస్ తీసుకున్న వారు సైతం ప్రీమియంలో తగ్గింపు పొందొచ్చు.

మంచి ఫండ్‌ను గుర్తించడం ఎలా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్



ఫ్లెక్సీక్యాప్, లార్జ్ అండ్ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో ఒకేసారి, ఒకటికి మించిన ఫండ్ విభాగాల్లో ఇన్వెస్ట్ చేయవచ్చా? – వెంకట రమణ

మీరు సంక్లిష్టతను ఇష్టపడే వారు అయితే అప్పుడు ఒకటికి మించిన విభాగాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. కాకపోతే నిర్ణీత కాలానికి ఒకసారి పోర్ట్‌ఫోలియోని రీబ్యాలన్స్ (సమీక్ష/మార్పులు, చేర్పులు) చేసుకోవడం మర్చిపోవద్దు. ఇలా ఎన్నో విభాగాల మధ్య వర్గీకరించినప్పుడు అది గజిబిజీగా, పన్ను పరంగా అనుకూలం కాకపోవచ్చు. దీనికి ప్రత్యామ్నాయంగా ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఎందుకంటే ఈ పథకాలు వివిధ మార్కెట్ విలువ కలిగిన కంపెనీల్లో (స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్, లార్జ్‌క్యాప్) ఇన్వెస్ట్ చేస్తుంటాయి. కాకపోతే ఆయా విభాగాలకు కేటాయించే మొత్తం వేర్వేరుగా ఉండొచ్చు. సాధారణంగా ఫ్లెక్సీక్యాప్ పథకాలు తమ నిర్వహణలోని పెట్టుబడుల్లో 70–75 శాతాన్ని లార్జ్‌క్యాప్ పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. మిగిలిన పెట్టుడులను మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ పథకాలకు కేటాయిస్తుంటాయి. కనుక మీరు రెండు నుంచి మూడు ఫ్లెక్సీక్యాప్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఫ్లెక్సీక్యాప్ పథకాలు ఎక్కువ మొత్తాన్ని లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. కనుక మీరు విడిగా లార్జ్‌క్యాప్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవాల్సిన అవసరం లేదు. పెట్టుబడుల విషయంలో మరింత దూకుడుగా, రిస్క్ తీసుకునే వారు, ఫ్లెక్సీక్యాప్‌నకు అదనంగా 10–15 శాతం పెట్టుబడులను మిడ్, స్మాల్‌క్యాప్‌నకు కేటాయించుకోవడం ద్వారా ఎక్కువ రాబడులు సొంతం చేసుకోవచ్చు.

మంచి మ్యూచువల్ ఫండ్‌ను గుర్తించడం ఎలా? అలాగే, ఏడాది కోసం ఒక మంచి పథకాన్ని సూచించగలరు. ఏడాదికి 12 శాతం కాంపౌండెడ్ రాబడి నా లక్ష్యం. – ఇష్రత్ సూతర్

చాలా విస్తృత శ్రేణిలో వేలాది పథకాలు ఉన్నప్పుడు సరైన పథకం ఎంపిక అన్నది కష్టమైన పనే. అయితే మంచి పథకం ఎంపికకు రాబడులు ఒక్కటే ప్రామాణికంగా తీసుకోకూడదు. పెట్టుబడి పెట్టడానికి ముందు మీ లక్ష్యాలను గుర్తించాలి. మీ పెట్టుబడుల లక్ష్యం ఆధారంగానే ఎలాంటి పథకం ఎంపిక చేసుకోవాలన్నది ఆధారపడి ఉంటుంది. దీర్ఘకాలంలో సంపద సృష్టించుకోవాలన్నది మీ లక్ష్యం అయితే అందుకు ఈక్విటీ పథకాలపై దృష్టి పెట్టాలి. అలా కాకుండా క్రమం తప్పకుండా ఆదాయం కోరుకుంటుంటే స్థిరాదాయ పథకాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. ఇక రిస్క్ ఎంత తీసుకోగలరు? అన్నది కూడా ముఖ్యమైన అంశం అవుతుంది. మీ పెట్టుబడులు విలువ పడిపోతూ, పెరుగుతూ ఉన్నా ఫర్వాలేదని అనుకుంటే అప్పుడు ఈక్విటీలు అనుకూలం. లేదా రిస్క్ లేని రాబడులు కోరుకుంటే డెట్ విభాగం అనుకూలం. అధిక రాబడులు ఇచ్చే సాధనాలు ఏవైనా అందులో అధిక రిస్క్ ఉంటుందని మర్చిపోవద్దు. రిస్క్, రాబడుల మధ్య సమతుల్యం అవసరం. పెట్టుబడులను ఎంత కాలం కొనసాగించాలని అనుకుంటున్నారు? లిక్విడిటీ సమస్యలు సమీప భవిష్యత్తులో ఉన్నాయా? తదితర అంశాలను చూడాలి. మ్యూచువల్ ఫండ్స్ అన్నవి మార్కెట్ రిస్క్‌పై ఆధారపడి నడుస్తుంటాయి. అందుకని కనీసం ఐదేళ్లకు తక్కువ కాకుండా ఈక్విటీ పెట్టుబడులు కొనసాగించుకోవాలి. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని, వీటికి సరితూగే పథకాన్ని ఎంపిక చేసుకోవాలి. ఇక ఏడాది కాలానికి 12 శాతం రాబడి కోరుకుంటే అది అసాధ్యమనే చెప్పుకోవాలి. ఎందుకంటే మార్కెట్లు కరెక్షన్‌లోకి వెళితే రాబడులు అటు ఉంచి, పెట్టుబడి విలువ తగ్గిపోతుంది. ఏడాది కోసం అయితే, ఎఫ్‌డీ తదితర సంప్రదాయ సాధనాలనే చూడాల్సి ఉంటుంది. వీటిల్లో మీరు కోరుకున్నంత రాబడి రాదు.

డిజీలాకర్‌తో ఫిన్‌టెక్ సేవలు విస్తృతం



అమర్‌దియో సింగ్
అడ్వైజరీ హెడ్, ఏంజెల్ వన్ లిమిటెడ్

భారత ఫిన్‌టెక్‌ను ఐదు విభాగాలుగా వేరు చూసి చూడొచ్చు. క్యూఆర్ కోడ్ తదితర చెల్లింపులు, బిల్లుల చెల్లింపులు, ఇతర అగ్రిగేటర్ సేవలు, బై నౌ, పే లేటర్ సహా రుణ సదుపాయం, రుణాలిచ్చే ప్లాట్‌ఫామ్‌లు, డిజిటల్ బ్యాంకింగ్ ప్లాట్‌ఫామ్‌లు, ఇన్సూరెన్స్ ప్లాట్‌ఫామ్‌లు, వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థలు. ఈ ప్లాట్‌ఫామ్‌లకు సంబంధించి సేవలు పొందాలంటే ప్రజలు గుర్తింపు పత్రాలను సమర్పించాల్సి (కేవైసీ) ఉంటుంది. గత కొన్నేళ్ల కాలంలో కేవైసీ ప్రక్రియను ఫిన్‌టెక్ సంస్థలు ఎంతో సులభతరం చేశాయి. ఫిన్‌టెక్ సంస్థలు డిజీలాకర్‌లో ఉన్న డాక్యుమెంట్లను పొందే అవకాశం కల్పిస్తామని 2023–24 బడ్జెట్‌లో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం నిజంగా ఒక పెద్ద మార్పు వంటిదే. డిజిటల్ ఇండియా మిషన్‌కు అనుగుణంగా భారత ప్రభుత్వం దేశంలో ఫిన్‌టెక్ పరిశ్రమ వృద్ధికి ఎన్నో సదుపాయాలు కల్పించింది. ఆధార్, పీఎం జన్ ధన్ యోజన, వీడియో కేవైసీ, యూపీఐ వంటివి ఎన్నో చేపట్టింది. ఫలితంగా భారత ఫిన్‌టెక్ పరిశ్రమ 2025 నాటికి 1.3 ట్రిలియ్ డాలర్ల స్థాయికి చేరుకోనుంది.



డిజీలాకర్

ప్రస్తుతం డిజీలాకర్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన డాక్యుమెంట్ల డిజిటల్ కాపీలు స్టోర్ చేసుకునేందుకు వినియోగిస్తున్నారు. ప్రభుత్వం తాజా నిర్ణయం ఇతర డాక్యుమెంట్లను సైతం డిజీలాకర్‌లో స్టోర్ చేసుకునే దిశగా ప్రోత్సహిస్తుంది. వెబ్‌బ్రౌజర్, మొబైల్ యాప్ రూపంలో అందుబాటులో ఉన్న డిజీలాకర్‌ను డిజీయాత్ర యాప్‌పై ఐడెండిటీ వెరిఫికేషన్‌కు అనుమతిస్తున్నారు. దీంతో దేశీ విమానాశ్రయాల్లో కాంటాక్ట్‌లెస్ చెకిన్‌కు వీలు లభిస్తోంది.

డైనమిక్ కేవైసీ

డిజీలాకర్ సాయంతో కేవేసీ ప్రక్రియను మరింత సులభతరం చేయాలన్న ప్రభుత్వం నిర్ణయంతో కేవైసీ ప్రక్రియ క్రియాశీలంగా మారుతుంది. ఆధార్, పాన్ డేటా ఆధారంగా రిస్క్ సమీక్ష సాధ్యపడుతుంది. డిజిటల్ ఇండియా కార్యక్రమం దేశంలో మరింత విస్తరిస్తుంది. రుణాల లభ్యతను పెంచుతుంది. భారత ఫిన్‌టెక్ పరిశ్రమ దీర్ఘకాల వృద్ధికి బడ్జెట్ ఎంతో ముందడుగు వేసింది సాంకేతిక, విజ్ఞాన ఆధారిత వృద్ధి ప్రాధాన్యతను బడ్జెట్ గుర్తించింది. వివిధ ప్రభుత్వ ఏజెన్సీలు, నియంత్రణసంస్థలు కలిగి ఉండే పౌరుల డేటా విషయంలో ఏకీకృత పరిష్కారంపై దృష్టి సారించింది. నేషనల్ డిజిటల్ లైబ్రరీ సహా ఇతర చర్యలు ఫిన్‌టెక్ పరిశ్రమ వృద్ధికి ఎంతో లబ్ధి కలిగిస్తాయి. క్రెడిట్ కార్డులు యూపీఐతో లింక్ చేయడానికి ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయం కూడా ఆహ్వానించతగినది.

క్లుప్తంగా...

అప్పర్‌భద్రపై ఏపీ అప్పీల్‌కు వెళ్లవచ్చు

• కేంద్ర మంత్రి దేవుసిన్హా చౌహాన్



కర్నూలు(సెంట్రల్): కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న అప్పర్ భద్ర వల్ల అన్యాయం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ భావిస్తే ట్రిబ్యునల్‌కు అప్పీల్ చేసుకోవాలని కేంద్ర టెలీ కమ్యూనికేషన్ శాఖ మంత్రి దేవుసిన్హా చౌహాన్ అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల అంశం రాష్ట్రాల పరిధిలో ఉంటుందని, దానిపై కేంద్రానికి ఎలాంటి అధికారాలు ఉండబోవని, సమస్యలు ఉంటే రాష్ట్రాలే మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. ఆయన ఆదివారం కర్నూలులో విలేకరులతో మాట్లాడుతూ 2023–24 కేంద్ర బడ్జెట్ దేశాన్ని ఆర్థికమాంద్యం నుంచి గట్టెక్కించగలదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని, కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ఏకంగా రూ.42 వేలకోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వలేదు గానీ... అంతకంటే ఎక్కువగా నిధులు కేటాయించి ప్రధాని ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. అనంతరం కేంద్ర బడ్జెట్‌పై మేధావులతో నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. మాజీ ఎంపీ వెంకటేష్, బీజేపీ నేతలు డాక్టర్ పార్థసారథి, రామస్వామి పాల్గొన్నారు.

'విజ్ఞాన్'కు రూ.4.50 కోట్ల ప్రాజెక్టు

• మంజూరు చేసిన డీఎస్‌టీ



ప్రాజెక్ట్ మంజూరు పత్రాలను చూపుతున్న వీసీ నాగభూషణ్, చైర్మన్ రత్తయ్య, ప్రొఫెసర్లు

చేబ్రోలు (గుంటూరు): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీకి ఢిల్లీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ) నుంచి ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డివిజన్ కేటగిరీలో రూ.4.50 కోట్ల విలువ గల ప్రాజెక్టు మంజూరైందని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ ఆదివారం తెలిపారు. ఐటీబీఐ నిధి ఇన్‌క్లూజివ్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్‌కు గాను రాబోయే మూడేళ్లకు గ్రాంట్ మంజూరైందన్నారు. గొప్ప ఆవిష్కరణలు, ఆలోచనలు కలిగిన యూనివర్సిటీ విద్యార్థులకు అవసరమైన పెట్టుబడులకు ఈ ప్రాజెక్టు దోహదం చేస్తుందన్నారు. దాదాపు 30 స్టార్టప్స్‌ను అభివృద్ధి పథంలో నడపడంతో పాటు చిన్న, మధ్యతరగతి సంస్థలకు ఊతమిస్తుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ రూపకల్పనలో కృషి చేసిన బయోటెక్ విభాగం ప్రొఫెసర్ దిరిశాల విజయరామును, మెకానికల్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ బి.నాగేశ్వరరావును విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వీసీ నాగభూషణ్ అభినందించారు.

వైద్యరంగం సాంకేతికంగా దూసుకెళ్తోంది

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



లబ్బీపేట (విజయవాడ తూర్పు): దేశవ్యాప్తంగా వైద్య రంగం సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు దూసుకెళ్తోందని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. స్థానిక లబ్బీపేటలోని ప్రశాంత్ హాస్పిటల్స్‌లో రోబోట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సర్జరీలు చేసే రోబోలు విజయవాడలోనూ అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. సర్జికల్ రోబో పరిజ్ఞానాన్ని విజయవాడలో ప్రారంభించిన ప్రశాంత్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కె.ప్రశాంత్‌కుమార్‌ను అభినందించారు. డాక్టర్ ధీరజ్, డాక్టర్ ప్రియతమ్, డాక్టర్ హరిత, డాక్టర్ శ్వేత పాల్గొన్నారు.

తిరుపతిలో సీఎం కప్ ఫైనల్స్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాతినిధ్యం వహించనున్నారు. టోర్నీలో 963 పతకాలు, 48 ట్రోఫీలను బహూకరించనున్నారు.

పోటీపడనున్న క్రీడాకారులు, బహూకరించనున్న మెడల్స్ వివరాలు

విభాగం	క్రీడాకారులు	మెడల్స్
అథ్లెటిక్స్	416	96
హ్యాండ్‌బాల్	416	96
టేబుల్ టెన్నిస్	130	20
ఫుట్‌బాల్	468	108
టెన్నిస్	130	20
బ్యాడ్మింటన్	130	20
హాకీ	468	108
బాస్కెట్‌బాల్	312	72
బాల్‌బ్యాడ్మింటన్	260	60
బాక్సింగ్	325	75
వెయిట్ లిఫ్టింగ్	260	72
వాలీబాల్	312	72
ఖోఖో	312	72
కబడ్డీ	312	72


ఇల్లే నయా జిమ్

పెరుగుతున్న 'హోమ్ జిమ్' ట్రెండ్

బయటకు వెళ్లే తీరికలేక ఇంట్లోనే వ్యాయామం

గణనీయంగా పెరుగుతున్న వ్యాయామ పరికరాల కొనుగోళ్లు

స్మార్ట్ గాడ్జెట్లు, ఫిట్‌నెస్ యాప్‌ల వినియోగంపై ఆసక్తి



శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. జీవన నాణ్యతను మెరుగుపర్చుకోవడానికి 'ఫిట్‌నెస్' మంత్రం జపిస్తున్నారు. ప్రాణాంతక వ్యాధుల ముప్పును తప్పించుకునేందుకు అత్యధికులు వ్యాయామాన్ని దినచర్యలో భాగంగా చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా దేశంలోని పట్టణాలు, నగరాలతోపాటు సెమీ అర్బన్, సబ్ అర్బన్ ప్రాంతాల్లోనూ 'హోమ్ జిమ్' ట్రెండ్ పెరుగుతోంది.

- సాక్షి, అమరావతి


గుండె ఆరోగ్యంపై దృష్టి

గుండె, ఊపిరితిత్తుల పనితీరును మెరుగుపరచడం, కండరాల బలాన్ని పెంచడంలో సహాయపడటం వలన కార్డియోవాస్కులర్ వ్యాయామ పరికరాలను ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఇవే మార్కెట్ వాటాలో ఎక్కువ భాగాన్ని కలిగి ఉన్నాయి. ఇందులో ట్రెడ్‌మిల్స్, స్టేషనరీ బైక్‌లు, రోయింగ్ యంత్రాలు, ఎలిప్టికల్స్ ఉన్నాయి.

భారత్ టాప్..

తాజా గణాంకాల ప్రకారం భారత్‌లో గత ఏడాది గృహ ఫిట్‌నెస్ పరికరాల పరిశ్రమ మార్కెట్ విలువ 13,741.23 మిలియన్ డాలర్లుగా నమోదైంది. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఇది ఆసియన్–పసిఫిక్ దేశాల్లోనే అత్యధిక మార్కెట్ విలువగా నమోదైంది. మరోవైపు ప్రపంచ దేశాలతో పోలిస్తే ఆసియా పసిఫిక్ ప్రాంతంలోని ప్రజలు అత్యధికంగా ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇస్తుండటం విశేషం. దేశంలో భౌగోళికంగా చూస్తే పశ్చిమ, మధ్య భారతం అతిపెద్ద మార్కెట్‌గా ఉంది. ఇక్కడ పట్టణీకరణ, పెరుగుతున్న తలసరి ఆదాయం దీనికి కారణంగా తెలుస్తోంది. తూర్పు, దక్షిణ భారత దేశంలోనూ ఫిట్‌నెస్ మార్కెట్ క్రమంగా వృద్ధి చెందుతున్నప్పటికీ ఇక్కడ ఎక్కువ శాతం ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో వాకింగ్, జాగింగ్, రన్నింగ్ చేయడానికి ఇష్టపడుతున్నారు.

ఆన్‌లైన్ ఆర్డర్ల వృద్ధి



దేశంలో ఇటీవల గృహ వ్యాయామ పరికరాల కొనుగోలులో 45 శాతం ఆన్‌లైన్ ఆర్డర్లు పెరిగాయి. ముఖ్యంగా ట్రెడ్‌మిల్స్, ఎక్సర్‌సైజ్ బైక్‌లు, డంబెల్ సెట్‌లు, బెంచ్‌లు ఎక్కువగా ఉంటున్నాయి. సుమారు రూ.1,300–రూ.2,000 ధరలో వివిధ రకాల బరువులు, రాడ్‌లు, వెయిట్ బార్‌లు, జిమ్ ఉపకరణాలు లభిస్తున్నాయి. మరోవైపు యోగా మ్యాట్‌లు, రెసిస్టెన్స్ బ్యాండ్‌లు, ఫోమ్ రోలర్‌లు, టమ్మీ ట్రిమ్మర్లు వంటి సులభమైన వ్యాయామ పరికరాల విక్రయం విరివిగా ఉంటోంది. ఆన్‌లైన్ మార్కెట్ వ్యాపారం గత సంవత్సరం దాదాపు ఏడు రెట్లు పెరిగింది. చాలా కంపెనీలు వినియోగదారులను ఆకర్షించేందుకు ఒకే పరికరంపై 3కు పైగా వివిధ రకాల వ్యాయామాలు చేసుకునేలా డిజైన్లు చేస్తున్నాయి.

'స్మార్ట్'గా వాడుతున్నారు


ఫిట్‌నెస్ యాప్‌ల డౌన్‌లోడ్‌లు భారత్‌తోపాటు ప్రపంచ వ్యాప్తంగా భారీగా పెరిగాయి. 2023లో స్మార్ట్‌వాచ్‌లు, ఫిట్‌నెస్ బ్యాండ్‌ల వంటి వేరియబుల్ టెక్నాలజీలు సరికొత్త ఫిట్‌నెస్ ట్రెండ్‌ను సృష్టించనున్నాయి. దీంతోపాటు ఆన్‌లైన్ ట్రైనింగ్ సెషన్/వర్చువల్ ఫిట్‌నెస్ సెషన్లు పెరగనున్నాయి. ఇంతకు ముందు ఆన్‌లైన్ శిక్షణ గురించి పెద్దగా అవగాహన లేనివారు కూడా ఇప్పుడు ఆన్‌లైన్ శిక్షణకు ప్రాధాన్యత ఇస్తారు. ఇందులో మహిళలు ఎక్కువగా ఉండటం విశేషం.

రోజువారీ ప్రజల ఫిట్‌నెస్ యాప్ వినియోగం ఇలా..



దేశం	శాతం
భారత్	84
అరబ్	28
యూరప్	11
ఆసియా–పసిఫిక్	24
ఇతర దేశాలు	24
అమెరికా	8

భారత్‌లో పరికరాల కొనుగోళ్లు



ఆసక్తి పెరిగింది

కోవిడ్ తర్వాత హోమ్ జిమ్‌లు పెరిగాయి. తక్కువ ధరల్లో వ్యాయామ పరికరాలు వస్తుండటం, ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండటంతో చాలామంది స్వయంగా వ్యాయామాలు చేయడం నేర్చుకుంటున్నారు. కొంతమంది మా లాంటి ట్రైనర్స్‌ను పెట్టుకుంటున్నారు. హోమ్ జిమ్ ఇంటిల్లిపాదికి ఎంతగానో ఉపయోగపడుతోంది.

– సందీప్, ఫిట్‌నెస్ ట్రైనర్, విజయవాడ

96 శాతం ఈ–క్రాప్ నమోదు

• 55% పూర్తయిన రైతుల ఈ–కేవైసీ
• ఇప్పటివరకు 45.30 లక్షల ఎకరాల్లో రబీ సాగు
• 20వ తేదీకల్లా ఈ–క్రాప్, ఈ–కేవైసీ పూర్తిచేసేలా చర్యలు
• 28 వరకు సోషల్ ఆడిట్ కింద ఆర్బీకేల్లో ప్రదర్శన
• అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాత మార్చి 7న తుది జాబితా



సాక్షి, అమరావతి: రబీసాగు చివరి దశకు చేరుకుంటోంది. ఈసారి సాగుతో పాటు ఈ–క్రాప్ నమోదు, ఈ–కేవైసీ నమోదు ప్రక్రియ కూడా సమాంతరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే సాగైన విస్తీర్ణంలో 96 శాతం ఈ–క్రాప్ నమోదు పూర్తికాగా, ఈ–కేవైసీ 55 శాతం పూర్తయింది. ఈ నెల 20వ తేదీలోగా 100 శాతం పంటల నమోదుతోపాటు ఈ–కేవైసీ పూర్తిచేయాలనే లక్ష్యంతో వ్యవసాయ శాఖ ముందుకెళ్తోంది. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని రబీసీజన్ నుంచి ఈ–క్రాప్ నమోదులో పలు సంస్కరణలు తీసుకొచ్చింది. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) సౌజన్యంతో రూపొందించిన యాప్ ద్వారా డిసెంబర్ 8వ తేదీన ఈ–క్రాప్ నమోదుకు శ్రీకారం చుట్టారు. రెవెన్యూ గ్రామాల వారీగా వెబ్‌ల్యాండ్ డేటాతోపాటు పంట సాగుహక్కుపత్రాల (సీసీఆర్సీ) డేటా ఆధారంగా ఈ–క్రాపింగ్ చేస్తున్నారు. దీంతోపాటు సమాంతరంగా రైతుల వేలిముద్రలు (ఈ–కేవైసీ) తీసుకుంటున్నారు.

అవకతవకలకు ఆస్కారం లేకుండా..

గతేడాది డిసెంబర్‌లో విరుచుకుపడిన మాండూస్ తుపాన్ వల్ల దెబ్బతిన్న పంటల స్థానే రెండోసారి విత్తుకున్న పంటల వివరాలను స్థానిక వ్యవసాయాధికారి ధ్రువీకరణతో నమోదు చేస్తున్నారు. ప్రైవేటు విత్తన కంపెనీల కోసం విత్తనోత్పత్తికి సాగుచేసే పంటల వివరాలను సర్వే నంబర్ల వారీగా నమోదు చేస్తున్నారు. ఆయా సర్వే నంబర్లలో సాగైన పంటను కొనుగోలు చేయడానికి వీల్లేకుండా ఈ మార్పుచేశారు. సీజన్‌లో ఒకసారి పంట నమోదైన తర్వాత సాగుకాలం ముగిసేవరకు రెండోసారి పంట నమోదు కాకుండా లాకింగ్ సిస్టమ్ తీసుకొచ్చారు. 'ఈ–ఫిష్' ద్వారా ఆక్వా సాగవుతున్నట్టుగా గుర్తించిన సర్వే నంబర్లను ఈసారి ఈ–క్రాప్‌లో బ్లాక్ చేశారు. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి ఈ–క్రాప్, ఈ–కేవైసీ నమోదుతోపాటు మండల వ్యవసాయాధికారుల నుంచి కలెక్టర్ల వరకు ర్యాండమ్‌గా చెక్ చేస్తున్నారు. గతంలో ఈ–క్రాప్, ఈ–కేవైసీ ప్రక్రియలు పూర్తయిన తర్వాత ఈ తనిఖీలు చేసేవారు. మండల, డివిజన్, జిల్లాస్థాయిల్లో తనిఖీ కోసం ఎంపికచేసిన పంట వివరాలను సైతం కమిషనరేట్ నుంచే జిల్లాలకు పంపిస్తున్నారు. ఆ మేరకు ర్యాండమ్‌గా తనిఖీచేసి క్షేత్రస్థాయిలో గుర్తించిన లోటుపాట్లను సరిదిద్దుకునేలా మార్పుచేశారు. ప్రతి 15 రోజులకోసారి ర్యాండమ్‌గా చెక్ చేస్తున్నారు. ఈ–క్రాప్ నమోదు కాగానే రైతుల మొబైల్ నంబర్లకు ఎస్ఎంఎస్‌లు, ఈ–కేవైసీ పూర్తికాగానే భౌతిక రసీదులు ఇస్తున్నారు.

43.62 లక్షల ఎకరాల్లో పంటల నమోదు

రబీ సీజన్‌లో సాధారణ సాగువిస్తీర్ణం 57.30 లక్షల ఎకరాలుకాగా ఈ ఏడాది 58 లక్షల ఎకరాల సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు 45.31 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇప్పటివరకు 43.62 లక్షల ఎకరాల్లో సాగైన పంటల వివరాలను నమోదు చేశారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 20వ తేదీలోగా ఈ–క్రాప్ నమోదు, ఈ–కేవైసీ నూరు శాతం పూర్తిచేసి, సామాజిక తనిఖీల్లో భాగంగా 28వ తేదీ వరకు ఆర్బీకేల్లో ప్రదర్శనకు ఉంచనున్నారు. రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాత మార్చి 7వ తేదీన తుది జాబితాలను ఆర్బీకేల్లో ప్రదర్శించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఏపీ భవన్‌లో విద్యుత్ పొదుపు ప్రాజెక్ట్

• ఏటా 1.96 లక్షల యూనిట్ల విద్యుత్ ఆదా.. 139 టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గే అవకాశం
• మార్చి చివరికి ప్రాజెక్టు పూర్తికి ఏపీఎస్ఈసీఎం కృషి
• ఇంధన పొదుపు దిశగా దేశంలోనే తొలిసారిగా ఏపీ మరో ముందడుగు



ఐజీఈఏ నివేదికను ఆదిత్యనాథ్‌కు ఇస్తున్న ఆర్కేరాయ్

సాక్షి, అమరావతి: ఇంధన పొదుపు, సామర్థ్య కార్యక్రమాలను అమలు చేయడంలో దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలుస్తున్న ఆంధ్రప్రదేశ్ మరో ముందడుగు వేస్తోంది. 2030 నాటికి ఒక బిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించాలన్న లక్ష్యానికి అనుగుణంగా కేంద్ర విద్యుత్‌శాఖ నేతృత్వంలోని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) న్యూఢిల్లీలో ఉన్న వివిధ రాష్ట్రాలకు సంబంధించిన ప్రభుత్వ భవనాల్లో ఇంధన సామర్థ్య చర్యలపై దృష్టి సారించింది. మొదటిదశలో ఏపీ భవన్ నుంచి ఇంధన సామర్థ్య పైలట్ ప్రాజెక్టును ప్రారంభించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఏపీ భవన్‌లో పవర్ కాంట్రాక్ట్ డిమాండ్ తగ్గింపు, ఎల్ఈడీ స్టేజ్ లైటింగ్, స్టార్ రేటెడ్ ఎయిర్ కండిషనర్లు, వంటగదిలో ఇండక్షన్ వంట ఉపకరణాల వినియోగం, మోషన్ సెన్సార్‌ను ఇన్‌స్టాల్ చేయడం, బ్రష్ లెస్ డైరెక్ట్ కరెంట్ (బీఎల్డీసీ)తో సంప్రదాయ సీలింగ్ ఫ్యాన్లను భర్తీచేయడం, హీట్ పంపుల ఏర్పాటు వంటి మార్పులు చేయనున్నారు. బీఈఈ ద్వారా ఎంప్యానల్ చేయబడిన థర్డ్ పార్టీ ఎనర్జీ ఆడిటింగ్ సంస్థ నిర్వహించిన ఈ ఎనర్జీ ఆడిట్ ప్రకారం, ఇది సంవత్సరానికి సుమారు 1.96 లక్షల యూనిట్ల విద్యుత్ ఆదా చేస్తుందని అంచనా వేస్తున్నారు. దీనిద్వారా సుమారు 139 టన్నుల కర్బన ఉద్గారాల తగ్గింపుతోపాటు రూ.39 లక్షల విలువైన ఇంధనాన్ని ఆదా చేయవచ్చు. ఈ లెక్కన ఇంధన సామర్థ్య చర్యల కోసం ప్రతిపాదించిన రూ.35 లక్షల పెట్టుబడి కేవలం ఏడాదిలోనే వచ్చేస్తుంది. వచ్చేనెల (మార్చి) చివరి నాటికి ఈ ప్రాజెక్టును పూర్తిచేయడానికి ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) కృషిచేస్తోంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే దేశ రాజధాని ఢిల్లీలో ఇంధన సామర్థ్య చర్యలను అమలు చేసి, కర్బన ఉద్గారాలను తగ్గించే జాతీయ లక్ష్యానికి దోహదపడే తొలి రాష్ట్ర భవన్‌గా ఏపీ భవన్ అవతరించనుంది.

బీఈఈ ఆర్థిక సాయం

న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఇంధన సామర్థ్య చర్యలపై బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్ భాక్రే తరఫున బీఈఈ కార్యదర్శి ఆర్.కె.రాయ్ ఆదివారం ఏపీ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్, ఏపీ మాజీ చీఫ్ సెక్రటరీ ఆదిత్యనాథ్ దాస్‌తో సమావేశమయ్యారు. ఏపీ భవన్‌పై భారం లేకుండా బీఈఈ నుంచి ఏపీఎస్ఈసీఎంకు ఆర్థిక సహకారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆర్.కె.రాయ్ ఈ సమావేశంలో చెప్పారు. బీఈఈ ఆర్థిక సహాయంతో ఏపీ భవన్‌లో ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్ ఎనర్జీ ఆడిట్ (ఐజీఈఏ) నిర్వహించినట్లు ఏపీఎస్ఈసీఎం సీఈవో చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో బీఈఈ జాయింట్ డైరెక్టర్ అభిషేక్ శర్మ, ఏపీ భవన్ అడిషనల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి పాల్గొన్నారు.

'అగ్ని'ని బుగ్గి చేద్దాం!

• రాష్ట్రంలో అగ్నిమాపక శాఖ బలోపేతానికి కార్యాచరణ
• 3 దశల్లో 60 కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక.. మొదటి రెండు దశల్లో 47 కేంద్రాలకు ఆమోదం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అగ్నిమాపక శాఖను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కార్యాచరణకు ఉపక్రమించింది. స్టాండింగ్ ఫైర్ అడ్వయిజరీ కౌన్సిల్(ఎస్ఎఫ్ఏసీ) ప్రమాణాలకు అనుగుణంగా అగ్నిమాపక వ్యవస్థను తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఎస్ఎఫ్ఏసీ ప్రమాణాల ప్రకారం రెండు లక్షల జనాభాకొకటి చొప్పున రాష్ట్రంలో 250 అగ్నిమాపక కేంద్రాలుండాలి. కానీప్రస్తుతం 190 కేంద్రాలే ఉన్నాయి. నిర్దేశిత ప్రమాణాలు సాధించేందుకు కొత్తగా 60 అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. వాటిని మూడు దశల్లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి రెండుదశల కింద 47 కేంద్రాల నిర్మాణానికి ప్రణాళికను ఖరారు చేసింది. దాంతో పాటు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కీలక ప్రతిపాదనలకు సూత్రప్రాయంగా ఆమోదించింది.

నియోజకవర్గానికొకటి చొప్పున..

ఇప్పటికే కొత్తగా ఆరు అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వేంపల్లిలో అగ్నిమాపక కేంద్రాన్ని ప్రారంభించారు. ఇక పి.గన్నవరం, కోరుకొండ, సదూం, వెదురుకుప్పం, ముద్దనూరు, వేంపల్లిలో అగ్నిమాపక కేంద్రాల నిర్మాణాల ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. నెల్లిమర్ల, విశాఖ తూర్పు, విశాఖ పశ్చిమ, అరకు, రాజమహేంద్రవరం రూరల్, గోపాలపురం, ఆచంట, పోలవరం, ప్రత్తిపాడు, తాడికొండ, వేమూరు, పర్చూరు, సంతనూతలపాడు, నెల్లూరురూరల్, కొవ్వూరు, నందికొట్కూరు, పాణ్యం, మంత్రాలయం, సింగనమల, రాప్తాడు ఈ 20 నియోజకవర్గాల పరిధిలో ఒక్కో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఇక పరిధి, వాణిజ్య కార్యకలాపాల విస్తృతి దృష్ట్యా రాష్ట్రంలో కొత్తగా మరో 27 అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ మేరకు విపత్తుల స్పందన శాఖ ప్రణాళికను రూపొందించింది. ఒక్కో అగ్నిమాపక కేంద్రాన్ని రూ.1.90 కోట్లతో ఏర్పాటు చేయనున్నారు. ఆ మేరకు 47 కేంద్రాలను రూ.89.3 కోట్లతో ఏర్పాటు చేస్తారు. ఇక ఒక్కో కేంద్రానికి ఏటా నిర్వహణ వ్యయం రూ.1.10 కోట్లు అవుతుందని అంచనా.

ఆధునిక మౌలిక వసతులు

అగ్ని ప్రమాదాల నివారణకు విపత్తుల స్పందన శాఖకు ఆధునిక మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రూ.10 కోట్లు వెచ్చించి జపాన్ నుంచి రూ.55 మీటర్ల టర్న్ టేబుల్ ల్యాడర్‌ను కొనుగోలు చేసింది. రూ.20 కోట్లతో ఫిన్‌లాండ్ నుంచి 90 మీటర్ల హైడ్రాలిక్ ప్లాటఫాంను కొనుగోలు చేశారు. కొత్తగా అగ్నిమాపక వాహనాల కొనుగోలుకు రూ.6.96 కోట్లతో ప్రతిపాదనలను ఆమోదించింది. మరోవైపు రాష్ట్రంలో రెండు రీజియన్లుగా ఉన్న అగ్నిమాపక శాఖను నాలుగు రీజియన్లుగా ఇటీవల పునర్వ్యవస్థీకరించింది. వాటితో పాటు విపత్తుల స్పందన శాఖలో ఫైర్‌మెన్, డ్రైవర్ ఆపరేటర్ల పోస్టుల భర్తీకి త్వరలో నిర్ణయం తీసుకోనుంది. రాష్ట్ర విపత్తుల స్పందన దళాన్ని అగ్ని మాపక శాఖ పరిధిలోకి తెచ్చే అంశంపై కసరత్తు చేపట్టింది.

శ్రీసిటీ టు.. వందే భారత్ ఎక్స్‌ప్రెస్

ఫైబర్ రీ ఇన్ ఫోర్స్ ప్లాస్టిక్ (ఎఫ్ఆర్‌పీ) విడి భాగాల సరఫరా

దేశంలోని వివిధ మెట్రో ప్రాజెక్టులకూ శ్రీసిటీ నుంచే..





బీఎఫ్‌జీ పరిశ్రమలో తయారవుతున్న విడిభాగాలు

వరదయ్యపాళెం: వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పటి నుంచి శ్రీసిటీలోని బీఎఫ్‌జీ ఇండియా పరిశ్రమ నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్, దేశంలోని వివిధ మెట్రో ప్రాజెక్టులకు ఫైబర్ రీఇన్‌ఫోర్స్ ప్లాస్టిక్ (ఎఫ్ఆర్‌పీ) విడి భాగాలను సరఫరా చేస్తున్నారు. వైఎస్సార్ హయాంలో శ్రీసిటీలో తొలిసారిగా ఏర్పాటైన 8 పరిశ్రమల్లో బీఎఫ్‌జీ ఒకటి. బీఎఫ్‌జీ ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థ అయిన బీఎఫ్‌జీ ఇండియా.. వందేభారత్ ఎక్స్‌ప్రెస్, దేశంలోని వివిధ మెట్రో ప్రాజెక్టులకు నాణ్యమైన, ప్రపంచస్థాయి ఎఫ్ఆర్‌పీ విడి భాగాలను అందిస్తోంది. శ్రీసిటీ సెజ్‌లో ఉన్న బీఎఫ్‌జీ ఇండియా 2009 నుంచి పవన శక్తి, నిర్మాణం, రవాణా వంటి వివిధ రంగాల్లో ఉన్న పరిశ్రమల కోసం ఎఫ్ఆర్‌పీ మిశ్రమ ఉత్పత్తులు, ప్రత్యేక ఆకృతుల నిర్మాణాలను తయారు చేస్తోంది. మెట్రోకోచ్ తయారీ సంస్థలు– అల్‌స్టం, బొంబార్డియర్, వోల్వో, ఇండియన్ రైల్వేస్‌కి చెందిన ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ(ఐసీఎఫ్), జనరల్ ఎలక్ట్రికల్–ఎనర్జీ, గమేశ, కొచ్చిన్ షిప్ యార్డ్, థెర్మాక్స్, ఆర్సీఎఫ్, ఎంసీఎఫ్, బెచ్‌టెల్ వంటి సంస్థలకు బీఎఫ్‌జీ ఇండియా సేవలందిస్తోంది.

329 రకాల ఎఫ్ఆర్‌పీ ప్యానెల్స్

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రాజెక్ట్‌లో రైలు పెట్టెలోని ఇంటీరియర్‌లు, టాయిలెట్ క్యాబిన్, ఇంజన్ ముందు భాగాన్ని బీఎఫ్‌జీ సంస్థే సరఫరా చేస్తోంది. ఇచ్చిన పనులను రికార్డు స్థాయిలో 10 నెలల్లో బీఎఫ్‌జీ పూర్తి చేసింది. ప్రాజెక్ట్‌ను ఆకర్షణీయంగా రూపొందించడానికి వివిధ రంగుల ప్యానెల్స్‌ను ఈ కంపెనీ తయారీ చేసింది. ఒక్కోరైలు కోసం 329 రకాల ఎఫ్ఆర్‌పీ ప్యానెల్స్ తయారయ్యాయి. ఢిల్లీ మెట్రో రోలింగ్ స్టాక్(కోచెస్) కోసం బొంబార్డియర్ ట్రాన్స్‌పోర్టేషన్‌తో దాని వ్యూహాత్మక సరఫరాదారుగా ఇంటీరియర్స్, ఫ్రంట్ ఎండ్‌లు, డ్రైవర్ క్యాబ్‌లతో సహా ఎఫ్ఆర్‌పీ విడి భాగాలను బీఎఫ్‌జీ ఇండియా సరఫరా చేస్తోంది. చెన్నై, కొచ్చి, మెట్రో ప్రాజెక్ట్‌ల మెట్రో రోలింగ్ స్టాక్ కోసం సైడ్ వాల్స్, సెంట్రల్ సీలింగ్‌లు, లేటరల్ సీలింగ్‌లు, గ్యాంగ్‌వే విభజనలు, క్యాబ్ విభజనలతో సహా వివిధ భాగాలను శ్రీసిటీలోని ఆల్‌స్టోమ్ ఇండియాకు బీఎఫ్‌జీ సరఫరా చేస్తోంది.

మహిళా కార్మికుల ముందంజ

• మూడేళ్లలో 23.1 శాతం నుంచి 29.5 శాతానికి పెరుగుదల
• గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికం
• 62 శాతం మహిళా కార్మికులకు వ్యవసాయ రంగంలో ఉపాధి
• దేశంలో 2020–21లో నిరుద్యోగ రేటు 4.33 శాతానికి తగ్గుదల
• అదే రాష్ట్రంలో 2018–19లో 5.3 శాతం ఉండగా 2020–21 నాటికి 4.1 శాతం
• దేశంలో ఉపాధి, కార్మిక శక్తిలో మార్పులపై నీతి ఆయోగ్ అధ్యయనం



సాక్షి, అమరావతి: దేశంలో మహిళా శ్రామిక శక్తి నాలుగేళ్లలో 6.4 శాతం మేర పెరిగింది. పురుషుల కన్నా మహిళా కార్మికుల సంఖ్య పెరుగుదల ఎక్కువగా ఉంది. పట్టణాల్లో కన్నా గ్రామీణ ప్రాంతాల్లోనే ఇది ఎక్కువగా ఉందని నీతి ఆయోగ్ వెల్లడించింది. 2017–18లో మహిళా కార్మిక శక్తి 23.1 శాతం ఉంటే 2020–21 నాటికి అది 29.5 శాతానికి చేరిందని పేర్కొంది. ఈ కాలంలో దేశంలో ఉపాధి, శ్రామిక శక్తిలో చోటుచేసుకున్న మార్పులపై నీతి ఆయోగ్ తన అధ్యయన నివేదికను విడుదల చేసింది. 2017–18లో దేశంలో 485.3 మిలియన్ల కార్మిక శక్తి ఉండగా 2020–21 నాటికి అది 563.7 మిలియన్లకు పెరిగింది. అంటే.. మూడేళ్లలో 16.15 శాతం మేర పెరిగింది. కార్మిక శక్తి పెరుగుదల పురుషులతోపాటు మహిళా జనాభాలో కూడా నమోదైంది. అలాగే, ఈ పెరుగుదల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఉందని నివేదిక తెలిపింది. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో ఈ పెరుగుదల తక్కువగా ఉందని నివేదిక వెల్లడించింది. దేశంలో 2019–20లో గ్రామీణ కార్మిక శక్తి 70.7 శాతం ఉండగా 2020–21లో 73 శాతానికి పెరిగింది.

పట్టణాల నుంచి పల్లెలకు వలసలు

ఇక కోవిడ్ సమయంలో ఆసక్తికరంగా పట్టణ ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు వలసలు జరిగాయని నివేదిక తెలిపింది. దీంతో ఆ సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో కార్మిక శక్తి 8 శాతం మేర పెరుగుదల ఉంటే పట్టణ ప్రాంతాల్లో మూడు శాతం తగ్గింది. మూడేళ్లుగా మహిళా కార్మిక శక్తి పురుషుల కన్నా ఎక్కువ శాతం పెరిగింది. ఈ పెరుగుదల గ్రామీణ ప్రాంతాల్లో చాలా ఎక్కువగా ఉన్నట్లు నివేదిక తెలిపింది.

నిరుద్యోగ రేటూ తగ్గుముఖం

మరోవైపు.. దేశంలో 2017–18 నుంచి నిరుద్యోగ రేటు తగ్గుతూ వస్తోందని నివేదిక పేర్కొంది. 2017–18లో నిరుద్యోగ రేటు 6.07 శాతం ఉండగా 2018–19లో 5.84 శాతానికి.. 2019–20లో 4.84 శాతానికి, 2020–21లో 4.33 శాతానికి తగ్గినట్లు తెలిపింది. అదే సమయంలో.. రాష్ట్రంలో 2018–19లో నిరుద్యోగత రేటు 5.3 శాతం ఉండగా 2020–21 నాటికి 4.1 శాతనికి తగ్గింది. దేశంలో పట్టణ ప్రాంతాల కన్నా గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగత రేటు తక్కువగా ఉంది. కోవిడ్–19తో ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం పడినప్పటికీ కూడా పరిశ్రమ, సేవల రంగాల్లో 2019–20 నుంచి 2020–21 మధ్య ఉద్యోగాల సంఖ్య పెరిగింది. పరిశ్రమల రంగంలో 2018–19లో 4.8 మిలియన్ల ఉద్యోగాలు జోడించగా 2019–20లో 3.4 మిలియన్ల ఉద్యోగాలు, 2020–21లో 7.6 మిలియన్ల ఉద్యోగాలు పెరిగినట్లు నివేదిక పేర్కొంది. అలాగే, సర్వీసు రంగంలో కూడా 2018–19లో 10.1 మిలియన్ల ఉద్యోగాలు 2019–20లో 6 మిలియన్ ఉద్యోగాలు, 2020–21లో 2.3 మిలియన్ ఉద్యోగాలు పెరిగినట్లు నివేదిక వెల్లడించింది.

2020–21లో వివిధ రంగాల్లో ఉపాధి కల్పన ఇలా..

▪ వ్యవసాయ అనుబంధ రంగాల్లో 40 శాతం పురుషులకు ఉపాధి కల్పించగా 62 శాతం మహిళా కార్మికులకు ఉపాధి లభించింది.
▪ పరిశ్రమల రంగం 26 శాతం పురుషులకు.. 16.6 శాతం మహిళా కార్మికులకు ఉపాధి కల్పించింది.
▪ సేవా రంగం 33.6 శాతం పురుషులకు, 23.5 శాతం మహిళా కార్మికులకు ఉపాధి కల్పించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.